# ప్రేమ్‌చంద్ కథలు

అనువాదం :

చావలి రామచంద్రరావు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్, 4-1-435 బ్యాంక్ స్ట్రీట్
హైదరాబాద్-500 001

ప్రచురణ నెం : 1262

ప్రతులు : 2,000

CHECKED
1992

ప్రథమ ముద్రణ : ఏప్రియల్, 1956

ద్వితీయ ముద్రణ : జూలై, 1987

(C) విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్

టైటిల్ డిజైన్ : కె. నాగేశ్వరరావు

వెల : రూ. 15.00

University of Hyderabad
LIBRARY
Acc. No. 33427
Dated 15 FEB 88
Hyderabad - 500 134.

ప్రతులకు :

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
4-1-435, విజ్ఞాన భవన్, బ్యాంక్ స్ట్రీట్
హైదరాబాదు - 500 001.

విశాలాంధ్ర బుక్ హౌస్
విజయవాడ, హైదరాబాదు, అనంతపురం, విశాఖపట్నం,
హన్మకొండ, గుంటూరు, తిరుపతి, కాకినాడ.

I. S. B. N. 81-7098-030-5

---

ముద్రణ : నాగార్జున ఎంటర్ ప్రైజెస్, విజయవాడ-520 004.

# తొలి పలుకు

మానవజాతికి మానవుడే అన్నిటినీ మించిన క్లిష్ట సమస్య. మానవుడు తనకు తానే అర్థం కాడు. ఏదో ఒక రూపంలో అతడు తనను గురించే సమీక్షించుకుంటూ ఉంటాడు. తన మనోగత రహస్యాలనే బహిర్గతపరుస్తూ ఉంటాడు. ఈ (ఆత్మ) విమర్శననే, ప్రాచీన కాలంలో ఆఖ్యాయిక అనబడే ఈ రహస్యోద్ఘాటననే సాహిత్యము అంటారు-అది గద్యమూ కావచ్చు, పద్యమూ కావచ్చు. ఈనాడే కాదు; మనుష్యుడింకా వ్రాయటం నేర్చుకోని ఆదికాలం నుండీ కూడా ఆఖ్యాయిక లేక కథ-సాహిత్యంలో ఒక ప్రధాన భాగంగానే ఉంటూ వచ్చింది. కాలగతి ననుసరించీ, అభిరుచి ననుసరించీ నేటి కథానికలో అనేకమార్పులు వచ్చినమాట నిజమే. ప్రాచీన కథానిక కుతూహల ప్రధానంగానో, ఆధ్యాత్మిక సంబంధంగానో ఉండేది. ఈనాటి కథానిక సాహిత్యపు యితర అంగములకువలెనే మన సత్య పరిశీలననూ, మానసిక రహస్యోద్ఘాటననూ తన ఆదర్శంగా పెట్టుకుంది. నవలారచనవలెనే కథానికా రచననుగూడా మనం పాశ్చాత్య ప్రపంచం నుండే స్వీకరించాం. ఈ సత్యాన్ని అంగీకరించటంలో సంకోచించవలసిన పనిలేదు. కాని అయిదువందల సంవత్సరాలకు పూర్వం యూరప్‌కు కూడా ఈ కళతో పరిచయం లేదు. ఉన్నతశ్రేణికి చెందిన ఆధ్యాత్మిక చారిత్రక నవలలు మాత్రమే లిఖించబడేవి కాని చిన్న కథలపై ఎవరూ తమ దృష్టిని ప్రసరించలేదు. అప్సరసల కథలో, భూతసంబంధమైన కథలో కొన్ని ప్రచారంలో ఉన్నమాట నిజమే. కాని ఈ శతాబ్దంలోనే - యింకా తక్కువ కాలంలోనే అనవచ్చును - కథానిక సాహిత్యంలోని యితర అన్ని విభాగములనూ జయించింది. ఈనాడు కథలకు ప్రాధాన్యం లేని పత్రికేలేదు. అంతేకాదు; కథలు తప్ప మరో విషయమే ప్రచురించని పత్రికలు ఎన్ని లేవు! లాభ నష్టాలను గురించి చింతపడవలసిన అవసరం లేని, ఒక ప్రత్యేక ఆశయంతో నడిపించబడే పత్రికల విషయం వేరు. అలాంటి శ్రేణికి చెందిన ఆధ్యాత్మిక, చారిత్రక, రాజకీయ, వాణిజ్య సంబంధమైన పత్రికలలో కథలకు స్థానం లేదు. కాని అవి సామాన్య ప్రజల కోసం కాక, ప్రత్యేక ప్రయోజనాల కోసం వెలువరించబడతాయి.

ఈనాటి జీవిత సంగ్రామము, సమయాభావములే కథానిక కింతటి ప్రాబల్యం

ఏర్పడటానికి ప్రధాన కారణాలు. దినమంతా శృంగారలహరిలో మునిగి తేలుతూ విలాసంగా విహరించే కాలం గతించింది. మనం మన మానసిక ఆహ్లాదానికి అవకాశమే లభించనంతగా జీవిత సంగ్రామంలో మునిగిపోయాం. ఆరోగ్య దృష్ట్యా కొంత మానసికాహ్లాదం అవసరమైయుండక, విసుగూ విరామం లేకుండా రోజుకు 18 గంటలు పనిచేయగలగటం సంభవమే అయినట్లయితే, బహుశా మనం మానసికాహ్లాదాన్ని గూర్చి ఆలోచించమేమో గూడా! కాని, ప్రకృతి మనకు ఈ విషయంలో మరో గత్యంతరం లేకుండా చేసింది. అందుచేత మనం సాధ్యమైనంత తక్కువ కాలంలో వీలైనంత ఎక్కువగా మానసికాహ్లాదం పొందాలని వాంఛిస్తుంటాం. కనుకనే సినిమాహాలుల సంఖ్య రోజురోజుకూ అధికమౌతోంది. చదివితే కొన్ని నెలలు గడిచే నవలలోని ఆనందాన్ని సినిమా ద్వారా మనం రెండు గంటల కాలంలోనే అనుభవించగలుగుతున్నాం. కాని, కథ చదవటానికి 15-20 నిమిషాలు చాలు. అయితే మనకు ఎలాంటి కథలు కావాలి? కథానిక తక్కువ మాటల్లో చెప్పబడాలి. అందులో ఒక్క వాక్యంగానీ, ఒక్క శబ్దంగానీ అనవసరంగా కనబడగూడదు. దాని మొదటి వాక్యమే మన మనస్సులను వశీభూతం చేసుకునేలాగా ఉండాలి. తుదివరకూ మనలను ముగ్ధులను చేయగలగాలి. కాని, కథలో శీఘ్రగమనం, కొత్తదనం, వికాసం ఉండాలి. అంతేకాదు; వీటన్నిటితోపాటు కథలో ఏదో తత్వం ప్రతిబింబించాలి. అలాంటి కథలే కావాలి మనకు. ఏ తత్వమూ లేని కథానిక మానసికాహ్లాదం కలిగించగలిగినా, మనస్సుకు మాత్రం తృప్తిచేకూర్చలేదు. మనం కథానికల్లో ఏదో ఉపదేశా లుండాలని వాంఛించనిమాట నిజమే. కాని మన ఆలోచనా శక్తిని ఉత్తేజపరచగలిగేదో, మన మనస్సులోని ఉత్తమ భావాలను జాగృతం చేయగలిగేదో ఏదో కొంత కథానికలో ఉండాలని మన కోరిక. ఈ రెంటిలో ఏదో ఒకటైనా ప్రతిబింబించగలిగిన కథ మాత్రమే సార్థకమౌతుంది.

ఏదో ఒక మనోవైజ్ఞానిక సత్యంమీద ఆధారపడి వ్రాయబడిన కథానిక మాత్రమే ఉత్తమ శ్రేణికి చెందుతుంది. సత్పురుషుడైన తండ్రి దుర్వ్యసనలోలుడైన తన కుమారుని చూచి ఖేదపడటం అనేది మనోవైజ్ఞానిక సత్యం. ఆ ఆవేశంలో తండ్రి యొక్క మానసికోద్వేగాలను చిత్రించుతూ, వాటి కనుగుణంగా ఆయన చేష్టలను ప్రదర్శించటం జరిగితే కథ ఆకర్షవంతంగా తయారౌతుంది. పతితుడనుకున్న మానవుడు కూడా పూర్తిగా పతితుడు కాడు. అతనిలో ఎక్కడో, ఏ మూలో దేవత్వం ప్రచ్ఛన్నంగా ఉండి తీరుతుంది. ఇది మనోవైజ్ఞానిక సత్యం.

ఆ దేవత్వాన్ని వెలుగులోకి తెచ్చి, లోకానికి ప్రదర్శించటమే కథానిక కర్తవ్యం. విపత్తుపై విపత్తు వచ్చి పడిన కొలదీ మానవుడు మహావీరుడౌతాడు. అత్యంత విపత్కర దశను కూడా సవాలుచేసి ఎదుర్కొంటాడు. అతని దుష్ట వాంఛలన్నీ పలాయనం చేస్తాయి. అతని హృదయంలో ఏ చీకటి కోణంలోనో అజ్ఞాతంగా ఉన్న రత్నాలు ప్రకాశంలోకి వచ్చి మనలను చకితులను చేస్తాయి. ఇది మనో వైజ్ఞానిక సత్యం. ఒకటి రెండు మంచి లేక చెడు ఘటనలు వేరు వేరు స్వభావం గల మనుషులమీద వేరువేరు ప్రభావాలను కలిగించుతాయి. వీటన్నిటినీ కథానికతో విజయవంతంగా ప్రదర్శించగలిగితే కథానిక తప్పక ఆకర్షణీయ మౌతుంది. ఏదో ఒక సమస్యను ప్రతిపాదించటమే కథను ఆకర్షవంతం చేయటానికి ఉత్తమ సాధనం. జీవితంలో నిత్యం యిలాంటి సమస్యలు ఎన్నో తల ఎత్తుతుంటాయి. వాటిమూలంగా జనించే సంఘర్షణ కథానికను రసవంతం చేస్తుంది. ఉదాహరణకు నీతిపరుడైన తండ్రికి తన కుమారుడు హత్య చేశాడని తెలుస్తుందనుకోండి. తన కుమారుని న్యాయవేదికపై బలి యివ్వటమా – లేక తన జీవిత సిద్ధాంతాలకే తిలోదకా లివ్వటమా ? ఎంత భయంకర సంఘర్షణ ! పశ్చాత్తాపం యిలాంటి సంఘర్షణలకు జన్మస్థలం. ఒకడు తన సోదరుని ఆస్తిని దగాచేసి అపహరించాడనుకోండి. ఆ సోదరుడు విచ్చమెత్తుకొనటం చూచి ఆ దగాకోరుకు పశ్చాత్తాపం కలుగకుండా ఉంటుందా ? అలా కలుగకపోతే అతను మానవుడే కాడు.

నవలలవలెనే కథానికలుకూడా కొన్ని ఘటనా ప్రధానంగానూ, కొన్ని శీల ప్రధానంగానూ ఉంటాయి. శీల ప్రధానమైన కథకు ఉన్నత స్థానం యివ్వబడు తోంది ఐతే కథానికలో విపులమైన విమర్శకూ, విశ్లేషణకూ తావులేదు. కథానికా రచనతో మానవుణ్ణి సంపూర్ణంగా చిత్రించటం కాక, మానవ శీలంలోని ఒక భాగాన్ని మాత్రం ప్రదర్శించటమే మన ఉద్దేశ్యం. అయితే మన కథానిక ద్వారా ఏదో ఒక పరిణామం లేక తత్వం బహిర్గతం కావాలి. అది సర్వసమ్మతంగా ఉండాలి. సునిశ్చితంగా కూడా ఉండాలి. కొద్దిగానో గొప్పగానో మనకు సంబంధం ఉన్న విషయం అయితేనే మనకు అభిరుచీ, ఆనందం కలుగుతుంది. ఇది సర్వసాధారణ నియమం. జూదం ఆడే వ్యక్తిలో చెలరేగే ఉన్మాదం, ఉల్లాసం ప్రక్కన ఉండి చూచే వ్యక్తిలో ఎన్నటికీ రేకెత్తదు. మన కథానికలోని పాత్రధారి తానేనని పాఠకుడు భావించేటంత సజీవంగానూ, ఆకర్షణీయంగానూ కథలోని పాత్ర చిత్రణ ఉన్నప్పుడే పాఠకుడికి కథలో ఆనందం లభిస్తుంది. రచయిత తన కథానికలోని పాత్రల

ఎడల అలాంటి ఆత్మీయతను అంకురింప చేయజాలకపోతే తన లక్ష్య సాధనలో అతను అపజయం పొందినట్లే.

ఐతే కథానిక వాస్తవ జీవితచిత్ర మనుకొనటం చాలా పొరబాటు. వాస్తవ జీవితచిత్రం ఏదో డైరీలో మాత్రమే లభిస్తుంది. కాని కథ ఎప్పుడూ కథే. యథార్థం కాజాలదు. తరుచుగా మన జీవితం దాని అవసరం పూర్తిగా తీరిపోయిన పిమ్మటే సమాప్తమౌతుంది. కాని కథలోకూడా జీవితం అలాగే సమాప్తమైతే పాఠకునికి అరుచి కలుగుతుంది. పాఠకుడు కథారంభంలో తాను దర్శించిన పాత్ర యొక్క అంకురం పెరిగి పెద్దదై పుష్పించి ఫలించటంకూడా వీక్షించాలని ఆశించుతాడు. ఆ పాత్ర వేరువేరు పరిస్థితులలో తన పాత్రను నిర్వహించటం చూడాలని వాంఛిస్తాడు. కృత్రిమత్వమే కళ యొక్క రహస్యం. కాని యథార్థమనే ముసుగు ధరించిన కృత్రిమత్వమది. కళావేత్త తన ఆశయ సాధన కోసం అసలు విషయాన్ని కొంత పరివర్తన చేస్తాడు. కొంత కుంచించుతాడు. మరికొంత పెంచుతాడు. కొంత గుప్తపరిచి, కొంత బహిర్గత పరుస్తాడు. అప్పుడతని మనోరథం ఫలిస్తుంది.

—ప్రేమచంద్

★ ★

# విషయసూచిక

ఇందులో....


| | | | పుట |
|---|---|---|---|
| 1. | ఈద్ పండుగనాడు | .... | 5 |
| 2. | ఊరేగింపు | .... | 20 |
| 3. | జోడెద్దులు | .... | 32 |
| 4. | రామలీల | .... | 46 |
| 5. | మా అన్నగారు | .... | 53 |
| 6. | కైపు | .... | 63 |
| 7. | పోటా పోటీ | .... | 72 |
| 8. | ఆత్మారామ్ | .... | 80 |
| 9. | ప్రేరణ | .... | 89 |
| 10. | శేరుంబావు గోధుమలు | .... | 101 |
| 11. | బిళ్ళంగోడు | .... | 109 |
| 12. | లాటరీ | .... | 118 |
| 13. | చదరంగయోధులు | .... | 134 |
| 14. | మంగళ సూత్రం | .... | 146 |

# ఈద్ పండుగనాడు

రంజాన్ నెల ముప్పది రోజులూ గడిచిపోయినాయి. ఈరోజే 'ఈద్' పండుగ. నేటి ప్రాతఃకాలం ఎంత మనోహరంగా ఉంది! చెట్లన్నీ ఒక వింతైన పచ్చదనంతో కళ కళ లాడుతున్నాయి. పొలాల్లో ఒక విచిత్రమైన శోభ వెల్లివిరుస్తోంది. ఆకాశమంతటా వింతైన అరుణకాంతులు అలముకొన్నాయి. ఈనాటి సూర్యుణ్ణి చూడండి; ప్రపంచాని కంతటికీ పండుగ అభివందనా లర్పిస్తున్నాడా అన్నట్లు ఎంత చల్లగా ఉన్నాడో! గ్రామమంతా ఎంత సందడిగా ఉంది! జనం అంతా ప్రార్థనలకు వెళ్ళేందుకు తయారౌతున్నారు. చొక్కాకు గుండీ లేనందువల్ల సూదీ దారం కోసం పొరుగింటికి ఆదరా బాదరా పరుగెత్తుతున్నా డొకడు. చెప్పులు కొయ్యబారి పోయినందువల్ల వాటికి ఆముదంపట్టిద్దామని ఆముదంకోసం దుకాణానికి పరుగులు తీస్తున్నాడింకొకడు. ఎద్దులకు నీళ్ళుపెట్టి మేతవెయ్యాలని త్వరపడుతున్నారు కొందరు. నమాజుకు వెళ్ళివచ్చేసరికి రెండు ఝాములౌతుంది. మూడుకోసుల దూరం నడిచి పోవాలి. అనేక మందితో కులాసాగా తిరగాలి; కబుర్లు చెప్పుకోవాలి. ఏమైనా మధ్యాహ్నంలోగా రావటం అసంభవం. అందరికంటే హుషారుగా ఉన్నది పిల్లలు. వాళ్ళలో కొందరు ఉపవాసమున్నారు. అదీ మధ్యాహ్నంవరకే. మరికొందరు అదీ లేదు. కాని నమాజుకువెళ్ళే హుషారుమాత్రం వారిసొత్తే. ఉపవాసం పెద్దవాళ్ళకు. వీళ్ళకు కావలసింది పండుగే. రోజూ పండుగకోసం కలవరిస్తున్నారు. నేటికి వచ్చిందది. ప్రార్థనలకు యింకా కదలరేం జనం? తొందరగా ఉంది పిల్లలకు. వీళ్ళకు యింట్లో బాధలతో పనేముంది? సేమ్యాపాయసంలోకి పాలు, పంచదార యింట్లో ఉన్నాయో లేదో వీళ్ళకక్కరలేదు. వీళ్ళు మాత్రం సేమ్యాలు తింటారు. తన తండ్రి చౌధరీ కాయమ్ అలీ యింటికి ఆదుర్దాగా ఎందుకు వెళుతున్నాడో వాళ్ళకేం తెలుసు. చౌధరీ గనుక మొండిచెయ్యి చూపుతే పండుగ కాస్తా ఎండగైపోతుందని వాళ్ళకేంతెలుసు! వాళ్ళకు తమ జేబుల్లో కుబేరుని ఐశ్వర్యముంది. మాటి మాటికీ జేబునుండి తమ ముల్లెను బయటకు తీసి లెక్కపెట్టుకుని తృప్తిగా మళ్ళీ జేబుల్లో దాచుకుంటున్నారు. ఒకటీ....రెండూ....పదీ....పన్నెండూ! మహమూద్ వద్ద పన్నెండు కానులున్నాయి. మొహసిన్‌వద్ద ఒకటీ, రెండూ, మూడూ....ఎనిమిదీ, తొమ్మిదీ....పదిహేనూ! మొత్తం పదిహేను కానులున్నాయి. ఈ బోలెడు కానులతో బోలెడు వస్తువులు కొనుక్కుంటారు. బొమ్మలూ, మిఠాయిలూ, బిగుళ్ళు, బంతులూ యింకా ఎన్నెన్నో తెచ్చుకుంటారు. అందరికంటె హుషారుగా ఉన్నది హామిద్.

నాలుగైదేళ్ళుంటాయి. ముఖంలో దీనకళ. సన్నగా బక్కపలచగా ఉంటాడు. పాపం అతనితండ్రి నిరుటి సంవత్సరం కలరాను బలైపోయినాడు. తల్లిగూడా ఎందుకనో క్రమంగా పాలిపోయి పాలిపోయి ఒకరోజు ప్రాణాలు వదిలింది. అదేం జబ్బో ఎవరికీ అర్థంకాలేదు. చెబితేమాత్రం వినిపించుకునే వాళ్ళెవరూ! కడుపులో జబ్బు కడుపులోనే దాచుకుంటూ సహించి సంతకాలం సహించింది. సాధ్యం కానప్పుడు ఈ లోకంనుండి సెలవు తీసుకుంది. ఇప్పుడు హామిద్ తన ముసలి నాయనమ్మ అమీనా ఒడిలో నిద్రపోతూ యితరుల మాదిరే ఆనందంగా ఉన్నాడు. వాళ్ళ నాన్న డబ్బు సంపాదించుకు రావటానికి వెళ్ళాడు. బోలెడు సంచులతో డబ్బులు తీసుకు వస్తాడు. వాళ్ళమ్మ అల్లావద్దనుండి తనకోసం మంచిమంచి వస్తువులు తేవటానికి వెళ్ళింది. అందుకనే హామిద్ సంతోషంగా ఉన్నాడు. ఆశ చాలా గొప్పది. అందులో యిక పిల్లల ఆశనుగురించి చెప్పాలా! వాళ్ళ కల్పనలు అణువును మహాపర్వతంగా మార్చేస్తాయి. హామిద్ కాళ్ళకు చెప్పులులేవు. తలకు ఒక పాతచింకి టోపీ ఉంది. దాని చమ్కీ గోటంతా నల్లబడి పోయింది. ఐనా హామిద్ హుషారుగానే ఉన్నాడు. వాళ్ళనాన్న డబ్బుల సంచులూ, వాళ్ళమ్మ కానుకలూ తెచ్చారంటే అతని కోరిక లన్నీ తీరిపోతాయి. మహమూదూ, మొహిసినూ, నూరే, సమ్మి అన్ని డబ్బులు ఎక్కడినుండి తెస్తారో అప్పుడు చూస్తాడు. దౌర్భాగ్యురాలు అమీనా తన గదిలో కూర్చుని ఏడుస్తోంది. ఇవ్వాళ ఈద్‌పండుగ. కాని యింట్లో గిద్దెడు గింజలులేవు. ఇవ్వాళ ఆబిద్ బ్రతికే ఉంటే ఈ పండుగ అలావచ్చి యిలా వెళ్ళిపోయేదా! ఈ నిరాశాంధకారంలో మునిగిపోతోంది అమీనా. ఎవరు పిమ్మన్నారీ దిక్కుమాలిన పండుగను! దానికీ యింటితో ఏమి నిమిత్తంలేదే! కాని హామిద్ ఉన్నాడాయె! అతనికి ఒకరిచావు బ్రతుకులతో లెక్కేమిటి? అతని అంతరాళంలో వెలుగున్నది. బాహ్యంలో ఆశ ఉంది. ప్రమాదం కొండలాగావచ్చి మీదపడనీగాక! ఆనంద భరిత మైన హామిద్ దృష్టి దాన్ని చూర్ణం చేసేస్తుంది.

హామిద్ గదిలోకివెళ్ళి నాయనమ్మతో "అమ్మమ్మా! నువ్వేం భయపడొద్దు. నేను అందరికంటే ముందొచ్చేస్తాగా! ఏం భయం లేదులే!" అన్నాడు.

అమీనా హృదయం స్తంభించిపోయింది. ఊళ్ళో పిల్లలంతా వాళ్ళవాళ్ళ తండ్రులవెంట వెళ్తున్నారు. హామిద్‌కు తండ్రి అమీనాయేగా! యింకెవరున్నారూ? తాను అతన్ని తిరునాలకు ఒంటరిగా ఎలా పోనిస్తుందీ? ఆ గుంపులో కుర్రాడెక్కడైనా మారుపడితే ఏం కావాలి? ఉహుం! అమీనా అతన్ని ఒంటరిగా పోనివ్వదు. నా చిన్నతండ్రి మూడుకోసులు ఎలానడుస్తాడు. కాళ్ళు బొబ్బలెక్కుతాయి. చెప్పులు కూడా లేవాయె! తానుంటే కాస్త కాస్త దూరం చంకనెత్తుకోవచ్చు. కాని యిక్కడ సేమ్యాలు ఎవరువండుతారూ? చేతులలో డబ్బులుంటే రాగానే సామానులన్నీ కొనుక్కొచ్చి చటుక్కున చేసెయ్యొచ్చు. ఇక్కడ ఉంటే గంటలతరబడి తిప్పలు బడితే గాని వస్తువులు పోగుకావు. అరువు దొరుకుతుందన్న నమ్మకమేమిటి? ఆరోజు

షహీమాన్ గుడ్డలు కుట్టిపెడితే అర్ధరూపాయి డబ్బులు దొరికినాయి. ఆ ఎనిమి దణాలనూ పండగకోసం ప్రాణప్రదంగా దాచిపెట్టుకుంది. కాని నిన్నపాలమనిషి వచ్చి గొంతుమీద కూర్చుంది. ఏంచేస్తుంది పాపం! హామిద్‌కు ఏమీ లేకపోయినా ఒక అర్ధణా పాలైనా కావాలి. ఇంట్లో యిప్పుడు మొత్తం రెండణాల డబ్బు లున్నాయి. అందులో మూడుకానులు హామిద్‌కిచ్చింది. అయిదుకానులు అమీనా కొంగున గట్టుకుంది. ఇదీఉన్న సరుకు. ఈద్ పండుగవచ్చి కూర్చుంది. ఆ అల్లాయే దాటిచూపించాలి. చాకలిదీ, మంగలిదీ, సాకీదీ, గాజులమనిషీ అందరూ వస్తారు. అందరికీ సేమ్యా పాయసం పొయ్యాలి. కొంచెంగా పోస్తే ఎవరి కంటికి ఆనదు. ఎవరిని కాదని ముఖం తప్పిస్తుంది. అయినా ముఖం తప్పించ వలసిన అవసరంమాత్రం ఏముందీ? సంవత్సరానికొక్క పండుగ! బ్రతుకు చల్లగా గడిచిపోవాలి. అంతేచాలు. తన అదృష్టంకూడా అందులోనే ఉంది. పిల్లవాణ్ణి అల్లా దయచూడాలిగాని ఎలాగో కష్టకాలం గడవకపోదు.

గ్రామంనుండి ఉత్సవంబయలుదేరింది. ఇతరపిల్లలతోపాటు హామిద్‌కూడా వెళ్తున్నాడు. ఒక్కొక్కసారి పిల్లలందరూ పరుగెత్తి ముందుకు వెళ్ళిపోయేవాళ్ళు. మళ్ళీ ఏ చెట్టుక్రిందో నుంచుని సహచరులకోసం ఎదురుచూచేవాళ్లు. వీళ్ళంతా యింత నిదానంగా నడుస్తారేం? హామిద్ కాళ్ళకేవో రెక్కలు వచ్చినట్లుగా ఉంది. అతనికి అలుపే వచ్చేట్లులేదు. నగరపు పొలిమేరలు సమీపించారు. రోడ్డు కిరువైపులా శ్రీమంతుల తోటలున్నాయి. వాటిచుట్టూ దిట్టమైన ప్రహరీ లున్నాయి. చెట్లకు మామిడిపళ్ళూ, లీచీపళ్ళూ వ్రేలాడుతున్నాయి. అప్పుడప్పుడు ఆ కుర్రవాళ్లు కంకర రాళ్లు తీసుకుని మామిడికాయలకు గురిపెట్టి విసురుతున్నారు. తోటకాపలావాడు బూతులుతిడుతూ వచ్చేసరికి కుర్రాళ్ళప్పుడే ఫర్లాంగుదూరం వెళ్ళిపోయారు. "కాపలావాణ్ణి భలేగా ఏడిపించాంతే" అని పక పక నవ్వుకుంటూ వెళ్తున్నారు.

గొప్ప గొప్ప భవనాలున్న రోడ్డులో నడుస్తున్నారు. ఇది హైకోర్టు! ఇది కాలేజి! ఇదిగో ఇది క్లబ్బు! యింత పెద్ద కాలేజీలో ఎంతమంది కుర్రాళ్ళు చదువుకుంటున్నారో. అందరూ కుర్రాళ్ళు కారే. నిజం! పెద్ద పెద్ద వాళ్ళుకూడా ఉన్నారు. వాళ్ళకు పెద్ద పెద్ద మీసాలుకూడా ఉన్నాయి. ఇంత పెద్ద వాళ్ళయినా యింకా చదువుతూనే ఉన్నారు. ఇలా ఎంతవరకు చదువుతారో! ఇంత చదువు చదివి ఏంచేద్దామనో? హామిద్ చదువుతున్న స్కూల్లో కూడా యిద్దరు ముగ్గురు పెద్ద పెద్ద కుర్రాళ్ళున్నారు. వట్టి అణాకానీరకం రోజూ దెబ్బలు తింటారు. పనికి దొంగలు. ఇక్కడకూడా అలాంటివారే ఉంటారా ఏమిటి కర్మం!

ఇక్కడ చచ్చిపోయినవాళ్ళ పుర్రెలు హుషారుగా పనిచేస్తాయట! ఇంకా చాలా చాలా తమాషాలు జరుగుతుంటాయి. అయితే ఎవరినీ లోపలికి పోనీయరట!

ఇక్కడ సాయంత్రం గొప్పగొప్ప వాళ్ళువచ్చి ఆటలాడు తుంటారు. మీసాలున్న వాళ్ళూ, గడ్డాలున్నవాళ్ళూగూడా వస్తారు. దొరసానులుగూడా ఆడతారట! నిజమోయ్! మా అమ్మచేతికి గనుక.... దాని పేరేమిటి.... బేటు!.... అందిస్తే పట్టు కోటంకూడా చేతగాదు. అట్టా తిప్పేసరికల్లా బుడుంగున జారిపోతుంది.

"అల్లాతోడు! మా అమ్మయితే చేతులు వణికే పోతాయి" అన్నాడు మహమూద్.

"చెప్పొచ్చావులే! మీ అమ్మ మణుగుల కొలదీ పిండి విసిరి పారేస్తుంది; కాస్తంత బేటు పట్టుకుంటేనే వణికిపోతాయేం చేతులూ! రోజూ వందల కడవల నీళ్ళు తోడుతుంది. మీ బత్తే తాగుతుంది అయిదు కడవలు. ఆ దొరసానులు గనుక ఒక్క కడవ నీళ్ళు తోడవలసివస్తే కళ్ళు చీకట్లు కమ్మిపోతాయి" అన్నాడు మొహసిన్.

"కాని పరుగెత్తటం, గంతులుపెట్టటం చేతకాదుగా" అన్నాడు మహమూద్.

"అవును గంతులు పెట్టలేనిమాట నిజమే. కాని ఆరోజు మా ఆవు పలుపు విప్పుకుని చౌధరీగారి చేలోపడితే మా అమ్మ ఎంత తొందరగా పరుగెత్తిందనుకున్నా. ఆమె నందుకోలేకపోయాను నేను. నిజమోయ్!" అన్నాడు మొహసిన్.

ముందుకు సాగారు. మిఠాయి దుకాణాలు ప్రారంభమైనాయి. ఇవ్వాళ బాగా అలంకరించారు. ఇన్ని మిఠాయిలు ఎవరు తింటారు? ఒక్కొక్క దుకాణంలో మణుగుల లెక్కన ఉంటుంది. రాత్రికి భూతాలువచ్చి కొనుక్కుపోతాయట; మా నాన్న చెప్పాడోయ్ అర్థరాత్రికల్లానటా ఒకమనిషి అన్ని దుకాణాలకూ వెళ్ళి మిగిలిన సరుకల్లా తూకం వేయించేసి నిజమైన రూపాయలు — అచ్చగా మన రూపాయల వంటివే-యిచ్చేస్తాడుటోయ్!

హామిద్‌కు నమ్మకం కలుగలేదు — ఇటువంటి రూపాయలు భూతాల కెక్కడ దొరుకుతాయో?

"భూతాలకు రూపాయల కేం తక్కువా? ప్రతి ఖజానాలోకి వెళ్తాయిచుపి. ఉక్కు తలుపులు గూడా వాటి నడ్డగించ లేవోయ్! తెలుసా? ఏమిటనుకున్నావు మరీ? నగలూ, వజ్రాలూ అన్నీ ఉంటాయి వాటిదగ్గర. వాటిని సంతోషపెట్టిన వాళ్ళకు బుట్టల బుట్టల రత్నాలు యిచ్చేస్తాయిట. ఇప్పు డిక్కడుంటాయి. అయిదు నిమిషాలకల్లా కలకత్తాకు చేరుకుంటాయి. ఏమిటనుకున్నావో!" అన్నాడు మొహసిన్.

"భూతాలు చాలా పెద్దగా ఉంటాయి కావాలేం?" ప్రశ్నించాడు హామిద్

"ఒక్కొక్క భూతం ఆకాశమంత కూడా ఉంటుంది. నేలమీద నుంచుంటే దాని తలకాయ ఆకాశాని కంటుతుంది. కాని కావాలనుకుంటే బుడుంగున ఒక చెంబు లోకి దూరిపోతుంది" అన్నాడు మొహసిన్.

"వాటిని ఎలా సంతోష పెడ్తారో? ఎవరైనా నాకా మంత్రం చెబితే నేనూ ఒక భూతాన్ని సంతోషపెడుదునే!" అన్నాడు హామిద్.

" ఆ మంత్రాలేమీ నాకు తెలియవుగాని చౌధరీగారి స్వాధీనంలోమాత్రం చాలా భూతాలున్నాయిట. ఎక్కడైనా దొంగతనం జరిగిందంటే చౌధరీగారు దాని ఆచూకీ తీస్తారు. దొంగపేరు కూడా చెప్పేస్తారు. ఆ రోజున జుమ్రాతీగారి దూడ తప్పిపోయింది. మూడు రోజులు తిప్పలుబడినా ఎక్కడా దొరకలేదు. అప్పుడు గభాలున చౌధరీగారి దగ్గరకు వెళ్ళారు. ఆయన వెంటనే దూడ బందెలదొడ్డిలో ఉన్నదన్నాడు అక్కడే చిక్కింది కూడా. భూతాలువచ్చి ఆయనకు లోకంలో సంగతులన్నీ తెలియజేసి వెళ్తుంటాయి" అన్నాడు మొహసిన్.

చౌధరీవద్ద అంత డబ్బుండటానికి కారణమేమిటో, అతనికంత గౌరవం ఎందుకు లభిస్తుందో అప్పటి కర్థమైంది హామిద్‌కు.

ముందుకు సాగారు. ఇదిగో యిది పోలీసులైను ఇక్కడే పోలీసులందరూ కవాతు చేస్తుంటారు. రైటన్! పయ్‌ఫో! "పాపం! రాత్రిపూట తిరిగి తిరిగి కాపలా కాస్తుంటారు. లేకుంటే దొంగతనాలు జరిగిపోవూ!" మొహసిన్ ఎదురువాదం చేస్తూ "ఈ పోలీసులు కాపలా కాస్తున్నారూ? అయితే నీకు భలే తెలుసులే? అరె వాబూ? అసలు దొంగతనాలు చేయించేదే వీళ్ళు. పట్నంలో ఉన్న దొంగలూ, బందిపోట్లూ అందరూ వీళ్ళతో షరీకే రాత్రిపూట దొంగతనాలు చెయ్యమని దొంగలకు చెబుతారు. తామేమో మరో పేటకు వెళ్ళి "మెలకువగా ఉండండి; భద్రం! భద్రం!"అంటూ కేకలు వేస్తుంటారు. కనుకనే వాళ్ళదగ్గర చాలా డబ్బులుంటాయి. మా మామయ్య ఒక స్టేషనులో పోలీసు. నెలకు యిరవైరూపాయల జీతం. కాని ఏభైరూపాయలు యింటికి పంపిస్తుంటాడు. అల్లాతోడు! "నీకిన్ని రూపాయలు ఎక్కడనుంచొస్తాయి మామయ్యా" అని నేనొకసారి అడిగాను. అందు కాయన నవ్వి "దేవుడిస్తుంటాడోయ్" అన్నాడు. మళ్ళీ తానే "కావాలనుకుంటే ఒక్కరోజులోనే లక్షలు కొట్టుకురాగలం. కాని అటు చెడ్డపేరు రాకుండానూ, యిటు నౌకరీ పోకుండానూ చూసుకుంటూ జాగ్రత్తగా మెలుగుతుంటాం"! అన్నాడు.

"దొంగతనాలు వీళ్ళే చేయిస్తుంటే వీళ్ళనెవరూ పట్టుకోరుమరి?" ప్రశ్నించాడు హామిద్.

మొహసిన్ అతని అమాయకత్వానికి జాలిపడి యిలా అన్నాడు— "అరె! ఎంత వెర్రివాడవోయ్! అసలు పట్టుకునేవాళ్ళే వీళ్ళయితే యింక వీళ్ళనెవరు పట్టుకుంటారు? కాని అల్లా వీళ్ళను తగినట్లుగానే శిక్షిస్తుంటాడులే. అన్యాయంగా వచ్చిన

డబ్బు అన్యాయంగానే పోతుంది. కొద్దిరోజులకే మా మామయ్యగారి యింటికి నిప్పంటుకుంది. మొత్తం ఇంట్లో ఉన్నదంతా తుడుచుకుపోయింది. ఒక పాత్ర కూడా మిగలలేదు; అల్లాతోడోయ్! చాలా రోజులు చెట్లక్రిందనే కాపురంచేశారు. తెలుసా? మళ్ళీ ఎక్కడ తెచ్చాడో వందరూపాయలు అప్పుతెస్తే చెంబూ, తప్పాలా అమరినాయి."

"వందంటే ఏభై కంటె ఎక్కువా?" అన్నాడు హామిద్.

"ఎక్కడి ఏభైకి! ఎక్కడి వంద! ఏభై అయితే ఒక్క సంచికి సరి పోతాయి. వందరూపాయలకు రెండు సంచులు కూడా చాలవు."

అప్పటికి పట్నం కిట కిట లాడసాగింది. ఈద్ ప్రార్థనలకు వెళ్ళే గుంపులు ఎదురౌతున్నాయి. ఒకరికంటే ఒకరు పసందైన దుస్తులు వేసుకున్నారు. కొందరు యిక్కాబండ్లమీద కొందరు టాంగా బండ్లమీద వస్తున్నారు. మరికొందరు మోటార్ల మీద వస్తున్నారు. అందరూ అత్తరు గుమగుమలతో మునిగి తేలుతున్నారు. అందరిలోనూ ఉత్సాహం పొంగులు వారుతోంది. మన ఈ చిన్న గ్రామీణుల జట్టు తమ దీనత్వాన్ని మరిచి తృప్తిగానూ, ధీమాతోనూ పరవశమై వెళ్తోంది. పల్లెవాళ్ళకు పట్నంలో వస్తువులన్నీ విచిత్రం గానే ఉంటాయి. దేనివంక చూస్తే దానివంకే చూస్తుండిపోతారు. వెనుకనుండి అదే పనిగా హారన్ కొడుతున్నా సరే వినపడదు వాళ్ళకు. హామిద్ మోటారుక్రింద పడి పోయేవాడే. కొంచెంలో తప్పించుకున్నాడు.

తటాలున ఈద్ ప్రార్థనలు జరిగేస్థలం దృష్టి గోచరమైంది. పైన పెద్ద పెద్ద చింతచెట్ల నీడ ఉంది. క్రిందనేల చక్కగా చదునుచేసి ఉంది. దానిపైని తివాసీలు పరిచారు. ఉపవాస మున్నవాళ్ళ పంక్తులు ఒకదాని వెనక ఒకటి చాలా దూరం వ్యాపించాయి. తివాసీలులేని చదరపునేల దిగువదాకా సరిపోయాయిపంక్తులు. క్రొత్తగా వచ్చినవాళ్ళు వెనక వరుసలో నిలబడుకున్నారు. ముందిక చోటులేదు. ఇక్కడ ధనాన్నీ, పదవినీ లెక్కించరు. ఇస్లాం దృష్టిలో అందరూ సమానులే. మన గ్రామస్థులుకూడా కాళ్ళుచేతులు కడుగుకుని వెనుకపంక్తిలో వెళ్ళి నిలబడ్డారు. ఎంతపసందుగా ఉందా నిర్మాణం! ఎంతచక్కని వ్యవస్థది. లక్షల శిరస్సులు ఒకే సారి వంగి నమస్కరిస్తున్నాయి. తిరిగి అందరూ ఒకేసారి లేచి నిలబడుతున్నారు. ఒకేసారి ముందుకు వంగుతున్నారు. మళ్ళీ ఒకేసారి మోకరిల్లి కూర్చుంటున్నారు. లక్షలకొలది ఎలక్ట్రిక్ దీపాలు ఒక్కసారి వెలిగి, ఒక్కసారిగా ఆరిపోవటం అనేక మార్లు జరిగినట్లుగా ఉందా ప్రార్థనా విధానం. ఎంత అపూర్వదృశ్యం! ఆ సమిష్టి కార్యక్రమం, ఆ విశాలత్వం, ఆ అనంతత, హృదయంలో భక్తినీ, గర్వాన్నీ, ఆత్మానందాన్నీ రేకెత్తిస్తున్నాయి. భ్రాతృ భావసూత్రం ఆ ఆత్మలన్నిటినీ ఒకే హారంలో గుదిగుచ్చాయా అనిపిస్తోంది.

# 2

ప్రార్థనలు అయిపోయినాయి. జనం పరస్పరం కౌగలించుకుంటున్నారు. ఇక మిఠాయి దుకాణాలమీదా, బొమ్మల దుకాణాలమీదా దండయాత్ర మొదలౌతుంది. మన గ్రామీణుల దళం ఈ విషయంలో పిల్లలతో సమానంగానే హుషారుగా ఉంటుంది. ఇదిగో ఇది రంగులరాట్నం. ఒక్క కానీయిస్తే ఎక్కవచ్చు. ఒకసారి ఆకాశంలోకి వెళుతున్నట్లుగా ఉంటుంది ఒకసారి క్రింద పడిపోతున్నట్లుగా ఉంటుంది. ఇదిగో ఇది ఉయ్యాల, యిది కొయ్య ఏనుగు, యిది గుర్రం, యిదిగో యిది ఒంటె, అన్నీ కర్రలకు తగిలించబడి ఉన్నాయి ఒక్క కానీ టిక్కట్టు! పాతిక చుట్లు ఆనందంగా తిరగొచ్చు. మహమూద్, మొహసిన్, నూరే, సమ్మి వాళ్ళంతా గుర్రాలమీద, ఒంటెలమీద కూర్చున్నారు. హామిద్ దూరంగా నుంచున్నాడు. అతనిదగ్గర మూడు కానులేగా ఉన్నాయి. తన ముల్లెలో మూడో వంతు పైకం కాసేపు గిరగిర తిరిగేందుకు ఎలా ఖర్చుపెట్టగలడూ!

అందరూ రంగులరాట్నంనుండి దిగారు. ఇక బొమ్మలు కొనుక్కుంటారు. ఇవతల వరుసగా ఉన్నాయి బొమ్మల దుకాణాలు. రకరకాల బొమ్మలు – సిపాయి, గొల్లభామ, రాజు, వకీలు, నీళ్ళవాడు, చాకలిది, సాధు!– ఎన్నోబొమ్మలు! బలే! ఎంతఅందమైన బొమ్మలు! మాట్లాడొస్తున్నట్లుంటే! ఆహా! ఎంత బాగున్నాయో! మహమూద్ సిపాయిబొమ్మ కొనుక్కున్నాడు. ఖాకీడ్రస్సు వేసుకుని, ఎర్ర తలపాగా చుట్టుకుని, తుపాకి భుజంమీద పెట్టుకుని ఉన్నాడాసిపాయి. ఇప్పుడే కవాతు నుండి తిరిగి వస్తున్నట్లున్నాడు. మొహసిన్‌కు నీళ్ళతోడేవాడి బొమ్మ నచ్చింది. నడుము వంగిపోయింపతనికి. నెత్తిన మోటబాన ఉంది. ఆ బానను ఒక చేత్తో పట్టుకునే ఉన్నాడతను. ఎంత సంతోషంగా ఉన్నాడూ! బహుశా ఏదో పాటపాడుతున్నట్లున్నాడు. బానలోనుండి నీళ్ళు కుమ్మరించబోతున్నాడు. నూరే వకీలుమీద మోజు పడ్డాడు. ఆయన ముఖంలో ఎంత పాండిత్యముంది! నల్లకోటూ, లోపల తెల్ల చొక్కా, పైజేబులో గడియారం, దానికి బంగారు గొలుసూ, ఒక చేతిలో 'లా' పుస్తకం – బలేగా ఉన్నాడు. అప్పుడే ఏదో కోర్టులో వాదించి వస్తున్నట్లున్నాడు. ఇవన్నీ అర్ధణా అర్ధణా బొమ్మలు. హామిద్‌దగ్గర మొత్తం ఉన్నవే మూడుకానులు. ఇంత ఖరీదుగల బొమ్మలు అతనేం కొనగలుగుతాడూ? బొమ్మ ఎక్కడైనా చెయ్యి జారి పడిపోతే ముక్కలు ముక్కలౌతుంది. కాసిని నీళ్ళుపడితే రంగంతా చెరిగి పోతుంది. అటువంటి బొమ్మలు అతనేం చేసుకుంటాడు. ఎందు కుపయోగిస్తాయి గనుక!

"మా నీళ్ళవాడు రోజూ రెండు పూటలా నీళ్ళు తెచ్చిపెడతాడు" అన్నాడు మొహసిన్.

"మా సిపాయి యింటికి కాపలా కాస్తాడు. ఎవరైనా దొంగవస్తే వెంటనే తుపాకీతో కాల్చిపారేస్తాడు" అన్నాడు మహమూద్.

"మా వకీలు దావాల్లో మోతగా పోట్లాడుతాడు" అన్నాడు నూరే.

"మా చాకలిది రోజూ బట్టలుతికిపెడుతుంది" అన్నాడు సమ్మీ.

"మట్టిబొమ్మలేగా! క్రిందపడిపోయినాయంటే ముక్కలు ముక్కలై పోతాయి" బొమ్మలను దూషిస్తున్నాడు హామిద్. కాని అతని కళ్ళన్నీ ఆ బొమ్మల మీదే ఉన్నాయి. ఆశగా చూస్తున్నాడు వాటివైపు. కాసేపు తన చేతులతో పట్టుకొనిస్తే బాగుండునే అనిపిస్తోంది. అతని చేతులు తెలియకుండానే వాటిమీదికి పోతున్నాయి. కాని వాళ్ళతని కివ్వటంలేదు. అప్పుడే కొనుక్కున్న బొమ్మల విషయంలో పిల్లలు అంత త్యాగం చూపించలేరు. హామిద్ ఆశగా చూస్తూ ఉండిపోయాడు

బొమ్మల దుకాణాల తరువాత మిఠాయి దుకాణా లున్నాయి. ఒకడు నువ్వు జీడీలు కొనుక్కున్నాడు ఇంకొకడు గులాబ్‌జామ్ కొనుక్కున్నాడు. మరొకడు సోహన్‌హల్వా కొనుక్కున్నాడు. అంతా హుషారుగా తింటున్నారు. హామిద్ వాళ్ళలో కలపలేదు. అతనివగ్గర మూడుకాను లున్నాయి. ఏమైనా కొనుక్కు తిన కూడదూ? ఆశగొన్న నేత్రాలతో అందరివంక చూస్తున్నాడు

"హామిద్! ఇదిగో నువ్వుజీడీ! ఎంత కమ్మని వాసన గొడుతోందోచూడు!" అన్నాడు మొహసిన్

హామిద్ సందేహించాడు. ఇది కేవలం క్రూరమైన వినోదం. మొహసిన్ అంత ఉదారబుద్ధిగలవాడుకాదు. అయినా తెలిసిగూడా అతనిదగ్గరకు వెళ్ళాడు హామిద్. మొహసిన్ తన పొట్లంలోనుంచి ఒక జీడీతీసి హామిద్‌కు యివ్వబోయాడు. హామిద్ చెయ్యిజాపేసరికి మొహసిన్ జీడీ తన నోట్లో వేసుకున్నాడు. మహమూద్, నూరే, సమ్మీ విపరీతంగా చప్పట్లుగొడుతూ నవ్వారు. హామిద్ పాపం చిన్నబుచ్చుకున్నాడు.

"పోనీలే హామిద్! ఈసారి తప్పకుండా పెడతాను. అల్లాతోడు. ఇదిగో తీసుకుపో" అన్నాడు మొహసిన్.

"ఉంచుకో, ఉంచుకో! నాకే మక్కరలా! నా దగ్గరేం డబ్బులు లేవనుకున్నావా?" అన్నాడు హామిద్.

"ఉన్నాయిలే మూడుకానుల పైకం. ఏమేం కొంటావు వాటితో?" అన్నాడు సమ్మీ.

"ఇదిగో నా దగ్గర గులాబ్‌జాముంది తీసుకో హామిద్! మొహసిన్ గాడొట్టి బద్మాషులే" అన్నాడు మహమూద్.

"మిఠాయి లేమంత గొప్పవేం? పుస్తకాల్లో అవ్వెంత చెడ్డవని వ్రాశారో తెలుసా?" అన్నాడు హామిద్.

"దొరికితే పాపం తిందామనే ఉంది మనసులో. తన డబ్బులు బయటికి తీస్తాడేమో చూశారూ!" అన్నాడు మొహసిన్.

"వీడి ఎత్తు నాకు తెలుసులే. మన డబ్బులన్నీ అయిపోగానే మనలను ఊరించి ఊరించి తిందామని చూస్తున్నాడు" అన్నాడు మహమూద్.

మిఠాయి దుకాణాల తరువాత కొన్ని యినుప దుకాణాలున్నాయి. కొన్ని గిల్టు దుకాణాలు, మరికొన్ని నకిలీ నగల దుకాణాలూ ఉన్నాయి. పిల్లలకు యిక్కడేమీ ఆకర్షణ కలుగలేదు. వాళ్ళంతా ముందుకు సాగిపోయారు. హామిద్ ఇనుప వస్తువుల దుకాణంవద్ద ఆగిపోయాడు. బోలెడు చిమటా [పట్కారులు] లున్నాయక్కడ. హామిద్‌కు జ్ఞాపకంవచ్చింది. మామ్మదగ్గర చిమటాలేదు. పెనంమీదనుండి రొట్టెలు తీస్తుంటే ఆమెకు చెయ్యి కాలుతుంటుంది పాపం! తాను చిమటా తీసుకువెళ్ళి మామ్మకిస్తే ఎంత సంతోషిస్తుంది. ఇక ఆమె వేళ్ళు కాలవు. ఇంట్లో ఒక పనిముట్టు ఏర్పడుతుంది. బొమ్మలవల్ల ఏం ప్రయోజనం? వృథాగా డబ్బులు నాశనమైపోతాయి. కాసేపుమాత్రం సంతోషంగానే ఉంటుంది. ఆ తరువాత వాటిని కన్నెత్తికూడా చూడరు. లేక యింటికి చేరే సరికే పగిలి ముక్కలు ముక్కలైపోవచ్చు. కాని చిమటా ఎంత ఉపయోగకరమైన వస్తువు. పెనంమీదినుంచి రొట్టెలు తియ్యొచ్చు. నిప్పులమీద రొట్టెలు కాల్చుకోవచ్చు. ఎవరైనా నిప్పుకోసం వస్తే చటుక్కున పొయ్యిలోనుండి నిప్పుతీసి యివ్వొచ్చు. బజారుదాకావచ్చి కొనుక్కుపోవటానికి మామ్మకు తీరిక ఏదీ? అదీ గాక యిన్ని డబ్బులుమాత్రం దొరకొద్దూ? రోజూ చేతులు కాలుతుంటాయిపాపం. హామిద్ సహచరులు ముందుకు సాగిపోయినారు. దోవలో ఒకచోట అందరూ పానకం త్రాగుతున్నారు. చూడండి వాళ్ళెంత ఆశపోతులో! ఇన్ని మిఠాయిలు కొనిగూడా నా కొక్కటైనా పెట్టలేదు. మళ్ళీ మాతో ఆడుకోటానికి రమ్మంటారు. ఆపనీ ఈపనీ చేసిపెట్టమంటారు. ఈసారి ఎవరైనా పని చేసిపెట్టమని అడిగితే అప్పుడు చెబుతాను. తింటే తిననీ మిఠాయిలు. వాళ్ళనోరే కంపుకొడుతుంది. కురుపులూ, మొటిమలూ లేస్తాయి. ఎప్పుడూ మిఠాయిలమీదే ఉంటుంది మనసు. ఇక వాటికోసం యింట్లో డబ్బులు దొంగిలించటం ప్రారంభించి దెబ్బలు తింటుంటారు. పుస్తకాల్లో అబద్ధాలేం వ్రాయరు. నా నోరెందుకు పాడుచేసుకోవాలి! మామ్మ చిమటా చూడగానే పరుగెత్తి నా చేతిలోనుండి తీసుకుని "మా నాయనే! మామ్మకోసం చిమటా తెచ్చావా?" అంటుంది. వేల దీవెనలిస్తుంది. చిమటాతీసుకు వెళ్ళి యిరుగు పొరుగు ఆడవాళ్ళకు చూపిస్తుంది. హామిద్ చిమటా తెచ్చాడని ఊరంతా తెలిసిపోతుంది. "ఎంత మంచిపిల్లవాడమ్మా" అంటారు. వీళ్ళ బొమ్మల్నిచూసి దీవించేవాళ్ళెవరూ? పెద్దవాళ్ళ దీవెనలు తిన్నగా అల్లా దర్బారుకు చేరుకుంటాయట. అల్లాకూడా ఆ దీవెనలను త్వరగా ఆలిస్తాడు. నా దగ్గర డబ్బులు లేకపోబట్టిగా మొహసినూ, మహమూదూ, ఈ విధంగా దాబుసరి చేస్తున్నారూ.

నేనూ చేస్తాను బాబుసరి. బొమ్మలాట ఆడుకుంటే ఆడుకోనీ! మిఠాయిలు తింటే తిననీ! నేను ఆడను బొమ్మలాట. వీళ్ళ మిడిసిపాటు నే నెందుకు సహిస్తానూ. నేను పేదవాణ్ణే. అయినా ఎవరినీ దేబిరించటంలేదుగా? ఎప్పుడో తప్పకుండా మా నాన్న రానేవస్తాడు. అమ్మగూడా వచ్చేస్తుంది. అప్పుడు "మీకు ఎన్నిబొమ్మలు కావాలోయ్" అని అడుగుతాను వీళ్ళను. ఒక్కొక్కరికి బుట్టల బుట్టల బొమ్మలిచ్చే స్నేహితులతో ఎలా మెలగాలో చూపిస్తాను. ఇట్లాగా! ఒక్క కానీ జీడీలు తీసుకున్నారో లేదో ఊరించి ఊరించి తినటమూ! హామిద్ చిమటా తీసుకొచ్చాడని అంతా పగలబడినవ్వుతారు. నవ్వితే నవ్వనీ. నాకేం? దుకాణదారుణ్ణి ప్రశ్నించాడు "ఈ చిమటా ఎంత?"

దుకాణదారు డతనివైపు చూచాడు. వెంట ఎవరూ లేకపోవటం గమనించి "అది నీకు పనికొచ్చేది కాదులే" అన్నాడు.

"అమ్మేదా? కాదా?"

"అమ్మేదెందుకు కాదూ? ఇంతదూరం మోసుకువచ్చిం దెందుకూ?"

"అయితే చెప్పరాదూ ఎన్ని కానులౌతుందో?"

"ఆరుకాను లౌతుంది."

హామిద్ నిరాశపడిపోయినాడు.

"సరిగ్గా చెప్పవయ్యా!"

"సరిగ్గా అయిదుకాను లౌతుంది. ఇష్టమైతే తీసుకో, లేకుంటే వెళ్ళు."

"మూడుకానుల కిస్తావ్?"

ఈ మాటంటూ దుకాణదారు కోపగించుకుంటాడేమోనని ముందుకు సాగాడు. కాని దుకాణదారు కోప్పడలేదు. పిలిచి చిమటా యిచ్చేశాడు. హామిద్ దాన్ని తుపాకిమాదిరిగా భుజంమీద పెట్టుకుని ఠీవిగా విరుచుకుంటూ నడిచి సహచరులతో కలిశాడు. యిక వాళ్ళు ఎలాంటి వ్యాఖ్యానాలు చేస్తున్నారో వినండి.

"ఈ చిమటా ఎందుకు తెచ్చావోయ్? పిచ్చివాడివల్లే ఉందే!" అన్నాడు మొహసిన్.

హామిద్ చిమటాను నేలపువేసికొట్టి "నీ నీళ్ళవాణ్ణి కాస్త నేలమీద పడెయ్ తెలుస్తుంది. ఎముకలన్నీ విరిగి ఊరుకుంటాయ్ కుంకకు" అన్నాడు.

"అయితే ఈ చిమటాకూడా ఒక బొమ్మేనా" అన్నాడు మహమూద్.

"ఎందుకు కాదూ? యిదుగో! భుజంమీద పెట్టుకున్నా నా తుపాకి! చేతితో పట్టుకుంటే ఫకీరుల చిమటా. కావాలంటే దీన్ని కంజరిలాగాగూడా ఉపయోగించ గలను. దీనితో ఒక్కటి పెట్టానంటే మీ బొమ్మలన్నీ నిగిడి చస్తాయి. మీబొమ్మలు ఎంత గింజుకున్నా నా చిమటాను ఏమీ చెయ్యలేవు. నా వీరసింహం- ఈ చిమటా! తెలుసా?" అన్నాడు హామిద్.

సమ్మి కంజరి కొనుక్కున్నాడు. కాని చిమటాచూచి మోజుపడ్డాడు. "నా కంజరిస్తానుగాని నీ చిమటా యిస్తా? రెండణాలుపెట్టి కొన్నానిది" అన్నాడు.

హామిద్ కంజరివైపు నిర్లక్ష్యంగా చూచాడు— "నా చిమటా తలుచుకుంటే నీ కంజరిపొట్ట బద్దలు చేసేస్తుంది. తోలుపొర ఒకటి తగిలించేసరికి డబడబ మోగుతున్నది. కాస్త తడితగిలితే ఖాళీ. నా మొనగాడి చిమటా నిప్పుల్లో, నీళ్ళల్లో, తుపానులో ఎక్కడైనాసరే నిశ్చయంగా నిలబడుతుంది. ఏమిటనుకున్నావో :" అన్నాడు.

చిమటాకూడా అందరినీ ఆకర్షించింది. కాని ఇప్పుడిక డబ్బులు ఎవరిదగ్గరున్నాయ్! పైగా పట్నంనుండి చాలాదూరం వచ్చేశారు. అప్పటికే తొమ్మిదిగంటలైంది ఎండ తీవ్రమౌతున్నది. త్వరగా యింటికి చేరాలనిపిస్తున్నది. నాన్నదగ్గర హఠంవేసినా చిమటా దొరకటం అసంభవం. హామిద్ చాలా తెలివైనవాడు. అందుకనే దుష్టుడు తన డబ్బులు ఓవరదాకా దాచుకున్నాడు.

ఇక పిల్లలు రెండు మతాలుగా చీలారు. మొహసిన్, మహమూద్, సమ్మి, నూరే వీళ్ళంతా ఒకవైపు. హామిద్ ఒక్కడూ ఒకవైపు. తర్కవితర్కాలు సాగినాయి. కొంతసేపటికి సమ్మి మతం మార్చుకుని రెండోపక్షం చేరాడు. కాని మొహసిన్, మహమూద్, నూరే ముగ్గురూ హామిద్‌కంటె ఏడాదీ రెండేళ్ళు పెద్దయి ఉండికూడా హామిద్ తిసే దెబ్బలకు గుక్కతిప్పుకోలేక పోతున్నారు. న్యాయబలం, నైతికబలం అతనివైపు వుంది. ఒక పక్షాన మట్టి, రెండోపక్షాన యినుము! ఇప్పుడు తననది ఉక్కని చెప్పుకుంటోంది. అది అజేయమైంది. ప్రమాదకరమైంది. అక్కడికేదైనా సింహంగనుక వస్తే నీళ్ళమో సేవాకి గుండెలు జారిపోతాయి. సిపాయిగారు మట్టితుపాకి వదిలేసి పారిపోతారు వకీలుగారు ముడుచుకుపోయి కోటులో తలదాచుకుని నేలమీద పడుకుంటారు. కాని ఈ చిమటా బహదూర్ భారతవీరుడివలే ముందుకురికి సింహం మీద స్వారీచేస్తాడు. దానిగ్రుడ్లు తోడేస్తాడు.

"నీళ్ళవాణ్ణిగనుక మన చిమటావీరుడు దబాయించాడంటే పరుగెత్తుకుంటూ నీళ్ళుతెచ్చి వాకిట్లో చల్లుతాడు". చివరిమాటగా నొక్కిచెబుతూ అన్నాడు హామిద్

మొహసిన్ ఓడిపోయాడు. కాని ఇంతలో మహమూద్ వత్తాసి కొచ్చాడు - "చిమటా వెధవగనుక పట్టుబడ్డాడంటే కాళ్ళూ చేతులూ కట్టించుకుని కోర్టులచుట్టూ తిరగాలి. అప్పుడు నా వకీలు కాళ్ళే పట్టుకోవాలి."

ఈ బలమైన వాదనకు హామిద్ జవాబు చెప్పలేకపోయినాడు. "మమ్మల్ని పట్టుకునే దెవరూ?" అని ప్రశ్నించాడు.

"ఈ తుపాకి పట్టుకున్న సిపాయే!" రొమ్ము విరుచుకుంటూ అన్నాడు నూరే.

"పాపం! ఈ మొనగాడు మా భారతవీరుణ్ణి పట్టుకుంటాడేం? అయితే రమ్మను; యిప్పుడే కాసేపు కుస్తీపడదాం. చిమటా ముఖం చూస్తేనే దూరంగా పరుగుతీస్తాడు మీ సిపాయి. ఇంకా పట్టుకుంటాట్ట మొగాడు!" ముఖం చిట్లించుకుని అన్నాడు హామిద్.

మొహసిను కొక క్రొత్తయుక్తి తోచింది– "నీ చిమటా ముఖం రోజూ నిప్పుల్లో కాలుతూనే ఉంటుందిగా!" అన్నాడు మొహసిన్.

హామిద్ దీనికిక జవాబే చెప్పలేడనుకున్నాడు. కాని అలా జరగలేదు. "నిప్పుల్లో వీరులైనవాళ్ళే దూకగలుగుతారు. తెలుసా? మీ వకీలు, సిపాయి, నీళ్ళ వాడు ఆడవాళ్ళలాగా యిళ్ళల్లో దూరాల్సిందే. నిప్పుల్లో దూకటంలాంటి పనులు మా చిమటా బహాదూరొక్కడే చెయ్యగలిగేవి. భారతవీరుడోయ్ మా చిమటా! తెలుసా?" అని వెంటనే జవాబు చెప్పాడు హామిద్.

"మా వకీలుగారు కుర్చీలమీద, సోఫాలమీద కూర్చుంటారు. నీ చిమటా ఎప్పుడూ వంటింట్లో నేలమీదే పడివుంటుంది" మాటలు సాగదీస్తూ అన్నాడు మహమూద్.

ఈ తర్కంతో సమ్మీ నూరేళ్ళిద్దరికీ హుషారు వచ్చింది. "మన వస్తాదు ఠకీమని తిరాడోయ్ దెబ్బ! చిమటా వంటింట్లో ఉండక యింకా చేసేదేముందీ?"

హామిద్‌కు సూటైన జవాబు తోచకపోయేసరికి ఉడుకుబోతుతనం ప్రదర్శించ సాగాడు.— "నా చిమటా వంటింట్లో ఉండదు. వకీలుగారు కుర్చీమీద కూర్చుంటే పోయి ఆయన్ను నేలకేసి కొడుతుంది. ఆయన 'చట్టం' తీసుకువెళ్ళి పొట్టలో పెట్టేస్తుంది"

మాట సరిగ్గా అతకలేదు. అవి వట్టితిట్లూ, శాపనార్థాలూ. కాని చట్టాన్ని పొట్టలో పెట్టేస్తానన్నమాట మంచి ప్రభావం కలిగించింది. ఎంతగా చిత్తు చేసిందంటే ఆ ముగ్గురువీరులూ గూడా కళ్ళప్పగించి ఊరుకున్నారు. గ్రద్దకు చిక్కిన కోడిపిల్లలాగా అయింది వాళ్ళస్థితి. చట్టం నోటినుండి వెలువడుతుంది. దాన్ని పొట్టలో పెట్టడం అనేమాట అతక్కపోయినా అందులో కొంత క్రొత్తదనం ఉంది. హామిద్ విజయం పొందాడు. అతని చిమటా భారతవీరుడు! ఇప్పుడీవిషయంలో మొహసిన్, మహమూద్, సమ్మీల కెవరికీ ఎలాంటి అభ్యంతరం లేదు.

విజేతలకు పరాజితులు సత్కారం చేయటం సహజం. అలాంటి సత్కారం హామిద్‌కుకూడా లభించింది. ఇతరులు మూడణాలు, నాలుగణాలదాకా ఖర్చు పెట్టారు. ఒక్కడూ ఉపయోగకరమైన వస్తువు కొనలేదు. హామిద్ మూడుకానులతో గారడీ చేసేశాడు. నిజమేగా! బొమ్మలేం గట్టిగా ఉంటాయ్? విరిగి ముక్కలై పోతాయి. హామిద్ తెచ్చిన చిమటా అయితే ఎన్ని సంవత్సరాలో ఉంటుంది.

సంధి షరతులు సిద్ధమైనాయి. "కాస్త నీ చిమటా నా చేతికివ్వు. నేనూ చూస్తాను. నువ్వు నా నీళ్ళవాడి బొమ్మ తీసుకుని చూడు" అన్నాడు మొహసిన్.

మహమూద్, నూరేలుకూడా తమ బొమ్మల్ని ముందుంచారు.

హామిద్‌కు ఈ షరతులు అంగీకరించటానికి అభ్యంతరమేమీ లేదు. పందెం ప్రకారం చిమటా అందరి చేతుల్లోకి వెళ్ళింది. అలాగే వాళ్ళ బొమ్మలు కూడా హామిద్ చేతుల్లోకి వచ్చాయి. ఎంత అందమైన బొమ్మలు!

"నేను మిమ్మల్ని ఊరికే ఉసికొల్పానోయ్! లేకుంటే ఈ యినుప చిమటా ఈ బొమ్మలముందు ఎందుకు పనికొస్తుంది? ఇప్పుడే మాట్లాడబోతున్నట్లు ఎంత బాగున్నాయో చూడు బొమ్మలు!" ఓడిపోయిన వాళ్ళను ఓదారుస్తూ అన్నాడు హామిద్.

కాని మొహసిన్ పార్టీకి ఈ ఓదార్పు సంతృప్తి కలిగించలేదు. చిమటా అంటే బాగా మోజు ఏర్పడిపోయింది. పడిన ముద్ర కడిగినా చెరగడం లేదు.

"ఏమైనా ఈ బొమ్మలు తెచ్చినందుకు మమ్మల్నెవరూ మెచ్చుకోరుగా?" అన్నాడు మొహసిన్.

"మెప్పులకోసం చూస్తున్నావు. పైగా దెబ్బలుకూడా తగులుతాయేమో అది చూడు! 'తిరుణాలలో మీకి మట్టిబొమ్మలేనా దొరికింది?' అని అమ్మ తప్పకుండా కోప్పడుతుంది" అన్నాడు మహమూద్.

ఈ చిమటాను చూచి తన మామ్మ సంతోషించినంతగా ఆ బొమ్మలనుచూచి ఏ తల్లి అంతగా సంతోషించదు. ఈ విషయం హామిద్ ఒప్పుకోక తప్పలేదు. మూడు కానుల్లో తానన్నీ సరిపెట్టుకోవాలి. మరి ఆ కానులను ఈ విధంగా ఉపయోగించినందుకు తను పశ్చాత్తాప పడవలసిన అవసరం ఎంత మాత్రం లేదు. పైగా యిప్పుడా చిమటా భారత వీరుడుగా చలామణి అవుతోంది. బొమ్మలన్నింటికీ రాజై కూర్చుంది.

దారిలో మహమూద్‌కు ఆకలైంది. వాళ్ళ నాన్న తింటానికి అరటిపళ్ళిచ్చాడు. మహమూద్ హామిద్ ఒక్కడినే భాగం కలుపుకున్నాడు. అతని యితర స్నేహితులంతా నోరు తెరచుకుని చూస్తూండిపోయారు. మరి అదంతా చిమటా మహిమే!

## 3

పదకొండుగంట లయ్యేసరికి గ్రామమంతా కోలాహలంగా ఉంది. తిరుణాల కెళ్ళినవాళ్ళంతా వచ్చేశారు. మొహసిన్‌చెల్లెలు పరిగెత్తుకుంటూవచ్చి నీళ్ళవాడి బొమ్మను అతని చేతిలోనుండి లాక్కుని, వెర్రి సంతోషంతో ఒక్కగంతు వేసేసరికి పాపం నీళ్ళవాడు క్రిందపడి స్వర్గానికి చేరుకున్నాడు. అందుకు అన్నా చెల్లెలు దెబ్బలాడుకున్నారు. ఇద్దరూ విపరీతంగా ఏడ్చారు. ఈ గోలంతా విని వాళ్ళమ్మ చివాట్లు పెట్టింది. పైగా యిద్దరికీ చెరొక రెండూ వడ్డించింది.

నూరేమియాగారి వకీలు చావు ఆయన ప్రతిష్ఠకు తగినట్లుగానే, యింతకంటె గౌరవప్రదంగా సంభవించింది. వకీలుగారు నేలమీదగానీ, గూట్లోగానీ కూర్చుంటారా? ఆయనకు తగిన మర్యాద చెయ్యొద్దూ? గోడకు రెండు మేకులు కొట్టాడు. దానిమీద ఒక చెక్క అమర్చాడు. పైన కాగితాల జముఖానా పరిచాడు. వకీలుగారు భోజమహారాజు మాదిరిగా సింహాసనం అలంకరించాలని అతని కోరిక. నూరే ఆయనకు విసనకర్రతో విసరటం ప్రారంభించాడు. కోర్టుల్లో వట్టివేళ్ళ తడికలూ, ఎలెక్ట్రిక్ పంకాలూ ఉంటాయి. మరిక్కడ మామూలు విసనకర్రయినా ఉండకపోతే బాగుంటుందా! చటాలవేడి మెదడుకెక్కిపోదూ పాపం! వెదురు విసనకర్ర తీసుకుని విసరటం మొదలెట్టాడు నూరే. మరి విసనకర్రగాలే తగిలిందో, లేక విసనకర్రే తగిలిందో తెలియదుగాని వకీలుగారు స్వర్గలోకంనుండి భూలోకానికి వచ్చిపడ్డారు. ఆయన మట్టిబొమ్మ మట్టిలో కలిసిపోయింది. ఇక నూరే పెద్దగా శోకాలుకూడా పెట్టాడు. తరువాత వకీలుగారి అస్థికలు పెంటపోగులో పడేశారు.

ఇక మహమూద్‌గారి సిపాయి సంగతి. అతనికి వెంటనే గ్రామానికి పహరా యిచ్చే ఉద్యోగం లభించింది. పోలీసు జవానంటే మామూలు మనిషా క్రిందనడపటానికీ! అతను పల్లకీమీద వెళ్తాడు కాపలాకు మహమూదొక బుట్ట తీసుకొచ్చాడు. దానిలో సిపాయిగారు విశ్రాంతిగా పడుకోటానికి వీలుగా ఎర్రని చింపిరిగుడ్డలు పరిచాడు. నూరే ఆ బుట్ట నెత్తికెత్తుకుని వాళ్ళద్వారం వద్ద పహరాతిరుగుతున్నాడు. అతని తమ్ముళ్ళిద్దరూ "నిద్దలపోయేవాళ్ళూ! మెలకువతో ఉందండీ!" అంటూ సిపాయి తరఫున కేకలు వేస్తున్నారు. మరి రాత్రిపూట చీకటిగా ఉంటుందిగా! మహమూద్‌కు ఎదురుదెబ్బ తగిలింది. బుట్ట అతని చేతులో నుండి జారి పడిపోయింది. సిపాయి తన తుపాకితోసహా నేలమీదపడిపోయినాడు. ఒక కాలు విరిగిపోయింది. తానొక మంచి డాక్టరునన్న విషయం ఈరోజే తెలిసిందతనికి. ఎందువల్లంటే విరిగిన కాలును అతికించే ఉపాయం తెలిసిందతనికి. అయితే అత్తిపాలు దొరకాలి. ఎలాగో అత్తిపాలు సంపాయించాడు. విరిగిపోయిన కాలుఅతికించేశాడు. కాని సిపాయిని అలా నిలబెట్టాడో లేదో కాలుకాస్తా ఊడి పడిపోయింది. శస్త్ర చికిత్స ఫెయిలయింది. అందువల్ల రెండవ కాలుకూడా విరుగగొట్టేశాడు. ఇప్పుడు కనీసం ఒకచోట కూర్చోనైనా కూర్చుంటాడు. ఒక్క కాలుతో అటు నడవనూ లేడు; ఇటు కూర్చోనూలేడు. యిప్పుడా సిపాయి సన్యాసిగా మారాడు. తానున్న చోటే ఉండి కాపలా కాస్తున్నాడు. అప్పుడప్పుడు దేవతగాకూడా మారుతున్నాడు. అతని నెత్తిమీద ఉన్న కుచ్చుల టోపి అరగదీసి పారేశాడు. ఇక దాన్ని ఎన్ని రకాలుగానైనా మార్చుకోవచ్చు. అప్పుడప్పుడు తూనికరాయిగాకూడా ఉపయోగించుకోవచ్చు.

ఇక హామిద్ కథ వినండి. అమీనా అతని గొంతు వినపడగానే పరుగెత్తుకు వచ్చి చంకనెత్తుకుని ముద్దులాడసాగింది. ఇంతలో అగస్మాత్తుగా అతని చేతిలోని చిమటా చూచి త్రుళ్ళిపడింది.

"ఈ చిమటా ఎక్కడిది?"

"నేను కొన్నాను మామ్మా!"

"ఎంతకు కొన్నావు?"

"మూడుకాను లిచ్చాను."

అమీనా గుండెలు బాదుకుంది. వీడెంత మతిలేనివాడంటా! రెండుఝాము లైంది. ఇంతవరకూ గుక్కెడు నీళ్ళయినా త్రాగలేదు. "ఈ ఇనుప చిమటా ఒకటి తెచ్చావా? తిరుణాలలో యింతకంటే ఏమి దొరకలా నీకూ?"

"పెనంమీద నీ వేళ్ళు కాలుతున్నాయిగదు మామ్మా! అందుకని తెచ్చా లేవే:" ఏదో అపరాధం చేసినవాడిలాగా అన్నాడు హామిద్.

ఆమాట వినగానే వృద్ధురాలికోపం ప్రేమగా మారిపోయింది. తన ఆవేద నంతా శబ్దజాలం ద్వారా ప్రగల్భంగా వెల్లడించే ప్రేమ కాదది. వినిర్మలమూ, రస పంతమూ, మధురాతిమధురమూ అయినదా ప్రేమ. అతనిలో ఎంత త్యాగం, ఎంత సద్భావం! ఎంత వివేకం! తోటి పిల్లలు బొమ్మలు కొనుక్కోటం, మిఠాయిలు తినటం చూచి అతని మనస్సు ఎంత పరితపించిందోగదా! ఇంత నిగ్రహం అతని కెలా కలిగిందో! అక్కడికి వెళ్ళిన తరువాతగూడా తన ముసలి మామ్మను మరిచి పోలేదు. అమీనా హృదయం ద్రవించింది.

అప్పుడొక విచిత్రమైన ఘటన జరిగింది. హామిద్ చిమటాకంటెగూడా అద్భుతమైన దాఘటన. పసవాపడైన హామిద్ వయోవృద్ధ హామిద్ పాత్ర వహిం చాడు. వృద్ధురాలైన అమీనా, బాలిక అమీనా అయింది. ఆమె ఏడుస్తోంది. కొంగు పరిచి హామిద్‌ను ఆశీర్వదిస్తోంది. ఆమె కంటినుండి పెద్దపెద్ద అశ్రుబిందువులు రాలుతున్నాయి. అందులోగల రహస్యం పాపం హామిద్ కేం తెలుస్తుంది.

—o—

# ఊరేగింపు

సంపూర్ణ స్వరాజ్యంకోసం సత్యాగ్రహోత్సవం సాగుతోంది. కొందరు యువకులూ, కొందరు వృద్ధులూ, కొందరు బాలురూకూడా జండాలు చేతబట్టుకుని 'వందేమాతరమ్' గీతాన్ని గానం చేస్తూ బజారుగుండా బయలుదేరారు. రెండు వైపులా ప్రేక్షకులు బారులుతీరి నిలబడ్డారు. తమ కీ దళంతో సంబంధంలేదనీ కేవలం కళ్ళప్పగించి చూస్తుండటమే తమ కర్తవ్యమనీ భావిస్తున్నట్లుంది వారంతా.

శంభునాథ్ దుకాణంముందు నుంచుని తన పొరుగు దుకాణదారుడైన దీన దయాళ్‌తో యిలా అన్నాడు—"వీళ్ళందరూ మృత్యు దేవతకు బలికాబోతున్నారు. అవతల పోలీసులు గుర్రపు దళాలతో సిద్ధంగా ఉన్నారు. తరిమి తరిమి కొడ్తారు."

"మహాత్ముడికికూడా మతిపోయింది. ఊరేగింపులు చేస్తే స్వరాజ్యం వచ్చే ట్లయితే ఈ పాటి కెప్పుడో రానే వచ్చేది. ఇక ఊరేగింపులో జనాభా ఎటువంటిదో చూడు! అంతా కుర్రకుంకలూ, రౌడీ ముండాకొడుకులూ, తలతిరుగుడుగాళ్లూ! అంతా వట్టి చచ్చురకం. ఈ పట్నంలోగల గొప్పవాళ్ళల్లో ఒక్కడైనా యిందులో ఉన్నాడూ?" అన్నాడు దీనదయాళ్.

మైకూలాల్ మెడలో చిలపలవంద ధరించి అక్కడే నుంచుని ఉన్నాడు. ఈ వరకు లిద్దరి మాటలూ విని నవ్వాడు.

"నవ్వుతున్నా వెందుకు మైకూ? ఇవ్వాళ మంచి హుషారుగా ఉన్నట్లుందే" అన్నాడు శంభూ.

"గొప్పవాళ్ళెవ్వరూ ఈ ఊరేగింపులో లేరే అంటున్నావ్ చూడావ్! అందుకే నవ్వువచ్చింది నాకు. ఇందులోకి గొప్పవాళ్ళెందుకొస్తారు చెప్పు! వాళ్ళకి రాజ్యంలో లేని సౌకర్యా లేమిటున్నాయ్? బంగళాల్లోనూ, భవనాల్లోనూ నివాసం; మోటారుకార్లలో విహారం; ఆఫీసర్లతో విందులూ, వాళ్ళకొచ్చిన కష్టమేమిటి చెప్పు. హోటలుకు కూడా గతిలేక చచ్చేది మనవంటివాళ్ళం. ఈ సమయంలో కొందరు టెన్నిస్ ఆడుతుంటారు. కొందరు టీ త్రాగుతుంటారు. మరికొందరు గ్రామఫోను పెట్టుకుని వింటూ వుంటారు. ఇంకొందరు పార్కుల్లో షికార్లు కొడుతుంటారు. వాళ్ళందరినీ లాఠీదెబ్బలు తినటానికి యిక్కడికి రమ్మంటావా ఏం? బలేవాడివయ్యా నువ్వు!" అన్నాడు మైకూ.

"నీ కేం తెలుస్తుందిలే మైకూ ! ఏమైనా నలుగురు గొప్పవాళ్ళు ముందుండి నడిపితేనే ప్రభుత్వంగూడా కాస్త లక్ష్యపెడుతుంది. అలగాజనమంటే అధికారుల కేమిలక్ష్య ముంటుంది చెప్పు" అన్నాడు శంభూ.

ఈ మాటలు విని మైకూ అదోలా చూచాడు. 'ఈ విషయాలన్నీ గ్రహించ గలగటం నీ ఒక్కడి గుత్తసొమ్మేంకాదులే' అంటున్నట్లుగా ఉందాచూపు — "గొప్పవాళ్ళను చేసేదీ, క్రిందకు దించేదీ అంతా మనమేనా? యింకెవరన్నానా? ఊరూపేరూ గూడా లేని వాళ్ళను ఎంతమందిని మనం గొప్పవాళ్ళను చేశాం? వాళ్ళిప్పుడు కార్లలో తిరుగుతూ మనలనే నీచంగా చూస్తున్నారు. కాస్త పైకి రాగానే ప్రతివాడికీ మనమంటే గిట్టకపోవటం మన ప్రజల దురదృష్టంకాదూ ! సాదాగా, నిరాడంబరంగా మనతోపాటు ఉంటూ, మన పరిస్థితులను బాగుపరచటం కోసం ఆత్మత్యాగానికిసైతం సిద్ధమైన వాడే మనకు గొప్పవాడు. అదీగాక మనకు ఈ గొప్పవాళ్ళంటే గౌరవమేమీలేదు. నిజం చెప్పాలంటే మన దుర్దశకంతా కారణం ఈ గొప్పవాళ్ళే. ప్రభుత్వం వీళ్ళ కేదో కాస్త మంచిహోదా యివ్వగానే యింకే ముందీ ! ఇక వాళ్ళకు కళ్ళు నెత్తికోచ్చేస్తాయి" అన్నాడు.

"క్రొత్తగా వచ్చిన సబిన్స్పెక్టరు చాలా దుర్మార్గుడు. కూడలిలోకి చేరుకోగానే హంటరుతీసుకొని విరుచుకుపడతాడు. ఇక అప్పుడు అందరూ తోకలు ముడుచుకుని ఎలా పరుగులు పెడ్తారో చూద్దురుగాని. బలే రంజుగా ఉంటుందిలే" అన్నాడు దీనదయాళ్.

స్వరాజ్యనిషాలో మునిగితేలుతూ ఊరేగింపు నాలుగురోడ్ల కూడలిలోకి చేరుకుంది. అక్కడ గుర్రపుదళం, పోలీసుదళం దారికడ్డంగా నిలబడిఉన్నాయి.

అకస్మాత్తుగా యిన్స్పెక్టరు వీరబల్‌సింగ్ తన గుర్రాన్ని ముందుకునడిపి ఊరేగింపుముందుకు వచ్చాడు. 'మీరింక ముందుకు సాగటానికి వీల్లేదు' అన్నాడు.

ఊరేగింపును నడిపిస్తున్న వృద్ధనాయకుడు ఇబ్రహీం అలీ ముందుకువచ్చి యిలా అన్నాడు— "నేను మీకు హామీ యిస్తున్నాను. ఏవిధమైన గల్లంతు జరుగదు. దుకాణాలు కొల్లగొట్టటానికీ, కార్లు బద్దలుగొట్టటానికీ కాదు మేము బయలుదేరింది. మా ఆశయం యింతకంటే చాలా ఉన్నతమైందని మనవి చేస్తున్నాను."

వీరబల్ : ఊరేగింపు యిక్కడనుండి ముందుకు సాగనీయవద్దని మా కార్డర్లున్నాయి !

ఇబ్రహీం : మీరు కొంచెం మీ ఆఫీసర్లతో సంప్రదించగూడదూ !

వీరబల్ : నా కలాంటి అవసరమేమీ కనపడటంలేదు.

ఇబ్రహీం : అయితే మేమంతా యిక్కడే కూర్చుంటాం. మేముకూడా మీరు వెళ్ళిపోయినతరువాతే బయలుదేరుతాం లెండి !

వీరబల్ : ఇక్కడ వుండటానికికూడా వీల్లేదు. మీరు వెనక్కుతిరిగి పోవాలి.

"మేము వెనక్కు వెళ్ళటం అసంభవం. మీకుగానీ, మరొకరికిగానీ మమ్మల్ని అడ్డగించే హక్కులేదు. మీరు మీ గుర్రపు దళాలతోనూ, బాయినెట్లతోనూ, తుపాకుల బలంతోనూ మమ్మల్ని అడ్డగించదలచుకుంటే అలాగే చెయ్యండి. కాని మీరు మమ్మల్ని వెనక్కు పంపటంమాత్రం కల్ల. జాతినంతా బానిసత్వంలో బంధించటానికి మాత్రమే ఉద్దేశించబడిన యిలాంటి ఆర్డర్లను మన సోదరులంతా ఉల్లంఘించే సుదిన మెప్పుడొస్తుందోగదా !" గంభీరంగా అన్నాడు ఇబ్రహీం.

వీరబల్ గ్రాడ్యుఏటు. ఆయన తండ్రి పోలీసు సూపరింటెండెంటు. దర్పం ఆయన నర నరంలో ప్రస్ఫుటమౌతుంది. ఆఫీసర్లకు ఆయనంటే మంచి గౌరవముండేది. తెల్లని శరీరచ్ఛాయ, నీలి నీలి నేత్రాలూ, బూడిదరంగు కేశాలతో మంచి తేజస్సుగల విగ్రహం. కోటు వేసుకొని పైన హేటు ధరించాడంటే తాను ఈ దేశస్థుడేనన్న విషయంగూడా గుర్తుండదేమో! బహుశా తాను రాజ్యం చేసేజాతికి ఒక మూలస్తంభ మనుకునేవాడేమో! కాని ఇబ్రహీం మాటల్లో ఉన్న తిరస్కారభావంచూసి కొద్ది క్షణాలు అతనూ లజ్జపడ్డాడు. కాని పరిస్థితి చాలా గడ్డుగా ఉంది. ఊరేగింపును సాగనిద్దామా సంజాయిషీ అడుగుతారు. అక్కడే ఉండనిద్దామా వీళ్ళంతా యిక్కడ ఎంతసేపు తిష్ఠవేస్తారో ఏమో. ఈ సంకటంలోపడి ఆలోచిస్తుండగానే డి.యస్.పి. గుర్రంమీద రావటం చూచాడు. ఇక ఆలోచించటానికి టైము లేదు. డ్యూటీలో తన శక్తి సామర్థ్యాలు ప్రదర్శించటానికదే మంచి సమయం. ఎదుముకు వేలాడుతున్న బెత్తం చేతికి తీసుకున్నాడు. గుర్రం డొక్కల్లో కాళ్లు గ్రుచ్చి గుర్రాన్ని ఊరేగింపుమీదికి నడిపించాడు. అతన్నిచూచి యితర పోలీసులుగూడా తమ తమ గుర్రాలను ఊరేగింపు మీదకు నడపటం ప్రారంభించారు. ఇబ్రహీం ఇన్‌స్పెక్టరు గుర్రంముందు నుంచుని ఉన్నాడు. ఆయన తలమీద మంచి విసురుగా తగిలింది ఒక లాఠీదెబ్బ. దాంతో ఇబ్రహీం కళ్లు చీకట్లు కమ్మిపోయినాయి. నుంచో లేకపోయినాడు. తలపట్టుకుని కూలబడిపోయినాడు. అదే సమయంలో ఇన్‌స్పెక్టరు గుర్రం తన రెండుకాళ్ళనూ పైకెత్తింది. ఇబ్రహీం సరిగ్గా దాని గిట్టలక్రిందికి వచ్చేశాడు. ఊరేగింపు అప్పటివరకూ శాంతంగానే ఉంది. ఇబ్రహీం పడిపోవటం చూచి ఆయన్ని లేవదీయటానికి చాలామంది పరుగెత్తుకు వచ్చారు. కాని ఎవరూ ముందుకు అడుగు వెయ్యలేక పోయారు. ఒకప్రక్క గుర్రపుదళాలు అతి నిర్దాక్షిణ్యంగా లాఠీలు ప్రయోగిస్తున్నాయి. వలంటీర్లు చేతులమీద దెబ్బలను ఆపుకుంటూ అచంచలంగా నుంచున్నారు. ప్రతిహింసాభావాలకు లోనుగాకుండా నిగ్రహించుకోటం క్షణ

క్షణానికీ కష్టమౌతోంది. దెబ్బలూ, అవమానాలూ తప్పనప్పుడు ఈ అడ్డుగోడలను మనంమాత్రం ఎందుకు ఉల్లంఘించగూడదూ? వలంటీర్లకు ఒక ఆలోచన కలిగింది. పట్నంలో లక్షలమంది ప్రజలదృష్టి మనమీద కేంద్రీకృతమైయ్యింది. ఇక్కడ నుండి ఈ జండాతో వెనక్కు మళ్ళితే యిక ఏ ముఖంపెట్టుకుని 'స్వతంత్రం' అనే మాట ఉచ్చరించగలం! అయితే ప్రాణాలు దక్కించుకోటానికి పారిపోదామనే ఆలోచనకూడా ఎవరికీ లేదు. ఇది కుక్షింభరుల దళం కాదు. కిరాయికొచ్చినగుంపు కాదు. స్వరాజ్య సాధనకోసం పోరాడే స్వచ్ఛమైన స్వయంసేవకుల దళ మిది. ఉత్తమ దేశభక్తుల సుసంఘటిత సైన్యమిది. తమ బాధ్యత లేమిటో వారికి బాగా తెలుసుగా. ఎంతమంది తలలనుండి నెత్తురు కారుతోంది? ఎంతమంది చేతులకు గాయాలు తగిలినాయి? తలచుకుంటే ఒక్క ఊపులో గుర్రపు దళాలను చీల్చుకుని బయటపడగలరు. కాని సిద్ధాంత, ఆదర్శ శృంఖలాలు వాళ్ళను బంధించాయి.

పది, పదిహేను నిమిషాలవరకూ అదే పనిగా దెబ్బలవర్షం కురిసింది. వలంటీర్లు ప్రశాంతంగా నిలబడ్డారు.

## 2

ఈ లాఠీఛార్జి వార్త ఒక క్షణంలో బజారంతా వ్యాపించింది. ఇబ్రహీం గుర్రం క్రిందపడి నలిగిపోయాడు; చాలామంది గాయపడ్డారు; చాలామందికి చేతులు విరిగిపోయాయి. అయినా వలంటీర్లు వెనక్కు తిరగటంలేదు. పోలీసులుగూడా వాళ్ళను ముందుకు సాగనివ్వటం లేదు.

మైకూ ఉద్రేకంలో యిలా అన్నాడు — "ఇక యిక్కడ ఉండలేను భాయీ! నేనుగూడా వెళతాను" "నేనూ వస్తాను; చూద్దాంపద భాయీ" అన్నాడు దీనదయాళ్.

ఒక నిమిషంవరకూ శంభునాథ్ మౌనంగా ఉండిపోయాడు. వెంటనే అతను గూడా దుకాణం మూసివేసి "ఏదో ఒకనాడు మనమూ చనిపోవలసినవాళ్ళమే. కానివ్వండి ఏం జరగాల్సుంటే అదే జరుగుతుంది." అన్నాడు. చూస్తుండగానే దుకాణాల్లో ఎక్కువ భాగం బందయినాయి పదినిమిషాలకు పూర్వం వినోదంగా చూస్తున్న జనమంతా అన్నివైపులనుండీ పరుగెత్తుకువచ్చారు. వేలకొలదీ ప్రజలతో ఒక బ్రహ్మాండమైన సమూహం ఘటనాస్థలం వైపుకు బయలుదేరింది. ప్రతిహింసావాంఛతో ఉన్మత్తులైన ప్రజా సమూహ మది. సిద్ధాంతాలూ, ఆదర్శాలూ యివన్నీ లక్ష్యపెట్ట రాజనం. చావటానికేకాదు; చంపటానికకూడా సిద్ధమైయున్నారు వాళ్ళు. ఎందరి చేతుల్లోనో లాఠీ లున్నాయి. అనేకమంది తమ జేబులనిండా రాళ్లుకూడా నింపుకొచ్చారు. ఎవరూ ఎవరితోనూ మాట్లాడటంలేదు. ఎవరినీ ఏమీ అడ

గటంకూడాలేదు. అందరూ మనస్సులో ఒక దృఢసంకల్పంతో పరుగులుతీస్తూ వెళ్తున్నారు. ఏదో మేఘం కమ్ముకువస్తున్నదా అనిపిస్తోంది.

దూరాన ఉండగానే ఈ గుంపునుచూచి గుర్రపు దళంలో ఆందోళన బయలు దేరింది. వీరబల్‌సింగ్ వదనం వెలవెలబోసాగింది. డి. యస్. పి. తన కారును ముందుకు నడిపించాడు. శాంతివాదుల పైనా, అహింసావ్రతధారుల పైనా కర్రసాము చేయటం వేరు; క్రోధోన్మత్తులైన ప్రజలను ఎదుర్కోటం వేరూ. గుర్రపు దళాలూ, పోలీసులూ వెనక్కు తగ్గారు.

ఇబ్రహీం వీపుమీద గుర్రం అడుగువేసింది. ఆయన స్పృహ తెలియకుండా నేలమీద పడిఉన్నాడు. ఈ ప్రజల కోలాహలం విని ఆయన కళ్లు వాటంతటవే తెరుచుకున్నాయి. సైగతో ఒక యువకుని పిలిచి "ఏం కైలాస్! పట్నంనుండి జనం ఏమైనా వస్తున్నారా ఏమిటి?" అన్నాడు.

ముందుకు ముందుకు వస్తున్న ఆ మేఘాన్ని చూచి "ఔను! వేలాది జనం వస్తోంది" అన్నాడు కైలాస్.

"అయితే యిక లాభంలేదు. జండాను వెనక్కు మళ్ళించు. మనం త్వరగా వెనక్కు వెళ్ళిపోవాలి. లేకపోతే గల్లంతు జరుగుతుంది. మనకు మన సోదరులతో పోరాటం పనికిరాదు. వెంటనే వెనుకకు నడవండి" అన్నాడు యిబ్రహీం.

ఈ మాటలంటూ ఆయన లేవటానికి ప్రయత్నించాడు. కాని లేవలేక పోయినాడు.

సైగ చెయ్యటమే తడవుగా స్వయం సేవకులందరూ సంఘటిత సైన్యం లాగా వెనుకకు మరలారు. జండా కర్రలతోనూ, తలపాగాలతోనూ అప్పటికప్పుడే ఒక స్ట్రెచరు తయారైపోయింది. యిబ్రహీమ్‌ను దానిమీద పరుండబెట్టి వాళ్ళంతా వెనుకకు బయలుదేరారు. అయితే వాళ్ళు పరాజితులైనట్లేనా? కొందరికి వాళ్ళు పరాజితులనుకుంటేనే తృప్తికలిగేట్లయితే, వాళ్ళను అలాగే అనుకోనీండి. కాని నిజానికి వాళ్ళొక విప్లవాత్మకమైన విజయాన్ని సాధించారు. మన సంఘర్షణ మన సోదరులతోనే అన్న విషయం వారికి తెలుసు. మనం వాళ్ళను శత్రువులుగా చూడకూడదు. లూటీలు, దెబ్బలాటలతో నగరం ఉద్రిక్తమవాలనికూడా వాళ్ళకు లేదు. తమ ధర్మయుద్ధానికి ప్రతిఫలంగా లూటీయైన దుకాణాలు, బద్దలైన తలలూ లభించాలని కాదు వారి వాంఛ. వారి విజయానికి ఉత్తమోత్తమ చిహ్నం వారికి ప్రజల సానుభూతి లభించటమే. వారినిచూసి మొదట్లో పరిహసించిన ప్రజలే, వారి ధైర్యసాహసాలు చూచి వారి సహాయానికి పరుగెత్తుకుని వచ్చారు. మానసిక ప్రవత్తిలో వచ్చిన ఈ పరివర్తనే మన అసలైన విజయం. మనం ఎవరి తోనూ దెబ్బలాడవలసిన పనిలేదు. ప్రజల సానుభూతి సంపాదించటం, వారిమాన సిక ప్రవృత్తుల్లో పరివర్తన తీసుకురావటం - యివే మన లక్ష్యాలు మన ఈ లక్ష్యాన్ని చేరుకున్న రోజునే స్వాతంత్ర్య భానుడు ఉదయిస్తాడు.

మూడురోజులు గడిచినాయి. వీరబల్‌సింగ్ తన గదిలో కూర్చుని టీ త్రాగుతున్నాడు. ఆయన భార్య మిత్థన్‌బాయి పిల్లవాణ్ణి ఒడిలో ఉంచుకుని అక్కడే ఎదురుగా నిలబడింది.

"అలాంటి తప్పుడు నేనేం చెయ్యనుచెప్పు! డి. యస్. పి. నా వెనుకే ఉండె. వాళ్ళకు దారి యిచ్చి ఉంటే నా ప్రాణాని కొచ్చేది" అన్నాడు వీరబల్‌సింగ్.

"పోనీ కనీసం లాఠీఛార్జి జరుగకుండానైనా చూడగలిగే వారేగా! మీ ఉద్యోగం మనుషులను బాదటమా ఏమండీ? మహా అయితే వాళ్ళను పోనీయకుండా అపుదల చెయ్యండి. రేపు నేరసులను బెత్తాలతో కొట్టేపని వప్పగించితే బహుశా మీరు బలే సంతోషించేట్టున్నారే" తల వంకిస్తూ అన్నది మిత్థన్‌బాయి.

"అసలు నువ్వు విషయం అర్థం చేసుకోవుగదా!" సిగ్గుపడుతూ అన్నాడు వీరబల్‌సింగ్

"డి యస్. పి. వెనుక నుంచున్నాడూ; యింకేం! శక్తి సామర్థ్యాలు ప్రదర్శించటానికి మళ్ళీ యిలాంటి అవకాశం లభిస్తుందో లభించదో, అనుకుని ఉంటారు. ఆ దళంలో మంచివాళ్ళెవరూ లేరనేనా మీ అభిప్రాయం. మీ వంటివాళ్ళనునౌకర్లుగా ఉంచుకోగలిగిన వారు వారిలో ఎంతమందిలేరూ? విద్యలో బహుశా ఎక్కువమంది మీకంటె ఎక్కువ చదువుకున్న వాళ్ళే ఉంటారు. కాని మీరు వాళ్ళమీద లాఠీలు ప్రయోగిస్తున్నారు. వాళ్ళను గుర్రాలచేత త్రొక్కిస్తున్నారు. ఏమండీ మీ పౌరుషం!"

వీరబల్ లజ్జారహితమైన మందహాసంతో "డి. యస్. పి. నా పేరు నోట్ చేసుకున్నాడు. నిజం!" అన్నాడు.

ఈ విషయంచెప్పి మిత్థన్‌బాయిని సంతోష పెట్టగలుగుతా ననుకున్నాడు ఇన్‌స్పెక్టరుగారు. సజ్జనత్వం. సద్భావం – యివ్వన్నీ పై పై మాటలు. హృదయ పూర్వకంగా అనే మాటలుకావు. వాచా మాత్రం ఉచ్ఛరిస్తుంటారు. స్వార్థం హృదయపు అంతరాంతరాల్లో పీఠం వేసుకునుంటుంది. గభీరంగా ఆలోచించవలసిన విషయమే అది.

కాని మిత్థన్‌బాయి వదనంలో హర్షచ్ఛాయ లెక్కడా అగుపించలేదు. ఇన్‌స్పెక్టరుగారన్న మాటల్లోగల లోతుల్ని క్షుణ్ణంగా అర్థంచేసుకున్నదామె. "తప్పకుండా నోట్ చేసుకునేఉంటారు. బహుశా త్వరలోనే తమకు ప్రమోషనుకూడా రావచ్చు. కాని నిరపరాధులను హింసపెట్టి సాధించే ప్రమోషనుకూడా ఒక ప్రమోషనేనా! అది మీ శక్తిసామర్థ్యాల కిచ్చిన బహూకృతికాదు. మీ దేశ ద్రోహానికి చెల్లించిన మూల్యం. మీరు ఏ హంతకుణ్ణయినా శోధించి బంధించగలిగితేనో, లేక ఏ ఆపదలోవున్న వ్యక్తినో రక్షించగలిగితేనో అప్పుడూ మీ శక్తి సామర్థ్యాలకు బహూకరించేది" అన్నది మిత్థన్‌బాయి.

ఇంతలో ఒక పోలీసువచ్చి వసారాలో నిలబడి "కవరు తెచ్చాను సార్!" అన్నాడు. వీరబల్‌సింగ్ బయటికివెళ్ళి కవరు తీసుకున్నాడు. లోపలున్న గవర్నమెంటు ఆర్డరు తీసి చదువుకుని టేబిల్‌మీద ఉంచాడు.

"ప్రమోషన్ ఆర్డర్ వచ్చిందాఏమిటి?" ప్రశ్నించింది మిఠన్‌బాయి.

"నీదంతా మరీ విచిత్రం! యివ్వాళ మళ్ళీ ఏదో ఊరేగింపు బయలుదేరుతుందిట. నన్ను ఆ ఊరేగింపువెంట ఉండమని ఆర్డరు పంపారు" సిగ్గుపడుతూ అన్నాడు వీరబల్‌సింగ్.

మిఠన్ : అయితే యింకేం! మీపంట పండిందన్నమాటే. తయారుకండి. ఇవ్వాళకూడా మళ్ళీ మొన్నటిలాగానే వేటాడొచ్చు. బాగా మీ బలమంతా ప్రదర్శించండి. డి. యస్. పి. కూడా తప్పకవస్తాడు. ఈసారి మీకు ప్రమోషను వచ్చి తీరుతుంది. ఖాయమే."

వీరబల్‌సింగ్ నొసలు చిట్లిస్తూ 'ఒక్కొక్కసారి నీవు మరీ విడ్డూరంగా మాట్లాడుతుంటావు. పోనీ నేను వెళ్ళి మెదలకుండా నిలబడతాననుకో ఏమౌతుందో తెలుసా! నన్ను అయోగ్యుడుగా భావించి నా స్థానంలో మరొకరిని నియమిస్తారు. ఒకవేళ స్వరాజ్యవాదులంటే నాకు సానుభూతి ఉందని అనుమానించారంటే యిక నేను ఎందుకూ కొరగాకుండా పోతాను డిస్మిస్ కాకపోయినా లైనుహాజరీ (రోల్ కాల్) అయినా జరుగుతుంది. ప్రతివాడూ తన పరిసర వాతావరణాన్నిబట్టి నడుచుకుంటాడు. నేను పెద్ద బుద్ధిశాలిని కానే అనుకో. అయినా వీళ్ళు దేశాన్ని, జాతిని ఉద్ధరించటానికే పాటుబడుతున్నారన్న విషయం నాకూ తెలుసు. ప్రభుత్వం అలాంటి భావాలను అణగద్రొక్కాలని ప్రయత్నిస్తున్నదనికూడా నాకు తెలుసు. బానిసజీవితం చూచుకుని గర్వించేందుకు నే నేం గాడిదను కాదు. కాని ఏం చెయ్యను? పరిస్థితులకు లొంగిపోక తప్పటంలేదు" అన్నాడు.

ఇంతలో బ్యాండు మ్రోత వినబడింది. వీరబల్‌సింగ్ బయటికి వెళ్ళి విచారించాడు. స్వరాజ్యవాదుల ఊరేగింపు బయలుదేరిందని తెలిసింది. గబగబా డ్రస్సు వేసుకుని, టర్బన్ ధరించి, పిస్తోలు జేబులో పెట్టుకుని బయటికి వెళ్ళిపోయినాడు. ఒక నిమిషంలో గుర్రంవచ్చేసింది. పోలీసులు అంతకుముందే తయారుగా ఉన్నారు. అందరూ కదంత్రొక్కుకుంటూ గబగబా ఊరేగింపుకు బయలుదేరారు.

# 3

వేగంగా కదంత్రొక్కుతూ పదిహేను నిమిషాలకల్లా ఊరేగింపు కెదురైంది పోలీసుదళం. వీళ్ళను చూడగానే అసంఖ్యాకమైన ప్రజల కంఠాలన్నీ 'వందేమాతరమ్' అంటూ ఒక్కసారి నినదించాయి. మేఘమండలమంతా ఒక్కపెట్టున గర్జించిన పిమ్మట తిరిగి నిశ్శబ్దం ఆవరించిందా అన్నట్టుంది. గత ఊరేగింపుకూ,

ఈ ఊరేగింపుకూ ఎంత అంతరం ఉంది. అది స్వరాజ్యోత్సవం. ఇది మృతవీరోత్సవం. మూడుదినాలు తీవ్రమైనజ్వరంతో బాధపడి ఈరోజు జీవితాన్ని చాలించాడు. ఆయన ఎన్నడూ పదవీ వ్యామోహానికి లోనుగాలేదు. అధికారానికి ఎన్నడూ తల వంచలేదు. ఆయన తన అసువులు వదిలేటప్పుడు మరణ సందేశమిస్తూ తన మృత దేహాన్ని గంగానదిలో స్నానం చేయించి సమాధి చేయమనీ, తన సమాధిపైన స్వాతంత్ర్య పతాకాన్ని ఆవిష్కరించమనీ కోరాడు. ఆయన మరణవార్త వినగానే నగరం అంతటా విషాదచ్ఛాయలు వ్యాపించాయి. ఈ వార్త విన్న ప్రతివ్యక్తి తుపాకి గుండు తగిలినట్లుగా ఒక్కసారి ఉలిక్కిపడేవాడు. తక్షణం ఆయన దర్శనానికి బయలుదేరేవాడు. బజారంతా మూతబడింది. ఇక్కా బండ్లూ, టాంగా బండ్లూ అన్నీ మాయమైపోయినాయి. నగరమంతా కొల్లగొట్టపడ్డట్టుగా ఉంది. చూస్తూండగానే నగరమంతా ఒక్కచోటికి పోగుపడ్డది. శవపేటిక బయలుదేరే వేళకు లక్ష, లక్షన్నర జనసమూహం వెంట ఉన్నారు. దుఃఖంతో కళ్ళు ఎర్ర బడని వ్యక్తి ఒక్కడూ లేడు.

వీరబల్‌సింగ్ తన పోలీసులనూ, గుర్రపు రౌతులనూ అయిదైదు గజాలకు ఒకరుచొప్పున ఊరేగింపు వెంట నడువమని ఆజ్ఞాపించి, తాను వెనక్కు వెళ్ళాడు. చివరి వరుసల్లో ఏభై గజాల దూరం వరకూ స్త్రీలున్నారు ఇన్‌స్పెక్టరు వాళ్ళవైపు పరీక్షగా చూచాడు. మొదటి వరుసలోనే మిఠన్‌బాయీ కంటబడింది. వీరబల్‌సింగ్ నమ్మలేకపోయినాడు. మళ్ళీ పరీక్షగా చూచాడు. సందేహంలేదు. ఆమే! మిఠన్‌బాయీ ఆయనవైపు ఒక్కసారి చూచి ముఖం త్రిప్పుకుంది, కాని ఆ ఒక్క చూపులోనూ తిరస్కారం, లజ్జ, బాధ, అసహ్యం ఎంతగానో అండవిస్తున్నాయి! వీరబల్ శరీరం ఆపాదమస్తకం తత్తరపడిపోయింది. తన దృష్టిలో ఎన్నడూ తానింత అల్పుడూ, బలహీనుడూ, తుచ్ఛుడుగా భావించబడలేదు.

ఇంతలో అగస్మాత్తుగా ఒక యువతి యిన్‌స్పెక్టరుగారివైపు చూచి — "ఇన్‌స్పెక్టరుగారూ! లాఠీలు మామీద ప్రయోగించేరు. మిమ్మల్ని చూస్తుంటే భయమేస్తోంది" అన్నది.

"ఆనాడు చౌరాస్తాలో ఈ వీరపురుషుణ్ణి గాయపరిచింది ఎవరో ఈయనగారి సోదరుడే అయివుంటాడు" అన్నది మరో యువతి.

"ఆయన సోదరు డెవరో కాదు. ఆయనగారే" అన్నది మిఠన్‌బాయి.

వందలకంఠాలు ఒక్కసారి పలికాయి—"సరె సరె! వీరేనా ఆ మహానుభావులూ! నమస్కారాలు మహాశయా! ఈరోజు మేంకూడా మీ లాఠీల దర్శనానికి వచ్చామంటే అదంతా మీ చలవే సుమండీ!"

వీరబల్ మిఠన్‌బాయివైపు కొర కొర చూచాడు. కాని నోరు తెరచి ఏమీ అనలేదు.

"మేమొక విందు ఏర్పాటుచేసి, మీ మెళ్ళో విజయహారం వేసి, తమ కీర్తిని గురించి మంగళహారతులు పాడతాం లెండి" అన్నది మరో యువతి.

"మీరు అచ్చగా ఇంగ్లీషువాళ్ళున్నట్లున్నారే! కాబట్టే యింత తెల్లగా ఉన్నారు" అన్నది మరొక మహిళ.

"నా కడుపునే యిటువంటివాడు పుట్టుంటే గొంతు పిసికి పారేసేదాన్ని" కళ్లు పెద్దవిచేసి అన్నదొక వృద్ధురాలు.

ఆమెమాటను ఖండిస్తూ "నువ్వు బలేదానివమ్మా. కుక్క కూడా ఉప్పూ పులుసూ తిన్న విశ్వాసం అట్టి పెడుతుంది. మరి ఈయన మనిషై పోయె!" అన్నదొక యువతి.

ఆ వృద్ధురాలు మండిపడుతూ "కడుపుకక్కుర్తి అటువంటిదే వెధవపొట్ట కోసం! ఎన్నో తిప్పలు! ఏంచేస్తాడూ!" అన్నది.

అందుకు అనేకమంది స్త్రీలు ఆమెమీద విరుచుకుపడ్డారు. పాపం ఆ వృద్ధురాలు లజ్జపడుతూ — "అరే! నే నన్నదాంట్లో ఏముందర్రా! అయినా స్వార్థంకోసం గ్రుడ్డిగా ప్రవర్తించేవాడు మనిషా?" అన్నది.

వీరబల్‌సింగ్ యిక ఆ మాటలు వినలేకపోయినాడు. గుర్రాన్ని వెనక్కు త్రిప్పి ఊరేగింపుకు చాలా గజాల వెనుకకు వెళ్లిపోయినాడు. మొగవాడు సిగ్గుపడితే మనకు కోపమొస్తుంది. స్త్రీ సిగ్గుపడితే జాలి కలుగుతుంది. ఆ సమయంలో వీరబల్‌సింగుకు మళ్ళీ ఆ మహిళల ఎదుటపడే సాహసం లేకపోయింది. ఆయనకు తన పైఆఫీసర్లమీద కోపంవచ్చింది. ఈ పనులకు మాటిమాటికీ తననే ఎందుకు నియమించాలి? యింకా యితరులుకూడా ఉన్నారుగా! వాళ్ళ నెందుకు పంపగూడదూ! తానేనా అంత పతితుడూ? భావశూన్యమైనవాడు తానొక్కడేనా ఏమిటి?

"ఇప్పుడు మిత్తో తన హృదయంలో నన్నెంత పిరికిపందగానూ, నీచుడుగానూ భావిస్తుంటుందోగదా! బహుశా యిప్పుడు ఎవరైనా ప్రాణంతీసినా నోరు మెదపదు. మంచిపనే జరిగిందని మనసులో బహుశా సంతోషిస్తుందేమోకూడా. ఇప్పుడే ఎవరైనా వెళ్ళి వీరబల్‌సింగ్ భార్య ఊరేగింపులో పాల్గొన్నదని ఆఫీసరుకు చెబితే యింక నాకేమైనా స్థాన ముంటుందీ? మిత్తోకు ఈ సంగతి తెలుసు. అర్థం చేసుకోగలదు. అయినా వూరేగింపుకు బయలుదేరింది. నన్ను అడగనైనా అడగలేదు. ఏవిధంగానైనా దిగులుంటేగా! అలాంటప్పుడే యిలాంటి ఆలోచనలు కలుగుతుంటాయి ఆ ఊరేగింపులో ఉన్న వాళ్ళంతా ఏ దిగుళ్ళూ లేనివాళ్ళే! కాలేజీ విద్యార్థులూ, హైస్కూలు విద్యార్థులూ, కార్మికులు, తదితర వృత్తులవాళ్ళూ అంతా ఈ జనాభాయేగా వాళ్ళకేం దిగులా? చింతా? పిల్లా జెల్లా కలిగి వంశప్రతిష్ఠ కాపాడుకోవాలని తాపత్రయపడే మావంటి వాళ్ళ కొచ్చిపడ్డది చావు. మొత్తం జనం అంతా నన్ను మ్రింగేస్తారా అన్నట్లు నావంక కొరకొర చూస్తున్నారు" ఇలా మథనపడుతున్నాడు వీరబల్‌సింగ్.

ఊరేగింపు నగరంలో ముఖ్యవీధులగుండా నడుస్తూ వెళ్ళిపోతోంది. రెండు వైపులా యింటికప్పులమీద, పిట్టగోడలమీద, కటకటాలగుండానూ, చెట్లమీదా ప్రేక్షకులు బారులుతీరి నుంచున్నారు. ఈనాడు వీరబల్‌సింగ్‌కు వారి వదనాల్లో ఒక నూతనమైన ఉత్తేజం, ఉత్సాహం, గర్వం తొణికిసలాడుతున్న ట్లనిపించింది. వృద్ధుల వదనాల్లో ఉత్తేజం, యువకుల వదనాల్లో ఉత్సాహం మహిళల వదనాల్లో గర్వం చిందులాడుతున్నాయి. స్వాతంత్ర్య పథంలో సాగిపోతున్నందువల్ల కలిగే ఆనందమది. ఇప్పుడు వారి ప్రస్థాన లక్ష్యం అజ్ఞాతంకాదు. దారితప్పిన వారిలాగా అటూయిటూ తపుడులాడుకోవటంలేదు. బానిసలలాగా తలలు వంచి రోదించటంకాదు. స్వర్ణకాంతులీనే స్వాతంత్ర్యశిఖరం చూపుమేరదూరంలో గగనంలో మెరిసిపోతోంది ఇక ఆ ప్రజలకు పథమధ్యంలో ఉండే నదీనదాలూ, అడవులూ, కొండలూ ఏవీ అడ్డు రాగలిగేలా లేవు. అందరూ ఆ స్వర్ణలక్ష్యం చేరుకోటానికి ఉత్సాహపూరితు లౌతున్నారు.

పదకొండు గంటలయ్యేసరికి ఊరేగింపు నదీతీరానికి చేరుకుంది. శవపేటిక క్రిందికి దించారు. మృతదేహాన్ని గంగా స్నానంకోసం తీసుకువెళ్ళారు. ఆయన పచ్చని, శీతల, ప్రశాంత ఫాలభాగంమీద లాఠీదెబ్బ స్పష్టంగా దృష్టి గోచర మౌతోంది. రక్తం కూడుకుని ఆ భాగమంతా నల్లబడిపోయింది. దీర్ఘమైన శిరో కేశాలు రక్తంతో తడిసి చిత్రకారుడి కుంచెలాగా అంటుకుపోయినాయి. వేలాది ప్రజలు ఆ మృతవీరుని అంతిమ దర్శనంకోసం గుంద్రంగా బారులుతీరి నుంచు న్నారు వీరబల్‌సింగ్ వెనుక గుర్రంమీద ఆసీనుడై యున్నాడు. లాఠీగాయం ఆయనగూడాచూచాడు. అతని అంతరాత్మ అతన్ని తీవ్రంగా గర్హించింది. ఆయన శవంవైపు చూడలేకపోయినాడు, ముఖం ప్రక్కకు త్రిప్పుకున్నాడు. "ఏ వ్యక్తి దర్శనంకోసం ఏవ్యక్తి పాదధూళి నొసట ధరించటంకోసం లక్షలాది ప్రజలు తహ తహలాడుతున్నారో, ఆ వ్యక్తినేనా నేనింతగా అవమానపరిచింది?" నిర్దాక్షిణ్యంగా కొట్టిన ఆ ప్రహారంలో కేవలం స్వార్థం, శక్తి సామర్థ్యాలు ప్రదర్శించాలనే దాహం, పై అధికారులకు తృప్తి పరచాలనే వ్యసనం యివి మినహా కర్తవ్యభావం లేశమంతైనాలేదు. ఈ సత్యాన్ని అతని అంతరాత్మ యిప్పు డంగీకరిస్తోంది. వేలాదిజనం క్రోధారుణనేత్రాలతో అతనివైపు చూస్తున్నారు. కాని అటువైపు చూడ టానికికూడా సాహసించలేకపోతున్నాడు వీరబల్‌సింగ్.

ఇంతలో ఒక కానిస్టేబుల్‌వచ్చి 'దొరగారిదెబ్బ బాగా లోతుగా తగిలింది. ఇప్పటికీ గాయం మూతపడలేదు. అందరికీ బాగా తెలిసొచ్చిందిలెండి" అంటూ ప్రశంసించాడు.

వీరబల్ ఆ మాటలకేమీ విలువివ్వలేదు. "అది నా పౌరుషమను కోవటం లేదు. నా నీచత్వ మనుకుంటున్నాను" అన్నాడు.

"ఆయనగారు చాలా దుర్మార్గుడండీ" మళ్ళీ ముఖప్రీతిగా అన్నాడు కానిస్టేబిల్.

"చాల్లే ఊరుకో! అసలు నీకు దుర్మార్గు డనాల్సింది ఎవరినో తెలుసా? బందిపోట్లూ, దొంగతనాలు చేసేవాళ్ళనూ, కన్నాలేసేవాళ్ళనూ....వాళ్ళనూ దుర్మార్గులనేది. దేశశ్రేయస్సు కోసం తమ ప్రాణాలనుకూడా పణం బెట్టేవారిని కాదు అలా అనేది. ఏంచేస్తాం! మన దురదృష్టం! ఎవరికైతే సహాయం చెయ్యాలో వారినే వ్యతిరేకిస్తున్నాం. ఇందులో గర్వపడాల్సిందీ, ఆనందపడాల్సిందీ ఏమీలేదు, సిగ్గుపడవలసిన సంగ తిది; విలపించవలసిన విషయ మిది."

స్నానం సమాప్తమైంది. ఊరేగింపు తిరిగి అక్కడనుండి బయలుదేరింది.

## 4

శవాన్ని సమాధిచేసి జనం తిరిగి యిళ్ళకు బయలుదేరే సరికి రెండు గంటలు కావస్తోంది. మిత్థన్‌బాయి స్త్రీలతో బాటు కొంతదూరంవరకూ కలిసివచ్చింది. కాని క్వీన్సుపార్కువద్ద ప్రక్కకు తప్పుకుంది. ఇంటికి వెళ్ళటానికి మనస్కరించ లేదు. ఈ శిథిలమైన, గాయపడిన రక్తరంజితమైన మృతదేహం ఆమె అంత రాత్మలో పీఠం వేసుకుని, ఆమెను క్షోభ పెడుతున్నట్లుగా ఉంది. ఇప్పుడామెకు తన భర్తను నిందించాలనే వాంఛకూడాలేదు. ఆయనంటే అంతగా విరక్తి కలిగిందా మెకు. అటువంటి స్వార్థపరుడు భయాని కొక్కడానికి మినహా మరే ప్రభావాని కైనా లోబడతాడనే విశ్వాసం ఆమె కెంతమాత్రం లేదు.

ఆమె చాలాసేపటివరకూ పార్కులో పచ్చికనేలపై కూర్చుని ఆలోచిస్తూ ఉండిపోయింది. కాని తన కర్తవ్యమేమిటో యిదమిద్ధంగా నిర్ణయించుకోలేక పోయింది. పోతే పుట్టింటికి వెళ్ళవచ్చు కాని ఒకటి రెండు మాసాల తరువాత మళ్ళీ యింటికి రావలసిందేగా. "ఉహుం! నే నెవరినీ ఆశ్రయించను. నా పొట్టను కూడా నేను సంపాదించుకోలేనా?" ఆమె తనలోతానే రకరకాల కష్టాలను ఊహించు కుంది. కాని ఈరోజు ఆమెకింతటి మనోబలం ఎలా కలిగిందో అనూహ్యం. రాబోయే కష్టాలనుగురించి అసలు ఆలోచించటమే తన బలహీనత నిపించిం దామెకు.

ఉన్నట్టుండి ఆమెకు ఇబ్రహీం ఆలీయొక్క వృద్ధ వితంతువు తలంపు కొచ్చింది ఆమెకు పిల్లా జెల్లా ఎవరూ లేరని విన్నదామె. పాపం ఒంటరిగాకూర్చుని విలపిస్తూఉంటుంది. ధైర్యంచెప్పి ఓదార్చే వాళ్ళుగూడా ఉన్నారోలేదో! ఆమె వెంటనే వారి యింటివైపుకు వెళ్ళింది. ఆమె అంతకుముందే తోటి మహిళల నడిగి వాళ్ళింటి అడ్రసు తెలుసుకుంది. ఆమె మనస్సులో యిలా మధనపడుతూ వెళు తోంది. "ఆమె దగ్గరకు నేను ఎలా వెళ్ళేది? ఆమెతో ఏం మాట్లాడాలి? ఆమె నెలా ఓదార్చాలి?" ఈ ఆలోచనలతోనే మునిగి తేలుతూ ఆమె ఇబ్రహీం ఆలీ

యింటికి చేరుకుంది. ఇల్లొక సందులో ఉంది. చక్కని పసందైన యిల్లు. కాని ముంగిట విషాదం తాండవిస్తోంది. దడదడలాడుతున్న హృదయంతో లోపలికి వెళ్ళిందామె. ఎదురుగా వసారాలో ఒక మంచంమీద ఆ వృద్ధురాలు కూర్చుని ఉంది. ఈరోజు ఆమె భర్త స్వాతంత్ర్య బలివేదికపైన తన ప్రాణాలను బలిపెట్టాడు. ఆమె ఎదుట ఒక యువకుడు సాధారణ దుస్తులు ధరించి, కళ్ళనీళ్ళు నింపుకుంటూ ఆ వృద్ధురాలితో ఏవో సంభాషిస్తున్నాడు. మర్జన్‌బాయి ఆ యువకుణ్ణిచూచి ఉలిక్కి పడ్డది. ఆయన ఎవరోకాదు, వీరబల్‌సింగే!

"మీ రిక్కడి కెలా వచ్చారూ?" క్రోధపూర్ణమైన విస్మయంతో ప్రశ్నించిందామె.

"నీ వెలా వచ్చావో నేనూ అలాగే వచ్చాను. నా అపరాధానికి క్షమాపణ కోరటానికి వచ్చాను" అన్నాడు వీరబల్‌సింగ్.

కళకళలాడే మర్జన్ వదనంలో ఈ రోజు అంకితమైయున్న గర్వం, ఆనందం, ఉజ్వలమైన అనురాగ విభవం అవర్ణనీయం. ఆమె జన్మజన్మాంతరాల క్లేశాలన్నీ అంతరించినట్లూ, చింతలూ, మాయాబంధనాల చెరనుండి విముక్తురాలైనట్లూ అనిపించిందామెకు.

—o—

# జోడెద్దులం

జంతువుల్లోకల్లా తెలివితక్కువ జంతువు గాడిద అని ప్రతీతి. మనం ఎవరినైనా మొదటితరగతి శుంఠ అనదలుచుకుంటే ఒక్క ముక్కలో గాడిద అనేస్తాం. గాడిద నిజంగానే తెలివి తక్కువదో? లేక దాని నిష్కాపట్యం, అంతులేని దాని సహనం దాని కా హోదా నిచ్చాయో?- స్పష్టంగా తేల్చిచెప్పటం కష్టమే. ఆవులు కొమ్ములతో కుమ్ముతాయి. అదే ఈనిన ఆవైతే సహజంగా సింహినీ అవతారం ఎత్తిందన్నమాటే. కుక్కకూడా సాధుజంతువే. కాని అప్పుడప్పుడు దానికీ కోపమొస్తుంది. కాని గాడిదకు కోపం రావటం మాత్రం ఎన్నడూ కనీవినీ ఎరుగం. పాపం దాన్ని యిష్టంవచ్చినట్లు బాదండి; ఎటువంటి కుళ్ళుమోతైనా దానిముందు పడేయ్యండి. దాని ముఖంలో మచ్చుకైనా అసంతృప్తి కనిపించదు. వైశాఖంలో ఒకటి రెండుసార్లు గంతులేస్తే వెయ్యొచ్చుగాక అది సంతోషంగా ఉండటం మాత్రం నేను ఎన్నడూ చూడలేదు. దాని ముఖంలో ఒక రకమైన శాశ్వతమైన దుఃఖం అన్ని వేళలా ఆవరించే ఉంటుంది. కష్ట సుఖాల్లోగానీ, లాభనష్టాల్లోగానీ ఏస్థితిలోనూ దానిలో మార్పున్నది గోచరించదు. మహర్షుల్లోఉండే సద్గుణాలన్నీ గాడిదలో పరాకాష్ఠకు చేరుకున్నాయి. అయినా మానవుడు మాత్రం దాన్ని 'శుంఠ' అంటాడు. సద్గుణాలను యింత చిన్నచూపుచూడటం యింకెక్కడా ఎరగను నేను. బహుశా మైతకతనం అనేది ప్రపంచానికి సరిపడే గుణం కాదేమో. చూడటం లేదుటండీ! ఆఫ్రికాలో భారతీయులు ఎందుకంత దుర్గతి పాలౌతున్నారు చెప్పండి. అమెరికాలో వాళ్ళను అడుగుపెట్టనివ్వని కారణమేమిటి? పాపం వాళ్ళు బ్రాందీలు త్రాగరు ఏవేళ ఎలా ఉంటుందోనని నాలుగు డబ్బులు వెనకేసుకుంచుకుంటారు. వళ్లువంచి పనిచేస్తారు. ఎవరితోనూ దెబ్బలాడరు. చివాట్లుతినికూడా గ్రుడ్లనీరు గ్రుడ్లకుక్కుకొని ఊరుకుంటారు. అయినా అపఖ్యాతి తప్పటంలేదు. పైగా జీవితాదర్శాలను కించపరుస్తున్నారని వాళ్ళమీద ప్రచారం కూడాను వాళ్ళుకూడా కుక్కకాటుకు చెప్పు దెబ్బ ప్రయోగించటం నేర్చుకుంటే బహుశా వాళ్ళనూ నాగరికులనే వాళ్ళేనేమో! ఉదాహరణకు జపాను విషయమే చూడండి. ఒక్క విజయంతో ప్రపంచంలోని సభ్యజాతుల్లో అదీ ఒకటైంది.

గాడిదకు తమ్ముడు ఉన్నాడు. కాని గాడిదకంటే ఒక డిగ్రీ తక్కువరకం. అదే ఎద్దు. గాడిద శబ్దాన్ని ప్రయోగిస్తున్న అర్ధంలోనే "ఎద్దు" శబ్దాన్నికూడా ప్రయోగిస్తున్నాం. కొంతమంది ఎద్దును తెలివితక్కువ సరుకులోకల్లా ప్రథమ శ్రేణి

అంటారు. కాని నా కలాంటి అభిప్రాయంలేదు. అప్పుడప్పుడు ఎద్దుకూడా పొడుస్తుంది. అక్కడక్కడ హఠంవేసే ఎద్దుల్నికూడా చూస్తుంటాం. ఇలాగే ఇంకెన్నో విధాలుగా ఎద్దు తన అసంతృప్తిని ప్రకటిస్తుంది. అందువల్లనే గాడిదకంటె ఎద్దు ఒకగ్రేడు తక్కువ.

## 2

క్రూరగాయలమ్మే ఝూరీ ఎద్దుల్లో ఒకదానిపేరు హీరా; రెండవదానిపేరు మోతీ. రెండూ పడమటిజాతికి చెందినవే. చూపులకు ఎంతో అందంగా ఉండేవి. పనిలో మంచి మెలకువ గలవి. మంచి భారీరకం ఎద్దులు. చిరకాలం కలిసిఉన్న కారణాన రెంటికీ మంచి సోదరభావం ఏర్పడింది. రెండూ ఎదురు బొదురుగానో, దగ్గర దగ్గరగానో కూర్చుని ఏదో మూక భాషలో పరస్పరం సంభాషించుకునేవి. ఒకరి మాట ఒకరికి ఎలా అర్థమయ్యేదో మనం చెప్పలేం. కాని ప్రాణుల్లోకల్లా ఉత్తమ ప్రాణినని చాటించుకునే మనుష్యజాతికి తెలియని అజ్ఞాతశక్తి ఏదో వాటికి తప్పక ఉండే ఉంటుంది. రెండూ ఒకదాని నొకటి నాకు కొనటంద్వారానో, వాసన చూసుకుంటూనో తమ ప్రేమను వెల్లడించుకునేవి. అప్పుడప్పుడు రెండూ కొమ్ములు కూడా కలుపుతుండేవి అయితే విరోధభావంతో మాత్రంకాదు. కేవలం వినోదం కోసం అలా చేసేవి. సాన్నిహిత్యం ఫలితంగా మిత్రులమధ్య ఆత్మీయతాభావంతో జరిగే దెబ్బలాటలాంటి దది. ఇటువంటివేమీ లేని స్నేహం ఘనిష్ఠమైందనటానికి వీల్లేదు. అదంతా పైపై స్నేహమే. అదంత విశ్వసనీయమైందికాదు. ఆ ఎద్దులు రెంటినీ బండికో, నాగలికో కట్టటం జరిగితే అవి రెండూ తలలు ఊపుకుంటూ ఏం నడిచేవి! అప్పుడు రెండూకూడా వీలైనంత ఎక్కువ బరువును తానే భరించాలనే ప్రయత్నంలోనే ఉండేవి. పగలంతా పనిచేసిన తరువాత మధ్యాహ్నమో, సాయంత్రమో వాటిని వదిలినప్పుడు ఒకదాన్నొకటి నాక్కుంటూ తమ అలసటను తీర్చుకునేవి. గానుగపిండీ, చిట్టూ తొట్లో వెయ్యగానే రెండూ తోడుగావెళ్ళి ఒకేసారి మూతులుపెట్టేవి. ప్రక్కప్రక్కనే ఉండేవి. ఒకటి మూతి పెట్టటం మానివేస్తే రెండోదికూడా మానివేసేది.

దైవికంగా ఒకసారి ఝూరీ రెంటినీ తన అత్తవారింటికి తోలాడు. తామెందుకు పంపబడుతున్నదీ ఎద్దులకేం తెలుస్తుంది. యజమాని తమను అమ్మి వేశాడు కాబోలనుకున్నాయి. ఉత్తపుణ్యానికి వాటినలా అమ్మివేయటం వాటికి యిష్టంగా ఉందో, కష్టం కలిగించిందో ఎవరికి తెలుసు? కాని ఝూరీ బావమరిది గయాకు మాత్రం ఎద్లజతను యింటికి చేర్చేసరికి తలప్రాణం తోకకువచ్చింది. వెనుకనుండి తోలుతుంటే రెండూ అటూ, యిటూ పారిపోయేవి. పలుపులు పట్టుకొని ముందుండి లాక్కుపోతుంటే రెండూ వెనక్కులాగేవి. కొడితే కొమ్ములు నేల

లానించి రంకెవేసి హుంకరించేవి. భగవంతుడు వాటికి నోరేగనుక యిచ్చి ఉంటే "మమ్మల్ని ఎందుకిలా వెళ్ళగొడుతున్నావు? మేము నీకు సేవ చెయ్యటంలో లవం తయినా వళ్ళుదాచుకుని ఎరుగమే! మేంచేసే చాకిరీ చాలకపోతే మరికొంత చేసే వాళ్ళమే. నీ చాకిరిలోనే మారోజులు చెల్లి పోవాలని కోరుకున్నామే; మేము ఎన్నడైనా దాణా వగైరాలకు పేచీపెట్టి ఎరుగుదుమా ! నీ వేదిపెడితే అది కళ్ళకద్దుకుని తిన్నామే. అయినా మమ్మల్ని ఈ కసాయివాడికి ఎందు కమ్మినట్లు చెప్పు" అని ఝూరీని ప్రశ్నించేవి.

సాయంత్రం వేళకు ఎద్దులు రెండూ క్రొత్తచోటికి చేరుకున్నాయి రోజంతా ఆకలితోనే ఉన్నాయి. కాని గాటివగ్గర కట్టివేసినా గాట్లో మూతైనా పెట్టలేదు. దుఃఖం పొంగుకువస్తోంది. తమ స్వంతంగా భావించుకున్న గృహంనుండి ఎడబాటు కలిగింది. ఈ క్రొత్తయిల్లు, ఈ క్రొత్తఊరూ, క్రొత్తమనుషులూ అన్నీ వాటికి పరాయివనే అనిపిస్తున్నాయి.

రెండూ తమ మూకభాషలో సలహాపడ్డాయి. పరస్పరం క్రీగంటితో చూచుకుని పడుకున్నాయి. గ్రామమంతా మాటుమణగగానే రెండూ ఒక్క ఊపులో పగ్గాలు తెంచుకుని యింటికి బయలుదేరినాయి. పలుపులు మంచి బలంగా ఉన్నాయి. ఏ ఎద్దయినా ఆ పలుపులు తెంచగలుగుతుందని అనుమానించటానికిగూడా వీలులేదు. కాని ఈ ఎద్దులు రెంటికీ మాత్రం ఆ సమయంలో రెట్టింపుశక్తి వచ్చింది. ఒక్క ఊపుకే పగ్గాలు తెగిపూరుకున్నాయి.

ఝూరీ ప్రొద్దున్నే నిద్రలేచిచూస్తే ఎద్దులు రెండూ పశువులకొట్టంలో నిలబడి ఉన్నాయి. రెంటి మెడలోనూ సగంసగం మోకులు వేలాడుతున్నాయి. మోకాళ్ళ వరకూ కాళ్లు బురద బురదగా ఉన్నాయి. రెంటి నేత్రాల్లోనూ విద్రోహ పూర్ణమైన స్నేహం తొణికిస లాడుతోంది.

ఎద్దుల్ని చూడగానే స్నేహాతిశయంతో ఝూరీ స్వరం కంపించింది. పరుగెత్తి వాటిని కౌగిలించుకున్నాడు. ఆ ప్రేమాలింగనం ! ఆ చుంబనాలూ! ఎంతో మనోహరంగా ఉందా దృశ్యం.

ఇరుగూ పొరుగూ గ్రామంలో ఉండే కుర్రాళ్ళందరూ గుమిగూడారు. చప్పట్లుకొడుతూ వాటికి స్వాగతమిచ్చారు. గ్రామ చరిత్రలో ఇలాటి ఘటన కిదే ప్రథమం కాకపోయినా మంచి చెప్పకోదగినఘటనే. బాలసమాజమంతా ఈ పశువీరుల జతకు ప్రశంసాపత్రం యివ్వాలని నిశ్చయించుకున్నారు. ఒకడు తన ఇంటినుంచి రొట్టె తెచ్చాడు. మరొకడు బెల్లం, ఇంకొకడు గంద్రనూక, వేరొకడు తవుడు ఇలా తలాకాస్త తెచ్చిపెట్టారు.

"ఇలాంటి గిత్తలు ఎవరిదగ్గరా ఉండవు" అన్నాడొక కుర్రాడు.

"కాదూమరి! ఇంతదూరం నుండి రెండూ ఒంటరిగా వచ్చేశాయే" సమర్థించాడు మరోకుర్రాడు

"ఇవి ఎద్దులుకాదురాబాబూ క్రిందటి జన్మలో మనుషులై యుంటాయిరా!" అన్నాడు మరోకుర్రాడు.

ఈమాట కాదనటానికి ఎవడూ సాహసించలేదు.

సూరీ భార్య ఎద్దులను వాకిట్లో చూచి మండిపడింది. "ఈ ఎద్దు లెంత విశ్వాసఘాతకపు జాతివీ! అక్కడ ఒక్కరోజుకూడా పనిచెయ్యలేదు. పారిపోయి వచ్చేసినాయ్. పాపిష్టివి" అన్నది.

తన ఎద్దులను అలా నిందించటం సూరీ సహించలేకపోయినాడు "విశ్వాస ఘాతుకపు జాతంటున్నావా? దాణా సరిగ్గా పెడితేగా! మరేం చేస్తాయ్ పాపం" అన్నాడు.

"చాల్లే ఆపండి ఎడ్లను మేపటం ఇంకెవరికన్నా చేతౌతుందీ; మీ కొక్కరికి తప్పితే! ఇక అందరూ కుడితినీళ్ళతో మేపేవాళ్ళే?" దర్పంగా అన్నది సూరీ భార్య.

"సరిగ్గా మేపితే పారిపోయి ఎందుకువస్తాయ్?" కోపంగా అన్నాడు సూరీ.

దీంతో ఆమె రెచ్చిపోయింది. "ఎందుకు పారిపోయి వస్తాయంటూ? నీవంటి దద్దమ్మలమాదిరి ఎద్దులను నెత్తికెక్కించుకోరు వాళ్ళు. మేపారంటే మేపుకుతగ్గట్టు బాగా అదిమిపెట్టి పనిగూడా చేయిస్తారు. ఇవి పనికిదొంగలు. కాబట్టే పారిపోయి వచ్చేశాయి. గానుగపిండీ, గంట్రనూక ఇకవీటికి ఎవరు మేపుతారో నేనూచూస్తా" అన్నది.

అన్నట్లే జరిగింది. ఎద్దులకు వట్టిగడ్డి తప్పితే ఇంకేమీ మేపొద్దని పాలేరును గట్టిగా ఆజ్ఞాపించింది.

ఎద్దులు గాట్లో మూతులు పెట్టినాయి. తినబోతే వట్టి రుచీ పచీలేని మేత. సారమూ. సంతోషమూ లేని చెత్త. ఏం తింటాయ్. ఆశలునిండిన కళ్ళతో ద్వారం వంక ఎదురుచూడసాగాయి.

"కాస్త గానుగపిండి వెయ్యకపోయినా వట్రా" పాలేరును ప్రశ్నించాడు సూరీ.

"అమ్మగారు నా పీక పిసికేస్తుంది బాబోయ్."

"కాస్తచాటుగా తెచ్చి వేద్దూ."

"వద్దులేబాబూ! మళ్ళీ తరువాత మీరూ ఆమెనే వెనక వేసుకొస్తారు."

# 3

రెండో రోజు ఝూరీ బావమరది వచ్చి ఎద్దులను మళ్ళీ తోలుకుపోయినాడు. ఈసారి అతను రెంటినీ బండికి కట్టాడు.

రెండు మూడుసార్లు మోతీబండిని దారిప్రక్కనగల గోతుల్లో బోల్తా కొట్టించటానికి ప్రయత్నం చేసింది. కాని హీరా సర్దుకుంది. అది కాస్త ఓర్పుగలది.

సాయంత్రానికి ఇల్లుచేరుకుని రెంటినీ మంచి బలమైన మోకులతో బంధించి నిన్నటి పోకిరీతనానికి ఫలితం రుచి చూపించాడు. మళ్ళీ ఆ చిట్టే తెచ్చిపోశాడు. తన ఎద్దుల రెంటికీ మాత్రం గానుగపిండీ, నూకా అన్నీ మేపాడు.

ఇలాంటి అవమానం ఆ ఎద్దులకు ఎన్నడూ జరుగలేదు. ఝూరీ ఎన్నడూ పూలరెమ్మతోనైనా వాటివ టిమీద చెయ్యివేసి ఎరుగడు. అతనిమాట వింటే చాలు రెండూ మింట లేచిపోయేవి. కాని ఇక్కడ దెబ్బలుకూడా తగులుతున్నాయి. శిథిల గౌరవాన్ని గురించి వ్యధకు తోడు సారంలేని మేతకూడాను. గాటివైపు కన్నెత్తి కూడా చూడ లేదవి.

ఆ మరునాడు గయా ఎద్దుల్ని నాగలికి గట్టాడు. కాని అవి రెండూ ముందు కొక్క అడుగుకూడా వెయ్యకూడదని ప్రతిజ్ఞచేశాయా అన్నట్లు ప్రవర్తించాయి. కొట్టికొట్టీ అలిసిపోయినాడు గయా. కాని ఆ ఎద్దులు కాలైనా కదపలేదు. ఆ కటిక వాడొకసారి హీరా నాసికారంధ్రంలో కర్రపెట్టి పొడవటం చూచేసరికి విపరీతమైన కోపంవచ్చింది మోతీకి. నాగలితోసహా పరుగుతీసింది. నాగలీ, మోకులూ, కాడీ, మేడీ అన్నీ తునాతునకలై పోయినాయి. మెడలో గట్టిపగ్గాలే లేకపోయినట్లయితే రెండూ అసలు అలివయ్యేవి కావు.

"పారిపోయి లాభంలేదు." మూకభాషలో అన్నది హీరా.

"వీడిప్పటికే నీ ప్రాణాలు తోడాడు. ఈసారి ఇంకా హింస పెడతాడు." అదే భాషలో జవాబిచ్చింది మోతీ.

"పెడితే పెట్టనీ! ఎద్దయి పుట్టినతరువాత దెబ్బలు తినకుండా ఎందాకా తప్పించుకుంటాం?"

"గయా ఇద్దరు మనుషులను తీసుకుని పరుగెత్తుకుంటూ వస్తున్నాడు. ఇద్దరి చేతుల్లోనూ కర్రలున్నాయి."

"లాఠీతీసుకు వస్తున్నాడతను. మరి నేనుగూడా ఒక పరుస రుచి చూపించనా?" అన్నది మోతీ.

"వద్దులే తమ్ముడూ! ఊరుకుందూ!"

నా వంటిమీద దెబ్బవేశాడా నేనూ ఒకరిద్దరిని మట్టుబెట్టేస్తాను."

"అబ్బే! ఆపని మనజాతికి ధర్మంకాదు."

మోతీ మనసులో కొరకొరలాడుతూ నిలబడింది. గయావచ్చి రెంటినీ పట్టుకుని తీసుకువెళ్ళాడు. అతనీసారి బాదకపోవటం మంచిదేఅయింది. లేకుంటే మోతీ కూడా ఎదురుతిరిగేదే. దాని కోపపుచూపు చూచి గయా, అతనికి సహాయంగా వచ్చినవాళ్ళు గూడా ఆ సమయంలో ఊరుకోవటమే శ్రేయస్కరమని అర్థం చేసుకున్నారు.

ఆ రోజు మళ్ళ రెంటిముందూ ఆ ఎండుచెత్తే పడేశారు. రెండూ మెదలకుండా నుంచున్నాయి. ఇంట్లో వాళ్ళు అన్నాలు తింటున్నారు. ఆ సమయంలో ఒక చిన్నపిల్ల రెండు రొట్టెలు తీసుకొనివచ్చింది. రెంటికీ నోటికందించి వెళ్ళిపోయింది. ఆ ఒక్క రొట్టెతో వాటి ఆకలేం తీరుతుంది! కాని వాటికి కడుపు నిండినటే అనిపించింది. ఇక్కడగూడా ఎవరో మంచి మనుషులున్నారు. ఆ పిల్ల భైరోకూతురు. వాళ్ళమ్మ చనిపోయింది. సవతితల్లి ఆ అమ్మాయిని ఊరికే కొడుతుండేది. అందువల్ల ఈ ఎద్దులతో ఆ అమ్మాయికి ఒకరకమైన ఆత్మీయత ఏర్పడింది.

పగలంతా వాటికి పొలం దున్నుతూ దెబ్బలు తింటూ మొండికేస్తూ గడిచిపోయేది. సాయంత్రం కొట్టంలో కట్టివేసేవాళ్ళు. రాత్రికి ఆ అమ్మాయే వాటికి రెండురొట్టెలు నోటికందించి వెళ్ళేది. ప్రేమపూర్ణమైన ఈ ప్రసాద మహిమవల్లనే కావచ్చు; రెండుబొక్కెళ్ళ ఎండుగడ్డితో సరిపెట్టుకుంటున్నా, రెండూ బక్కచిక్కిపోవటంలేదు. కాని వాటి నేత్రాల్లోనూ, రోమరోమానా కూడా విద్రోహభావం తాండవిస్తోంది.

"ఇక నేను సహించలేను హీరా!" ఒకరోజు మూకభాషలో వెల్లడించింది మోతీ.

"అయితే నీ ఉద్దేశ్యం ఏంచేద్దామనీ?"

"ఒకరిద్దరిని కొమ్ములతో ఎత్తి విసిరవతల పడేస్తా."

"మనకు రొట్టెలు తినిపించే ఆ బంగారుతల్లి ఈ ఇంటి యజమాని కూతురే. పాపం ఆ తల్లి అనాథైపోదూ!"

"అయితే యజమానురాలిని కుమ్మేస్తాను. ఆ అమ్మాయిని హింస పెట్టేది ఆవిడే."

"స్త్రీ జాతిమీద కొమ్మువిసరటం నిషిద్ధం. ఆ సంగతి మరిచిపోతున్నావు సుమా!"

"నువ్వు అసలు ఏ విధంగానూ తేలనీవుగదా! అయితే కట్లు తెంచుకుని పారిపోదాం పద."

"ఓ! అలాయితే నాకూ యిష్టమే. కాని యింతలావు మోకు ఎలా తెగుతుందబ్బా!"

"దానికొక ఉపాయముందిగా. మొదట మోకును కాసేపు నములు. ఆ తరువాత ఒక ఊపులో తెగిపోతుంది."

రాత్రిపూట ఆ బాలిక రొట్టె లందించి వెళ్ళగానే ఎద్దులు రెండూ మోకులు నమలటం మొదలుపెట్టినాయి. కాని మోకులులావుగా ఉండటంచేత నోటికి అరపటం లేదు. పాపం మాటి మాటికి మోకు పెణగదీసుకొంటూ ఉండిపోయినాయి.

అకస్మాత్తుగా యింటివాకిలి తలుపు తెరుచుకుంది. ఆ అమ్మాయే వచ్చింది. రెండూ తలలువంచి ఆమె చేతులు నాకసాగాయి. వాటి తోకలు రెండూ పైకి లేచాయి. ఆమె వాటి తలలు నిమురుతూ "మీకు ముక్కు తాళ్ళు వెయ్యాలని ఆలోచనలు జరుగుతున్నాయి లోపల. పలుపులు విప్పేస్తానుగాని చప్పిడి చెయ్యకుండా పారిపోండి. పాపం, లేకుంటే వీళ్ళు మీ ప్రాణాలు తోడేస్తారు" అన్నది.

పలుపులు తప్పించేసిందా బాలిక. కాని రెండూ మెదలకుండా నుందున్నాయి.

"ఇంకా బయలుదేరవేం ?" తన భాషలో ప్రశ్నించింది మోతీ.

"పద పోదాం ! కాని రేపు ఈ అమ్మాయిని హింసపెడతారు" అన్నది హీరా.

"నాన్నా ! నాన్నా ! మామయ్యగారి ఎద్దులు రెండూ పారిపోతున్నాయి. తొందరగా రా !" అంటూ అకస్మాత్తుగా ఆ బాలిక కేకలు పెట్టింది.

గయా ఆదుర్దాపడుతూ ఆదరా బాదరా లోపలినుండి పరుగెత్తుకొచ్చాడు. ఎద్దులను పట్టుకోటానికి బయలుదేరాడు. ఆ రెండూ పారిపోసాగినాయి. గయా వెంటబడ్డాడు. అవి యింకా వేగంగా పరుగెత్తాయి. గల్లంతుచేశాడు గయా. తిరిగి కొందరు గ్రామస్థుల్ని వెంటబెట్టుకు వెళ్ళామని వెనక్కు తిరిగిగొచ్చాడు. మిత్రులిద్దరికీ పారిపోటానికి మంచి వీలుచిక్కింది. తిన్నగాపరుగుతీస్తూ వెళ్ళిపోయినాయి. ఆ పరుగులో దారీ, డొంకాకూడా చూచుకోలేదు. అవి లోగడ వచ్చిన పరిచితమార్గపు జాడలేవీ కనుపించటంలేదక్కడ. క్రొత్త క్రొత్త గ్రామాలు తగులుతున్నాయి. అప్పుడు అవి రెండూ ఒక పొలం గట్టుదగ్గర నుంచుని యికముందేమి చెయ్యాలా అని ఆలోచన సాగించాయి.

"చూస్తే మనం దారి తప్పిపోయినట్లున్నామే" అన్నది హీరా.

"నువ్వు వెనకాముందూ లేకుండా పరుగెత్తితివి. అతన్ని అక్కడే ఒక్క కుమ్ము కుమ్మాల్సింది."

"అతన్ని పొడిచి చంపితే లోకం ఏమనుకుంటుంది? అతను తన ధర్మం పాలించకపోతేపోనీ; మనం మన ధర్మం ఎందుకు తప్పాలి?"

రెండూ మంచిఆకలిగొని ఉన్నాయి. చేలో మొక్కజొన్న వేసిఉంది. మెయ్యటం ప్రారంభించినాయి. 'ఎవరూ రావటం లేదుగదా' అనుకుంటూ ఉండి ఉండీ అలికిడిని గమనిస్తూనే ఉన్నాయి.

కడుపునిండుగానే రెండూ స్వాతంత్ర్యానుభవాన్ని పొందాయి. హుషారుగా గంతులువేయటం మొదలెట్టాయి. మొదట రెండూ రంకెలువేశాయి. తరువాత రెండూ కొమ్ములు కలిపి ఒకదాని నొకటి నెట్టుకోసాగాయి. మోతీ హీరాను చాలా దూరం వెనుక్కు నెట్టేసింది. చివరకు గుంటలో పడిపోయిందాకా నెట్టింది. అప్పుడు దానికికూడా కోప మొచ్చింది. తప్పించుకులేచి మళ్లీ మోతితో కలబడింది. ఆట కాస్తా పోట్లాటగా మారుతున్నదని గమనించి మోతీ గట్టుమీదకు తప్పుకుంది

అయ్యో! ఇదేమిటీ! ఏదో ఆంబోతెద్దు రంకెలు వేసుకుంటూ వచ్చేస్తోందే! ఔను! ఆబోతే, ఎదురుగావచ్చి నిలబడింది. మిత్రులిద్దరూ నిశ్చేష్టులైనారు. ఆబోతును చూస్తే మదగజంలాగాఉంది దానితో కలబడటం అంటే ప్రాణాలకు నీళ్ళొదులు కోటమే. కాని కలబడకపోయినా బ్రతికి బయటపడే లక్షణా లేమీలేవు. అది వీటిమీదికే వచ్చేస్తున్నదిగూడా. ఎంత భయంకరావతారం!

"చెడ్డ ఇరుకులోపడ్డాం. తప్పించుకోట మెలాగబ్బా! ఏమైనా ఉపాయం ఆలోచించు" మూకభాషలో అన్నది మోతీ.

ఆలోచనాపూరితమైన స్వరంతో "దానికి గర్వంతో కన్నూ మిన్నూ కనపడటంలేదు. ప్రార్థనలూ, విజ్ఞప్తులూ దాని చెవికెక్కవు" అన్నది హీరా.

"పారిపోకూడదూ?"

"పారిపోవటం పిరికితనం."

"అయితే యిక్కడే చచ్చిపో. నేనుమాత్రం పారిపోతాను."

"అది వెంటబడితేనో?"

"అయితే త్వరగా ఏదైనా ఉపాయం చూడుమరి."

"ఉపాయం ఏముందీ! ఇద్దరం ఒకేసారి దానిమీద దెబ్బతీయాలి. నేను ముందునుంచి దూకుతాను. నువ్వు వెనకనుంచి దూకు. రెండుప్రక్కలా దెబ్బతగిలితే సరి పారిపోతుంది. నావైపు దూకగానే ప్రక్కనుండి కొమ్ములతో పొట్టలోకుమ్ము. ప్రాణాలమీదకు వచ్చింది. ఇంతకుమించిన ఉపాయమేమీ కనపడటంలేదు."

అవి రెండూకూడా ప్రాణాలకు తెగించి దూకినాయి. ఆబోతు కెన్నడూ సంఘటితమైన శత్రువులతో పోరాడే అనుభవం లేదు. అది ఎప్పుడూ ఒక్క శత్రువుతో కుస్తీకే అలవాటుపడింది. హీరా మీదదూకటమే తడవుగా మోతీ వెనుకనుంచి దాడి చేసింది. ఆబోతు, దానివైపుకు మళ్ళేసరికి హీరా దాడిచేసింది. ఒక్కొక్కదాంతో విడివిడిగా పోరాడి రెంటినీ పడగొట్టాలని దాని కోరిక. కాని ఎద్దులు రెండూ కూడా ఆరితేరినవే. దానికి అలాంటి అవకాశమే ఇవ్వటంలేదు. ఒకసారి ఆబోతు మండిపడుతూ హీరాను హతమార్చుద్దామని బయలుదేరింది. ఇంతలో మోతీ ప్రక్కనుండివచ్చి దాని పొట్టలో ఒక్క కుమ్ము కుమ్మింది. ఆబోతు క్రోధంతో

వెనుకకు మళ్లేసరికి హీరావచ్చి కుమ్మి రెండవడొక్కలో కొమ్ముదిగేసింది. చివరకు పాపం ఆబోతు గాయపడి పారిపోయింది. ఎద్దులు రెండూ చాలాదూరం వరకూ దాన్ని తరిమికొట్టినాయి. ఆఖరు కా ఆబోతు స్పృహతప్పి క్రింద పడిపోయేవరకూ తరిమిగాని వదిలిపెట్టలేదు.

మిత్రులిద్దరూ విజయోత్సాహంతో ఊగుతూ ప్రయాణం చేస్తున్నారు.

"వెధవను అసలు చంపి పారేద్దామనే అనిపించింది." తన సాంకేతిక భాషలో అన్నది మోతీ.

"పడిపోయిన శత్రువుమీద దెబ్బతీయకూడదు" నిరసించింది హీరా.

"ఇదంతా వట్టి బూటకం. దెబ్బతీశామంటే శత్రువు మళ్ళీ తలెత్తకుండా దెబ్బతీయాలి!"

"ఇప్పుడిక యింటికి చేరేదెలాగో అది ఆలోచించు."

"ముందు కాస్త ఆకలి తీరనీ. తరువాత ఆలోచించుదాం."

మొక్కజొన్నచేను ఎదురుగానే ఉంది. మోతీ అందులో దూరబడది. హీరా వారిస్తూనే ఉంది. కాని దాని మాట వినలేదు. రెండుపరకలు కొరికిందో లేదో ఇద్దరు మనుషులు లాఠీలతో పరుగెత్తుకొచ్చారు. రెంటినీ చుట్టుముట్టారు హీరా గట్టు మీదనే ఉంది. అందువల్ల అది యివతలకు జారుకుంది. మోతీ నీళ్ళుపెట్టిన చేలో ఉంది. దానిగిట్టలు బురదలో దిగబడిపోతున్నాయి. పరుగెత్తలేకపోయింది. పట్టుబడింది. సహచరుడు సంకటంలో పడటం గమనించింది హీరా. 'చిక్కుపడితే యిద్దరమూ కలిసేపడాలి' అనుకుని తానూ వెనుతిరిగింది. కాపలావాళ్ళు దాన్నికూడా పట్టుకున్నారు.

ఉదయమే రెంటినీ బందెలదొడ్డికి అప్పగించారు.

# 5

ఇలాంటి అనుభవం కలగటం జీవితంలో వాటి కిదే ప్రథమం. పగలంతా గడిచినా తింటానికి ఒక్క పరకమైనా దొరకలేదు. ఈయనెక్కడ యజమానో అర్థంకావటంలేదు. ఈయనకంటె ఆ గయాయే మంచివాడు. ఆ దొడ్లో బర్రెలూ, మేకలూ, గుర్రాలూ, గాడిదలూ చాలా ఉన్నాయి. కాని వేటిముందరా మేతలేదు. అన్నీ నేలమీద శవాలలాగా పడివున్నాయి. చాలా పశువులు లేచి నుంచోలేనంత బలహీనమైనాయి. పగలంతా ఎద్దులు రెండూ ద్వారంవైపు కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయాయి. కాని ఎవరూ మేత తీసుకువస్తున్న జాడ కనపడలేదు. ఇక అవి రెండూ గోడనుండి రాలిన చవిటిమట్టిని చప్పరించటం మొదలుపెట్టినాయి. కాని అందువల్లఏం కడుపు నిండుతుంది!

రాత్రికికూడా మేత ఏమీ దొరక్కపోయేసరికి హీరా హృదయంలో విద్రోహ జ్వాలలు ప్రజ్వరిల్లినాయి. "ఇక నేను సహించలేను మోతీ!" అన్నది హీరా.

"నాకుమాత్రం ప్రాణాలు పోతున్నట్లుగా ఉన్నాయోయ్." నీరసంగా జవాబిచ్చింది మోతీ.

"ఇంత త్వరగా గుండెలు జారితే ఎలాగోయీ! ఇక్కడనుండి పారిపోయే ఉపాయం ఏదైనా ఆలోచించాలి."

"గోడ బద్దలుగొడదాం రా!"

"ఇప్పుడు నేనేమీ చెయ్యలేను."

"ఇంతేనా! ఈ మాత్రానికేనా అలా మిడిసిపడ్డదీ?"

"నా తెలివంతా మంటగలిసిపోయింది."

పశుశాల గోడ బలంగాలేదు. హీరా మంచి బలమైందేనాయె. తన వాడి కొమ్ములతో గోడను పొడిచి నెట్టింది. ఒక మట్టిపెళ్ళ ఊడిపడ్డది. దాంతో దాని సాహసం యినుమడించింది అది పరుగుపరుగున వచ్చి గోడను కుమ్మటం మొదలుపెట్టింది ప్రతిసారీ కాస్తకాస్త పెళ్ళ ఊడగొడుతున్నది.

అప్పుడే బందెలదొడ్డి కాపలావాడు లాంతరుతీసుకుని పశువుల లెక్క చూచుకోటానికి వచ్చాడు. హీరా పొగరుబోతుతనం చూచి కర్రతో తెగబాది వదిలిపెట్టాడు. ఒక బలమైన మోకుతో కట్టిపడేశాడు.

"చివరకు దెబ్బలుతిన్నావు. ఏం ఒరిగింది చెప్పు!" నేలమీద పడుకునే అన్నది మోతీ.

"నా శక్తంతా ఉపయోగించి దెబ్బతీశాను."

"ఇలా దెబ్బతీసినందువల్ల కలిగే ప్రయోజనమేమిటి చెప్పు: మరింత బంధనాల్లో చిక్కటం తప్పితే."

"ఎన్ని బంధనాల్లో చిక్కినాసరే చివరివరకూ దెబ్బకుదెబ్బ తీస్తూనే ఉంటాను"

"అయితే ప్రాణాలకు ఆశవదులుకోవాల్సిందే."

"ఏం పరవాలేదు. ఎప్పటికైనా చనిపోవలసిందేగా! ఆలోచించు. గోడ పడగొట్టగలిగితే ఎన్ని ప్రాణాలు దక్కేవి. ఇంతమంది సోదరులిక్కడ బందీలైయున్నారు. దేన్నిచూచినా ప్రాణమే ఉన్నట్లులేదు. ఇంకా రెండుమూడురోజులు యిలాగే ఉంటే అందరిప్రాణాలూ పోతాయి."

"ఔను! ఆమాటా నిజమే. అయితే వుండు. నేనుగూడా ప్రయత్నిస్తాను."

మోతీగూడా అదేస్థలంలో గోడను కుమ్మటం మొదలుపెట్టింది. కాస్త మట్టిపెళ్ళ రాలేసరికి మరింత ధైర్యం కలిగింది. ఇక అది గోడను కొమ్ము మోటించి

ఏదో ప్రత్యర్థితో పోరాడుతున్నట్లుగా బలమంతా ప్రయోగించి నెట్టసాగింది చివరకు రెండుగంటల బలప్రయోగం తరువాత గోడ పైభాగం సుమారొక మూరెడు మేర కూలిపోయింది. అది ద్విగుణీకృతమైన శక్తితో మరొకసారి కుమ్మేసరికి సగం గోడ పడిపోయింది.

గోడ పడిపోగానే సగం చనిపోయినట్లుగా పడివున్న పశువులన్నీ దిగ్గున లేచాయి. ఆడగుర్రాలు మూడూ గ్యాలప్‌వేసి పారిపోయినాయి. ఆ తరువాత మేక లన్నీ దూకిపోయినాయి. బర్రెలుగూడా జారుకున్నాయి. కాని గాడిదలుమాత్రం ఉన్నచోటే వుండిపోయినాయి.

"మీ రిద్దరూ పారిపోరెందుకనీ?" ప్రశ్నించింది హీరా.

"మళ్ళీ ఎక్కడన్నా పట్టుపడితేనో?" అన్నది ఒక గాడిద.

"అయితే ఏం మునిగిపోయిందీ? ఇప్పుడు తప్పించుకు పోవటానికి వీలు చిక్కిందిగా!"

"మాకు భయంగా ఉంది. మే మిక్కడే పడి ఉంటాం."

రాత్రి సగానికిపైగా గడిచిపోయింది. గాడిదలు రెండూ పారిపోదామా? వద్దా? అని యింకా ఆలోచిస్తూనే ఉన్నాయి. మోతీ తన స్నేహితుని మోకు ఊడ దీసే ప్రయత్నంలో వుంది. ఆ ప్రయత్నం ఫలించకపోయేసరికి "నువ్వు వెళ్ళిపో. నన్నిక్కడే పడివుండనీ. బహుశా ఎవరికో బలైపోతాను" అన్నది హీరా.

మోతీ కళ్ళనీళ్ళు బెట్టుకుని "నేనంత స్వార్థిననుకున్నావా హీరా! నువ్వూ నేనూ యిన్నాళ్ళబట్టీ కలిసి మెలిసి ఉన్నాం. ఇవ్వాళ నువ్వు ఆపదలో ఉన్నప్పుడు నిన్ను విడిచిపెట్టి పోతానా హీరా!"

"నిన్ను అమితంగా కొడతారు. లోకులు యిదంతా నీ పోకిరీతనమేనని గ్రహిస్తారు" అన్నది హీరా.

"ఏ అపరాధానికి నీవు బంధించబడ్డావో అదే అపరాధానికి నేను దెబ్బలు తినవలసివస్తే చింతపడవలసిందేముంది? పది, పన్నెండు ప్రాణాలు దక్కనే దక్కినాయిగదా. అవ్వన్నీ ఆశీర్వదిస్తాయి." సగర్వంగా అన్నది మోతీ.

ఈ మాటలంటూ గాడిదలు రెంటినీ కొమ్ములతో కుమ్మికుమ్మి దొడ్డి బయ టకు వెళ్ళగొట్టింది. ఆ తరువాత హీరా దగ్గరగా పడుకుని నిద్రపోయింది.

తెల్లవారగానే గుమాస్తా, కాపలావాడు తదితర అధికారులూ ఎంత ఆందో ళనపడ్డారో వ్రాయనక్కరలేదు. మోతీని చావగొట్టి దాన్నిగూడా ఒక బలమైన మోకుతో కట్టిపడేశారు.

## 6

ఒక వారంవరకూ అవి రెండూ అక్కడే బంధించబడివున్నాయి. ఎవ్వరూ ఒక్క గడ్డిపరకైనా వెయ్యలేదు. రోజుకొకసారి మాత్రం నీళ్ళు పెట్టేవాళ్ళు. అవే

వాటి కాధారమైనాయి. రెండూ కూడా లేచి నిలబడలేనంతగా నీరసపడ్డాయి. బొమికలు బయటపడినాయి.

ఒకనాడు బండెలదొడ్డి ముందు తప్పెట మ్రోగుతున్నది. మధ్యాహ్నం వేళకల్లా ఏభై, అరవైమంది జనం అక్కడికి పోగైనారు. అప్పుడు ఎద్దులు రెంటినీ బయటికి తోలుకువచ్చారు. అందరూ వాటిని పరీక్షించసాగారు. ప్రజలు రావటం. వాటి అవతారాలు చూడటం, నిరాశపడి వెళ్ళిపోవటం జరుగుతోంది. ఇటువంటి చావుకు సిద్ధమైన ఎద్దుల్ని కొంటానికి ఎవరు తయారౌతారు?

ఇంతలో ఒక గడ్డం గలిగిన వ్యక్తి ప్రత్యక్షమైనాడు. ఎఱ్ఱగా ఉన్నాయతని కళ్ళు. ముఖాకృతి అతి భయంకరంగా ఉంది. వాటితొంటి ఎముకల్లో వ్రేళ్ళుబెట్టి పొడుస్తూ గుమాస్తాతో మాట్లాడుతున్నాడు. అతని ముఖం చూడగానే ఆత్మజ్ఞానం కలిగిన వాటి హృదయాలు కంపించిపోయినాయి. అతనెవరో, తమ శరీరాన్ని తడువుతున్న కారణమేమిటో-ఆ విషయంలో వాటి కెలాంటి సందేహం కలుగ లేదు. రెండూ ఒకదాని నొకటి భయకంపిత నేత్రాలతో చూచుకుని తలలు వంచుకున్నాయి.

"గయా యింటినుండి అనవసరంగా పారిపోయివచ్చాం. ఇక ప్రాణాలు దక్కే మార్గంలేదు" అన్నది హీరా.

"భగవంతుడు అందరినీ కరుణిస్తాడని అంటారు. ఆయన మనల్ని మాత్రం ఎందుకు కరుణించడూ?" నిర్లక్ష్యంగా జవాబిచ్చింది మోతీ.

"భగవంతుడికి మనం బ్రతికినా? చచ్చినా రెండూ ఒకటే. సరేపద! అతని దగ్గరగూడా కొన్నాళ్ళుంటాంగా! ఒకసారి భగవంతుడు ఆ పిల్లరూపంలోవచ్చి రక్షించాడు. ఈసారిమాత్రం కాపాడడూ?"

"ఇతను ఖడ్గం ప్రయోగిస్తాడు తెలుసా?"

"అయితేమాత్రం విచార మెందుకూ? మాంసమూ, చర్మమూ, కొమ్ములూ, ఎముకలూ సమస్తం ఏదో ఒక విధంగా ఉపయోగపడతాయిగా"

వేలం అయిపోయిన తరువాత ఎద్దులు రెండూ ఆ కసాయివాని వెంట బయలుదేరాయి. వాటి శరీరంలో ప్రతికండరం కంపించి పోతోంది. పాపం కాలు కూడా కదపలేక పోతున్నాయి. నడక ఏమాత్రం మందగించినా కర్ర తినుకుని అనుకంగా బాదుతున్నాడా కసాయి.అందువల్ల భయంతో పడుతూ లేస్తూ పరుగెత్తుతున్నాయి.

దారిలో ఒక ఎద్దులమంద పచ్చపచ్చగా ఉన్న పచ్చికబీడులో మేస్తుండటం చూచాయి. పశువులన్నీ చాల సంతోషంగా, బలంగా, హుషారుగా ఉన్నాయి. కొన్ని గంతులు పెడుతున్నాయి; కొన్ని హాయిగా పడుకొని నెమరువేస్తున్నాయి. వాటి జీవితం ఎంత సుఖంగా ఉంది! కాని ఇంత స్వార్థమా, తమ సోదరు లిద్దరు

కసాయివాడి చేతిలో చిక్కి దుఃఖంతో కుమిలి పోతున్నారే అన్న బాధ అందులో ఒక్కదానికీ లేదే!

తటాలున వాటికి తాము ప్రయాణం చేస్తున్న దారేదో పరిచితమైనదేనని తోచింది. ఔను! గయా వాటిని తీసుకువెళ్ళింది ఈ దారినే. అవే పొలాలు; అవే తోటలు; అవే గ్రామాలు. అన్నీ అవే. నిమిషనిమిషానికీ వాటి నడక వేగం హెచ్చుతోంది. అలసట, నీరసం అంతా మాయమైపోయింది. అరరె! ఇదిగో! మన పచ్చికబీడు! ఈ బావికే మనం మోటతోలటానికి వచ్చేవాళ్ళం. ఔను! ఇదే బావి!

"మన ఇల్లు దగ్గరకొచ్చేసింది" అన్నది మోతీ.

"భగవంతుడి దయ!" అన్నది హీరా.

"నే నిక ఇంటికి పారిపోతాను."

"వీడు పోనిస్తాడా?"

"ఒక్క కుమ్ము కుమ్ముతాను."

"అలా వద్దులే. పరుగుతీసి ఇంటికిపోదాం పద. అక్కడినుండి ఒక్క అడుగుకూడా కదలొద్దు."

రెండూ వెర్రి ఉత్సాహంతో కోడెదూడల్లాగా గంతులు వేస్తూ ఇంటివైపుకు పరుగెత్తాయి. 'అదే మన చావిడి!' రెండూ పరుగెత్తి తమ ఇంటికివచ్చి నిలబడి నాయి. కసాయివాడుకూడా వాటిని వెంబడిస్తూ వస్తున్నాడు.

ఝూరీ ద్వారంవద్ద కూర్చుని చుట్ట త్రాగుతున్నాడు. ఎద్దుల్ని చూడగానే తన చావిడివద్దకు పరుగెత్తి వాటిని వంతుల ప్రకారం ఆప్యాయంగా కౌగలించుకో సాగాడు. వాటి నేత్రాలనుండి ఆనందబాష్పాలు ప్రవహించసాగాయి. ఒకటి ఝూరీ చెయ్యి నాకుతోంది.

కసాయివాడు వచ్చి ఎద్దులపగ్గాలు పట్టుకున్నాడు.

" ఈ ఎద్దులు నావి" అన్నాడు ఝూరీ.

"నీ వెల్లా అయినాయి? నేను బందెలదొడ్డి దగ్గర పాటపాడి తీసుకువస్తు న్నాను."

"దొంగతనంగా తీసుకువస్తున్నట్లున్నావు. మెదలకుండా అవతలికి నడు! ఈ ఎద్దులు నావి. నేను అమ్మితేగా అమ్ముడుపోవటానికి? నా ఎద్దుల్ని వేలం వెయ్యటానికి ఇతరులకేం అధికారం?"

"అయితే వెళ్ళి పోలీసు స్టేషనులో రిపోర్టుచేస్తాను."

"ఈ ఎద్లు నావి. ఇందుకు సాక్ష్యం అవి నా వాకిట్లో ఉండటమే."

కసాయివాడు మండిపడుతూ ఎద్దులను జబర్దస్తీగా తోలుకు పోవటానికి తయారైనాడు. వెంటనే మోతీ కొమ్ము విసిరింది. కసాయివాడు వెనక్కు తగ్గాడు.

మోతీ వెంబడిపడింది. కసాయివాడు పారిపోయినాడు. మోతీ వెంటబడి పరుగెత్తింది. వాడు ఊరి బయటికి వెళ్ళిన తరువాత ఆగిపోయింది. కాని వాడు పారిపోతున్న వైపు చూస్తూ నుంచుంది. దూరంగా నుంచుని బెదరిస్తున్నాడు కసాయివాడు. బూతులు తిడుతున్నాడు; రాళ్ళు విసురుతున్నాడు. మోతీ విజయ వీరుడులాగా అతని దారికడ్డంగా నిలబడింది. గ్రామ ప్రజలీ వినోదంచూసి ఆనందిస్తున్నారు.

కసాయివాడు పరాజితుడై వెళ్ళిన తరువాత మోతీ ఠీవిగా నడుస్తూ ఇంటికి చేరుకుంది.

''కోపంలో వాణ్ణెక్కడ చంపేస్తావోనని భయపడ్డాను నేను" అన్నది హీరా.

''నన్ను పట్టుకుని ఉంటేమాత్రం ప్రాణాలతో వదిలిపెట్టేదాన్ని కాదు."

''ఇక ఈ ఛాయలకు రాడు."

''వస్తే దగ్గరకు రాకముందే తగిన శాస్తి చేస్తాను."

''తుపాకితో కాల్పిస్తేనో?

''చచ్చిపోతాను. కాని వాడికిమాత్రం ఉపయోగపడను."

"మనవీ ప్రాణాలే అని ఒక్కడూ అనుకోడేం?"

కాసేపట్లో గానుగపిండీ, తవుడూ, గంట్రనూక దాణా పెట్టారు. ఎద్దులు రెండూ తినటం మొదలు పెట్టినాయి. ఝూరీ నుంచుని రెంటినీ నిమురుతున్నాడు. పిల్లలు గుంపులుగుంపులుగా చేరి వినోదం చూస్తున్నారు. గ్రామమంతా పండుగ దినంలా ఉంది.

అప్పుడే ఝూరీ భార్యగూడా వచ్చి రెండు ముఖాలను ముద్దుపెట్టుకుంది.

# రామలీల

ఈ మధ్య చాలాకాలంనుండి రామలీల ఉత్సవాలకు వెళ్ళలేదు. కోతుల వికారపు వేషాలు వేసుకొని పొట్టిపొట్టి పైజామాలు తొడుక్కొని, నల్లరంగు చొక్కాలు వేసుకొని పొలికేకలు పెడుతూ గోలగోలగా పరుగెత్తే మనుషులను చూస్తే యిప్పుడేమిటో నాకు నవ్వుగా ఉంటుంది. మజాగా మాత్రముండదు. కాశీలో జరిగే లీలా ఉత్సవాలు మహాప్రసిద్ధి. ప్రజలు దూరప్రదేశాలనుండిగూడా చూడటానికి వస్తుంటారని విన్నాను. నేనూ ఎంతో హుషారుగా వెళ్ళాను. కాని నాకు మాత్రం అక్కడి లీలా ఉత్సవాలకూ, ప్రజప్రాంత పల్లెటూళ్ళలో జరిగే లీలా ఉత్సవాలకూ ఏమీ తేడా కనిపించలేదు. కాని రామనగర్ ఉత్సవాల్లో మాత్రం కాస్త ఆడంబరం అధికంగా ఉంటుంది. రాక్షసుల, వానరుల ముఖ కవచాలు ఇత్తడితో తయారైనవి. గదలుకూడా ఇత్తడివే. బహుశా వనవాస వేషంలో ఉన్న సోదరుల కిరీటాలు మాత్రం కాస్త ఎందుకన్నా అక్కరకొస్తాయేమో. కాని ఆడంబరం ఒక్కటి మినహాయిస్తే అక్కడా ఆ కేకలూ గోలా తప్పితే మరేమీ విశేషం లేదు. అయినా లక్షల జనం కిటకిట లాడుతూనే ఉంటుంది.

నాకూ రామలీలా ఉత్సవాలంటే ఆనందం కలిగేకాలం ఒక టుండేది. ఎవ్వో! 'ఆనందం' అనేమాట చాలదు. ఆ ఆనందం ఉన్మాదానికి తక్కువైందేమీకాదు. అదృష్టవశాత్తూ ఆరోజుల్లో మా యింటికి చాలా దగ్గరలోనే ఉండేది రామలీలా మైదానం. లీలా పాత్రధారులు వేషాలు వేసుకునేఇల్లు మాఇంటికి అనుకునే ఉండేది. పగలు రెండు గంటలనుంచీ పాత్రధారులు అలంకరణ సాగించేవాళ్ళు. నేను మధ్యాహ్నానికే అక్కడికి వెళ్ళి కూర్చునేవాణ్ణి. పరుగులుతీస్తూ ఎంతో ఉత్సాహంతో చిన్న చిన్న పనులెన్నో చేస్తుండేవాణ్ణి. ఇప్పుడంత ఉత్సాహంతో నా పెన్షను కోసంకూడా వెళ్ళను. ఒక గదిలో రాకుమారుల అలంకరణ జరిగేది. వాళ్ళ శరీరాలకు పసుపుపచ్చని నాము అరగదీసి పట్టించేవాళ్ళు. ముఖానికి పౌడరు అద్దేవాళ్లు. దానిమీద ఎరుపువీ, ఆకుపచ్చవీ, నీలివీ చుక్కలద్దేవాళ్లు. నుదురూ, కనుబొమలూ, బుగ్గలూ, గడ్డం చుక్కలతో నిండిపోయేవి. ఈ పనిలో నిపుణత ఒక్కడికే ఉండేది. అతనే వంతుల ప్రకారం ముగ్గురు పాత్రధారులనూ అలంకరించేవాడు. రంగుల గిన్నెలకు నీళ్ళుతేవటం, పచ్చనాము అరగదీయటం, విసనకర్రతో విసరటం ఇవన్నీ నా పనులు. ఈ ఏర్పాట్లన్నీ కాగానే రథం బయలుదేరేది. అప్పుడు రథంలో శ్రీరామచంద్రమూర్తి వెనుక కూర్చుంటే నా కెంతటి గర్వం, ఉల్లాసం

పులకరింపు కలిగేవో ఏం చెప్పను. ఇప్పుడు గవర్నరు దర్బారులో కుర్చీమీద కూర్చునప్పుడుకూడా అలా అనిపించదు. ఒకసారి హోంమంత్రిగారు శాసనసభలో నా తీర్మాన మొకటి ఆమోదించినప్పుడుకూడా నాకు సరిగ్గా అలాంటి ఉల్లాసం గర్వం. పులకరింపే కలిగాయి. ఒకసారి మా పెద్దబ్బాయి ఆక్టింగ్ తహసీల్ దారుగా నామినేట్ చెయ్యబడ్డప్పుడుగూడా అలాంటి తరంగాలే తలెత్తాయి మనస్సులో. కాని వీటికీ, బాలోత్సాహానికీ బోలెడంత అంతరముంది. అప్పుడు నేను స్వర్గంలో ఉన్నట్లనిపించేది.

ఆనాడు విషద నౌకాలీల. ఇద్దరు ముగ్గురు పిల్లలు నన్ను రెచ్చగొట్టినందువల్ల బిళ్ళంగోడు ఆడుతున్నాను నేను. ఆ రోజు అలంకారం చూడటానికి వెళ్ళలేదు. రథంకూడా బయలుదేరింది. అయినా నేను ఆట మానలేదు. నేను నా ఆట పెట్టించుకోవాల్సుంది. నా ఆట వదులుకోవాలంటే నా శక్తికి మించిన స్వార్థత్యాగం అవసరం. నేనే ఆటపెట్టవలసివచ్చినట్లయితే ఎప్పుడో పారిపోయి వచ్చేసేవాణ్ణి. కాని ఆటపెట్టించుకునే పరిస్థితిలో అదంతా వేరుగా ఉంటుంది. సరే ఆట పూర్తయింది. నేను కావాలనుకుంటే మరో పదినిమిషాలు తిప్పలుపెట్టగలిగేవాణ్ణి. అందుకు మంచి అవకాశం కూడా ఉంది. కాని అప్పుడు తగిన టైము లేదు. నేను తిన్నగా కాలువ వైపుకు పరుగెత్తాను. రథం అప్పటికే నీళ్ళవద్దకు చేరుకుంది. నేను దూరంనుండే చూచాను. పడవవాడు బోటు తీసుకువస్తున్నాడు. పరుగుతీశాను. కాని జనంలోగుండా పరుగెత్తటం చాలాకష్టం. చివరకు గుంపును తప్పించుకుంటూ ప్రాణాలకు తెగించి ముందుకుసాగి ఎలాగైతేనేం ఒడ్డుకు చేరాను. అప్పటికే పడవవాడు పడవ వదిలాడు. రామచంద్రుడంటే నాకంత శ్రద్ధ. నేను నా పాఠాల సంగతికూడా చూచుకోకుండా అతన్ని చదివించేవాణ్ణి. అతను ఫేలు కాకూడదని నాకోరిక. నాకంటే వయస్సులో పెద్దయినా, అతను క్రింది తరగతిలో చదువుతున్నాడు. కాని ఆ రామచంద్రుడే ఈ రోజు ఓడమీద కూర్చుని నాతో అసలు పరిచయమే లేదా అన్నట్లుగా ముఖం త్రిప్పుకుపోతున్నాడు. నకలులోకూడా కొంతకు కొంత అసలులో లక్షణాలు అగుపిస్తూనే ఉంటాయి. భక్తుల నెప్పుడూ కఠినంగా చూస్తూ వచ్చిన ఆయన నన్నేం ఉద్ధరిస్తాడూ? తొలిసారిగా మెడమీద కాడివేయబడినప్పుడు చిందులు త్రొక్కే కోడెదూడలాగా గంతులు వేయసాగాను నేను. ఒకసారి ఎగిరి గంతువేసి కాలువవైపుకు వెళ్ళేవాణ్ణి. ఇంకొకసారి ఎవరైనా సహాయం దొరుకుతారేమోనని వెనకవైపుకు పరుగెత్తేవాణ్ణి. అందరూ ఎవరి గొడవలో వాళ్ళున్నారు. నా గగ్గోలు ఎవరికీ వినబడలేదు. ఆ తరువాత యిప్పటివరకూ గొప్పగొప్ప బాధ లనుభవించాను. కాని ఆ సమయంలో కలిగినంత దుఃఖం మరెప్పుడూ కలుగలేదు.

ఇక రామచంద్రునితో ఎప్పుడూ మాట్లాడనేవద్దను కున్నాను. తింటానికి యిక ఎప్పుడూ ఏమీ పెట్టనేపెట్టకూడదనుకున్నాను. కాని కాలువదాటి వంతెన

వద్దకు వచ్చాడో లేదో నేను పరుగెత్తి రథంమీద ఎక్కాను. అసలేమీ జరగనే లేదన్నట్లు పొంగిపోయాను.

# 2

రామలీల సమాప్తమైంది. ఇక పట్టాభిషేకం కాబోతోంది. కాని ఎందుకనో ఆలస్యమౌతోంది. బహుశా చందా తక్కువగా వసూలైనట్లుంది. ఇప్పుడు రామచంద్రుణ్ణి పలకరించేవాళ్ళే లేరు. ఇంటికి పంపలేదు. సరిగా భోజనమైనా ఏర్పాటు చెయ్యలేదు. చౌదరీ సాహెబుగారింట్లో రోజుకొక్కసారి పగలు ఏమూడు గంటలకో తిండిపెట్టేవాళ్ళు. మిగతారోజంతా మంచినీళ్ళుకావాలా? అని అడిగే దిక్కయినా ఉండేది కాదు. కాని అతనంటే నాకు గల భక్తి శ్రద్ధలు యిప్పటికీ అలాగే ఉన్నాయి. నా దృష్టిలో అతను యిప్పుడుకూడా రామచంద్రుడే. ఇంట్లో నాకేమైనా ఏరుతిండి పెడితే అది తీసుకెళ్ళి రామచంద్రుడకిచ్చి వచ్చేవాణ్ణి. అతనికి పెట్టినప్పుడు కలిగే ఆనందం నేనుతింటే ఎప్పుడూ కలిగేదికాదు. మిఠాయో, పండో ఏది దొరికినా వెనకాముందూ చూడకుండా రచ్చబావిడి వైపుకు పరిగెత్తేవాణ్ణి. రామచంద్రు డక్కడ దొరక్కపోతే నలువైపులా గాలించేవాణ్ణి. అత నా వస్తువు అరగించేవరకూ నా మనసు కుదుటపడేదికాదు.

సరే, పట్టాభిషేకపురోజు వచ్చింది. రామలీలా మైదానంలో ఒక బ్రహ్మాండమైన పందిరివేశారు. దాన్ని చక్కగా అలకరించారు భోగంమేళంకూడా వచ్చింది. సాయంత్రానికి శ్రీరామచంద్రుని ఊరేగింపు బయలుదేరింది. గడపగడపకూ హారతులిచ్చారు. వాళ్ళ వాళ్ళ శ్రద్ధాభక్తులకు తగినట్లుగా ఒకడు రూపాయలిస్తే, మరొకడు టాకలిచ్చాడు. మానాన్న పోలీసు ఆఫీసరు. అందువల్ల ఆయన ఏమీ యివ్వకుండానే హారతిచ్చాడు. అప్పుడు నాకు ఎంత లజ్జ వేసిందో చెప్పలేను। ఆ సమయంలో అదృష్టవశాత్తూ నావద్ద ఒకరూపాయి ఉంది. దసరాకుముందు మా మామయ్య వచ్చినప్పుడు యిచ్చిందా రూపాయి. అది నేను దాచి ఉంచుకున్నాను. దాన్ని దసరా రోజుల్లోకూడా ఖర్చుపెట్టలేకపోయాను. వెంటనే నే నా రూపాయి తెచ్చి హారతి పళ్ళెంలో వడ్డించాను. నాన్నగారు నావైపు క్రోధంగా చూచి ఊరుకున్నారు. ఆయన స న్నేమి అనలేదు. కాని ముఖం చూస్తే మాత్రం నా ఈ 'పోకిరీ' పని వల్ల ఆయన గొప్పతనానికి 'మచ్చ' వచ్చినట్లు భావించాడనిమాత్రం తోస్తుంది. రాత్రి పది గంటలు కావచ్చేసరికి ఊరేగింపు పూర్తయింది. హారతిపళ్ళెం రూపాయలతోనూ, కానులతోనూ నిండిపోయింది. సరిగ్గా చెప్పలేనుగాని, యిప్పుడు నా అంచనాప్రకారం నాలుగైదువందలకు తక్కువ ఉండదనుకుంటాను. చౌధరీగారు అంతకంటె ఎక్కువే ఖర్చుచేశారు. ఏదోవిధంగా కనీసం మరో రెండువందలైనా వసూలయ్యేదెలాగా అని ఎంతగానో ఆలోచిస్తున్నాడు. అందుకు వేశ్యలద్వారా

సభలో వసూలుచేయట మొకటే ఆయనకు ఉత్తమమైన ఉపాయమనిపించింది. జనం అంతా వచ్చి కూర్చున్నతరువాత సభ మంచి రసపాకంలో ఉన్నప్పుడు, చంచలీ బాయి గనుక రసికుల చేతులు తాకుతూ తన హావభావాలన్నీ ప్రదర్శిస్తుంటే యింకా సందేహమెందుకూ ! సిగ్గుపడుతూగూడా ఎంతోకొంత యిచ్చి తీరాల్సిందే; వచ్చి తీరాల్సిందే ! చంచలీబాయి, చౌధరీగారు మంతనాలు సాగించారు. అదృష్టవశాత్తూ నే నా రెండు జీవాల మాటలూ వింటూనే ఉన్నాను. 'పుర్రకుంక ఏమి అర్థం చేసుకు ఏడుస్తాడులే' అనుకున్నట్లున్నాడు చౌధరీగారు. కాని భగవంతుడి దయవల్ల కాస్త బుర్రఉన్నవాళ్ళే ఉన్నారిక్కడ. కథంతా అర్థమౌతూనే ఉంది.

చౌధరీ: నా మాట విను చంచలీ ! నువ్వు మరీ అన్యాయంగా మాట్లాడు తున్నావు. మన వ్యవహారానికి యిదే మొదలు కాదుగా ! భగవంతుడు కరుణిస్తే నువ్వు ఎప్పుడూ యిక్కడికి వస్తూ పోతూనే ఉంటావు. ఈసారి చందా చాలా స్వల్పంగా వచ్చింది. లేకుంటే నీతో యింత గట్టిపట్టు పట్టేవాణ్ణా !

చంచలీ ; తమరు నామీద జమీందారీ ఎత్తులు ప్రదర్శిస్తున్నారే! అయ్యగారి పప్పులు యిక్కడేమీ ఉడకవు. బలేబాగుంది! రూపాయలేమో వసూలు చెయ్యాలి ? తమరేమోదర్జాగా కూచుంటారూ? సంపాదనకు బలే మార్గం కనిపెట్టారే! ఈ రాబడితో నిజంగా తమరు కొద్దిరోజుల్లోనే మహారాజులై పోతారు. దీనిముందు జమీందారీ దాసోహ మనాల్సిందే. ఇంతెందుకూ ! రేపటినుంచీ వేశ్యాగృహ మొకటి ప్రారంభించండి. దేవుని సాక్షిగా చెబుతున్నాను; కోట్లకు పడగెత్తుతారు!

చౌధరీ : నీకేమో పరిహాసంగా ఉంది. ఇక్కడేమో ఉక్కిరి బిక్కిరిగా ఉంది నాపని.

చంచలీ : తమరు నాకే పాఠాలు నేర్పుతున్నారు. నిత్యం తమ వంటివారి నెందరినో తైతక్కలాడిస్తున్నాను తెలుసాండీ?

చౌధరీ : ఇంతకీ నీ అభిప్రాయమేమిటో చెప్పు.

చంచలీ : వసూలైనదాంట్లో సగం నాకూ సగం మీకూ ! మరి "ఊఁ" అనండి !

చౌధరీ : అయితే సరేకానీ !

చంచలీ : సరే! అయితే ముందు నా వంతు నాకిచ్చెయ్యండి. తర్వాత మళ్ళీ పేచీ పెడతారు.

చౌధరీ : బలేదానివే! యిదీ, అదీ రెండూ కాజేద్దామనే?

చంచలీ : అబ్బా! అయితే నా కిరాయి వసులుకుంటా వనుకున్నారు కాబోలు పాపం! ఏమండీ మీ తెలివితేటలూ! తాడెక్కే వాడికి తలదన్నేవాళ్ళు ఉంటా రండోయ్ !

చౌధరీ : అయితే కిరాయి రెండుసార్లు తీసుకుందామనుకున్నావా ?

చంచలీ : తమకు నూటికి నూరుపాళ్లు యిష్టమైతేనే. లేకపోతే నాకు వంద రూపాయిలకేమీ ఖోకాలేదుగా ! ఊళ్ళో వాళ్ళ జేబులు తడుముతూ తిరగటానికి నాకేం ఖేటా ?

చౌధరీ ఎత్తులేమీ పారలేదు. చంచలీబాయికి లొంగక తప్పలేదు. నాట్యం ప్రారంభమైంది. చంచలీబాయి బహూ పోకిరీ పిల్ల. అసలే మంచి వయస్సులో ఉంది. పైగా మంచి అందగత్తెకూడాను. ఆమె ఒయ్యారం, హావభావాలూ అతి విలక్షణమైనవి. నాకుకూడా మత్తెక్కిస్తున్నాయి. వి మనుషుల స్వభావాలు ఎటు వంటివో పసిగట్టటంలో అందెవేసిన చెయ్యి. ఎవరి ఎదుట మోడీవేసి కూర్చున్నా ఎంతో ఒకంత రాబట్టిందన్నమాటే. ఐదు రూపాయలకు తక్కువ ఎవడూ యిచ్చి ఉండడు. నాన్నగారి ఎదుటికికూడా పోయి బెతాయించింది. నేను సిగ్గుతో కుంగి పోయాను. ఆమె నాన్నగారి చెయ్యిపటుకున్నప్పుడు కుంచించుకుపోయాను.' నాన్న గారుతప్పకుండా దాని చేతిని విదిలించేస్తారు. బహూశా చివాట్లుకూడా పెడతారు' అను కున్నాను. కానిఇదేమిటి? ఆరిభగవంతుడా! నాకళ్ళేమీ దగా పడటంలేదు గదా!నాన్న గారుమునిపళ్ళతో నవ్వుతున్నారు. అటువంటి మందహాసం ఆయన ముఖంలో నే నెన్నడూ చూడలేదు. ఆయన నేత్రాల్లో అనురాగం పొంగులువారుతున్నది. ఆయన రోమాలన్నీ పులకిస్తున్నాయి. కాని భగవంతుడు నాపరువు కాపాడాడు. అదుగో, ఆయన మెల్లగా చంచలీబాయి కోమల హస్తాలనుండి తన చేతిని విడిపించు కున్నాడు. అరె! మళ్ళీ అదేమిటీ ! చంచలీ ఆయన మెడచుట్టూ చేతులు వేస్తోందే. ఈసారి తప్పకుండా నాన్నగారు దాన్ని బాదేస్తారు. లంజకు బొత్తిగా సిగ్గేలేదు.

ఇంతలో ఒక మహాశయుడు చిరునవ్వుతో యిలా అన్నాడు —చంచలీ! నీ పప్పులు ఉడకవు తెలుసా! ఎందుకుగాని మరోచోటికి వెళ్ళటం మంచిది.

ఆయన నా మనసులో ఉన్నమాటే అన్నాడు. ఉన్నమన్నట్లుగానే అన్నాడు. కాని ఎందుకనో తెలియదు. నాన్నగారు ఆయనవంక క్రోధంగా చూచారు. మీసాలు కూడా మెలివేశారు. నోరు తెరచి ఏమీ అనలేదు కాని ఆయన ముఖవైఖరి చూస్తే మాత్రం "కోమటికి నీకేం తెలుస్తుంది మనసంగతి? ఇటువంటి సందర్భాల్లో ప్రాణ త్యాగం చెయ్యటానికికూడా సిద్ధమే. రూపాయ లొకలెక్కా? జమా? దమ్ములుంటే కాచుకో! నీకంటె రెట్టింపు యివ్వకపోతే నా ముఖం చూపిస్తే అప్పుడను" అని సరోషంగా గర్జిస్తూ అంటున్నట్లనిపించింది. ఎంత ఆశ్చర్యం! ఎంత అనర్థం! ఓ భూదేవీ! నీవింకా బ్రద్దలు కావేం? ఓ ఆకాశమా! నీ వింకా అలాగే ఉన్నావేం? అరె! నాకు చావైనా రాదేం? నాన్నగారు జేబులో చెయ్యిపెడుతున్నారు. ఆయనేదో వస్తువు బయటికితీసి శ్రేష్ఠిగారికి చూపించి చంచలీ చేతిలో పెట్టారు. అమ్మో! అది నవరున్న. నలువైపులా చప్పట్లు మ్రోగినయ్. అవమానం పొందినది శ్రేష్ఠిగారో, నాన్నగారో తేల్చి చెప్పలేనుగాని నాన్నగారు నవరున్నతీసి చంచలికి యివ్వటం

మాత్రం చూచాను. అప్పుడు ఆయన కళ్ళలో గర్వం, ఉల్లాసం ఎంతగా మెరసి పోతున్నాయనుకున్నారూ? తానేదో గొప్ప ఉదారమైన మహోపకారం చేశాడా అన్నంతగా పొంగిపోతున్నారు. నేను హారతిపళ్ళెంలో రూపాయి వేసినప్పుడు నన్ను నమిలి మ్రింగివేస్తారా అన్నట్లుగా నావంక చూచింది ఈ నాన్నగారే! నేను చేసిన ఆ సత్కార్యం ఆయన హోదాకు హాని కలిగించే దయింది. కాని యిప్పుడీ అసహ్యమూ, నీచమూ, నింద్యమూ అయిన తన ప్రవర్తనకు మాత్రం గర్వంతోనూ, ఆనందంతోనూ ఉబ్బి తబ్బిబ్బయి పోతున్నారు.

చంచలీ మనోహరమైన ఒక మందహాసం విసిరి నాన్నగారికి నమస్కరించి ముందుకుసాగింది. కాని నేనక్కడ ఉండలేకపోయాను. సిగ్గుతో నాతల వాలిపోతోంది. నేను కళ్ళారా చూసినవిషయం కాకపోతే ఎంతమాత్రం నమ్మేవాణ్ణికాదు. నేను బయట విన్నవీ, కన్నవీ అన్ని విషయాలూ అమ్మకు తప్పకుండా రిపోర్టు చేసేవాణ్ణి. కాని యీ సంగతి వింటే ఆమెకు చాలా కష్టం కలుగుతుందని తెలుసు నాకు. అందుకనే నే నీవిషయాన్ని మాత్రం దాచిపెట్టాను.

రాత్రంతా కచ్చేరీ జరుగుతూనే ఉంది. తబలా దరువులు చెవులకు వినిపిస్తూనే వున్నాయి. మనసులోమాత్రం పోయి చూదామనే ఉంది. కాని ధైర్యం చాలటంలేదు. నా ముఖం లోకానికెలా చూపించనూ? అక్కడెవరైనా నాన్నగారి ప్రస్తావనతెస్తే నేనేం చెయ్యనూ?

మరునా డుదయమే రామచంద్రుడికి అంపకాలు. నేను నిద్రమంచంమీదినుంచి లేవగానే కళ్ళు నులుముకుంటూ పందిరివైపుకు పరుగెత్తాను. రామచంద్రు డప్పటికే వెళ్ళిపోయాడేమోనని భయపడ్డాను. అక్కడికి పోయిచూస్తే వేశ్యలబళ్ళు ప్రయాణానికి సిద్ధంగా ఉన్నాయి. మంగళ్ళచేత తీరుగా ముఖాలు దిద్దించుకుని డజనుల కొలదీ గుంపుగా ఆ వేశ్యలచుట్టూ ముట్టడివేశారు. నేను వాళ్ళవైపు కన్నెత్తికూడా చూడలేను. తిన్నగా రామచంద్రుని వద్దకు వెళ్ళాను. లక్ష్మణుడూ, సీతా యిద్దరూ ఏడుస్తున్నారు. రామచంద్రుడు మూటా ముల్లె భుజానికి తగిలించుకుంటూ వాళ్ళను సముదాయిస్తున్నాడు. అక్కడ నేనుదప్పమరెవరూలేరు. నేను కుంచించించుకుపోయిన స్వరంతో రామచంద్రుణ్ణి ప్రశ్నించాను—"నిన్ను సాగనంపటం అయిందా?"

"కావటానికి అయింది. మమ్మల్నింకా సాగనంపే దేముంటుంది? చౌధరీగారు వెళ్ళిపొమ్మని చెప్పేశారు. వెళ్ళిపోతున్నాం."

"మరి డబ్బా, గుడ్డలూ యివ్వలా?"

"ఇంకా యివ్వలేము. ప్రస్తుతం పైకం మిగలలేదు. మరోసారివచ్చి తీసుకు వెళ్ళ అన్నారు చౌధరీగారు."

"ఏమీ యివ్వలేదన్నమాట!"

"ఒక్క కానీగూడా ఇవ్వలేదు. ఏమీ మిగలలేదంటున్నారు. కాసిని డబ్బి లిస్తారేమో చదువుకునేందుకు పుస్తకాలు కొనుక్కుందాం అనుకున్నాను. కాని కానీ

గూడా యివ్వలేదు. ప్రయాణఖర్చులైనా ఇవ్వలేదు. ఎంతదూరంలే నడిచిపోదురూ అంటున్నారు."

చౌధరీవద్దకుపోయి నోటికివచ్చినట్లు తిడదామన్నంత కోప మొచ్చిందినాకు. వేశ్యలకేమో రూపాయలూ, బండ్లూ అన్నీ ఏర్పాటా? రామచంద్రునికీ, అతని స్నేహితులకూ మాత్రం బండిసున్నానా? గత రాత్రి చంచలీబాయికోసం పదులూ, ఇరవైలూ త్యాగంచేసిన వాళ్ళదగ్గర వీళ్ళకివ్వటానికి బేడలూ, పావలాలైనా లేక పోయినా యేం? నాన్నగారుకూడా చంచలికి ఒక సవరన్ ఇచ్చారు. మరి వీరికెంత యిస్తారో చూద్దాం. నేను పరుగెత్తుకుని నాన్నగారి దగ్గరకెళ్ళాను. వారు ఎక్కడికో ఆచూకీకి వెళ్ళబోతున్నారు. నేను రావటం చూచి "ఎక్కడ తిరుగుతున్నావురా? చదువుకునే టైములో తిరగాలనిపిస్తోందా?" అన్నారు.

"పందిరి వద్దకు వెళ్ళాను. రామచంద్రుడు వెళ్ళిపోతున్నాడు. వాళ్ళకు చౌధరీగారు ఏమీ యివ్వలేదు" అన్నాను.

"అయితే నీకెందుకురా దిగులూ?"

"వాళ్ళు వెళ్ళేదెట్లా? వాళ్ళవద్ద ప్రయాణ ఖర్చులకుకూడా డబ్బులులేవు."

"అయితే ప్రయాణ ఖర్చులైనా యివ్వలా? చౌధరీగారు బలే అన్యాయం చేశారే!"

"మీరు రెండు రూపాయిలిస్తే పాపం వాళ్ళకిచ్చి వస్తాను. ఆ మాత్రం ఉంటే వాళ్ళు ఇల్లు చేరతారు."

"పో అవతలికి! నీ పాఠాలు చదువుకో నాదగ్గర డబ్బులేదు" ఉరిమి చూస్తూ అన్నారు నాన్నగారు.

ఈ మాటంటూ గుర్రంమీదెక్కి వెళ్ళిపోయారు. ఆ రోజునుండీ నాన్నగారంటే నాకుండే గౌరవం అంతరించిపోయింది. "నాకు ఉపదేశా లివ్వటానికి మీకెంతమాత్రం హక్కులేదు" అనేది నా హృదయం. నాకు ఆయన ముఖం చూస్తేనే అసహ్యంవేసేది. ఆయన చెప్పినదానికి సరిగా వ్యతిరేకమైన పనిచేసేవాణ్ణి. అందువల్ల నాకే అపకారం జరిగినాసరే అప్పుడు నా అంతరాత్మ తిరుగుబాటు ఆలోచనలలోనే మునిగి ఉండేది.

నావద్ద రెండణాలకానులు మాత్రమున్నాయి. నేనవి తీసుకునివెళ్ళి సిగ్గుపడుతూ రామచంద్రునికిచ్చాను. ఆ డబ్బులుచూచి రామచంద్రునికి అంత సంతోషం కలుగుతుందనుకోలేదు నేను. దప్పిగొన్నవాడికి నీళ్ళు లభించినట్లుగా ఎగిరి గంతేశాడు.

ఆ రెండణాల డబ్బులూ తీసుకుని వాళ్ళు ముగ్గురూ సెలవు తీసుకున్నారు. వాళ్ళను ఊరిబయటదాకా సాగనంపటానికి వెళ్ళింది నేనొక్కడినే.

వాళ్ళను సాగనంపి తిరిగివస్తుంటే నా కళ్ళల్లో నీళ్ళునిండాయి. కాని హృదయంమాత్రం ఆనందంతో పొంగిపోయింది.

# మా అన్నగారు

మా అన్నగారు నాకంటె అయిదేళ్లు పెద్ద. కాని నాకంటె మూడు క్లాసులు మాత్రమే ఎక్కువ. నేనూ, ఆయనా ఒకే సంవత్సరంలో చదువు మొదలెట్టాం. అయితే విద్యవంటి మహత్తర విషయాల్లో తొందరపడి ముందుకు సాగటం ఆయన కిష్టంలేదు. ముందుముందు దానిమీద బ్రహ్మాండమైన మహలు నిర్మించగలగటానికి వీలుగా ఇప్పుడే మంచి కట్టుదిట్టమైన పునాది వెయ్యాలి. అందుకనే ఆయన ఒక సంవత్సరపు పని రెండు సంవత్సరాలు చేసేవాడు. అప్పుడప్పుడు మూడు సంవత్సరాలుకూడా పట్టేవి. పునాది దిట్టంగా ఉండకపోతే మహలు నిలకడగా ఉండే దెలా చెప్పండి!

నేను చిన్నవాణ్ణి. ఆయన పెద్దవాడు. నేను తొమ్మిదేళ్ళవాణ్ణి ఆయన కేమో పదునాలుగేళ్ళు. నన్ను దండించటానికి, అదుపులో పెట్టటానికి ఆయనకు జన్మతః అధికారముంది. అలాంటప్పుడు ఆయన ఆజ్ఞల్ని శాసనంగా భావించటమే నా ధర్మం.

ఆయన సహజంగానే చాలా కష్టపడి చదివేవ్యక్తి. ఎప్పుడూ పుస్తకం తెరుచుకునే కూర్చునేవాడు. బహుశా మెదడుకు కాస్త విశ్రాంతి కలిగించటంకోసమే కావచ్చుగాని, ఒకప్పుడు కాపీ పుస్తకంమీద, మరొకప్పుడు పుస్తకాల మార్జిన్స్‌లోనూ పిట్టలూ, కుక్కలూ, పిల్లుల బొమ్మలూ గీస్తుండేవాడు. అప్పుడప్పుడు ఒకే పేరునో, మాటనో, వాక్యాన్నో, పది పదిహేనుసార్లు వ్రాస్తుండేవాడు. ఒకప్పుడు ఒకే పద్యాన్ని ఒకటికి పదిసార్లు అందంగా చూచి వ్రాసేవాడు. ఒక్కొక్కసారి అర్థంపర్థంలేని సందర్భశూన్యమైన శబ్దాలను సృష్టిస్తుండేవాడు; ఉదాహరణకు ఒకసారి నేను వాడి కాపీ పుస్తకంమీద 'స్పెషల్, కోట్లు బంట్రోతు. సోదరులూ, అసలు విషయం, అన్నదమ్ములు. రాధాకృష్ణుడు, శ్రీయుత రాధాకృష్ణ. ఒక్కగంట వరకూ'—అని వ్రాసి, ఆ తరువాత ఒక మనిషి ముఖం గీచియుండటం చూచాను. ఈ పదాలకు ఏదైనా అర్థం లాగుదామని విశ్వప్రయత్నం చేశాను కాని నాచేత కాలేదు. ఆయన్ను అడుగుదామంటే గుండెలు చాలలేదు. ఆయన తొమ్మిదో క్లాసు చదువుతుండె. నేను ఐదో తరగతివాణ్ణేగా. ఆయన రచనలు నా కర్థంగావటం అంటే సామాన్యమా. పిట్ట కొంచెం కూత ఘనమన్నట్లు కాదూ!

నాకు చదవటం అంటే సుతరామూ గిట్టేదికాదు. ఒక్క గంటసేపు పుస్తకం బట్టటమైనా గగనంగా ఉండేది. వీలు చిక్కిందే తడవుగా హాస్టలు వదలి ఆటస్థలానికి వచ్చేసేవాణ్ణి. రాళ్ళు విసురుతూనో, కాగితపు చిలుకలు చేసి ఎగురవేస్తూనో గడిపేవాణ్ణి. సమయానికెవరైనా స్నేహితుడు దొరికితే ఇక అడగనే అక్కరలేదు. ఒకసారి ప్రహరీపైకెక్కి క్రిందకు దుముకుతూ గంతులేసేవాళ్ళం. మరో కప్పుడు గేటు తలుపుమీద ఎక్కి, దాన్ని ముందుకూ వెనక్కూ నడుపుతూ, కారెక్కి తిరుగుతున్నట్లుగా సంబరపడేవాళ్ళం; కాని గదిలోకి రాగానే అన్నగారి రౌద్రాకారం చూసి ప్రాణాలు ఎగిరిపోయేవి. "ఎక్కడున్నావ్?" ఇది ఆయన మొదటి ప్రశ్న. ఎప్పుడూ ఇదే ప్రశ్న అదే గొంతుతో అడగటం జరిగేది. మరి దానికి నా జవాబు కేవలం మౌనం వహించటమే. "కాస్త ఆరుబయట ఆడుకోటానికి వెళ్ళానులే అన్నయ్యా" అనేమాట – ఎందుకనో తెలియదుగాని – నా నోటినుండి పెగిలేదే కాదు. నా మౌనం నా అపరాధాన్ని అంగీకరించిన చిహ్నమన్నమాట. ఇక అన్నగారికి ప్రేమ, క్రోధం మిశ్రమమైన మాటలతో నన్ను సత్కరించటం మినహా మరో మార్గమే తోచేదికాదు.

"నువ్వు ఇంగ్లీషు ఈ విధంగా చదివితే జీవితమంతా చదువుతూ ఉండాల్సిందే. అయినా ఒక్క అక్షరం ముక్కకూడా రాదు. ఇష్టమొచ్చినట్లు చదవటానికి ఇంగ్లీషుభాష నేర్వటం ఏం మజాకా అనుకున్నావా? అలా అయితే ప్రతి అనామకుడంత ఆంగ్లంలో పండితుడై పోయేవాడే. రాత్రింబవళ్ళు కళ్ళు చిల్లులు పడేటట్లు చదవాలి. రక్తమంతా ఓడ్చాలి. అప్పటికీ ఈ విద్యలో నెగ్గటం. అదీ ఏం నెగ్గటం? పేరుకు నెగ్గటమే. గొప్పగొప్ప విద్వాంసులుకూడా పరిశుద్ధమైన ఇంగ్లీషు వ్రాయనేలేరు. ఇక మాట్లాడటం సంగతి చెప్పనే అక్కరలేదు. అయినా నువ్వెంత చవటవురా! నన్నుచూచైనా నేర్చుకోవేం? నేనెంత కష్టపడతాను చెప్పు. నీ కళ్ళతోనే చూస్తున్నావుగా. కనపడకపోతే అది నీ కళ్ళదోషం. నీకు మతిలేదనుకోవాలి. ఇన్ని తిరుణాళ్లు, వినోదాలు జరుగుతుంటాయి. నేను వెళ్ళగా ఎప్పుడైనా చూచావా? ప్రతినిత్యం క్రికెట్, హాకీ పందాలు జరుగుతుంటాయి. వాటి ప్రక్కగా కూడా నడువను. ఎప్పుడూ చదువుతూనే ఉంటాను. అయినప్పటికీ ఒక్కొక్క క్లాసులో రెండేళ్ళు మూడేళ్ళు పడివుంటున్నా. మరి నీవు కాలమంతా ఆటపాటల్లో గడిపేస్తూ ప్యాసయిపోతావని ఎలా అనుకుంటున్నావో, ఏమో! నాకు ఒక్కొక్కక్లాసు గడవటానికి రెండు మూడేళ్లు పడుతున్నాయి. ఇలా అయితే నీవు మాత్రం జీవితమంతా ఈ క్లాసులోనే మురిగిపోతావు. జీవితం యిలాగే గడపాలనుకుంటే ఇంటికి వెళ్ళిపోయి హాయిగా, స్వేచ్ఛగా బిళ్ళంగోడు ఆడుకోటం శ్రేష్ఠం."

ఈ చివాట్లన్నీ విని కళ్ళనీళ్ళు పెట్టుకొన్నాను నేను. ఏం జవాబు చెబుతాను! తప్పుచేసింది నేనూ, మరి చివాట్లెవరు తింటారూ? అన్నగారు ఉపదేశ

విద్యలో నిపుణులు, ఎలాంటి సూటిపోటీమాట లనేవాడు! ఎలాంటెలాంటి సామెతలతో విరుచుకుపడేవాడు? నాగుండెలు పగిలిపోయేవి. నా నడుములు విరిగిపోయేవి. ఆ విధంగా ప్రేగులు తెంచుకొని కష్టపడేశక్తి నాలో ఉండేదికాదు. ఆ నిరాశతో కాసేపు ఇలా ఆలోచించేవాణ్ణి— "ఇంటికి వెళ్ళిపోకూడదూ? నాకు మించినపనికి పూనుకొని జీవితం నాశనం చేసుకోటం ఎందుకూ? నన్ను మూర్ఖుడన్నా సరేగాని అంత శ్రమపడటం మాత్రం నావల్లకాదు బాబూ!" అనుకునేవాణ్ణి. ఈ ఆలోచనతో నాతల తిరిగిపోయేవి. కాని ఇలా రెండు మూడుగంటలు గడవగానే నిరాశా మేఘాలు విడిపోయేవి. ఇక మంచిపట్టుదలగా చదువుదామని నిశ్చయించుకునేవాణ్ణి. తక్షణం ఒక టైంటేబిల్ తయారు చేసేవాణ్ణి మొదటినుండీ తగిన ప్లానులేకుండా, స్కీము వెయ్యకుండా పని ప్రారంభించటం ఎలా? టైంటేబిల్‌లో ఆటపాటల అయిటం అసలు ఎగిరిపోయేది. ప్రొద్దున్నే లేవటం, ఆరుగంటలకల్లా కాలకృత్యాలు తీర్చుకొని టిఫిన్ తీసుకుని చదవటానికి సిద్ధమైపోవాలి. ఆరుగంటల నుండి ఎనిమిది గంటల వరకూ ఇంగ్లీషూ, ఎనిమిదిగంటలనుండి తొమ్మిది గంటల వరకూ లెఖ్ఖలు, తొమ్మిది గంటలనుండి తొమ్మిదిన్నర వరకూ చరిత్ర, తరువాత భోజనమూ, స్కూలూ. మూడున్నర గంటలకు స్కూలునుండి వచ్చిన తరువాత ఒక అరగంట విశ్రాంతి, నాలుగు గంటలనుండి అయిదుగంటల వరకూ భూగోళం అయిదు గంటలనుండి ఆరుగంటల వరకూ వ్యాకరణం, తరువాత ఒక అరగంట హాస్టలుముందే పచారుచెయ్యటం, ఆరున్నరనుండి ఏడు గంటలవరకూ ఇంగ్లీషుకాంపోజిషనూ, ఆ తరువాత భోజనంచేయటం తిరిగి ఎనిమిదినుండి తొమ్మిదివరకూ అనువాదం, తొమ్మిదినుండీ పదివరకూ హిందీ, పదినుండి పదకొండు వరకూ వివిధ విషయాలూ, తరువాత విశ్రాంతి; ఇదీ టైంటేబిల్.

కాని టైంటేబిల్ తయారు చేయటం వేరూ, దాన్ని అమలు పరచటంవేరూ. ఉల్లంఘన మొట్టమొదటి రోజునే ప్రారంభమయ్యేది. హాయిగాలిపే పచ్చికమైదానం, ఆ పిల్లగాలి విసురులూ ఫుట్‌బాల్ ఆడేటప్పటి ఆ ఉత్సాహం, చెడుగుడులో వేసే ఆ ఎత్తుగడలూ, వాలీబాల్ ఆటలోని ఆ చురుకుతనం, హుషారూ యివన్నీ అజ్ఞాతంగా, అనివార్యంగా నన్ను తమవైపుకు ఈడ్చుకుపోయేవి. అక్కడికి పోగానే అన్నీ మరచిపోయేవాణ్ణి. ఆ ప్రాణాలుతోడే టైంటేబిలూ, కళ్ళు ఖరాబుచేసే ఆ పుస్తకాలూ ఏవీ జ్ఞాపకముండేవేకావు. ఇంకేం? ఉపదేశించటానికీ శాపనార్థాలకూ అన్నగారికి చక్కని అవకాశం లభించేది. నేను ఆయన చాటుగా జారుకునేవాణ్ని. ఆయన కళ్ళబడకుండా ఉండటానికి ప్రయత్నం చేసేవాణ్ణి. ఆయనకు తెలియకుండా పిల్లి అడుగులు వేసుకుంటూ ప్రవేశించేవాణ్ణి గదిలోకి. ఆయన దృష్టి నామీద పడ్డదంటే నా ప్రాణాలు ఎగిరిపోయాయన్నమాటే. ఎప్పుడూ ఒక చురకత్తి నా నెత్తిన వ్రేలాడుతున్నట్లనిపించేది. అయినప్పటికీ ప్రాణాపాయ స్థితిలోకూడా మాయా,

మోహాల బంధనాల్లో చిక్కుపడే మానవుని లాగానే చివాట్లకూ, బెదిరింపులకూ గురై కూడా ఆటల కార్యక్రమాన్ని మాత్రం వదిలిపెట్టలేక పోయేవాణ్ణి.

## 2

సాంవత్సరిక పరీక్షలై పోయినాక అన్నగారు ఫేలయినారు. నేను పాసయినాను. క్లాసులో ఫస్టుగాకూడా వచ్చాను. ఇక నాకూ మా అన్నగారికి మధ్య తేడా రెండు సంవత్సరాలు మాత్రమే. "తమ తపస్సంతా ఏమైపోయిందండీ? నన్ను చూడండి హాయిగా ఆడుకుంటూనూ వచ్చాను. క్లాసులో ఫస్టుమార్కు సంపాదించాను. చూశారామరి?" అని నాలుగు మాటలూ ముఖానే అనేద్దా మనుకున్నాను. కాని ఆయన చాలా విచారంగానూ, దిగులుగానూ ఉన్నాడు ఆయన్నిచూస్తే నాకు నిజంగానే ఎంతో జాలివేసింది. ఆస్థితిలో ఆయన గాయంమీద కారంచల్లే ఆలోచన సిగ్గుచేటనిపించింది. అయితే నన్నుగురించి నాకు కాస్త గర్వం కలిగినమాట నిజం. ఆత్మాభిమానం కూడా అధికమైంది. నామీద మా అన్నగారి ఆ పూర్వపు పలుకుబడి క్షీణించింది. స్వేచ్ఛగా ఆటల్లో పాల్గొనటం ప్రారంభించాను. ఇప్పుడు కాస్త గుండెధైర్యం ఏర్పడింది. ఈసారి గనుక ఆయన శాపనార్థాలు పెట్టాడా "నెత్తురంతా ఓడ్చి తమరు పొడిచేసిందేమిటో చెబుదురూ! నేను ఆడుతూ పాడుతూనే క్లాసులో ఫస్టున వచ్చాను. తెలుసా"? అని ఖచ్చితంగా అనేస్తాను. నోరు తెరచి ఇంత దుడుకుగా అనటానికి సాహసించక పోయినా నా వ్యవహారం చూసేనే అన్నగారంటే నాకా బెదురిప్పుడు లేదని స్పష్టంగా తెలిసిపోతోంది. మా అన్నగారుకూడా ఈ విషయం పసిగట్టారు. సహజంగా ఆయనది చాలా కుశాగ్రబుద్ధి. ఒకరోజు ఉదయమంతా బిళ్ళంగోడు ఆటలో గడిపేసి భోజనం వేళకు ఇంటికి చేరేసరికి కత్తి దూసి దూకారా అన్నట్లు నామీద విరుచుకుపడ్డారు—— "చూస్తున్నాగా! ఈ సంవత్సరం ప్యాసయ్యానూ, క్లాసులో ఫస్టుసకూడా వచ్చానులే" అని నీకు చాలా గర్వం బలిసినట్లుంది. కాని ఒక్క సంగతి తమ్ముడూ! మహామహావాళ్ళ గర్వంకూడా అణగిపోయింది. నీ దొక లెక్కా జమా? చరిత్రలో రావణాసురుడి కేగతిపట్టిందో చదివే ఉంటావు. ఆయన జీవితంనుండి నువు నేర్చుకున్న నీతేమిటి? లేక ఊరికే చదివి పారేశావా? కేవలం పరీక్షలు ప్యాసుగావటంలో గొప్పేమీలేదు. అసలు విషయం మానసిక వికాసం. ఊరికే చదవటంకాదు. చదివిన విషయాల్లో సారం గ్రహించాలి. రావణాసురుడు భూమండలాని కంతా అధికారి. అటువంటి రాజులను చక్రవర్తి అంటారు. ఇంగ్లీషువాళ్ళ రాజ్యమిప్పుడు చాలా వ్యాపించింది. అయినా వీళ్ళను చక్రవర్తులనలేం. ప్రపంచంలో చాలారాజ్యాలు ఇంగ్లీషువాళ్ళ ఆధిపత్యాన్ని అంగీకరించవు పూర్తి స్వాతంత్ర్యం కలిగిన దేశాలవి. కాని రావణుడు చక్రవర్తి. ప్రపంచంలోని రాజులందరూ అతనికి కప్పంగట్టేవాళ్ళు. గొప్ప గొప్ప దేవతలు

గూడా ఆయనకు దాస్యం చేసేవాళ్ళు. అగ్నిదేవుడూ, వరుణదేవుడూగూడా ఆయనకు దాసులే. కాని చివరకు రావణాసురుడి గతేమైంది? గర్వం అతన్ని నామ రూపాలు లేకుండా నాశనం చేసింది. ఆయనకో గ్రుక్కెడు నీళ్ళుపోసే వాళ్ళయినా మిగలలేదు. మనిషి ఎన్ని కుచేష్టలు చేసినా గర్వం పనికిరాదు. మిడిసిపడకూడదు. గర్వపడ్డాడా యిహానికీ, పరానికీ కాకుండా పోతాడు. సైతాను కథకూడా వినే ఉంటావు. సైతానుకుకూడా తనకంటె మించిన సిసలైన భగవద్భక్తుడు మరెవరూ లేనేలేరని గర్వంకలిగింది. చివరకేమైంది? స్వర్గంనుండి నరకంలోకినెట్టివేయబడటం జరిగింది. శాహెహూమ్‌గూడా ఒకసారి గర్వించాడు. కాని ఏమైనాడు? అకుక్కుతింటూ చనిపోయినాడు. నీవిప్పుడు ఒక్కక్లాసు ప్యాసయ్యావో లేదో అప్పుడే తల తిరిగి పోయింది. ఇలా అయితే వృద్ధిలో కొచ్చినట్టే! నీవేదో కష్టపడ్డందువల్ల కాదు ప్యాసయింది. ఇది మాత్రం తెలుసుకో ఏదో గ్రుడ్డివేటుగా తగిలింది. కాని గ్రుడ్డి వేటు దెబ్బ ఏదో ఒకసారి మాత్రమే గురిగా తగుల్తుంది. మాటిమాటికి తగలదు. అప్పుడప్పుడు బిళ్ళంగోడు ఆటలోగూడా గ్రుడ్డివేటు దెబ్బ గురిగా తగులు తుంటుంది. అంతమాత్రానే వాడు పెద్దఆటగాడైపోడు అసలెప్పుడూ గురితప్పని వాడే మొనగాడైన ఆటగాడు. నేను ఫెయిలైన విషయం తీసుకురాకు. నా క్లాసు వరకూ వచ్చి ఆల్జీబ్రా, జామెట్రీల్లాంటి ఇనుపగుగ్గిళ్ళు నమలవలసి వచ్చినప్పుడూ, బ్రిటిష్ చరిత్ర చదువవలసి వచ్చినప్పుడూ – అప్పుడుగాని గ్రుడ్లు వెళ్ళకురావు. చక్రవర్తుల పేర్లు గుర్తుంచుకోటం సామాన్యంకాదు. ఎనిమిదిమంది హెన్రీ లున్నారు. ఏ విషయం ఏ హెన్రీకాలంలో జరిగిందో జ్ఞాపకముంచుకోవటం సులభమనుకున్నావా? ఏడవ హెన్రీకిబదులు ఎనిమిదవ హెన్రీ అని వ్రాశావా మార్కులు మొత్తం గల్లంతౌతాయి. క్షౌరం! గుండుసున్నా గూడా ఇవ్వరు. ఏమిటనుకున్నావో ఏమో! డజనుల జేమ్సులూ, డజనుల విలియమ్సులూ, కోట్ల ఛార్లెసులూ పరిపాలించారు బుర్ర తిరిగిపోతుందనుకో. పిచ్చెక్కిపోతుందనుకో ఈ దౌర్భాగ్యులకు పేర్లుకూడా దొరకవల్లేవుంది. ఒక్క పేరును లంకించుకొని రెండవ, మూడవ, నాలుగవ, అయిదవ అని తగిలించి పారేశారు. నన్నడిగినా చెప్పేవాణ్ణే పదిలక్షల పేర్లూ! ఇక జామెట్రీయా! దేవుడికో నమస్కారం L అబజకు బదులు L అజబ వ్రాశావా మార్కులు మొత్తం ఖాళీ! ఇంతకూ L అబజకూ, L అజబకూ ఏమంత భేదముందీ? అనవసరమైనదానికి విద్యార్థులగొంతు కొయ్యటం ఎందుకు చెప్పండి. పప్పు, అన్నం, రొట్టెతిన్నాడూ; అన్నం, పప్పు, రొట్టెతిన్నాడూ వీటిలో ఏదైతేనేం మునిగిపోయింది చెప్పు. ఈ కసాయి పరీక్షకులను ఒక్కడూ ప్రశ్నించడేం! కాని వాళ్ళు యివన్నీ లక్ష్యపెడతారూ? పుస్తకాల్లో వ్రాసిన విషయం వ్రాశాడా లేదా అని చూస్తారు. అంతే! పిల్లలు అక్షరం బట్టీపట్టాలనుకుంటారు వాళ్ళు. ఈ బట్టీ పట్టటానికే 'విద్య' అని పేరు పెట్టేశారు. ఇంతమా తలా, తోక లేని విషయాలు చదివినందువల్ల ప్రయోజన

మేముంది? ఈ రేఖపైన లంబ రేఖగీస్తే భూమి లంబమునకు రెట్టింపగును. అందువల్ల ఒరిగేదేమిటో చెప్పమనండి. రెండురెట్లు కాదు; నాలుగు రెట్లు అయితే మాత్రమేం? పోనీ సగమే ఉంటుందయ్యా. ఎంతుంటే మనదేంపోయింది? కాని లాభంలేదు. పరీక్ష ప్యాసుకావాలంటే ఈ చెత్తంతా గుర్తుంచుకోక తప్పదు. నాలుగు పేజీలకు తక్కువ కాకుండా 'పంక్చ్యుయాలిటీ' మీద ఒక వ్యాసం వ్రాయమంటారు. ఇక మీరు కాపీ ముందరపెట్టుకుని కలం చేతబట్టి వాని జీవానికిపడి అఘోరించాలి. టైముప్రకారం నడుచుకోటం చాలా మంచివిషయమన్న సంగతి తెలియనివాళ్లెవరు చెప్పు. అలా నడుచుకుంటే మనిషి జీవితంలో సంయమం ఏర్పడుతుంది. ఇతరులకు అతనంటే ఆదరం కలుగుతుంది. అతని వృత్తిలో పైకి వస్తాడు. కాని ఈ కాస్త విషయంమీద నాలుగుపేజీలు వ్రాయటం అంటే మాటలా? అదిగాక ఒక్క వాక్యంలో చెప్పగలిగే విషయాన్ని గురించి నాలుగుపేజీలు వ్రాయవలసిన అవసరమేమిటీ అంటే? యిది వట్టి మూర్ఖత్వమంటాను. నేను యిది కాలాన్ని సద్వినియోగం చేసుకోటంగాదు. ఏ విషయాన్నయినా అనవసరంగా సాగదీస్తూ కూర్చోటం కాలాన్ని దుర్వినియోగం పరచటంకాదూ? ఎవరైనా తాను చెప్పదలచుకున్న దేమిటో చటుక్కున చెప్పేసి తనతోవన తను వెళ్ళిపోవాలనుకుంటాం మనం. ఇక్కడట్లా వీల్లేదే! ఎలాఅయినా వ్రాయనీ నాలుగుపేజీలూ నింపితీరాల్సిందే. పైగా పేజీలు కూడా అరటావు సైజువి. ఇది విద్యార్థులను హింసపెట్టటంకాకపోతే మరొకటా? వచ్చిపడ్డ చిక్కేమిటంటే సంక్షిప్తంగా వ్రాయమంటారు. 'పంక్చ్యుయాలిటీని' గురించి సంక్షిప్తంగా నాలుగు పేజీలకు తక్కువగాకుండా ఒక వ్యాసం వ్రాయాలట! బాగుంది. సంక్షిప్తమైతేనే నాలుగు పేజీలన్నారు. లేకుంటే వందా, రెండు వందల పేజీలు వ్రాయిస్తారుకాబోలు! త్వరగానూ, మెల్లగానూ కూడా పరుగెత్తండి. ఇది విరుద్ధమైన విషయమేనా? కాదా? ఈ సంగతి పిల్లలకుగూడా అర్థమౌతుంది. కాని ఈ పంతుళ్ళకు ఈమాత్రం వివేకంగూడా ఉండదేం? పైగా మేము 'ఉపాధ్యాయులం' అని విర్రవీగుతారు. తమ్ముడూ! నా క్లాసుదాకా వస్తే ఈ తిప్పలన్నీ నువ్వూపడాలి. అప్పుడుగాని యిందులోఉండే కష్టనిష్టురాలు తెలియవునీకు. ఈ క్లాసులో ఫస్టున వచ్చేసరికి నీవేమీ క్రిందవిలవటంలేదు. అందుకనే నా మాట వినమంటున్నా. లక్షసార్లు తప్పితే మటుకేం? నీ కంటె పెద్దవాణ్ణి ప్రపంచాన్ని గురించి నీ కంటె నా కెక్కువ అనుభవముంది. నే చెప్పే విషయాలన్నీ అక్షరాలా గుర్తుంచుకో. లేదా ముమ్ముందు పశ్చాత్తాప పడతావు."

స్కూలువేళ కావచ్చింది. లేకుంటే ఈ ఉపదేశ దుమారం ఎప్పటి కంతమయ్యేదో ఏమో! ఆ రోజు నాకు భోజనమే రుచించలా. ప్యాసయితేనే యింత హీనంగా మాట్లాడుతున్నాడే ఫేలయితే బహుశా నా ప్రాణాలే తీసేవాడనుకుంటాను.

తన క్లాసు చదువును గురించి మా అన్నగారు చిత్రించిన భయంకర చిత్రం నన్ను హడలెత్తించింది. నేను స్కూలు వదలిపెట్టి పారిపోకుండా ఎలా ఉన్నానో అదే ఆశ్చర్యం. కాని యిన్ని చివాట్లు తిన్నతరువాత కూడా పుస్తకాలంటే నా కుండే అయిష్టం అలాగే ఉండిపోయింది. ఆడుకోటానికి వచ్చిన ఏ అవకాశాన్నీ చేజార నిచ్చేవాణ్ణి కాదు. చదువుతుండేవాణ్ణే కాని చాలా స్వల్పం. క్లాసులో అవమానానికి గురికావలసిన పనిలేకుండా ఏ రోజు పని మాత్రం ఆ రోజు ముగించుకునేవాణ్ణి. నామీద నాకు కలిగిన ఆ విశ్వాసం కాస్తా అణగిపోయింది. మళ్ళీ దొంగలలాగా జీవించటం ప్రారంభమైంది.

# 3

మళ్ళీ సాంవత్సరిక పరీక్షలైపోయినాయి. అదేదో దైవికంగా నేను మళ్ళీ ప్యాసుగావటం, మా అన్నగారు మళ్ళీ తప్పిపోవటం సంభవించింది. నే నేమంత పెద్దగా కష్టపడలేదు. అయినా క్లాసులో ఫస్టున ఎలా రాగలిగానో తెలియదు. నాకే ఆశ్చర్యమేసింది. అన్నగారు ప్రేగులు త్రెంచుకు చదివారు. రాత్రి పది గంటల వరకూ యిటూ తెల్లవారుఝామున నాలుగు గంటల నుండీ అటూ, స్కూలు టైముకు ముందు ఆరుగంటల నుండి తొమ్మిదిన్నరవరకూ ఒకటే చదవటం ! కోర్సులో ఉన్న ప్రతిమాటనూ నమలిపారేశాడనుకోండి. ముఖం పాలిపోయింది. కాని ఫేలై పోయినాడు పాపం. ఆయనంటే నాకు జాలి కలిగేది. ఫలితాలు వినగానే భోరున ఏడ్చాడాయన. నేనూ ఏడ్చాను. నేను ప్యాసయినానన్న సంతోషం సగానికి క్రుంగి పోయింది. నేను కూడా ఫేలయ్యుంటే మా అన్నగారికి యింత దుఃఖం కలిగేది కాదు. కాని విధి వ్రాలు ఎవరు తప్పించగలరు చెప్పండి ?

ఇక నాకూ, మా అన్నగారికి మధ్య ఒక్క క్లాసుమాత్రమే తేడా ఉండి పోయింది. దీంతో నా మనసులో ఒక దుష్టభావం మొలకెత్తింది. మా అన్నగారు మళ్ళీ యింకో సంవత్సరంగూడా ఫేలయితే నేనూ ఆయనతో సమానమైపోతాను. అప్పుడిక నన్ను ఏ ఆధారంతో కించపరుచగలుగుతాడూ ! కాని నేనీ నీచమైన ఆలోచనను మనసులోనుంచి బలవంతాన బయటికి నెట్టేశాను. ఇంతకూ ఆయన నన్ను మందలించటం నా మేలుకోసమేగా ! ఇప్పుడు నా కాయనమాటలు అప్రియంగా ఉండేమాట నిజమే. కాని నేను ఢంకామీద దెబ్బగొట్టి ప్యాసుకావటానికీ అందులోను ఇంతమంచి మార్కులతో ప్యాసవుతామంటే - అది బహుశా ఆయన ఉపదేశాల ప్రభావమేనేమోమరి !

అప్పటినుంచీ మా అన్నగారు చాలా నీరసపడిపోయారు. అనేకమార్లు నన్ను మందలించే అవకాశం దొరికినా నిబ్బరించుకుని ఊరుకునేవాడు. నన్ను మందలించే

అధికారం యితనకు లేదనీ ఉన్నా చాలా స్వల్పమనీ బహుశా ఆయనకే అర్థమైం దనుకుంటాను. ఇక నా స్వేచ్ఛకూడా మితిమీరింది. ఆయన సహనాన్ని అనుచితంగా ఉపయోగించుకోటం మొదలెట్టాను. "నేను చాలా అదృష్టవంతుణ్ని చదవనీ . చద వకపోనీ నేను ప్యాసయి తీరతాను" అనే ధీమా ఏర్పడిపోయింది నాలో. అందువల్ల చదివే ఆ స్వల్పమాత్రపు చదువుకూడా బందయిపోయింది. నాకుగాలిపటాలు ఎగుర వేసే క్రొత్త మోజొకటి పట్టుకుంది. ఇక రోజంతా గాలిపటాల పందాల్లోనే గడిచి పోతోంది. అయినా నేను మా అన్నగారిని గౌరవించేవాణ్ణే. ఆయన కళ్లుగప్పి గాలిపటాలు ఎగురవేసేవాణ్ని దారాలు పేనటం, సూత్రాలు గట్టటం, గాలిపటాల పందాలకు సన్నాహాలు వగైరా సమస్యలన్నీ రహస్యంగా పరిష్కారమైపోయేవి. నాకు తనంటేగల ఆదరాభిమానాలు సన్నగిల్లాయన్న అనుమానం మా అన్నగారికి ఏ మాత్రం గలుగనిచ్చేవాణ్నికాదు.

ఒకరోజు సాయంత్రం హాస్టలుకు దూరంగా ఒక గాలిపటం ఎగురవేసు కుంటూ ముందు వెనుకలు చూడకుండా పరుగెత్తి పోతున్నాను. దృష్టంతా ఆకాశం వైపే ఉంది. ఏదో ఆత్మస్వర్గంనుండి బయలుదేరి నిరక్త మనస్సువద్ద నూతన సంస్కారం పొందటం కోసం పయనిస్తోందా అన్నట్లు మెల్లగా ఉయ్యాలలూగుతూ భూపతనావస్థలో ఉంది గాలిపటం. నా మనస్సంతా ఆకాశంలో విహరించే ఆ బాట సారి వైపే వుంది. ఒక పెద్ద బాలసైన్యం కంపగట్టిన వాసాలతో ఆ గాలిపటాన్ని ఆహ్వానించటానికి పరుగెత్తుకువస్తోంది. వారిలో ముందు వెనుకలు ఒకదికీలేవు. కార్లూ, ట్రాములూ, బండ్లూ యివ్వేమీలేని సమతలప్రదేశంలో ఆ గాలిపటంతో పాటు వాళ్ళుకూడా గగనంలో విహరిస్తున్నారా అనిపిస్తోంది.

బహుశా బజారునుండి వస్తున్నాడుకాబోలు; అగస్మాత్తుగా ఎదురుపడ్డాడు మా అన్నగారు. ఆయన అక్కడే నా చెయ్యిపట్టుకొని మండిపడుతూ యిలా అన్నారు—ఈ కానీకానీ గాలిపటాలకోసం ఈ బజారు వెధవలందరితో చేరి పరు గెత్తటానికి నీకు సిగ్గెట్లా లేదురా! నీవిప్పుడు చిన్నక్లాసుల్లో లేవని తెలుసుకోవాలి. 'ఎనిమిదో తరగతి చదువుతున్నానే; అన్నయ్యకంటె ఒక్క క్లాసు మాత్రమే వెనకున్నానే' అన్న ఆలోచనే ఉండక్కరలా? ఏమైనా మనిషైనవాడు తన హుందా తనం సంగతి గ్రహించి నడుచుకోవాలి. పూర్వపు రోజుల్లో ఎనిమిదవ తరగతి చదివి ఏక్టింగ్ తహసీల్ దార్లయ్యేవాళ్ళు. మిడిల్‌స్కూల్ చదువుతో యివ్వాళఫస్టుక్లాస్ డిప్టీ మేజిస్ట్రేట్లో. సూపరెంటెండెంట్లో అయినవాళ్ళను ఎంతోమందిని ఎరుగుదునునేను. మన నాయకుల్లోనూ, పత్రికా సంపాదకుల్లోనూ ఎనిమిదో తరగతి వాళ్ళు బోలెడు మందున్నారు. వాళ్ళ అధీనంలో గొప్పగొప్ప విద్వాంసులే పనిచేస్తున్నారు. అలాంటి ఎనిమిదవ తరగతిలో ప్రవేశించి బజారు వెధవలతో చేరి గాలిపటాలకోసం పరు గెత్తుతున్నావా? నీ తెలివితక్కువతనంచూస్తే ఏడుపొస్తోంది. నీవు తెలివిగలవాడివే.

సందేహంలేదు. కాని మన ఆత్మగౌరవాన్ని కాస్తా మంటగలిపే ఆ తెలివి ఉండి మాత్రం ఏం ప్రయోజనం? 'నేను అన్నయ్యకంటె ఒక్క తరగతేకదా తక్కువ: నాకు నీతులు చెప్పేహక్కు ఈయనకేముందని నీ మనస్సులో అనుకుంటే అనుకో వచ్చు. కాని అలా అనుకోటం చాలా పొరబాటు. నేను నీకంటె అయిదేళ్ల పెద్ద. యివ్వాళనువ్వు నా తరగతిలోకి వచ్చినాసరే-పరీక్షకులస్థితి యిలాగే ఉంటే వచ్చే సంవత్సరం నిస్సందేహంగా నువ్వు నాతో సమానమౌతావు. బహుశా యింకో సంవత్సరానికి నాకంటే మించికూడా పోవచ్చు-నీకూ నాకూ ఉన్న అయిదేళ్ళ అంతరంమాత్రం నువ్వేమిటి: నిన్ను పుట్టించిన భగవంతుడుకూడా మాపుచెయ్య లేడు. నేను నీకంటే ఐదేళ్లు పెద్ద. ఎప్పటికైనా నేనే పెద్దవాణ్ని. నువ్వు యమ్. ఏ. డి లిట్. డి. ఫిల్ డిగ్రీలు పొందినా ప్రపంచాన్ని గురించీ, జీవితాన్ని గురించీ నాకున్న అనుభవంతో నీవెన్నడూ పోటీపడలేవు. అనుభవం పుస్తకాలు చదివితే వచ్చేదికాదు. లోకం తెలుసుకోవాలి. మన అమ్మ డిగ్రీలేమీ ప్యాసుకాలేదు. నాన్న గూడా బహుశా ఆయిదారు క్లాసులకు మించి చదువుకోలేదు. అయితే ఏం? మనం ప్రపంచంలోని విద్యలన్నీ నేర్చినాసరే అమ్మకూ, నాన్నకూ మనకు నచ్చజెప్పి చక్కదిద్దే అధికారం ఎప్పుడైనా వుంటుంది. మనల్ని కన్నవాళ్ళు గాబట్టికాదు ఈ అధికారం; మనకంటె వారికి లోకానుభవం ఉంది గనుక—ఉంటుంది గనుక. అమెరికాలో పరిపాలనా విధానమేమిటి, ఎనిమిదవ హెన్రీ ఎన్ని పెళ్ళిళ్లు చేసుకున్నాడు, ఆకాశంలో ఉండే నక్షత్రాల సంఖ్యఎంత? ఇలాంటి విషయాలు వాళ్ళకు తెలియకపోవచ్చు. కాని నాకంటె, నీకంటె మించి తెలిసిన విషయాలు వేలున్నాయి. అనుకోగూడదుగాని నేనొకవేళ జబ్బుపడటం జరిగితే నువ్వు గాబరా పడిపోతావు. నాన్నకు టెలిగ్రాం యివ్వటం మినహా మరో ఆలోచనే తోచదు నీకు. అదే నాన్నయితే టెలిగ్రాం ఇవ్వడు. గాబరా అయిపోడు గ్రుడ్లు తేలవేసి ఊరుకోడు. మొదట తానే రోగమేదో కనిపెట్టి చికిత్స చేస్తాడు. అందువల్ల ప్రయోజనం లేకపోతే ఏ డాక్టరునో తీసుకొస్తాడు. సరే జబ్బంటే పెద్ద విషయమనుకుందాం. నువ్వూ, నేనూ ఉన్నామంటే నెలరోజుల ఖర్చు నెలకు సరిపెట్టట మెలాగో కూడా చేతకాదు. నాన్న పంపిన డబ్బుకాస్తా, ఇరవై, ఇరవైరెండో తేదీలోపలే ఖర్చుచేసేస్తాం. ఇక అప్పటినుంచీ కానీ, కానీకి దేబిరించటమేగా; టిఫిన్ బందుకావటం, చాకలికీ, మంగలికీ ముఖం వాస్తూ తిరగటం—యింతేగా; కాని మన కుటుంబం సంగతి చూడు. తొమ్మిది మంది గల కుటుంబం మనది. అయితేనేం? ఇవ్వాళ మనిద్దరం కలిసి ఖర్చుపెడుతున్న మొత్తంలో సగం డబ్బుతోనే నాన్న తన కుటుంబాన్ని పోషించుకుంటూ, తన జీవితంలో ఎక్కువ భాగం గౌరవ ప్రతిష్ఠలతో నెట్టుకొచ్చాడు. మన హెడ్‌మాస్టరుగారినే చూడు. యమ్.ఏ. ప్యాసయినాడు గదా; అందులో ఆక్స్‌ఫర్డ్ యమ్.ఏ. వెయ్యిరూపాయలు సంపాదిస్తున్నాడు. కాని ఆయనింటిని చక్కదిద్దుతున్నది ఎవరు చెప్పు. ఆయనగారి ముసలి తల్లిగా! హెడ్‌మాస్టరు

గారి డిగ్రీ ఇక్కడ ఎందుకైనా పనికొచ్చింది? మొదట్లో ఇంటి వ్యవహారం ఆయనే చూసేవాడు. ఖర్చులకు సరిపోయేవి కాదు. అప్పులుకూడా అవుతుండేవి. ఇంటి పెత్తనం ఆయన తల్లిగారు తీసుకోగానే ఇంట్లో లక్ష్మి ప్రవేశం జరిగిందనుకో! అందుకనే తమ్ముడూ! నా మాట విను. నువ్వు నా దగ్గరలోకి వచ్చేశావు గాబట్టి 'ఇక నేను సర్వస్వతంత్రుణ్ని' అనే గర్వం మాత్రం మనసులోకి రానీకు. చూస్తూ చూస్తూ నేను నిన్ను దారితప్పి నడవనిస్తాననుకోబోకు. నీవు మాటలతో వినకపోతే (అరచెయ్యి చాచి చూపిస్తూ) చెంపదెబ్బలుకూడా ప్రయోగిస్తాను. నా మాటలు నీకు విషంగా వున్నాయని నాకూ తెలుసులే."

ఆయన ప్రయోగించిన యీ క్రొత్త యుక్తికి తలవంచేశాను. ఆరోజు నాకు నిజంగానే నేనెంత అల్పుడనో తెలిసి వచ్చింది. అన్నగారంటే నాలో భక్తి శ్రద్ధలు కూడా ఏర్పడ్డాయి. "అలా ఎప్పుడు అనుకోనన్నయ్యా. నువ్వు చెబుతున్నది అక్షరాలా నిజమే. అలా అనేందుకు నీకధికారముం దన్నయ్యా!" సజలనేత్రాలతో అన్నానీమాటలు.

అన్నయ్య నన్ను కౌగలించుకొని "గాలిపటాలు ఎగురవెయ్యొద్దని నేనూ అనను. గాలిపటాలంటే నాకూ ఎంతో మోజే. కాని ఏం చెయ్యనూ! నేనే తప్పు దోవన నడిస్తే నిన్ను చక్కదిద్దే వాళ్ళెవ్వరు చెప్పు! ఆ భారం నాదేగా!" అన్నాడు.

దైవికంగా అప్పుడే ఒక దారం తెగిన గాలిపటం మామీదుగా వెళ్ళింది. దాని దారం వేలాడుతోంది. పిల్లల గుంపొకటి దాని వెంబడే దౌడుతీస్తూ వస్తున్నారు. మా అన్నయ్య అసలు పొడుగుపాటివాడేగా! ఎగిరి ఆ దారం పట్టుకున్నాడు. ముందు వెనుకలు చూడకుండా హాస్టలువైపుకు పరుగుతీశాడు. ఆయన వెనుకనే నేనూ పరుగుతీశాను.

—o—

# కైపు

ఈశ్వర్ ఒక పెద్ద జమీందారు కుమారుడు. నేనేమో రెక్కల ఆధారం మినహా మరో ఆస్తి అంటూ ఏమీలేని ఒక పేద గుమాస్తా కొడుకును. మేమెప్పుడూ పరస్పరం తర్జనభర్జనలు పడుతుండేవాళ్ళం. నేను జమీందార్లను నిందించేవాణ్ణి. వాళ్ళను క్రూరమృగాలనేవాణ్ణి. రక్తం పీల్చుకుతాగే జలగలనేవాణ్ణి. చెట్ల చిటారు కొమ్మలపై పూసే గొడ్డుపూలనేవాణ్ని. అతను జమీందార్ల కొమ్ము వేసుకునేవాడు. కాని సహజంగానే అతని పక్షం కొంత బలహీనంగా వుండేది. ఎందువల్లంటే జమీందార్లకు అనుకూలమైన తర్కమేదీ ఉండదాయెమరి; "మనుషులందరూ సమానంగా ఉంటారా? పెద్దాచిన్నా ఎప్పుడూ ఉంటూనే ఉన్నారు. ఇకముందూ ఉంటారు." ఇలా అనటం వట్టి చచ్చువాదన. మానవత్వంతోకూడిన ఏ నైతిక సూత్రం ప్రకారమయినా ఈ వ్యవస్థలోని ఔచిత్యం రుజువు కావటం అసంభవం. ఈ తర్జనభర్జనల ఉడుకులో తరచు నేను ఉద్రేకపడేవాణ్ని. గ్రుచ్చుకునే మాటలనేవాణ్ణి కాని ఈశ్వర్ తర్కంలో ఓడిపోయి కూడా ముసి ముసి నవ్వులు నవ్వేవాడు. అతను ఉద్రేకపడగా నేనెన్నడూ చూడలేదు. అందుకు కారణం బహుశా తన పక్షపు బలహీనతలు అర్థం చేసుకోవటం వల్లనే అనుకుంటాను. నౌకర్లతో ఎన్నడూ అతను తిన్నగా మాట్లాడేవాడు కాదు. సహజంగా ధనవంతుల్లో వుండే కసాయితనం, దురహంకారం, అతనికి తగినంత అబ్బినాయి. నౌకరు ప్రక్కవేయటంలో ఏమాత్రమైనా ఆలస్యం చేసినా, పాలు ఉండవలసినదానికంటే వేడిగాగానీ, చల్లగాగానీ ఉన్నా సైకిలు సరిగ్గా తుడవకపోయినా అతనికి వళ్ళుతెలియని కోపం వచ్చేది. అల సత్యమన్నా, ఆ శిష్టతన్నా ఎంతమాత్రం సహించేవాడుకాదు. కాని మిత్రులతో ముఖ్యంగా నాతోమాత్రం చాలా సహృదయతతోనూ, నమ్రతగానూ మెలగేవాడు. బహుశా అతని స్థానంలో నేను ఉన్నా నాలోనూ ఆయనకు మాదిరి కఠినస్వభావాలే పుట్టుకొచ్చే వనుకుంటాను. ఎందువల్లంటే నా విశ్వప్రేమకు ఆధారం నా పరిస్థితులు కాని నా సిద్ధాంతాలు కావు. అతనుమాత్రం నా స్థితిలో వున్నప్పటికీ ధనవంతుడుగానే ఉండేవాడు. ఎందువల్లంటే అసలతను స్వభావంలోనే విలాస పురుషుడు. ఐశ్వర్యప్రియుడు కాబట్టి.

ఈసారి దసరా సెలవులకు ఇంటికి వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాను. ప్రయాణఖర్చులకు నావద్ద డబ్బులేదు; అందుకోసం మావాళ్ళను ఇబ్బంది పెట్టటం

నాకిష్టమూలేదు. ఇప్పుడువాళ్ళు నాకు పంపిస్తున్నదే వారికి శక్తికిమించిన విషయమని నాకు తెలుసు. అదీగాక పరీక్షల దిగులుకూడాఉంది. ఇంకా బోలెడెంత చదువవలసిఉంది. ఇంటికి వెళితే ఎవరు చదువుతారూ? హాస్టల్‌లో సైతానులాగా ఒక్కడినే బిక్కుబిక్కుమంటూ పడిఉండటానికి ఇష్టంలేదు. అందువల్లనే ఈశ్వర్ నన్ను వాళ్ళింటికిరమ్మని ఆహ్వానించగానే పెద్దగా కాదనకుండానే సరేనన్నాను. అతను ధనవంతుడైనప్పటికీ కష్టపడి చదువుతాడు. చురుకైనవాడు కూడాను. ఇంకేం? ఈశ్వర్‌తో కలిసి చదువుకుంటూ లక్షణంగా పరీక్షలకు గూడా తయారుకావచ్చులే అనుకున్నాను.

ఈశ్వర్ నన్నాహ్వానించేటప్పుడే ఒకమాటన్నాడు. "భాయీ! ఒకటి మాత్రం గుర్తుంచుకో. అక్కడ మాత్రం జమీందార్లను నిందించావంటే వ్యవహారం బెడిసిపోతుంది. మా వాళ్ళకు కష్టం కలుగుతుంది. భగవంతుడు మనుష్యులను తమకు సేవచేయటానికే సృష్టించాడన్న ధీమాతోనే వాళ్ళంతా ప్రజలమీద పెత్తనం చేస్తుంటారు. ప్రజలు కూడా అలాగే అనుకుంటారు. జమీందార్లకూ, ప్రజలకూ చెప్పుకోదగిన భేదమేమీ లేదన్న సంగతి ప్రజల చెవికెక్కిందో యిక జమీందార్లు సోదిలోగూడా ఉండరు"

"ఐతే నేనక్కడికి వచ్చేసరికల్లా తలక్రిందులుగా మారిపోతాననా నీ ఉద్దేశ్యం?" అన్నాను నేను.

"ఔను నేనలాగే అనుకుంటున్నాను"

"అలా అనుకోటం శుద్ధ తప్పు!"

ఈశ్వర్ అందుకేమీ మారు మాట్లాడలేదు. బహుశా అతనా విషయం నా విచక్షణకు వదిలాడనుకుంటాను. చాలా మంచి పనే చేశాడు. అతను గనుక తన మాట పట్టుదలకు పెనగులాడినట్లయితే నేనూ మొండికేసేవాణ్ణే.

## 2

సెకండు క్లాసేమిటి! నే నెప్పుడూ యింటర్ క్లాసులోగూడా ప్రయాణం చేసి ఎరుగను. ఈసారి నాకు సెకండ్‌క్లాసులో ప్రయాణంచేసే అవకాశం లభించింది. బండి రాత్రి తొమ్మిదిగంటలకు వస్తుంది. కాని ప్రయాణపు సంబరంతో మేము సాయంత్రానికే స్టేషనుకు చేరుకున్నాం. కాసేపు అటూ ఇటూ పచారుచేసి రిఫ్రెష్‌మెంటురూముకువెళ్ళి భోజనంచేశాం. నా వేషం, నా ప్రవర్తనా వీటినిబట్టే అనుభవంగల ఆ వంటవాళ్ళు మా యిద్దరిలో యజమానెవరై యుంటారో, సేవకులెవరై యుంటారో యిట్టే పసికట్టారు. కారణమేమిటో తెలియదు. కాని వాళ్ళ తలబిరుసుతనం నాకు చాలా కష్టం కలిగించింది. డబ్బు ఈశ్వర్ చెల్లించాడు. మా నాన్నకు వచ్చే జీతంకంటె మామూళ్ళు వగైరాలద్వారా ఈ వంటవాళ్ళకు

వచ్చే ఆ ఆదాయమే ఎక్కువనుకుంటాను. వెళ్ళిపోయేప్పుడు వాళ్ళకో అర్ధరూపాయి ఈశ్వరే యిచ్చాడు. అయినా ఈశ్వర్‌పట్ల కనబరుస్తున్న భక్తిశ్రద్ధలు నాయందు కూడా కనబరచాలని ఉవ్విళ్ళూరేవారే ఈశ్వర్ ఏదైనా కావాలనటం చాలు- ఏమి పరుగులెత్తేవాళ్ళు జనం. నే నేదైనా తెమ్మంటే అంత శ్రద్ధ కనబరచేవాళ్ళేకాదు. నాకసలు భోజనమే రుచించలేదు. వాళ్ళ పక్షపాత వ్యవహారం నా మనస్సును పూర్తిగా కలచివేసింది.

ఇంతలో రైలువచ్చింది. మేమిద్దరం రైలులో ఎక్కి కూర్చున్నాం. వంటవాళ్ళు ఈశ్వర్‌కు సలాంకొట్టారు. నావంకయినా చూడలేదు.

"వీళ్ళంతా ఎంత మర్యాదగలవాళ్ళు! మా నౌకరు ఒకడున్నాడు. వాడి కసలు పనిచేసే తీరే తెలియదు" అన్నాడు ఈశ్వర్.

"ఇలాగే మీ నౌకర్లకుగూడా రోజూ ఒక్క అర్ధరూపాయి బహూకరిస్తే బహుశా వాళ్ళు యింతకుమించిన మర్యాదస్థులే ఔతారు" కోపంగా అన్నాను నేను.

"అయితే వీళ్ళంతా యింత మర్యాదగా ఉండటానికి కారణంమామూళ్ళు యిస్తారనే ఆశేనన్నా నీ అభిప్రాయం."

"అబ్బెబ్బే! కానేకాదు! మర్యాదా, మట్టూ వీళ్ళ రక్తంలో రంగరించి యున్నాయిలే!"

రైలు కదిలింది. అది మెయిలుబండి. ప్రయాగలో బయలుదేరి ప్రతాపగడేలో ఆగింది. ఎవరో మా క్యారేజి తలుపు తెరిచాడు."ఇది రెండవతరగతిపెట్టె! సెకండ్ క్లాస్! సెకండ్ క్లాస్!" అని కేకవేశారు.

ఆ ప్రయాణీకుడు పెట్టెలోపలికివచ్చి ఒక విచిత్రమైన నిర్లక్ష్యభావంతో నావంక చూచాడు. "చిత్రం! నౌకరుకుకూడా భాలా తెలుసో!"అంటూ మరో సీటులో కూర్చున్నాడు. నేనెంత లజ్జపడ్డానో ఏం చెప్పను!

తెల తెలవారుతుండగా మేము మురాదాబాద్ చేరుకున్నాం. స్టేషన్ వద్ద మమ్మల్ని ఆహ్వానించటానికి చాలామంది వచ్చిఉన్నారు. వారిలో యిద్దరు గుమాస్తాలు. అయిదుగురు వెట్టివాళ్ళు మనుషులు, మా సామానులు తీసుకున్నారు. ఆ గుమాస్తాలిద్దరూ వాళ్ళ ననుసరించారు. ఒకతను మహమ్మదీయుడు. పేరు రియాసత్ అలీ. మరొకతను బ్రాహ్మణుడు, పేరు రామ్‌హరఖ్. వాళ్ళిద్దరూ "కాకి లాంటి నీకు హంసతో పొత్తెక్కడ కుదిరిందా!" అన్నట్లు అపరిచిత నేత్రాలతో నావంక చూచారు.

"ఈ బాబుగారు తమతో చదువుతున్నారా ఏమిటి?" ఈశ్వర్‌ను ప్రశ్నించాడు రియాసత్ అలీ.

"ఔను! నాతోపాటు చదవటమేకాదు, నాతోనే ఉంటున్నారు కూడా. అసలు నేను అలహాబాద్‌లో ఉంటున్నానంటే అందుకు వీరే కారణం. లేకుంటే ఎప్పుడో

వచ్చేసేవాణ్ణి లక్నోకు. వీరినిప్పుడు బలవంతాన లాక్కొచ్చాను. ఇంటివద్దనుండి వీరికెన్నో టెలిగ్రాము లొచ్చినాయి. కాని రానని జవాబు లిప్పించాను. చివరకు వచ్చింది అర్జంటు టెలిగ్రాంకూడా. దానికి ఫీజు మాటకు నాలుగణాలు. అయినా వీరు రాననే జవాబిచ్చారు" అన్నాడు ఈశ్వర్.

వారిద్దరూ నావంక ఆశ్చర్యంగా చూచారు. వారి ముఖకవళికలు చూస్తే చాలా ప్రభావితులైనట్లు తోచింది.

"కాని వీరు చాలా సాదాదుస్తులు ధరిస్తారే?" తీరితీరని సందేహస్వరంతో అన్నాడు రియాసత్ ఆలీ.

"మహాత్మాగాంధీ భక్తులండీ! ఖద్దరు తప్పితే మరోగుడ్డ కట్టనేకట్టరు. పూర్వపు వస్త్రాలన్నీ తగులబెట్టేశాడు. ఇన్ని మాట లెందుకూ? మహారాజు లనండి. సాలీనా రెండున్నర లక్షల ఆదాయంవచ్చే సంస్థానం వీరిది. కాని వీరి వేషంచూస్తే మాత్రం ఇప్పుడే అనాధ శరణాలయం నుండి పట్టుకుని వచ్చినట్లుగా ఉంటారు" సందేహ నివారణ చేశాడు ఈశ్వర్.

"శ్రీమంతుల్లో ఇలాంటి స్వభావం ఉండటం అరుదు. వీరంతటివారని ఎవరూ పసిగట్టలేరు" అన్నాడు రామ్‌హరక్.

"మీరు చాంగలీ మహారాజాను చూశారంటే ముక్కుమీద వేలువేసుకుంటారు. ఒక ముతకచొక్కా ధరించి ఆకుచెప్పులు తొడుక్కుని వీధుల్లో తిరుగుతుండేవాడు. ఒకసారి ఆయనగారు వెట్టిచేయించిన నేరానికి పట్టుబడ్డారట గూడాను. మరి ఆయన గారే పదిలక్షలు ఖర్చుబెట్టి కాలేజీ స్థాపించారట" సమర్థించాడు రియాసత్ ఆలీ.

నేను లోపలే కుమిలిపోతున్నాను. కారణమేమిటో తెలియదుగాని ఆ సమయంలో అంత పచ్చి అసత్యంగూడా నాకేమీ పరిహాస మనిపించలేదు. ఈశ్వర్ అంటున్న ప్రతి వాక్యంతోపాటు నేనా కల్పిత వైభవాన్ని అందుకుంటున్నానా అనిపించింది.

నేను గుర్రపు రౌతునుకాదు. కాని చిన్నతనంలో ఎన్నోసార్లు కంచరగాడిదల మీద ఎక్కటం జరిగింది. ఇక్కడచూస్తే రెండు మంచి జాతిగుర్రాలు మా కోసం తయారుగా ఉన్నాయి. నా ప్రాణాలు ఎగిరిపోయినాయి. ఎక్కటమైతే ఎక్కానుగాని కండరాలన్నీ వణకిపోతున్నాయి. ముఖంలో భయం కనపడనేలేదు. గుర్రాన్ని ఈశ్వర్ గుర్రం వెంబడి నడిపించాను. ఈశ్వర్ మంచిపనే చేశాడు. గుర్రాన్ని పరుగెత్తించలేదు. లేకుంటే కాళ్ళుచేతులు విరగగొట్టించుకు చచ్చేవాణ్ణి. నేనెంత ఊబిలో దిగబడ్డానో ఈశ్వర్ గ్రహించే ఉంటాడు.

# 3

ఈశ్వర్ ఇల్లు....ఇల్లేమిటి!— కోట అనాలి.మహమ్మదీయుల దర్గాగేటు వంటి ద్వారం; ద్వారంవద్ద కాపలావాడు అటూ ఇటూ పహారా ఇస్తుంటాడు. నౌకర్లకు అంతేలేదు. ఒక ఏనుగు కూడా ఉందక్కడ. ఈశ్వర్ తన తండ్రి. బాబాయి, పెత్తండ్రి మొదలైన వాళ్ళందరికీ అదే అతిశయోక్తులతో నన్ను పరిచయం చేశాడు. ఎంతగా నమ్మించాడని చెప్పను! పనిపాటలవాళ్ళే కాదు, ఇంటో వాళ్ళుగూడా నన్ను మర్యాద చేయసాగారు. పల్లెటూరి జమీందారులు; లక్షలకొలదీ ఆదాయం. అయితేనేం? పోలీసు జవానునుకూడా ఆఫీసరనుకుంటారు. చాలామంది పెద్దలు నన్ను 'అయ్యా, హుజూర్' అనటం సాగించారు.

కాస్త ఏకాంతంగా వున్నప్పుడు చూచి ఈశ్వర్‌తో "ఇలా అన్నాను—నీవు కాలాంతకుడివోయ్ మిత్రమా! నన్నెందుకంత బోల్తాకొట్టిస్తున్నావ్?"

"ఈ గాడిదల దగ్గర ఇలాగే ప్రవర్తించాలి. లేకుంటే తిన్నగా మాట్లాడను గూడా మాట్లాడరు." గంభీరమైన చిరునవ్వుతో అన్నాడు ఈశ్వర్.

కొంచెంసేపటికి ఒక మంగలి మాకు కాళ్ళొత్తటానికి వచ్చాడు. "యువ రాజులు స్టేషనునుండి వచ్చారు. అలిసిపోయి ఉంటారు" అన్నాడు మంగలి. "మొదట వారి కాళ్ళొత్తు" అంటూ నావంక సైగచేశాడు ఈశ్వర్.

నేను మంచంమీద పడుకొని ఉన్నాను. ఇతరులు నా కాళ్లొత్తటం అనేది ఇంతవరకూ నా జీవితంలోనే ఎరగనేమో! ఈ పనిని నేను శ్రీమంతుల మిడిసిపాటు తనమనీ, భూస్వాముల తలబిగుసనీ, గొప్పవారి కుండే అహంకారమనీ ఇంకా ఎన్నెన్నో అంటూ ఈశ్వర్‌ను పరిహసించేవాణ్ణి. అలాంటి నేను ఈరోజు వంశ పారంపర్యంగానే ఒక పెద్దభూస్వామి అయినట్లు ప్రవర్తిస్తున్నాను.

ఇంతలో పదిగంటలైంది. పూర్వకాలపు మనుషులు. నూతన నాగరికతా కిరణాలు ఇంకా అక్కడ ప్రసరించలేదు. లోపలినుండి భోజనానికి పిలుపువచ్చింది. మేము స్నానం చెయ్యడానికి వెళ్ళాము. నేనెప్పుడూ నా ధోవతి నేనే యూడించుకునేవాణ్ణి. కానీ ఇక్కడ ఈశ్వర్‌తోపాటే నేనూ నాధోవతి వదిలి ఊరుకున్నాను. నా చేతులతో నా ధోవతి ఉతుక్కోటానికి సిగ్గువేసింది. లోపలికి భోజనానికి వెళ్ళాం. హాసలులో అయితే చెప్పులకాళ్ళతోనే మేజావద్దకెళ్ళి దర్జాగా కూర్చునే వాళ్ళం. ఇక్కడ కాళ్ళు కడుక్కోవడం అవసరమైంది. నీళ్ళుతెచ్చే నౌకరు నీళ్ళతో సిద్ధంగా ఉన్నాడు. ఈశ్వర్ తనకాళ్లు ముందుకు చాచాడు. నౌకరు అతని కాళ్ళు కడిగాడు. నేనుకూడా కాళ్లు ముందుకు చాచాను. నౌకరు నా కాళ్లుకూడా కడిగాడు. నా భావాలన్నీ ఏ గంగలో గలిసాయో తెలియదు మరి!

# 4

అక్కడ పల్లెటూరులో బాగా కుదురుగా చదువుకోవచ్చు ననుకున్నాను. కాని యిక్కడ రోజంతా వినోదాలతో గడిచిపోతోంది. ఒకనాడు నదిలో పడవమీద షికారు. మరోనాడు చేపల వేటకో. పిట్టల వేటకో వెళ్తున్నాం. మరోనాడు వస్తాదుల కుస్తీపందాలు చూడటం. యింకోనాడు చదరంగంలో మునిగితేలటం – ఇలా గడిచి పోతోంది కాలం. ఈశ్వర్ పుష్కలంగా కోడిగ్రుడ్లు తెప్పించేవాడు. గదిలో స్టవ్‌మీద ఆమ్లెట్లు తయారయ్యేవి. నౌకర్ల గుంపొకటి ఎప్పుడూ మమ్మల్ని కనిపెట్టుకునే ఉండేది. మేము కాలు కదపాల్సిన పనేలేదు. పెదవి కదలించటం చాలు. స్నానానికి వెళితే స్నానం చేయించేందుకు నౌకర్లు హాజరు, పడుకుంటే యిద్దరు మనుషులు విసరటానికి తయారు. నేను మహాత్మాగాంధీగారి శిష్యపరమాణువునైన రాజకుమారుడనని ప్రసిద్ధి కెక్కానుగా! ఇంటా బయటా అంతటా మన పేరు మోగిపోతోంది. ఫలహారానికి యేమాత్రం ఆలస్యం కాకూడదు; యువరాజావారికి కోపంవస్తుందేమో! పాన్పు సకాలానికి వెయ్యాలి; యువరాజావారు. నిద్రపోయే వేళయింది. నేను ఈశ్వర్‌కంటె నాజూకు మనిషినై పోయాను. లేదా అలా బలవంతంగా తయారుచేయబడ్డాను. ఈశ్వర్ తన ప్రక్క తానే పరుచుకో వచ్చుగాక; అతిథిగావచ్చిన యువరాజావారు తన చేతులతో తానే ఎలా ప్రక్కవేసు కుంటారు చెప్పండి. ఆయన గొప్పతనాని కది మచ్చకాదూ?

ఒకరోజు నిజంగానే, అలా జరిగింది. ఈశ్వర్ ఇంట్లోఉన్నాడు. బహుశా తన తల్లితో ఏదో మాట్లాడుతుండటంవల్ల ఆలస్యమైంది. అప్పటికి పదిగంటలైంది. నిద్రతో కళ్లు మూతలు పడుతున్నాయి. కాని ప్రక్కెలా వేసుకోనూ? యువరాజావారినై పోతిని! పదకొండున్నరకు కాబోలు నౌకరువచ్చాడు. వట్టి మొద్దుముఖంవాడు. ఇంటిపనుల్లో మునిగిపోయినందువల్ల నాకు ప్రక్క వెయ్యాలనే స్పృహ లేదు. ఇప్పుడు జ్ఞాపకం వచ్చిందికాబోలు పరుగెత్తుకు వచ్చాడు. ఒక్క విదిలింపు విదిలించాను. దాంతో వాడికి తలతిరిగి ఉంటుంది.

ఈశ్వర్ నా విదిలింపువిని బయటికి వచ్చాడు. "మంచి పని చేశావు. ఈ అలగా వెధవలతో యిలాగే ప్రవర్తించాలి" అన్నాడు.

ఇలాగే ఈశ్వర్ ఒకనాడు ఒకచోటికి విందుకి వెళ్ళాడు. సాయంత్రమైంది; కాని లాంతరు వెలిగించలేదు. లాంతరు మేజామీదనే ఉంది. నిప్పుపెట్టె కూడా అక్కడేఉంది. కాని ఈశ్వర్ ఎప్పుడూ స్వయంగా లైటు వెలిగించడు. ఇక యువరాజావారు ఎలా వెలిగిస్తారు? నేను విసుగుకొంటున్నాను. దినపత్రికకూడా వచ్చింది. మనసంతా దానిమీదే ఉంది. కాని దీపంఏదీ? ఇంతలో దైవికంగా గుమాస్తా రియాసత్ ఆలీ వస్తున్నాడు. నేను ఆయనమీద విరుచుకుపడ్డాను. ఎలా

చీవాట్లు పెట్టా ననుకున్నారూ ! పాపం నిలువుగ్రుడ్లు పడ్డాయి— "లాంతరు వెలిగించాలన్న జ్ఞానంకూడా లేదటయ్యా మీకూ? యిలాంటి పనిదొంగల నిక్కడ ఎలా పోషిస్తున్నారో అర్థంకావటంలేదు. మా యింట్లో అయితే ఒక్కగంట గడిచేదా !" రియాసత్ అలీ వణకిపోయే చేతులతో లాంతరు వెలిగించాడు.

అక్కడి కోఠాకూరు వస్తుండేవాడు. కాస్త గుండెగల మనిషి. గాంధీగారికి పరమభక్తుడు. నేనుగూడా మహాత్మాగాంధీ శిష్యుడనని విన్నప్పటినుంచీ నన్ను అమితంగా ఆదరించేవాడు. కాని నన్నేమైనా ప్రశ్నించాలంటే మాత్రం వెనుకాడేవాడు. ఒక రోజు నేను ఒంటరిగా ఉండగాచూచి దగ్గరకువచ్చి చేతులు జోడించి "అయ్యా! మీరు గాంధీగారి శిష్యులుగదండీ! జనం అనుకుంటున్నారు; మనకు స్వరాజ్యమొస్తే జమీందార్లుండరటగా!" అన్నాడు.

"జమీందార్లు ఉండవలసిన అవసరంమాత్రం ఏముందీ! పేదలరక్తంపీల్చటం తప్పితే వీళ్ళు చేస్తున్న ఘనకార్యాలు మాత్రం ఏమున్నాయి?!" గొప్పగా అనేశాను నేను.

"అయితే బాబుగారూ! జమీందార్లందరి భూములూ లాక్కుంటారా?" తిరిగి ప్రశ్నించాడు ఠాకూర్.

"చాలామంది సంతోషంగానే యిచ్చివేస్తారు. యివ్వని వారి భూములు లాక్కొనక తప్పేదేముందీ? మేము మాత్రం సిద్ధంగా కూర్చున్నాం. స్వరాజ్యం వచ్చిన మరుక్షణమే మా యిలాకా మొత్తం రైతులపేర పట్టాలిచ్చేస్తాం" అన్నాను.

నేను కుర్చీమీద కాళ్ళువేలాడవేసి కూర్చున్నాను. మంగలి నా కాళ్ళు పత్తటం ప్రారంభించాడు.

తిరిగి యిలా అన్నాడు "ఇప్పుడు జమీందార్లు చాలా హింసలూ పెడుతున్నారయ్యా! నాకుగూడా తమ యిలాకాలో చారెడు భూమి యిప్పించండి. అక్కడికే వచ్చి తమ సేవచేస్తూ పడిఉంటా."

"ఇప్పుడు నా కధికారం లేదుగదోయ్! కాని అధికారం రాగానే అందరికంటే ముందు నిన్నే పిలిపిస్తాను. నీకు మోటారు డ్రయివింగ్ నేర్పి నా డ్రయివరుగా ఉంచుకుంటాను" అన్నాను.

తరువాత విన్నాను; ఆరోజు ఆ మంగలి మస్తుగా సారాత్రాగి భార్యను బాగా చావబాదాడట. గ్రామపడ్డీ వ్యాపారితో దెబ్బలాటకుగూడా తయారైనాడట!

# 5

సెలవు లీ విధంగా గడిచిపోయినాయి. మేము తిరిగి ప్రయాగకు బయలు దేరాం. గ్రామంలో చాలామంది మమ్మల్ని సాగనంపడానికి వచ్చారు. ఆ ఠాకూరు మాతో పాటు స్టేషను దాకా వచ్చాడు. నేను నా పాత్రను సలక్షణంగా పోషించు కున్నాను. శ్రీమంతులకు దగ్గ వినయం, హుందాతనం-వీటి ప్రభావాన్ని అందరి హృదయాల్లోనూ ప్రసరింపజేశాను. మనసులో మాత్రం ప్రతి నౌకరుకు బహుమతు లివ్వాలని తహతహ పడుతున్నాను. కాని అంతటి శక్తెక్కడిదీ? తిరుగుటిక్కెట్టు ఉండనే ఉంది. బండిలో కూర్చోటమే తరువాయి. కాని రైలుచూస్తే క్రిక్కిరిసి ఉంది. దసరా సెలవులుగడిపి అందరూ తిరిగివచ్చేస్తున్నారు: సెకండ్‌క్లాసులో నువ్వు గింజ మోపటానికైనా ఖాళీలేదు. ఇంటర్‌క్లాసుస్థితి అంతకంటే అధ్వాన్నంగాఉంది. ఇదే చివరిబండి ఏ పరిస్థితుల్లోనూ ఆగటానికి వీల్లేదు. ఎంతో కష్టంమీద మూడవ తరగతి పెట్టెలోచోటుదొరికింది. మా హోదాపెట్టెలో మంచి ప్రభావం కలిగించింది. కాని నాకు మాత్రం అందులో కూర్చోటం చెడ్డ అసహ్యంగాఉంది. వచ్చేటప్పుడు హాయిగా, విశ్రాంతిగా వచ్చాం. వెళ్ళేటప్పుడు యిరుక్కొని యిరుక్కొని వెళు తున్నాం. కాస్త అటూ, యిటూ సర్దుకోటానికి కూడా చోటులేదు.

పెట్టెలో చాలామంది విద్యావంతులు కూడా ఉన్నారు. వాళ్ళంతా తమలో తాము తెల్లదొరతనాన్ని కీర్తిస్తూ మాట్లాడు కుంటున్నారు. " ఇటువంటి న్యాయం ఏ రాజ్యంలోనూ ఎరుగం. చిన్నా పెద్దా అందరూ సమానమే. రాజైనాసరే ఎవరి నైనా అన్యాయం చేస్తే కోర్టు అతన్ని కూడా శిక్షిస్తుంది" అన్నాడొక మహా శయుడు.

"ఏమిటండీ! మీ రసలు చక్రవర్తిమీదనే దావా వెయ్యవచ్చు. కోర్టులో చక్రవర్తిమీదకూడా డిక్రీయిస్తారు." సమర్థించాడు మరో మహాశయుడు.

పెట్టెలోనే ఎవరో ఒకవ్యక్తి వీపుకు గంప ఒకటి కట్టుకుని ఉన్నాడు కలకత్తా వెళ్ళుతున్నాడు. ఎక్కడా గంపపెట్టుకోటానికి చోటు దొరకలేదు. వీపుకే కట్టుకుని ఉన్నాడు. అందువల్ల ఏమీ తోచక మాటిమాటికీవచ్చి వాకిలి దగ్గరనుంచునే వాడు. నేను వాకిలి దగ్గరే కూర్చున్నాను. అతను మాటిమాటికీవచ్చి తన గంప నా ముఖానికివేసి రుద్దుతుండటంవల్ల నాకు మహా చిరాకుగా ఉంది. ఒకవైపు అసలే గాలితక్కువగా ఉంది. ఇక దానికితోడు ఆ గబ్బిలాయి నాముఖం మీదకువచ్చి నుంచుంటే నాకు గొంతు నులిమినట్లుగాఉంది. నేను కొంతసేపు ఓర్పుతో కూర్చు న్నాను. ఒక్కసారి నాకు మండిపోయింది నేనతన్ని పట్టుకుని వెనక్కునెట్టాను. లాగి రెండు చెంపకాయ లిచ్చుకున్నాను.

"కొట్టారెందుకు బాబుగారూ. మేమూ దబ్బేయిచ్చాం." గ్రుడ్లు మిటకరించి అన్నాడతను.

నేను మళ్ళీ లేచి మరో రెండు మూడు లెంపకాయ లిచ్చుకున్నాను.

బండిలో దుమారం లేచింది. నాలుగు వైపులనుంచీ నామీద విరుచుకుపడ సాగారు.

"అంత సుకుమారులైతే ఫస్టుక్లాసులో కూర్చోకపోయారూ!"

"గొప్పవాళ్ళయితే తమ ఇంటికౌతారు. ఆ మాదిరి నన్ను గనుక కొట్టినట్లయితే చూపించేవాణ్ణి తడాఖా."

"పాపం అతనేం చేశాడూ? బండిలో శ్వాసపీల్చుకోటానికి కూడా చోటులేక పోతే కాస్త గాలిపీల్చుకోటానికి కిటికీవద్దకు వెళితే అంతకోపమా! ధనవంతుడవగానే మనిషిలో మానవత్వంగూడా నశించి పోయేట్లుందే!"

"ఇదికూడా మీరు గొప్పలుచెప్పే తెల్లదొరతనమే సుమండీ!"

"నాలుగు ఇంగిలీషు ముక్కలు నేర్చేసరికి కళ్ళునెత్తికొస్తాయి."అన్నాడొక గ్రామీణుడు.

"ఇంత ఘంఠవనుకోలేదోయ్ నిన్నూ!" అన్నాడు ఈశ్వర్.

అప్పటికి నాకైపు కొంచెం కొంచెంగా దిగిపోతున్నట్లు తోచింది.

—o—

# పోటాపోటీ

ఝోఖూ భగత్‌కూ, బేచన్ చౌధరీకీ మూడు తరాలనుండీ శత్రుత్వం. పొలంగట్లదగ్గర కాస్త పేచీ వచ్చింది. దాని విషయంలో వాళ్ళ తాతలు అనేకసార్లు ఘర్షణపడ్డారు. తండ్రులకాలంనుండీ దావాలు ప్రారంభమైనాయి. ఇద్దరూ అనేక సార్లు హైకోర్టువరకూ వెళ్ళారు. కుమారుల హయాంలో తగాదా ఇంకా తీవ్ర మైంది. చివరి కిద్దరూ దివాలా తీసేవరకూ సాగింది. మొదట ఇద్దరూ గ్రామం లోని మొత్తం ఆస్తికి చెరిసగం భాగస్థులు. ఇప్పుడు వారికి ఆ తగాదాలో ఉన్న భూమి మినహాయించితే ఒక్క అంగుళం భూమికూడా లేదు. భూమిపోయింది; ధనం పోయింది; మాన మర్యాదలు పోయినాయి. కాని ఆ తగాదామాత్రం ఎప్పటిలాగానే ఉంది. హైకోర్టులోని హేమాహేమీలైన న్యాయవేత్తలంతా గలిసి ఒక చిన్న సాధా రణమైన తగాదాను పరిష్కరించలేకపోయారు.

ఈ సత్పురుషులిద్దరూ గ్రామాన్ని రెండు శత్రుకూటములుగా విభజించారు. ఒక ముఠా చౌధరీ ఇంటిదగ్గరచేరి సారా త్రాగటం మొదలెడితే, మరోముఠా భగత్ ఇంటివద్దచేరి గంజాయి దమ్ము వేసుకునేవాళ్లు. స్త్రీలు, పిల్లల్లో కూడా రెండు ముఠాలైపోయినాయి. చివరకు ఆ సత్పురుషుల సాంఘిక, మత విశ్వాసాల్లోకూడా అడ్డుగోడలు తయారైనాయి. చౌధరీ కట్టుకున్న గుడ్డలతోనే భోజనం చేసేవాడు. భగత్‌ని వట్టి మోసగాడనేవాడు. భగత్ మడి గట్టుకోకుండా మంచినీళ్ళయినా ముట్టేవాడుకాదు. చౌధరీని వట్టి భ్రష్టుడనేవాడు. భగత్ సనాతన మతస్థుడైతే చౌధరీ ఆర్యసమాజవాదైనాడు. చౌధరీ ఖరీదుచేసే బట్టలషాపువంకగాని, చిల్లరదుకాణం వంకగాని, కూరగాయల కొట్టువైపుగాని కన్నెత్తి చూడటంకూడా మహా పాతక మనుకునేవాడు. భగత్ ఖరీదుచేసే మిఠాయికొట్లో మిఠాయీలుగానీ, ఆయనకు పాలు పోసే గొల్లవాడి పాలుగానీ, నూనెకొట్లో నూనెగానీ చౌధరీగారికి ముట్టరాని వస్తు వులు. చివరకు వాళ్ళ ఆరోగ్య సిద్ధాంతాల్లోగూడా వైరుధ్యమే; భగత్‌జీ ఆయుర్వేద వైద్య సమర్థకుడైతే చౌధరీ యూనానీ వైద్య పద్ధతిని మెచ్చుకునేవాడు. ఇద్దరూ గూడా తమ ప్రాణాలుపోవటానికైనా ఒప్పుకుంటారుగాని తమ సిద్ధాంతాలను మాత్రం వదులుకోరు.

# 2

దేశంలో ప్రారంభమైన రాజకీయాందోళన గాలి ఆ గ్రామానికి కూడా సోకింది. చౌధరీ ఉద్యమాన్ని సమర్థించాడు. భగత్ వ్యతిరేకించాడు. ఒక మహనీయుడువచ్చి గ్రామంలో రైతు సంఘం స్థాపించాడు. చౌధరీ అందులో చేరాడు. భగత్ దూరంగా ఉండిపోయాడు. ప్రజల్లో చైతన్యం హెచ్చింది. స్వరాజ్యాన్ని గురించి చర్చలు తీవ్రంగా జరుగుతున్నాయి. చౌధరీ స్వరాజ్య వాదైనాడు. భగత్ రాజభక్తుడయినాడు. చౌధరీఇల్లు స్వరాజ్యవాదుల వసతి గృహమైతే భగత్ భవనం రాజభక్తిపరాయణుల క్లబ్ అయింది.

చౌధరీ ప్రజల్లో స్వరాజ్యవాద ప్రచారం సాగించాడు — "మిత్రులారా! స్వరాజ్యమంటే మనరాజ్య మన్నమాట. మనదేశంలో మన రాజ్యం ఉంటే మంచిదా? పరాయివాళ్ళ రాజ్యముంటే మంచిదా చెప్పండి."

"మన రాజ్యం ఉంటేనే బాగుంటుంది!" అన్నారు ప్రజలు.

"అయితే మన రాజ్యం ఎలా వస్తుంది? ఆత్మశక్తితో వస్తుంది. పురుష ప్రయత్నంతో వస్తుంది. ఐకమత్యంతో వస్తుంది. ఒకరి నొకరు ద్వేషించటం మానుకుని, మన తగాదాలను మనమే కలిసి పరిష్కరించుకుంటే అప్పుడు వస్తుంది. మన రాజ్యం!" అన్నాడు చౌధరీ.

"మీరు నిత్యం కోర్టుచుట్టూనే తిరుగు తుంటారుగా!" ప్రశ్నించిందొక కంఠం.

"నిజమే! కాని ఈ రోజునుంచీ నేను కోర్టు గడప త్రొక్కితే గోహత్యాపాతకాని కొడిగట్టినట్లే. మీరు మీకష్టార్జితాన్ని మీపెళ్ళాం బిడ్డలకోసంఖర్చు పెట్టుకోండి. ఇంకా అదనంగా మిగిలితే పరోపకారానికి వినియోగించండి. అంతేగాని ప్లీడర్ల జేబులు నింపటం ఎందుకు చెప్పండి. సబ్‌యిన్స్పెక్టర్లకు లంచాలెందు కివ్వాలో ఆలోచించండి. అధికారులచుట్టూ చేతులు నలుపుకుంటూ తిరగటం దేనికి చెప్పండి! పూర్వం మన పిల్లలు మన మత సంబంధమైనవిద్య నేర్చుకునేవాళ్ళు. అందువల్ల వాళ్లు బుద్ధిమంతులుగానూ, పౌరుషవంతులుగానూ ఉండేవాళ్ళు. ఇప్పుడు వీళ్లు విదేశీ పాఠశాలల్లో చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. లంచాలు తింటున్నారు. పైలా పచ్చీసుగా సంచరిస్తున్నారు. మన దేవతలనూ పూర్వులనూ నిందిస్తున్నారు. సిగరెట్లు త్రాగుతున్నారు. క్రాఫులు చేయించుకుంటున్నారు. అధికారులకు కాకాపడుతూ తిరుగుతున్నారు. మనం మన పిల్లలకు మన మత ధర్మాన్ననుసరించి విద్య నేర్పటం మన కర్తవ్యం కాదా?" అన్నాడు చౌధరీ.

"చందా వేసుకుని పాఠశాల ప్రారంభించాలి." అన్నారు ప్రజలు.

"పూర్వం మనం కల్లుత్రాగటం పాపమనుకునే వాళ్ళం. ఇప్పుడు గ్రామ గ్రామానా వీధివీధినా కల్లుదుకాణాలే. మనం కోట్ల రూపాయల మన కష్టార్జితాన్ని ఈ గంజాయికీ, కల్లుకూ కొల్లబెట్టేస్తున్నాం" అన్నారు చౌధరీ.

"కల్లూ గంజాయి త్రాగినవాళ్ళకు జరిమానా వెయ్యాలి" అన్నారు ప్రజలు.

"మన తండ్రులూ, తాతలూ, పెద్దాచిన్నా అందరూ ముతకబట్టకట్టేవాళ్ళు. మన అమ్మమ్మలూ, నాయనమ్మలూ రాటంవడికే వాళ్ళు. డబ్బంతా మన దేశంలోనే ఉండేది. మనచేనేత సోదరులు సుఖంగా కాలంగడిపేవాళ్ళు. ఇప్పుడు మనంవిదేశాల్లో తయారైన సన్నని రంగురంగుల బట్టలంటే పడిచస్తున్నాం. ఈ విధంగా పరాయి దేశస్థులు మన సంపదను కొల్లకొట్టుకు పోతున్నారు. పాపం చేనేతవాళ్ళు బిచ్చగాళ్ళయిపోయారు. మనసోదరుల ముంమున్న విస్తరితీసి పరాయివాళ్ళ కందించటం ధర్మమేనా?" అన్నాడు చౌధరీ.

"ముతకబట్ట ఎక్కడా దొరక్కపోతేనో?" అన్నారు ప్రజలు.

"మీ యిళ్ళల్లో తయారైన ముతకబట్ట కట్టండి. కోర్టులను బహిష్కరించండి. మత్తుపదార్థాలు మానివెయ్యండి. మీపిల్లలకు మన మతకర్మలు నేర్పండి కలిసిమెలిసి ఉండండి. ఇంకేముంది! స్వరాజ్యమంటే యిదే! స్వరాజ్యంకోసం నెత్తురు నదులై పారాలని చెప్పేవాళ్ళు వట్టి వెర్రివాళ్ళు. వాళ్ళ మాటలేవీ లక్ష్య పెట్టబోకండి." అన్నాడు చౌధరీ.

ప్రజలీమాటలు మహాశ్రద్ధగా ఆలకించేవాళ్లు. క్రమ క్రమంగా శ్రోతలసంఖ్య హెచ్చవటం మొదలైంది. చౌధరీ అందరి గౌరవాన్ని చూరగొన్నాడు.

## 3

భగత్ గూడా రాజభక్తిని గురించి ఉపదేశించటం మొదలెట్టాడు—

"సోదరులారా! రాజ్యాన్ని పరిపాలించటం రాజు కర్తవ్యం, ఆయన ఆజ్ఞలను పాటించటం ప్రజల ధర్మం. దీన్నే 'రాజభక్తి' అంటారు. మన మతగ్రంథాల్లో మనకు బోధించేదీ రాజభక్తిని గురించే. రాజంటే ఎవరు? భగవంతుని తరపున ప్రతినిధి. ఆయన ఆజ్ఞలకు విరుద్ధంగా నడుచుకోటం మహాపాతకం. రాజుకు వ్యతిరేకి అయినవాడు నరకానికి పాత్రుడౌతాడు" అన్నాడు భగత్.

"రాజుకూడా తన ధర్మాన్ని పాలించాలిగా!" అన్న దొక గొంతు.

"మనరాజు పేరుకు మాత్రమే రాజు. అసలు రాజులు విదేశషాహుకార్లూ, జమీందార్లేగా!" అన్నది మరో గొంతు.

"షాహుకార్లకు డబ్బు సాంపాదించటం తెలుస్తుందిగాని రాజ్యం చెయ్యటం ఏం చేతౌతుందీ?" అన్నది ఇంకో గొంతు.

"కొందరు మిమ్మల్ని కోర్టులను బహిష్కరించండని ఉపదేశిస్తున్నారు. పేచీలన్నీ పంచాయితీలద్వారా పరిష్కరించుకోండి అంటున్నారు. నీళ్ళకు నీళ్ళూ, పాలకు పాలూ విడదీసి నిక్కచ్చిగా న్యాయం చెప్పగల పెద్దమనుష్యులు ఎక్కడున్నారు. చెప్పండి? యిక్కడంతా మొగమాటపు వ్యవహారం జరుగుతుంది నోరుగల వాడు గెలుస్తాడు. నోరులేనివాణ్ణి అణగద్రొక్కేస్తారు. కోర్టుల్లో అయితే వ్యవహారమంతా చట్టప్రకారం జరుగుతుంది. అక్కడ పెద్దా, చిన్నా అందరూ సమానమే. సింహాలూ, మేకలూ ఒక్కరేవులో నీళ్ళుత్రాగుతా యక్కడ ఇటువంటి కోర్టులను బహిష్కరించటం అంటే మన గొయ్యిమనం తీసుకోవటమే."

"కోర్టులకు వెళ్ళటానికి డబ్బుసంచు లెక్కడ తేగలం?" ప్రశ్నించిందొక గొంతు.

"కోర్టుల్లో న్యాయం పేరుకు మాత్రమే. కూట సాక్ష్యాలూ, జిత్తులమారి వకీళ్ళూ ఎవరివైపున ఉంటే వాళ్ళే జయిస్తారు. లేనిపోని హైరాన పడటం తప్పితే న్యాయాన్యాయ్యాలు విచారించే దెవరక్కడ" అన్నది మరోగొంతు.

"విదేశవస్తువులు వాడవద్దూ అంటారు. ఇందువల్ల పేదవాళ్ళకు ఘోరమైన అన్యాయం జరుగుతుంది. మనకు బజారులో ఏ వస్తువు శ్రేష్ఠమైందీ, చౌకగానూ దొరుకుతుందో అదే కొనుక్కుంటాం. స్వదేశి దైతేనేం? విదేశిదైతేనేం? పనికిమాలిన స్వదేశీవస్తువుల కోసం డబ్బు తగలెయ్యటానికి మనకేమైనా తేరగా వస్తున్నదా డబ్బూ?" అన్నాడు భగత్.

"మన డబ్బు మన దేశంలోనే ఉంటుందిగా. పరాయివాళ్ళ జేబుల్లోకి పోదుగా!" అన్నదొక గొంతు.

"మనయింట్లో మంచిభోజనం దొరకకపోతే మంచి భోజనం దొరుకుతుందని పరాయిజాతివాళ్ళింటికి వెళ్తామా?" ప్రశ్నించింది మరోగొంతు.

"పిల్లలను సర్కారు పాఠశాలల్లో చదివించవద్దంటున్నారు కొందరు. సర్కారు పాఠశాలల్లో చదవకపోతే ఈరోజున మనవాళ్ళకు పెద్ద పెద్ద ఉద్యోగాలెలా వచ్చేవి? పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు ఎలా నడపగలిగేవాళ్ళు? ఈ నూతన విద్య చదవకుండా యిప్పటి ప్రపంచంలో జీవితం సాగించటం సాధ్యంకాదు. పాతకాలపు చదువులవల్ల పంచాంగం చూడటం, పురాణాలు చెప్పటం - యివి దప్పితే యింకేం చేతనౌతుంది? ఈ పుస్తకాలు చదివేవాళ్ళైనా రాచకార్యాలు నిర్వహించేదీ?" అన్నాడు భగత్.

"రాచకార్యాలు మాకే మక్కరలేదు. మాకు మా వ్యవసాయమే చాలు. ఇందువల్ల ఎవరికీ బానిసలుకాముగా?" అన్నదొక గొంతు.

"గర్వపోతులుగా తయారుచేసేవిద్యకంటె మూర్ఖుడుగా ఉండటమే ఉత్తమం. ఈ క్రొత్తచదువులు చదివి సూటూ, బూటూ, బెత్తం, రిస్టువాచీ, హేటూ, కోటూ యివ్వన్నీ తగిలించటం మొదలెట్టారు. తమ జల్సాకోసం దేశంలో డబ్బంతా విదేశస్థులకు కొల్లబెడుతున్నారు' వీళ్ళు దేశద్రోహులు!" అన్నది మరో గొంతు.

"గంజాయీ, సారాలంటే ప్రస్తుతం జనానికి మహా ఏవగింపుగా ఉంది. మత్తుపదార్థాలను సేవించటం దుర్వ్యసనమేనని అందరకూ తెలిసిందే. ప్రభుత్వానికి మత్తుపదార్థాల దుకాణాలవల్ల కోట్లరూపాయల ఆదాయం వస్తోంది. దుకాణాల్లోకి వెళ్ళటం మానివేసి ఈ దుర్వ్యసనం వదిలిపోతే చాలా మంచిదే. కాని అందుకు అలవాటుపడిన వాడివ్యసనం ఎక్కడ ఆగుతుంది? దుకాణానికి వెళ్ళకపోతే ఏదో విధంగా దొంగతనంగానైనా సరే, రెండు మూడు రెట్లు ఎక్కువ ధరయిచ్చుకునైనాసరే, శిక్ష అనుభవించడానికి సిద్ధమైకూడా తనకక్కుర్తి నెరవేర్చుకుతీరతాడు. ఇందువల్ల అటు ప్రభుత్వానికీ నష్టం, యిటు పేదరైతులకూ నష్టం. ఇలా రెండింటలా నష్టంవచ్చేపని ఎందుకు చెయ్యాలి చెప్పండి. అదీగాక ఒక్కొక్కడికి మత్తుపదార్థాలవల్ల ఉపయోగముంటుంది. నామటుకు నాకు ఒక్కరోజు నల్లమందు వేసుకోకపోతే కాళ్ళు పీక్కొని పోతుంటాయి. ఊపిరాడకుండా పోయి జలుబు లంకించుకుంటుంది."

"సారాతాగితే వంట్లో మంచి హుషారుగానే ఉంది" అన్నదొక గొంతు.

"సర్కారు అధర్మపద్ధతుల్లో ధనం సంపాదిస్తోంది. ఇది న్యాయంకాదు. అధర్మపరుల రాజ్యంలో ప్రజలకు మేలు ఎలా జరుగుతుంది?" —— ఒక సందేహం.

"మొదట సారా తాగటం మరిపి పిచ్చివాళ్ళను చేశారు. అలవాటు పడగానే డబ్బుకక్కుర్తిపడటం మొదలు, ఇటు కూటికీ, గుడ్డకూ, అటు బ్రాందీ, సారాలకూ కూడా సరిపోయేటంత కూలెక్కడ దొరుకుతుంది? ఇకపోతే పెళ్ళాం బిడ్డలను పస్తులతో మాడ్చాలి. లేకుంటే దొంగతనం చెయ్యాలి; జూదం ఆడాలి: నమ్మకద్రోహాల కొడిగట్టాలి. అంతేగా!——బాబూ! అది సారా దుకాణంకాదు, మన దారిద్య్రానికి పుట్టిల్లయితే!" అన్నది మరో గొంతు.

## 4

చౌధరీ ఉపదేశాలు వినటానికి జనం విరుచుకుపడేవాళ్ళు. ప్రజలకు నుంచోటానికికూడా స్థలం దొరికేదికాదు. రోజురోజుకూ చౌధరీ ప్రతిష్ఠ వృద్ధవుతోంది.

ఆయన గృహంలో పంచాయితీలూ, దేశౌన్నత్యం వీటినిగురించి చర్చలు జరుగుతుండేవి. ఇందువల్ల ప్రజలకు ఎంతో ఆనందోత్సాహాలు కలిగేవి. వాళ్ళ రాజకీయ చైతన్యం వృద్ధయ్యేది. వాళ్ళ తమ ప్రతిష్ఠనూ, గొప్పతనాన్నీ గుర్తించసాగారు. తమ శక్తిని తాము అర్థం చేసుకోసాగారు. నిరంకుశత్వం, అన్యాయం అంటే మండిపడేవాళ్ళు. వాళ్ళు స్వతంత్రాన్ని రుచిచూశారు. తమ ఇళ్ళల్లోని సత్తి, తమ యిళ్ళల్లో వొడికిన నూలూ, తమ ఇళ్ళల్లో నేసిన బట్ట, తమ స్వంత భోజనం, స్వంత కోర్టు :- ఇంకేం కావాలి? పోలీసుల భయం లేదు. అధికార్ల వద్ద చేతులు నలపవలసిన పనిలేదు. సుఖంగా, శాంతంగా జీవితం గడుపుతున్నారు. మత్తుపదార్థాలను ఎందరో విసర్జించారు. మంచి మంచి భావాలు తరంగాలలాగా వ్యాపిస్తున్నాయి.

కాని భగత్ అంత అదృష్టవంతుడు కాదు. రోజురోజుకూ ప్రజలకు ఆయన ఉపదేశాలంటే ఏవగింపు అధికమైపోతోంది. చివరకది ఎంతవరకు వచ్చిందంటే కరణాలు, వెట్టివాళ్లు, బడిపంతుళ్లు, ఆ ఉద్యోగులతో తిరిగే కొద్దిమంది తప్పితే ఆయన మాటలు వింటానికి మరెవరూ ఉండేవాళ్ళుకాదు. అప్పుడప్పుడు పెద్దపెద్ద ఆఫీసర్లు కూడా వస్తుండేవాళ్ళు. భగత్‌జీని ఎ తో గౌరవించేవాళ్ళు. కాసేపు ఆయన కళ్ళనీళ్ళ తుడిచి వెళ్ళేవాళ్ళు. క్షణకాలపు గౌరవం నిత్యమూ జరిగే అవమానానికేమి సాటి? ఆయన ఎక్కడికి వెళ్ళినా వేలెత్తి వెక్కిరించే వాళ్ళే. ఒకడు ముఖస్తుతిరాయుడనేవాడు. మరొకడు సి.ఐ.డి పోలీసు అనే వాడు. భగత్ తన పోటీదారు ప్రతిష్టకూ, తనను గురించి జరిగే లోకదూషణకూ లోలోపలే కుమిలిపోయేవాడు. తన శత్రువు ఎదుట హీనంగా తల ఒగ్గవలసిన పరిస్థితి ఏర్పడటం ఆయన జీవితంలో యిదే మొదటిసారి. తన సర్వస్వాన్నీ బలిపెట్టి ఎంతో కాలంనుండీ కంటికి రెప్పగా కాపాడుకుంటూ వచ్చిన వంశ ప్రతిష్టంతా ఈ రోజు గంగలో కలిసిపోయింది. ఈ తీరని దిగులు ఆయన్ను ఒక క్షణం గూడా విశ్రాంతిగా ఉండనిచ్చేదికాదు, తన పోయిన ప్రతిష్ఠను తిరిగి రాబట్టుకోవటమెలా? తన పోటీదారును అణగద్రొక్కటానికి ఏది ఉపాయం? ఆయన గర్వభంగం చేసే మార్గమేది?—నిత్యం ఈ సమస్యే ఆయనను వేధిస్తుండేది.

చివరకు ఆయన సింహాన్ని దాని గుహలోనే పడగొడదామని నిశ్చయించుకున్నాడు.

అది సాయం సమయం, చౌధరీ వాకిటముందు ఒక పెద్దసభ జరుగుతోంది. చుట్టుప్రక్కల గ్రామాల రైతులుగూడా వచ్చారు. వేలకొలదీ ప్రజలు హాజరైనారు. చౌధరీ వాళ్ళకు స్వరాజ్య సంబంధమైన బోధలు చేస్తున్నాడు. మాటిమాటికీ "భారత్‌మాతాకీ జై!" అనే నినాదాలు వినబడుతున్నాయి. ఒకవైపు స్త్రీలు గుమిగూడారు. చౌధరీ తన ఉపదేశం ముగించి తన కుర్చీలో కూర్చున్నాడు.

వలంటీర్లు స్వరాజ్యనిధికి చందాలు వసూలు చేయటం ప్రారంభించారు. ఇంతలో ఎక్కడనుండి వచ్చాడో తెలియదు; భగత్‌జీ శ్రోతలముందు నిలబడి పెద్దగా యిలా ఉపన్యసించాడు—

"సోదరులారా! నన్నిక్కడ చూచి ఆశ్చర్య పడకండి. నేను స్వరాజ్యాని శత్రువునుకాను. స్వరాజ్యాన్ని నిందించే పతితుడూ, పాపాత్ముడూ ఎవడుంటాడు చెప్పండి. కాని దాన్ని సాధించటానికి మార్గం మీరు అమితంగా వ్యామోహపడు తున్న చౌధరీ విధానంకాదు. పరస్పర కలహం, నీచప్రవృత్తి కళ్ళకు కట్టినట్లు కన పడుతుంటే పంచాయితీలవల్ల ప్రయోజనమేముంది? భోగవిలాసాల భూతం శిరస్సు మీద నాట్యం తొక్కుతుంటే అది మనల్నెలా వదిలిపెడుతుంది చెప్పండి. కల్లు దుకాణాలను బహిష్కరించడం సాధ్యమయ్యే విషయమేనా? సిగరెట్లు, సబ్బులూ, మేజోళ్ళు, బనియనులు, ఆర్టుసిల్కులు వీటిమీద వదలమంటే ఎట్లా వదులుతుంది. దర్పం, అధికారవ్యామోహం తాండవమాడుతుంటే సర్కారు పాఠశాలలు ఎలా బహిష్కరిస్తారు? పరాయి మతస్తుల విద్యాశృంఖలాలనుండి విముక్తి కాగలిగే దెలా? స్వరాజ్యసాధనకు ఒక్కటే ఉపాయముంది. అదే ఆత్మనిగ్రహం. ఈ మహౌషధం మీ సమస్తవ్యాధులను సమూలంగా హతమారుస్తుంది. ఆత్మదౌర్బ ల్యమే పరాధీనతకు మూలకారణం. ఆత్మశక్తిని పెంపొందించండి. ఇంద్రియాలను స్వాధీనం చేసుకోండి. మనస్సును అదుపులో ఉంచుకోండి. అప్పుడే మీలో సోదర భావం పెల్లుబుకుతుంది. అప్పుడే మనస్పర్ధలు అంతరిస్తాయి. అప్పుడే ఈర్ష్యా ద్వేషాలు నశిస్తాయి. ఆనాడే భోగవిలాసాలంటే ఏవగింపు ఏర్పడుతుంది. ఆనాడే మత్తుపదార్థాల వ్యసనం నశిస్తుంది. ఆత్మశక్తిలేకుండా స్వరాజ్యం ఎన్నటికీ ప్రాప్తించదు. అన్ని పాపాలకూ మూలం స్వార్థమే. అదే మిమ్మల్ని కోర్టుల కెక్కిస్తోంది. అదే మిమ్మల్ని పరాయిమతస్తుల విద్యకు దాసులను చేస్తున్నది. ఈ స్వార్థపిశాచాన్ని ఆత్మశక్తితో హతమార్చండి; మీ కోరికలు ఫలిస్తాయి. నేను యాభై సంవత్సరాలబట్టీ నల్లమందు సేవిస్తున్నానన్న విషయం అందరకూ తెలిసిందే.

"ఈ రోజునుండీ నల్లమందంటే గోరక్తంగా భావిస్తాను. చౌధరీతో మాకు మూడు తరాలబట్టీ విరోధముంది. కాని యీ రోజునుండీ చౌధరి నా సోదరుడు. ఈ రోజునుండీ మా ఇంట్లో ఏ ఒక్కరైనాసరే యింట్లో వడికిన నూలుతో తయా రైన గుడ్డ కాకుండా మరోగుడ్డ కట్టుకుంటే మీ యిష్టమొచ్చిన శిక్ష వెయ్యండి. నేను చెప్పదలచిం దింతే. భగవంతుడు మనందరి వాంఛలు నెరవేర్చుగాక!"

ఈ మాటలను భగత్‌జీ యింటికి బయలుదేరాడు. ఇంతలో చౌధరీ పరుగెత్తుకు వచ్చి ఆయన్ను కౌగలించుకున్నాడు. మూడు తరాల శత్రుత్వం ఒక్క గడియలో అంతరించింది.

ఆ రోజునుండీ చౌధరీ, భగత్‌జీ యిద్దరూ కలిసి స్వరాజ్య ప్రబోధం చేయ సాగారు. వా రిద్దరూ గాఢమిత్రులైనారు. ఇప్పుడు ప్రజలు వా రిద్దరిలో ఎవరిని ఎక్కువగా గౌరవిస్తారో తేల్చి చెప్పటం కష్టమే.

పోటీ రూపంలో ఉన్న అగ్నికణం వారి హృదయ జ్యోతులను ప్రకాశ వంతం చేసింది.

—0—

# ఆత్మారామ్

బేందో గ్రామంలో మహాదేవ్ అనే పేరు ప్రఖ్యాతులుగల కంసాలి ఒకడుండేవాడు. అతను ఉదయంమొదలు సాయంత్రం వరకూ తన వసారాలో కుంపటి ముందు కూర్చుని సుత్తితో ఖట్ ఖట్‌మని కొడుతూ పని చేస్తూండేవాడు. అదే పనిగా వినపడే ఈ ధ్వనికి ప్రజలు ఎంతగా అలవాటుపడ్డారంటే ఏ కారణంవల్లనైనా ఆ ధ్వని ఆగిపోవటం జరిగితే ఏదో వస్తువు మాయమైపోయినట్లనిపించేది. అతను ప్రతి నిత్యం ఒక్కసారి ఉదయం తెల్లవారకముందేలేచి తన చిలక పంజరం చేత బట్టుకుని ఏవో కీర్తనలు పాడుకుంటూ చెరువుపైపుకు వెళ్ళేవాడు. ఆ మసక వెలుతురులో అతని ముసలి శరీరం, బోసినోరూ, వంగిన నడుమూ చూస్తే అపరిచితు డెవరికైనా అతను పిశాచేమో ననే భ్రమ కలిగితీరుతుంది. 'కల్లెంతో, నిజమెంతో గురుడు హరు డెరుగురా' అనే పాట జనం చెవిన బడగానే తెల్లవారిందను కునేవాళ్లు.

మహాదేవ్ కుటుంబ జీవితం సుఖవంతమైందికాదు. అతనికి ముగ్గురు కొడుకులూ, ముగ్గురు కోడళ్ళూ, డజనులకొలది మనుమలూ, మనుమరాళ్ళూ ఉన్నారు. కాని అతని బరువు తగ్గించేవాళ్లు ఒక్కరూలేరు. "నాన్న ఉన్నంతవరకూ హాయిగా ఆనందంగా ఉందాం. తరువాత ఎటూ యీడోలు మెడకు తగులుకోక తప్పదుగా" అనేవాళ్లు. పాపం అప్పుడప్పుడు మహాదేవ్ పస్తుపడుకోవలసివచ్చేది. భోజనసమయంలో ఆయనింట్లో సామ్యవాదం ప్రళయాంతకంగా గర్జించేది. అతను ఆకలి తీరకుండానే లేచిపోయి నారికేళహుక్కా త్రాగుతూ నిద్రపోయేవాడు. అతని వృత్తిగూడా మరింత అశాంతి కరంగానే ఉండేది. అతను తన పనిలో చాలా నిపుణుడు. అతని పనితనం యితరులకంటే చాలా శుద్ధంగా వుంటుంది. అతను బంగారం కరిగే విధానంగూడా విలక్షణంగా ఉండేది. అయినా ఆయన్ను నిత్యం అనుమానస్తులూ, పిరికివాళ్లూ శాపనార్థాలు పెడుతూనే ఉండేవాళ్ళు. కాని మహాదేవ్ అచంచల గాంభీర్యంతో తలవంచుకుని అన్నీ వింటూ ఉండేవాడు. తగాదా కాస్త చల్లబడగానే అతను తన చిలకవైపు చూచి 'కల్లెంతో నిజమెంతో గురుడు హరు డెరుగురా' అనేవాడు. ఈ మంత్రాన్ని జపించగానే అతని మనస్సుకు సంపూర్ణశాంతి లభించేది.

# 2

ఒకనాడు దైవికంగా కుర్రాడెవరో పంజరపుద్వారం తెరిచాడు. చిలక ఎగిరిపోయింది. మహాదేవ్ తలయెత్తి చూచేసరికి అతనికి గుండె ఆగిపోయినంతపనైంది. ఏదీ చిలక! అతను మళ్ళి చూచాడు పంజరంవైపు. చిలక మాయమైపోయింది. మహాదేవ్ గాబరాపడుతూ లేచాడు. అటూ యిటూ యింటి కప్పులవైపు దృష్టి సారించసాగాడు. ప్రపంచంలో అతనికి ప్రియమైన దేమైనా ఉంటే అది ఆ చిలక ఒక్కటే. పిల్లా, జెల్లా, మనుమలూ, మనుమరాండ్రంటే అతనికి విసుగెత్తిపోయింది. పిల్లల అల్లరివల్ల అతని పనికి ఆటంకం కలుగుతుండేది. కొడుకులంటే అతనికి చాలా అయిష్టంగా ఉండేది. అందుకు కారణం వాళ్లు పనికిమాలినవాళ్ళని గాదు. వాళ్ళమూలంగా తన కోర్కెల నెన్నింటినో చంపుకోవలసి వచ్చింది. ఇరుగుపొరుగువాళ్ళంటే ఆయనకు మహాచిరాకుగా ఉండేది. ఎందువల్లనంటే వాళ్లు తన కుంపటిలోనుండి నిప్పులు తీసుకెళుతుండేవాళ్లు. ఈ సమస్త బాధలనుండీ అతనికి శరణు లభించే దిక్కెక్కడైనా ఉంటే అది ఆ చిలకే. అతనికి ఏ విధంగానూ బాధ కలిగించని దదొక్కటే. ప్రశాంతంగా కాలం గడుపుదామనే తప్ప, మరోకోరికే ఉండటానికి అవకాశంలేని వయసులో ఉన్నాడాయన.

చిలక ఒక పెంకుటింటి కప్పుమీద కూర్చుని వుంది. మహాదేవ్ పంజరం దించి చిలకకు చూపిస్తూ "రా! రా! కల్లెంతో నిజమెంతో గురుడు హరు దెరుగులే" అనటం ప్రారంభించాడు. కాని యింట్లో పిల్లలూ, ఊళ్ళో పిల్లలూ అంతా పోగై కేకలు పెట్టటం, చప్పట్లు కొట్టటం సాగించారు. పైనుండి 'కావ్, కావ్' మంటూ కాకులు గోలపెడుతున్నాయి. చిలక ఎగిరిపోయి ఊరి బయటవున్న ఒక చెట్టుమీద వాలింది. ఖాళీ పంజరం చేతబట్టుకుని మహాదేవ్ దానివెంట అదేపనిగా పరుగెత్తాడు. అతని పరుగు వేగాన్ని చూచి జనానికి అంతులేని ఆశ్చర్యంగావుంది. మోహాన్ని గురించి యింతకంటే సుందరమూ, సజీవమూ, భావగర్భితమూ అయిన కల్పన చేయగల్గటం అసంభవం.

రెండు ఝాములైంది. రైతులు పొలాలనుండి తిరిగి వస్తున్నారు. వాళ్ళకు వినోదానికి మంచి అవకాశం లభించింది. మహాదేవ్‌ను ఏడిపించటం అంటే అందరికీ మజాగానే ఉండేది. ఒకడు చిలకమీదికి రాళ్ళు విసిరాడు. మరొకడు చప్పట్లు కొట్టాడు. చిలక మళ్ళి అక్కడినుండి ఎగిరిపోయి, అక్కడికి చాలా దూరంగా ఉన్న మామిడితోటలో ఒక చెట్టు చిటారు కొమ్మమీద వాలింది. మహాదేవ్ మళ్లీ ఆ పంజరం చేతబట్టుకుని కప్పమాదిరి ఎగురుకుంటూ వెళ్ళాడు. తోటలోకి వెళ్ళేసరికి కాళ్ళు మండిపోతున్నాయి. తలతిరిగిపోతోంది. కాస్త అలుపు తీర్చుకున్న తరువాత మళ్ళి పంజరం పైకెత్తి "కల్లెంతో నిజమెంతో గురుడు హరు దెరుగులే" అని

పాడుతున్నాడు. చిలక చివారు కొమ్మమీదనుండి క్రింది కొమ్మమీదకు వచ్చి కూర్చుంది. కాని మహాదేవ్‌వైపు సందేహ దృక్కులతో పొంచి చూస్తున్నది. భయ పడుతోంది కాబోలనుకున్నాడు మహాదేవ్. పంజరాన్ని అక్కడ వదలి తాను మరో చెట్టుచాటుకుపోయి దాక్కున్నాడు. చిలక నాలుగువైపులా పరీక్షగా చూచింది. ఇక భయం లేదులే అనుకుంది. ఎగిరి వచ్చి పంజరంమీద కూర్చుంది. మహాదేవ్ హృదయం పొంగిపోయింది. 'కల్లంతా నిజమెంతా గురుడు హరు దెరుగులే" అనే మంత్రం జపిస్తూ మెల్లగా, నిదానంగా చిలక దగ్గరకు చేరుకున్నాడు. చిలకను పట్టు కుందామని ఒక్క గంతు వేశాడు. కాని చిలక చేతికి చిక్కలేదు. మళ్ళీ చెట్టు మీదికిపోయి కూర్చుంది.

సాయంత్ర మయ్యేదాకా యిలాగే జరిగింది. చిలక ఒకసారి ఈ కొమ్మమీద ఒకసారి ఆ కొమ్మమీద వాలేది. ఒక్కొకసారి పంజరం వాకిలివద్ద వాలి తనకు నీళ్లు, మేతా పెట్టే పాత్రలను చూచి మళ్ళీ ఎగిరిపోయేది. ఆ వృద్ధుడు మూర్తీభ వించిన మోహమైతే, ఆ చిలక మూర్తీభవించిన మాయ, ఇంతలో ప్రొద్దు గూకి పోయింది. మాయా మోహాల ఈ సంగ్రామం అంధకారంలో విలీనమై పోయింది.

# 3

రాత్రయింది. నలువైపులా దట్టంగా అంధకారం వ్యాపించింది. చిలక ఆకుల మధ్య ఎక్కడదాక్కున్నదో తెలియలేదు. రాత్రిపూట అది ఎక్కడికీ ఎగిరిపోలేదనీ, పంజరంలోకికూడా రాలేదని మహాదేవ్‌కుతెలుసు. అయినాఅతని కా చోటునుంచి కదలా లన్నతలంపేలేదు.ఆరోజుప్రొద్దున్నుంచీ ఏమీతినలేదు. రాత్రిభోజనంచేసేవేళకూడా దాటిపోయింది. గొంతులో గుక్కెడు నీళ్ళుగూడా పోసుకోలేదు. అయినా అతనికి ఆకలీలేదు,దాహమూలేదు.చిలకదగ్గరలేని జీవితం అతనికి నిస్సారంనీరసం, శూన్యం అనిపిస్తోంది. అతను రాత్రింబవళ్ళు పనిచేసేవాడు. ఎందుకు చేస్తున్నాడంటే అందు కతని అంతఃప్రేరణే కారణం. జీవితంలో తదితర పనులన్నీ అలవాటుగనుక చేసే వాడు. ఆ పనులు చేసేకాలంలో తాను జీవించే ఉన్నానన్న చైతన్యం లేశమాత్రం కూడా ఉండేదేకాదు. ఆ చైతన్యాన్ని గుర్తుచేసే వస్తువు ఆ చిలకే. అది అతని చెయ్యి జారిపోవటమంటే జీవుడు దేహాన్ని త్యజించినంతపనే:

రోజంతా ఆకలి దప్పులకు లోనై అలసి సొలసి వున్న మహాదేవ్ ఉండి, ఉండీ కునికిపాట్లు పడుతున్నాడు. కాని మరుక్షణంలోనే ఉలిక్కిపడి కళ్ళు తెరిచే వాడు. ఆ పరుచుకున్న అంధకారంలో "కల్లంతా నిజమెంతా గురుడు హరు దెరు గులే" అని తత్వగానం చేస్తున్న అతని కంఠస్వరం వినిపించేది.

అర్ధరాత్రి దాటిపోయింది. అకస్మాత్తుగా అతనేదో అలికిడివిని త్రుళ్ళిపడ్డాడు. చూచాడు; తోటలోనే మరో చెట్టుక్రింద ఒకదీపం మసకగా వెలుగుతోంది. చాలామంది కూర్చుని వాళ్ళలో వాళ్లు మాట్లాడుకుంటున్నారు. వాళ్ళంతా భంగు త్రాగుతున్నారు. పొగాకువాసన గాలి సోకగానే అతను యిక ఆగలేకపోయినాడు. "కల్లెంతో నిజమెంతో సురుడుహరుడెరుగులే" అని పెద్దగా భంగు త్రాగటంకోసం తనుగూడా వాళ్లున్నవైపు బయలుదేరాడు. కాని తుపాకిమ్రోత వినగానే లేళ్లు ఏ విధంగా పారిపోతాయో, అలాగే అతను రావటం చూచి అందరూ లేచి ఎక్కడివాళ్ళక్కడ పారిపోయారు. తలా ఒకప్రక్కకూ చెల్లాచెదురైపోయారు. 'ఆగండి, ఆగండి!' అని కేకలు వేయ సాగాడు మహాదేవ్. తటాలున వాళ్ళంతా దొంగలని గ్రహించాడు. "దొంగలు! దొంగలు! పట్టుకోండి! పట్టుకోండి!" అని పెద్దగా కేకలువేశాడు. దొంగలు తిరిగి చూడకుండా పరుగెత్తిపోయారు.

మహాదేవ్ దీపం వద్దకు వెళ్ళాడు. అక్కడ కలశమొకటుంది. చిలుంపట్టి నల్లగా వుందది. మహాదేవ్ హృదయం పొంగులు వారుతోంది. కలశంలో చెయ్యి పెట్టి చూచాడతను. అందులో నవర్నులున్నాయి. ఒక నవర్ను బయటకుతీసి దీపపు వెలుతురులో చూచాడు. ఔను! నవర్నే అది. అతను వెంటనే కలశం తీసుకుని దీపం చల్లార్చి చెట్టు క్రిందికిపోయి దాక్కొని కూర్చున్నాడు. పనివాడల్లా దొంగగా మారాడు.

మళ్ళీ అతనికొక సందేహం కలిగింది. దొంగలు మళ్ళీ తిరిగివచ్చి తనను ఒంటరిగా చూచి నవర్నులు లాక్కుపోతారేమో! అతను కొన్ని నవర్నులు నడుముకు గట్టుకున్నాడు. తరువాత ఎండుపుల్ల ఒకటి సంపాదించి భూమిలో చాలా గోతులు తీశాడు. వాటినిండా నవర్నులుపోసి మట్టి కప్పేశాడు.

# 4

మహాదేవ్ మానసిక నేత్రా లిప్పుడు మరో నూతనజగత్తును వీక్షించు తున్నాయి. ఆలోచనలతోనూ, కల్పనలతోనూ నిండిన జగత్తది. ఆ ధనం చెయ్యి జారిపోతుందేమోననే భయం ఇంకా పీడిస్తున్నా, కోరికలు తమ పని అప్పుడే ప్రారంభించాయి. ఒక చక్కని భవనం తయారైపోయింది. షరాబు బజారులో మంచి దుకాణం ఒకటి ప్రారంభమైంది. తన బంధువు లందరితో మంచి సంబంధాలు ఏర్పడినాయి. విలాస వస్తువులన్నీ సమకూరినాయి. ఆ తరువాత తీర్థయాత్రకు బయలుదేరాడు. అక్కడినుండి వచ్చి మహావైభవంగా యజ్ఞం, బ్రహ్మాండమైన సమారాధాన జరిపించేశాడు. ఆ తరువాత ఒక శివాలయమూ,

కోనేరూ తయారై పోయినాయి. అక్కడ తాను ప్రతినిత్యం పురాణ కాలక్షేపం చేస్తున్నాడు. సాధువులకూ, యోగులకూ ఆదరసత్కారాలు అమోఘంగా జరిగి పోతున్నాయి.

తలాలున దొంగలుగనుక తిరిగివస్తే తా నెలా పారిపోతానా అనే ఆలోచన కలిగిం దతనికి. అతను పరీక్షగా చూసుకోటం కోసం కలశం పైకెత్తుకుని రెండు వందల గజాలవరకూ అతి వేగంగా పరుగెత్తి వెళ్ళాడు. అతనికి తన కాళ్ళకు రెక్కలు వచ్చాయేమో ననిపించింది. దిగులు తీరిపోయింది. ఇలాంటి ఊహలతోనే రాత్రంతా గడిచిపోయింది. ఉషఃకాంతులు వ్యాపిస్తున్నాయి. మలయమారుతం వీస్తు న్నది పక్షులు గానం చేస్తున్నాయి. అకస్మాత్తుగా మహాదేవ్‌కు ఈ పాట విన బడింది.

"కల్లెంతొ నిజమెంతొ గురుడు హరు దెరుగురా!

ఉల్లంబు కోదండపాణిపై నిలుపరా!"

ఈ తత్వం ఎల్లప్పుడూ అతని నాలుక కొసనే ఉండేది. ఆ పాట రోజూ వేలసార్లు వల్లిస్తుండేవాడు. కాని ఆ పాటలో ఉన్న ధర్మతత్వం అతని అంతరాత్మ నెప్పుడూ స్పృశించలేదు. సన్నాయిలో నుండి వచ్చే రాగంలాగా అతని నోటినుండి ఈ నిరర్థకమైన, ప్రభావ శూన్యమైన ఈ తత్వం వినబడుతుండేది. అప్పు డతని హృదయ రూపంలో ఉన్న వృక్షం పల్లవ విహీనంగా ఉండేది. ఆ తత్వంలో ఉన్న నిర్మల మారుతం ఆ వృక్షాన్ని ఊగించలేకపోయేది. కాని ఇప్పు డా వృక్షానికి కొమ్మలూ, రెమ్మలూ ఉద్భవించాయి. ఈ వాయు ప్రవాహానికి వృక్షం ఉయ్యాల లూగిపోయింది. ప్రతిధ్వనించింది.

అరుణోదయ సమయమైంది. ప్రకృతి ఒక విధమైన అనురాగ భరితమైన ప్రకాశంలో మునకలు వేస్తోంది అదే సమయంలో చిలక రెక్కలు విప్పుకుని పైకొమ్మనుండి క్రిందికి వచ్చి వాలింది. ఆకాశంనుండి ఏదో నక్షత్రం రాలిందా అన్నట్లు చిలక వచ్చి పంజరంలో కూర్చుంది. మహదేవ్ మహాదానందంతో పరు గెత్తుకు వెళ్ళి పంజరం చేతికి తీసుకుని "రా! ఆత్మారామ్! నన్ను కష్టమైతే చాలా పెట్టావుగాని, నా జీవితాన్నిగూడా తరింపజేశావు. ఇక నిన్ను వెండిపంజరంలో ఉంచుతాను. నీకు బంగారు తొడువు వేస్తాను" అన్నాడు. అతని రోమరోమంనుండీ భగవంతుని గుణసంకీర్తనం వినిపిస్తోంది—"ప్రభూ! నీ వెంత దయామూర్తివయ్యా! ఇది నీ అనంత వాత్సల్యం. లేకుంటే నావంటి పాపాత్ముడూ, పతితుడూ నీ దయకు పాత్రుడయ్యేవాడేనా!" ఈ పవిత్ర భావాలతో అతని ఆత్మ వ్యాకుల పడిపోయింది. అతను ప్రేమానురక్తుడై గానం చేయసాగాడు——

"కల్లంతో నిజమెంతో గురుడు హరు దెరుగురా
ఉల్లంబు కోదండపాణిపై నిలుపరా!"

అతను ఒక చేతితో పంజరం పట్టుకుని కలశం డొక్కకు ఆనించుకుని ఇంటికి చేరుకున్నాడు.

# 5

మహాదేవ్ ఇంటికి చేరుకునేసరికి ఇంకా కాస్త చీకటిగానే ఉంది. దారిలో ఒక కుక్క మినహా ఇంకెవరూ తటస్థపడలేదు. నవర్సులంటే కుక్కేమీ మక్కువ పడదుగా! అతను కలశాన్ని ఒక తొట్లో దాచిపెట్టి దాన్ని బొగ్గులతో బాగాకప్పి తన గదిలో పెట్టేశాడు. తెల్లవారగానే తిన్నగా అతను పురోహితుని ఇంటికి వెళ్ళాడు. పురోహితుడు సంధ్యానుష్ఠాలు పూర్తి చేసుకుని కూర్చున్నాడు– "కేసు రేపే విచారణకు వస్తుంది. కాని ఇంతవరకూ చేతిలో ఒక చిల్లి గవ్వయినా లేదే! దాతల పరిస్థితులుగూడా ఏమీ బాగుండ లేదు. రేపు మరి ఎలాగో ఏమో!'' అని ఆలోచిస్తున్నాడతను. ఇంతలో మహాదేవ్ వచ్చి నమస్కరించాడు. పురోహితుడు ముఖం ప్రక్కకు త్రిప్పుకున్నాడు. ఈ దరిద్రపుపీనుగ ఎక్కడనుంచి వచ్చిందీ! ఇవ్వాళ తిండి ప్రాప్తమైనా ఉందో లేదో అనుకున్నాడు. "ఏమయ్యా! ఏమిటి సంగతి! ఈ సమయంలో పూజలో ఉంటానని తెలియదటయ్యా?'' కోపంగా అన్నాడు పురోహితుడు. ''ఇవ్వాళ మా యింట్లో సత్యనారాయణ వ్రతమండీ'' అన్నాడు మహాదేవ్.

పురోహితుడికి ఆశ్చర్యంవేసింది. తన చెవులను తానే నమ్మలేకపోయినాడు. తన ఇంట్లో బిచ్చగాడికి ముష్టి రాబట్టటం ఎంత అసాధారణ ఘటనో, మహాదేవ్ యింట్లో సత్యనారాయణవ్రతం జరగటంకూడా అలాంటిదే. "ఇవ్వాళ ఏమిటి విశేషం?'' ప్రశ్నించాడతను.

''ఏమీ లేదు. ఏదో ఇవ్వాళ పరమాత్మని గాథలు విందామని బుద్ధిపుట్టింది, అంతే'' అన్నాడు మహాదేవ్.

ఉదయంనుండే ఏర్పాట్లు జరుగుతున్నాయి. చేందో గ్రామంలోనూ, సమీప గ్రామాల్లోనూ అందరికీ తాంబూలాలిచ్చి వచ్చారు. కథాశ్రవణానంతరం విందుకు కూడా ఆహ్వానించారు. అరె! ఈ పత్రలో గరి కెలా మొలిచిందో! విన్న ప్రతి వాడూ విస్తుపోయేవాడే!

సాయంత్రం అందరూ చేరిన తరువాత పురోహితుడు తన పీఠంపైన ఆశీనుడై నాడు. అప్పుడు, మహాదేవ్ నిలబడి పెద్దగా ఇలా అన్నాడు: ''సోదరులారా! నా

బ్రతుకంతా మోసంతోనూ, కపటంతోనూ గడిచిపోయింది. నేను ఎంతమందిని దగా చేశానో లెక్కలేదు. కల్తీయేలేని వస్తువులను ఎంతగా ఖరాబు చేశానో చెప్పలేను. కాని నన్ను భగవంతుడు కరుణించాడు. ఆయన నా కళంకాన్ని కడిగివెయ్యాలని సంకల్పించాడు. సోదరులందరికీ నేను నిష్కర్షగా చెబుతున్నాను. నానుంచి మీ కెంత రావాలో ఎవరెవరి సొమ్ము నేనెంత కాజేశానో, ఎవరెవరి మంచి బంగారంలో ఎంతెంత కల్తీ కలిపానో లెక్కచూచుకుని వాళ్ళంతా వచ్చి తమకు రావలసింది చిల్లిగవ్వతో సహా తీసుకు వెళ్ళండి. ఇక్కడికి రాలేనివా రెవరైనా ఉంటే రేపటి నుండీ నెలరోజులలోపల ఎప్పుడైనాసరే తమ ఇష్టంవచ్చినప్పుడు వచ్చి లెక్క చూచుకొని తీసుకు వెళ్ళవచ్చని అందరికీ తెలియజెయ్యండి."

అందరూ స్తంభించిపోయారు. ఎవరో ఒక వ్యక్తి ఏదో అంతరార్థంతో 'నేను చెప్పటంలేదుటయ్యా!' అన్నాడు. ఇంకొక వ్యక్తి సందేహంగా "వేలకొలదీ ఇవ్వవలసి వస్తాడు. ఏమి తిని తీరుస్తాడు!' అన్నాడు.

"మరి స్వర్గంలో ఉన్నవాళ్ళ సంగతేలా?" పరిహాసంగా అన్నాడొక క్షత్రియుడు.

"వారి వారసులుంటారు," అన్నాడు మహాదేవ్.

కాని ఆ సమయంలో జనానికి 'ఇతనికి ఇంత ధనం ఎక్కడినుంచి వచ్చిందా? అని తెలుసుకుందామని ఉన్నంతగా, తమకు రావలసింది వసూలు చేసుకుందామన్న యావే కనపడలేదు. మహాదేవ్ వద్దకు వచ్చి అడగటాని కెవరూ సాహసించలేదు. పల్లెటూరి జనం. తాతలనాటి గొడవలన్నీ తిరిగి తోడటం వాళ్ళకేం తెలుస్తుంది! అదీ గాక బహుశా అతనివద్దనుండి ఎంత రావలసుందో వాళ్ళకు గుర్తుకూడా లేదు. ఇటువంటి పవిత్రమయిన వ్రతసమయంలో లెక్కలో పొరపాటు పడతామేమో నన్నభయం వారిని మౌనంలో ఉంచింది. అన్నిటికంటె ముఖ్యమైన విషయం మహాదేవ్ మంచితనం వాళ్ళను వశీకరించుకుంది.

అకస్మాత్తుగా పురోహితు డిలా అన్నాడు—"నీకు కంటె చెయ్యమని బంగారమిస్తే నువ్వు చాలా చిన్నాలు మాయంచేశావు. జ్ఞాపకముందా మహాదేవ్!"

"ఆ! జ్ఞాపక ముందిలెండి. మీ కెంతనష్టం కలిగివుంటుంది?" అన్నాడు మహాదేవ్!

"ఏభై రూపాయలకు తక్కువ ఉండదు" అన్నాడు పురోహితుడు.

మహాదేవ్ రెండు నవర్సులు తీసి పురోహితుని ముందుంచాడు.

పురోహితుని దురాశను గురించి వ్యాఖ్యానాలు బయలుదేరినాయి. "ఇంత విశ్వాసఘాతుకమా! మహా అయితే నాలుగైదు రూపాయలు నష్టపడి ఉంటాడేమో. పాపం అతనిదగ్గర ఏభై రూపాయలు గుంజుకున్నాడు. భగవంతుడున్నాడన్న భయమైనా లేదు. కావటానికి పండితుడు మళ్ళీ! నీతి చూడబోతే రోత! రామ రామా!"

ప్రజలకు మహాదేవయ్యంటే ఒక విధమైన గౌరవం ఏర్పడింది. ఒకగంట గడిచింది. కాని ఆవేళ జనంలో ఒకడైనా ముందుకు రాలేదు. అప్పుడు మహాదేవ్ మళ్ళీ యిలా అన్నాడు: ''మీరు మీ లెక్కా డొక్కా మరిచిపోయినట్లున్నారు. సరే! ఇవ్వాళ కథాశ్రవణం కానీండి. నేను నెలరోజులవరకూ మీకోసం నిరీక్షిస్తుంటాను. ఆ తరువాత తీర్థయాత్రలకు వెళ్ళిపోతాను. సోదరులందరూ నన్ను ఉద్ధరించండని కోరుతున్నాను.''

మహాదేవ్ ఒక వారం రోజులవరకూ వాళ్ళ రాకకోసం ఎదురు చూశాడు. రాత్రిపూట దొంగల భయంవల్ల నిద్రపట్టేదికాదు. ఇప్పు డతను పనిచెయ్యటమే మానివేశాడు. త్రాగుడు వ్యసనంకూడా వదలిపోయింది. వాకిట్లోకి వచ్చిన అతిథి అభ్యాగతులను తగిన విధంగా సత్కరించేవాడు. అతని సత్కీర్తి దూరదూరాలకు వ్యాపించింది. ఇంతలో గడువు పూర్తయిపోయింది. లెక్క చూచుకుని పైకం తీసుకు వెళ్ళేందుకు ఒక్కరూ రాలేదు. ప్రపంచంలో ధర్మపరాయణత్వం, సత్ప్రవర్తన ఎంతగా ఉందో ఇప్పుడు గ్రహించాడు మహాదేవ్. ప్రపంచం చెడ్డవాళ్ళకు చెడ్డదనీ, మంచివాళ్ళకు మంచిదనీ యిప్పు డర్థమైం దతనికి.

# 6

ఈ ఘటన జరిగి ఏభై సంవత్సరాలైంది. మీరు బేందోగ్రామం వెళితే దూరంనుండే బంగారు వన్నెగల కలశ మొకటి కనిపిస్తుంది. ఆ గ్రామ దేవాలయ కలశ మది. దానికి ఆనుకుని పెద్ద చెరు వొకటుంది. అందులో విరివిగా తామరలు పూసివుంటాయి. ఎవరూ అందులో చేపలు పట్టరు. చెరువుఒడ్డున ఒక పెద్ద సమాధి ఉన్నది. అదే ఆత్మారామ్ స్మృతిచిహ్నం. దాన్నిగురించి అనేక వదంతు లున్నాయి. కొందరు అతని రత్నాలుచెక్కిన పంజరం స్వర్గానికి వెళ్ళిందంటారు. "కల్లెంతో నిజమెంతో గురుడు హరు డెరుగురా" అని గానంచేస్తూ అంతర్ధానమైందంటారు మరికొందరు. కాని నిజంమాత్రం యిది. అతని చిలకరూపంలోఉన్న చంద్రుణ్ణి పిల్లి రూపంలోఉన్న ఏ రాహువో గ్రహించింది. ఇప్పటికీ అర్ధరాత్రివేళ ఆ చెరువు ఒడ్డున ఈపాట వినిపిస్తుందంటారు.

"కల్లెంతో నిజమెంతో గురుడు హరు డెరుగురా! ఉల్లంబు కోదండపాణిపై నిలుపరా!"

మహాదేవ్‌ను గురించి ఎన్నో కింవదంతు లున్నాయి. అందులో అన్నిటి కంటె ప్రామాణికమైన దిది: మహాదేవ్ విరాగి అయిన తరువాత అనేకమంది సన్యాసులతో గలిసి అతను హిమాలయాలకు వెళ్ళిపోయాడు. ఇక అక్కడినుండి మళ్ళీ తిరిగిరాలేదు. అతనిపేరు ఆత్మారామ్ అని ప్రసిద్ధికెక్కింది.

—•—

# ప్రేరణ

నా క్లాసులో సూర్యప్రకాశ్‌కు మించిన పోకిరీ కుర్రవాడు మరొకడు లేడు. నేను ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న పది సంవత్సరాల్లోనూ ఇలాంటి విపరీత స్వభావంగల కుర్రవాడెప్పుడూ తటస్థించలేదు. ఎప్పుడూ పోకిరీ చేష్టల్లోనే గడిపేవాడు. ఉపాధ్యాయులను ఫూల్స్‌ను చెయ్యటం, చిరాకెత్తించటం, కష్టపడి చదివే కుర్రాళ్ళను రెచ్చగొట్టి ఏడిపించటం — యిలాంటి పనులంటే అతనికి మహా సంతోషంగా ఉండేది. ఎలాంటి ఎలాంటి వ్యూహాలు రచించేవాడు! ఎటువంటి ఉచ్చులు పన్నేవాడు! ఎలాంటి యెత్తులు వేసేవాడు! చూస్తుంటే ఆశ్చర్యం వేసేది. కుర్రాళ్ళను జట్టుగట్టటంలో మహా ఆరితేరినవాడు.

రహస్య సైన్యమొకటి తయారుచేసి దానిబలంతో స్కూలుమీద పెత్తనం చలాయించేవాడు హెడ్‌మాస్టరుగారి ఆజ్ఞయినా ఉల్లంఘించబడవచ్చుగాని, అతని ఆజ్ఞను ధిక్కరించటానికిమాత్రం ఎవడికీ దమ్ములుండేవికావు. స్కూలు బంట్రోతు, ఆర్డర్లీ అతనంటే గడగడలాడిపోయేవాళ్ళు. ఇన్‌స్పెక్టరుగారు తనిఖీకి రాబోతున్నారు. అందువల్ల హెడ్‌మాస్టరుగారు మామూలు టైముకు ఒక అరగంట ముందుగా రమ్మని ఆజ్ఞాపించారు. పరీక్షలను గురించి కొన్ని ముఖ్యమయిన విషయాలు చెబుదామని ఆయన ఉద్దేశ్యం. కాని పదిగంట లయింది. ఇన్‌స్పెక్టరుగారు వచ్చి కూర్చున్నారు. స్కూల్లో ఒక్క కుర్రాడైనా లేడు. పదకొండు గంటలకు ఏదో బోనులోంచి విడుదలై వచ్చినట్లుగా విద్యార్థులందరూ ఒక్కసారి హాజరయినారు. ఇన్‌స్పెక్టరుగారు 'డిసిప్లిన్ చాలా అధ్వాన్నంగా ఉందని రికార్డులో వ్రాశారు. హెడ్‌మాస్టరుగారు అవమానపడ్డారు. ఉపాధ్యాయులకు చెడ్డపేరు వచ్చింది. ఈ పోకిరీపనికంతకూ కారకుడు సూర్యప్రకాశే. ఎంత తిప్పలుపడినా ఒక్కడూ సూర్యప్రకాశ్ పేరైనా ఎత్తలేదు. ఆదర్శంగా క్లాసును నడిపేవిషయంలో నేను చాలా గర్వపడేవాణ్ణి. ట్రైనింగ్ కాలేజీలోగూడా ఈ విషయంలో మంచిపేరు సంపాదించాను. కాని ఇక్కడమాత్రం నా నిపుణతంతా నిరుపయోగమైంది. ఆ ఉద్దండుణ్ణి మంచిదారికి తేవటానికి తగిన ఉపాయమేమీ తోచేదికాదు మొదట్లు. అనేకమార్లు ఈ విషయాన్ని గురించి ఉపాధ్యాయుల సమావేశాలు కూడా జరిగాయి. కాని కీలకం అర్థంకాలేదు. నూతన విద్యావిధానం ప్రకారం నేను దండనీతి విధానానికి అనుకూలుణ్ణికాదు. కాని యిక్కడమాత్రం ఈ విధానమంటే విరక్తికలిగింది. రోగంకంటె చికిత్స అసాధ్యమౌతుందేమోననే భయం ఒక్కటే యిందుకు

కారణం. సూర్యప్రకాశ్‌ను స్కూలునుండి వెళ్ళగొడదామనే ప్రతిపాదనకూడా వచ్చింది. కాని ఆ పని చేయటం మా అసమర్థతకు నిదర్శన మౌతుందని, ఆ ప్రతిపాదనను అమలుపరచటానికి సాహసించలేకపోయినాం. ఇరవై, ఇరవై రెండేళ్ళ అనుభవం కలిగి, విద్యాబోధనలో నిపుణులైన ప్రొఫెసర్లు కూడా పన్నెండు, పదమూడేళ్ళ వయస్సు గల ఒక పోకిరీ కుర్రవాణ్ణి దారికి తేలేకపోయినారంటే అది చాలా నిరాశాజనకమైన విషయంకాదూ! మామూలుగా స్కూలంతా అతనంటే హడలిపోతూనే ఉండేది. కాని అందరికంటే ఇరకాటంలో పడింది నేను కారణం, అతను నా క్లాసు విద్యార్థి కావటమే. అతని పోకిరీపనుల దుష్ఫలితమంతా నేను అనుభవించవలసివచ్చేది. నేను స్కూలుకు బయలుదేరిన క్షణంనుండీ ఎప్పుడూ ఇవ్వాళ ఏంముప్పు తెచ్చిపెడతాడో అనే దిగులే వేధిస్తుండేది. ఒకరోజు నేను డ్రాయరు సొరుగు తెరిచేసరికి ఒక పెద్ద గోండ్రుకప్ప అందులోనుండి ఎగిరిపడింది. నేను ఉలిక్కిపడి వెనక్కి తగ్గేసరికి క్లాసంతా గొల్లుమన్నది. నేను సూర్యప్రకాశ్ వైపు క్రోధంగా చూచి ఊరుకున్నాను. కాలమంతా ఉపదేశాలతోనే గడిచిపోయింది. ఆ పోకిరీ తలవంచుకుని ముసిముసి నవ్వులు నవ్వుతున్నాడు. క్రిందితరగతుల్లో వీడు ఎలా ప్యాసయినాడా అని ఆశ్చర్యంకలిగేది నాకు. ఒకనాడు నేను కోపంతో "నీ వీ క్లాసులో జీవితమంతా ప్యాసుకాలేవు" అన్నాను. "నా ప్యాసునుగురించి మీ కేమీ దిగులొద్దులెండి. నేను ఎప్పుడూ ప్యాసవుతూనే వచ్చాను. ఇప్పుడూ అవుతాను" అన్నాడు.

"అసంభవం."

"అసంభవంకూడ సంభవమౌతుంది సార్!"

నేను ఆశ్చర్యంగా అతనివైపు చూస్తున్నాను. ఎంత కుశాగ్రబుద్ధిగల కుర్రవాడైనా తన ప్యాసును గురించి యింత నిష్కర్షగా మాట్లాడలేడు. 'వీడు ప్రశ్నాపత్రాలు కాజేస్తున్నట్లున్నాడు' అనుకున్నాను. ఈసారి యితని ఎత్తులు ఒక్కటిగూడా పారనియ్యగూడదని ప్రతిజ్ఞ చేశాను. 'ఈ తరగతిలో ఎన్నాళ్ళు పడిఉంటాడో అదీ చూద్దాం, గాబరాపుట్టి వాడే జారుకుంటాడు' అనుకున్నాను.

సాంవత్సరిక పరీక్షల సందర్భంలో నేను అసాధారణ జాగరూకతతో పని చేశాను, కాని సూర్యప్రకాశ్ ఆన్సరుపేపర్లు చూచేసరికి నా ఆశ్చర్యానికి అంతులేదు నేను రెండు ప్రశ్నాపత్రా లిచ్చాను. రెంటిలోనూ, అతనికి నా క్లాసులో అందరికంటె మార్కులు అధికంగా వచ్చినాయి. నా ప్రశ్నా పత్రాల్లో ంజానికి ఒక ప్రశ్నకుకూడా అతను జవాబు చెప్పలేడని నాకు బాగా తెలుసు. కావాలంటే యీ విషయం నేను రుజువు చేస్తానుగూడా. కాని అతని ఆన్సరు పేపర్లను కాదనటం యెలా? దస్తూరీలో సందేహం కలిగేటంత తేడా యేమీ కనపడటంలేదు. ఈ విషయమే నేను హెడ్‌మాస్టరుగారితో అంటే, ఆయన విభ్రాంతుడైనాడు. కాని ఆయనగూడా చూస్తూచూస్తూనే దిగమ్రింగి ఊరుకోవలసివచ్చింది. నేను బహుశా స్వభావసిద్ధం

గానే నిరాశావాదిని. సూర్యప్రకాశ్‌నుగురించి ఇతర ఉపాధ్యాయులు ఏమీ విచారంగా ఉన్నట్లు లేదు. ఇటువంటి కుర్రాళ్ళు స్కూలుకు రావటం వాళ్ళ కేమీ క్రొత్తగా ఉన్నట్లు లేదు. నాకుమాత్రం అతనొక కొరకరానికొయ్యగా ఉన్నాడు. ఈ విధంగానే ఉంటే ఏదో ఒకనాడు అతను జైలుపాలు కావటమో, పిచ్చిఆసుపత్రికి చేరటమో జరగక తప్పదు.

# 2

ఆ సంవత్సరమే నేను బదిలీ అయినాను. ఇక్కడి వాతావరణం అనుకూలంగానే ఉంది. హెడ్మాష్టరుతోనూ, తదితర ఉపాధ్యాయులతోనూ బాగా స్నేహంకూడా కలిసింది. అయినా బదిలీ అయినందుకు నేను చాలా సంతోషించాను. ఎందువల్లంటే, సూర్యప్రకాశ్‌తో యిక గొడవపడవలసిన అవసర ముండదు. విద్యార్థులు నాకు వీడ్కోలు విందు చేశారు. అందరూ నన్ను సాగనంపటానికి స్టేషనువరకూ వచ్చారు. ఆ సమయంలో కుర్రవాళ్ళందరి కళ్ళు చెమ్మగిల్లినాయి. నేనూ కన్నీటిని ఆపుకోలేకపోయాను. అకస్మాత్తుగా నా దృష్టి అందరికంటె వెనుక సిగ్గుపడుతూ నుంచున్న సూర్యప్రకాశ్‌మీద పడింది. అతని కళ్ళుగూడా చెమ్మగిల్లినట్లే ఉన్నాయి. వెళ్ళేటప్పుడు అతనితో రెండు మాటలు మాట్లాడదామనే కోరిక మాటిమాటికీ మనసులో తొలిచింది. బహుశా అతనికీ నాతో ఏదో చెప్పాలనే ఉంది. కాని మొదట నేనూ పలకరించలేదు; అతనూ పలకరించలేదు. అకారణంగా చాలా రోజులవరకూ విచారంగా ఉండేది. అతని దురుసుతనం క్షమించదగ్గదే. కాని నా అభ్యంతరంమాత్రం క్షమార్హంకాదు. జాలిగొలిపే ఆ విషాద సమయంలో రెండు ముక్కలు అతనితో మాట్లాడిఉంటే, అతనిలో ఎంతో మార్పురావటానికి అవకాశముండేది. ఇలాంటి అవకాశాలను జారవిడుచుకోటానికి మరో పేరే జీవితం. బండి నిదానంగా నడుస్తోంది. కుర్రాళ్ళు కొన్ని అడుగులవరకూ రైలుతోపాటు పరుగెత్తారు. నేను తల కిటికీ బయటకుపెట్టి నుంచున్నాను. కొంతదూరంవరకూ వాళ్ళ చేతుల్లతో ఊగిస్తున్న జేబురుమాళ్ళు కనిపించాయి. క్రమంగా ఆ రేఖలు శూన్యంలో విలీనమయినాయి. కాని ఒక సన్నని వ్యక్తి యింకా ప్లాట్‌ఫారంపైనే నిలబడి ఉన్నాడు. నేను గుర్తించాను; అతను సూర్యప్రకాశే! ఆ సమయంలో నా హృదయం వ్యాకులపడుతున్న ఖైదీవలె ద్వేషం, మనస్పర్థ, ఉదాసీనతల బంధనాలన్నీ త్రెంచుకుని అతన్ని కౌగలించుకోవాలని తహతహ లాడిపోయింది.

క్రొత్తప్రదేశపు క్రొత్తసమస్యలు అనతికాలంలోనే నన్ను తమవైపుకు ఆకర్షించుకున్నాయి. గడచినరోజుల స్మృతులు తీరని కోరికలుగానే ఉండిపోయి.

నాయి. ఎవరూ నాకు జాబు వ్రాయలేదు. నేనూ ఎవరికీ వ్రాయలేదు. బహుశా లోకపు తీరే ఇంతేమో! వర్షాకాలం దాటిపోయిన తరువాత, ఆ కాలపు పచ్చదనం ఎన్నా ళ్ళుంటుంది! తలవని తలంపుగా నాకు విద్యాభ్యాసానికి ఇంగ్లండు వెళ్ళే అవకాశం లభించింది. అక్కడ మూడు సంవత్సరాలు గడిచినాయి. అక్కడనుండి రాగానే నన్ను ఒక కాలేజీకి ప్రిన్సిపాల్‌గా నియమించారు. నేను ఆశించినదానికంటె అధి కంగా కలిసివచ్చింది. నేను స్వప్నంలోగూడా ఇంతదూరం ఊహించలేదు. కాని నా పదవీ వ్యామోహం ఇప్పుడు మరింత ఉన్నతస్థానాన్ని పొందాలని ఉవ్విళ్ళూరు తోంది. విద్యాశాఖామంత్రితో సంబంధా లేర్పరచుకున్నాను. మంత్రిగారు నన్ను బాగా ఆదరించేవారు. కాని విద్యకు సంబంధించిన మూలసిద్ధాంత పరిజ్ఞానం ఆయ నకు శూన్యం. ఇక ఆయన తన భారమంతా నాకు పప్పగించేశారు. గుర్రాన్ని అధి రోహించింది వారే అయినా, కళ్ళెం నా చేతిలోనే ఉండేది. దాని ఫలితంగా ఆయన రాజకీయ ప్రతికక్షులందరూ నాకు విరోధులైనారు. ఇక వాళ్ళంతా అయినదానికీ, కానిదానికీ నామీద దాడిచేసేవాళ్ళు. నేను సైద్ధాంతికంగా నిర్బంధ విద్యావిధానానికి ప్రతికూలుణ్ణి, తనకు ప్రత్యేకంగా సంబంధించిన విషయాల్లో ప్రతి మానవుడికీ యితోధికంగా స్వతంత్రం ఉండాలని నా అభిప్రాయం, నిర్బంధ విద్యావిధానపు అవసరం యూరపు ఖండాని కుందిగాని, భారతదేశానికి లేదని నా అభిప్రాయం. భౌతికతత్వం పాశ్చాత్య సభ్యతకు మూలాధారం. అక్కడ ఏ పనైనా ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యానే చేస్తారు. అక్కడ జీవితావసరాలుకూడా యెక్కువ.అందు వల్ల జీవన సంగ్రామంకూడా భీషణంగానే ఉంటుంది. తలిదండ్రులుకూడా విలా సాలకు దాసులై, పిల్లలు సాధ్యమైనంత త్వరలో సంపాదన పరులయ్యేట్లుగానే చూస్తారు. తమ విలాసాలను తగ్గించుకుని, రోజుకొక షిల్లింగ్ మిగుల్చుకునేందుకు బదులు, తమ చిన్నపిల్లవాణ్ణి ఒక షిల్లింగ్‌కూలి సంపాదించుకురమ్మని వత్తిడి పెడ తారు. భారతీయ జీవితంలో సాత్వికమైన సరళస్వభావముంది. మనం పరిస్థితులవల్ల తప్పనిసరి అయితేతప్ప మన పిల్లలను కూలికి పంపించం. నిష్ఠదరిద్రుడైన భారతీయ కార్మికుడుగూడా విద్యవల్ల కలిగే ప్రయోజనం అర్థంచేసుకున్నవాడే. తన కొడుకు కూడా నాలుగు అక్షరం ముక్కలు నేర్చుకోవాలనే అభిలాష అతనికీ ఉంటుంది. అత నలా కోరుతున్నాడంటే తన కొడు కేదో అధికారై పోతాడని కాదు; విద్య మానవశీలానికి ఒక అలంకారం కాబట్టి. ఈసంగతి తెలిసికూడా తన కొడుకు నతడు స్కూలుకు పంపటంలేదంటే విధిలేకనే అన్న విషయం అర్థంచేసుకోవాలి. అటు వంటిస్థితిలో అతనిమీద చట్టం పేరుతో దాడిచేయటం నా దృష్టికి న్యాయసమ్మతంగా లేదు. అదీగాక, మన దేశంలో ఇంకా యోగ్యులైన ఉపాధ్యాయులు లేరని నా అభిప్రాయం. సరియైన శిక్షణలేని, అల్పవేతనాలు పొందే ఉపాధ్యాయులు ఏవో ఉన్నతాదర్శాలతో పనిచేయగల్గుతారని ఎవరూ ఆశించలేరు. మహా అయితే నాలు గైదు సంవత్సరాల్లో పిల్లవాడికి అక్షరజ్ఞానం కలుగుతుందేమో! అంతే! ఇది

కొండను తవ్వి ఎలుకనుపట్టినట్లవుతుందని నా అభిప్రాయం. వయోజనులైన తరువాత ఈ సమస్య ఒక మాసంలో పరిష్కరించగలం. పెద్దవాళ్ళయిన తరువాత ఒక నెలలో సంపాదించగలిగే జ్ఞానం చిన్నతనంలో మూడు సంవత్సరాలకుకూడా సాధించలేము. అనవసరంగా పసివాళ్ళను పాఠశాలల్లో నిర్బంధిస్తే లాభమేమిటి? పాఠశాల బయట స్వచ్ఛమైన గాలి లభిస్తుంది. ప్రాకృతిక అనుభవం కలుగుతుంది. పాఠశాలల్లో బంధించి మానసికంగానూ, శారీరకంగానూ రెండిందాలా వాళ్ళను భ్రష్టుపట్టిస్తున్నాం. అందువల్లనే రాష్ట్ర కార్యనిర్వాహకుల సమావేశంలో నిర్బంధ విద్యా తీర్మానం ప్రతిపాదించినప్పుడు, నా ప్రోత్సాహంతో మంత్రిగారు దాన్ని ప్రతిఘటించారు. దాని ఫలితంగా తీర్మానం నిరాకరింపబడింది. ఇంకేముంది? మంత్రిగారికీ, నాకూ ఉన్న లావాదేవీలనుగురించి ఎలాంటి దుమారం రేగిందో చెప్పనక్కరలేదు. వ్యక్తిగతమైన ఆరోపణలు చెలరేగినాయి. పేదవాడి పెళ్ళాం స్థితిలో ఉన్నది నేనేగా! అందుకనే అందరికీ నేనే వదినను కావలసివచ్చింది. నన్ను దేశద్రోహి, అభ్యుదయ నిరోధకుడు, అధికారుల తొత్తు అని నిందించటం మొదలైంది; నా కాలేజీలో ఏ చిన్నవిషయం జరిగినా, కౌన్సిల్ సమావేశంలో నాపైన విరుచుకుపడేవాళ్ళు. నేనొక బంట్రోతును డిస్మిస్ చేశాను. కౌన్సిలు సభ్యులంతా పంజాలువిప్పి నావెంటబడ్డారు. చివరకు మంత్రిగారు గత్యంతరంలేక ఆ బంట్రోతును తిరిగినియమించవలసివచ్చింది. ఈ అవమానాన్ని నేను సహించలేకపోయాను, బహుశా ఎవరైనా సహించలేరేమో! ఇందులో మంత్రిగారి దోషమేమీ లేదు. ఆయనకు తప్పనిసరైంది. ఇక ఆ వాతావరణంలో పనిచెయ్యటం నాకు అసాధ్యమైపోయింది. నాకు నా కాలేజీ నిర్వహణలోగూడా అధికారం లేకుండా పోయింది. "ఫలానావాణ్ని పరీక్షకెందుకు పంపించారు? ఉపకారవేతనం ఫలానావాడికి బదులు ఫలానావాడికి ఎందుకివ్వలేదు? ఫలానా ఉపాధ్యాయుడికి ఫలానా క్లాసు ఇవ్వకపోవటానికి కారణ మేమిటి?"-ఇలాంటి సారహీనమైన ఆరోపణలతో నాకు విసుగెత్తిపోయింది. ఈ క్రొత్త గాయంతో నా నడుములు విరిగిపోయాయి. నేను రాజీనామా ఇచ్చేశాను.

కనీసం యీ విషయంలోనైనా మంత్రిగారు తప్పకుండా న్యాయదృష్టితో పనిచేస్తారని ఆశించాను. కాని వారు న్యాయానికి బదులు రాజనీతిని గౌరవించారు. అనేక సంవత్సరాల నా భక్తి విశ్వాసాలకు ఫలితంగా, నన్ను పదవినుండి తొలగించటం జరిగింది. లోకాన్నిగురించి ఇలాంటి అప్రియమైన అనుభవం ఇంతవరకు ఎప్పుడూ కలుగలేదు. గ్రహస్థితికూడా బాగాలేదు. ఆ రోజుల్లోనే నా భార్యకూడా చనిపోయింది చివరిసారి ఆమెను చూడలేకపోయాను. సాయంత్రమప్పుడు ఏటి ఒడ్డుకు షికారుకు వెళ్ళాను. ఆమెకు కాస్త సుస్తీగా ఉంది. తిరిగి నేను వచ్చేసరికి శవం లభించింది. బహుశా గుండె ఆగిపోయిందనుకుంటాను. ఈ గాయం నన్ను కుంగదీసింది. తల్లియొక్క అనుగ్రహ ఆశీర్వాదాలతో గొప్ప గొప్ప మహాపురుషు

లనేకమంది కృతార్థులైనారు. నేను సాధించిందేమైనాఉంటే అందుకు నా భార్య అనుగ్రహ ఆశీర్వాదాలే కారణం. ఆమె నా అదృష్టానికి విధాత్రి. ఎంత అలౌకిక త్యాగమూర్తి! ఎంత అచంచల ధైర్యలక్ష్మి! ఆమె మధుర స్వభావంలో అస హనం ఎప్పుడూ లేదు. ఆమెకు ఎన్నడూ కోపంరాగా చూచినట్లు జ్ఞాపకమే లేదు. నిరాశ అంటే ఏమిటో అసలు ఎరగనే ఎరుగదు. నేను చాలాసార్లు పెద్ద జబ్బున పడ్డాను. వైద్యుడుకూడా ఆశవదులుకున్నాడు. కాని ఆమె అణుమాత్రంకూడా అధైర్యపడలేదు. స్థిమితాన్ని కోల్పోలేదు. తన భర్త జీవించి వుండగానే, తాను కన్నుమూస్తానని విశ్వాసం. జరిగిందికూడా అదే. ఇంతవరకూ జీవితం ఆమె నాధారం చేసుకునే గడిపాను. జీవితాధారమే నశించిపోయిన తరువాత ఇక జీవిత మేముంది! తినటమూ, నిద్రపోవటమూ కాదు జీవితమంటే. నిరంతరం ముందుకు నడువాలనే పట్టుదలకు మరోపేరే జీవితం. ఇప్పుడాపట్టుదల మాయమయిపోయింది. నాకు లోకమంటే విరక్తి ఏర్పడింది. ఇక మిగతా జీవితకాలం ఏకాంతంగా గడుపు దామని నిశ్చయించుకుని ఒక కుగ్రామానికి వెళ్ళి నివసించసాగాను. ఊరికి నలు వైపులా ఎత్తయిన దిబ్బలే. ఒకప్రక్క గంగానది ప్రవహిస్తూంది. నేను నది ఒడ్డున ఒక చిన్న యిల్లు కట్టించుకున్నాను. అందులోనే నివసించసాగాను.

## 3

పని చేయటం మానవుని స్వభావం. నిరుద్యోగంతో జీవితం గడిచే దెలా? నే నొక చిన్న పాఠశాల ప్రారంభించాను. ఒక చెట్టునీడన గ్రామంలో పిల్లలను పోగుచేసి చదువు చెబుతుండేవాణ్ణి. పాఠశాల ఖ్యాతి బాగా వ్యాపించింది. సమీప గ్రామంనుండిగూడా పిల్లలు రాసాగారు.

ఒకరోజు నేను నా క్లాసులో పాఠం చెబుతున్నాను. ఇంతలో పాఠశాలవద్దకు ఒక కారువచ్చి ఆగింది. అందులోనుండి జిల్లా డిప్యూటీ కమీషనరు దిగాడు. అప్పుడు నేను ఒక చొక్కా, ధోవతి మాత్రమే ధరించి ఉన్నాను. ఈ వేషంతో ఒక అధికారిని కలుసుకోటానికి సిగ్గుపడుతున్నాను. ఆయన నాదగ్గరకు రాగానే నేను సిగ్గుపడుతూ చెయ్యిజాచాను. కాని ఆయన నాకు షేక్‌హాండ్ ఇవ్వటానికి బదులు, నా పాదాలమీద వాలి తల వాటిమీద ఆనించాడు. నే నెంతో గాబరాపడి పోయాను. నోటినుండి ఒక్కమాటైనా పెగలలేదు. నేను మంచి ఇంగ్లీషు వ్రాస్తాను. దార్శనికశాస్త్రంలోగూడా నేను ప్రొఫెసరును. ఉపన్యాస కళలోకూడా ఆరితేరిన వాణ్ణే. కాని ఇవ్వేవీ భక్తి ప్రదర్శించవలసిన గుణాలు కావు, భక్తి ప్రదర్శించటా నికి యోగ్యులు సాధులూ, జ్ఞానులూ మాత్రమే. పోనీ నేను బ్రాహ్మణుడనైనా

అయివుంటే ఫరవాలేదు. ఎందువల్లనంటే ఒక పౌరుడు బ్రాహ్మణుని పాదాలకు మొక్కటంలో విచారపడవలసిం దేమీలేదు.

నే నింకా విస్మయావస్థలోనే ఉన్నాను. ఇంతలో డిప్యూటీ కమీషనరు తల యెత్తి నావైపు చూచాడు. "బహుశా మీరు నన్ను గుర్తించలేదనుకుంటాను" అన్నాడు.

ఆ మాట వినేసరికే నాకు జ్ఞాపకం వచ్చేసింది : "మీ పేరు సూర్యప్రకాశ్ కదూ!" అన్నాను.

"చిత్తం! ఆనాటి మీ తుంటరి శిష్యుణ్ణే!"

"పన్నెండు పదమూడేళ్ళయింది."

"ఉపాధ్యాయులు విద్యార్థులను మరిచిపోతారు. కాని విద్యార్థులు మాత్రం వారిని ఎన్నటికీ మరచిపోరు" చిరునవ్వుతో అన్నాడు సూర్యప్రకాశ్.

"మీవంటి విద్యార్థులను మరచిపోవటం మాత్రం అసంభవం" నేనూ పరిహాసంగా అన్నాను.

"ఆనాటి అపరాధాలకు క్షమాపణ వేడుకోటానికే మీ సన్నిధికి వచ్చాను. నేను అకారణంగా మిమ్మల్ని వేధించేవాణ్ని. మీరు ఇంగ్లండుకు వెళ్ళినప్పుడు నేను మీకు అభినందన లేఖకూడా వ్రాశాను. కాని అది మీకు పంపలేకపోయాను. మీరు ప్రిన్సిపాల్ అయినప్పుడు నేను ఇంగ్లండుకు వెళ్ళబోతున్నాను. అక్కడ పత్రికల్లో నేను మీవ్యాసాలు చదివేవాణ్ణి నేను తిరిగి వచ్చేసరికి మీరు రాజీనామా ఇచ్చేశారనీ, ఎక్కడో పల్లెటూరికి వెళ్ళిపోయారనీ తెలిసింది. నే నీ జిల్లాకు వచ్చి ఒక సంవత్సరానికి ఎక్కువే అయింది. కాని మీరిక్కడ ఏకాంతవాసం చేస్తున్నారని ఆవంతయినా అనుమానించలేదు. ఈపాడుబడ్డ ఊళ్ళో మీ కెలా తోస్తున్నది? ఈ వయసులోనే మీరు వానప్రస్థాశ్రమం స్వీకరించారే?"

సూర్యప్రకాశ్ అభివృద్ధి చూచి నా కెంతటి ఆశ్చర్యానందాలు కలిగాయో వర్ణించలేను. అతను నా కుమారుడైనా ఇంతకు మించిన ఆనందం కలిగేదికాదు. అతన్ని నేను నా కుటీరంలోకి తీసుకునివెళ్ళి నా కథంతా చెప్పాను.

"అయితే మీరు మీ సోదర వ్యక్తియొక్క విశ్వాసఘాతుకానికే ఎరఅయినా రన్నమాట! నా అనుభవం ఇంకా పరిమితమైందే. కాని ఈ కొద్ది దినాల్లోనే మన కింకా మన బాధ్యతలను నిర్వర్తించుకోటం చేతకాలేదని అర్థమైపోయింది మంత్రి గారిని కలుసుకున్నప్పుడు ఇదేనా మీధర్మమని అడుగుతాను" అన్నాడు సూర్యప్రకాశ్.

"భాయీ! ఇందులో ఆయన దోషమేమీలేదు. ఆ పరిస్థితిలో నేనూ ఆ పనే చేసేవాణ్ణేమో, నా స్వార్థ దాహానికి తగిన శిక్ష లభించింది. అందుకు నేను ఆయనకు రుణపడ్డాను. ఇది పైకి అనేమాట కాదు. నిజం చెబుతున్నాను. నాకిక్కడున్న శాంతి మరెక్కడా లేదు. ఈ ఏకాంత జీవితంలో జీవిత రహస్యాలను అర్థంచేసుకున్నాను

ఇలాంటి జ్ఞానం ధనంవల్లగానీ, అధికారంవల్లగానీ లభించటం అసంభవం. చరిత్ర, భూగోళ గ్రంథాల పన్నాలన్నీ జీర్ణం చేసుకున్నా. యూరపియన్ విశ్వవిద్యాలయాల శరణుజొచ్చినా, నా మమకారాన్ని చంపుకోలేక పోయాను. అంతేకాదు. ఈ వ్యాధి అంతకంతకు అసాధ్యమౌతూ వచ్చింది. మెట్లమీద కాలుపెట్టకుండానే పైఅంతస్తుకు చేరుకోగలమా? సంపత్తి మహలుకు చేరుకోవటానికి ఇతరుల జీవితాలే మెట్లుగా ఉపయోగపడతాయి. ప్రక్కవాళ్ళను అణచివేస్తేనే లక్ష్యంవరకూ చేరుకోటం సాధ్యం. ఈ విషయంలో సౌజన్యానికీ, సానుభూతికీ స్థానంలేదు. ఆ కాలంలో నేను క్రూర జంతువుల మట్టడిలో చిక్కినట్లుండేది. అప్పుడు నా సర్వశక్తులూ ఆత్మరక్షణకే వినియోగమయ్యే వనిపిస్తుంది. ఇక్కడ నాకు నలువైపులా సంతృప్తి, నిరాడంబరత్వం కనిపిస్తున్నాయి. నావద్దకు వచ్చే జనం ఏదో స్వార్థం కోసం రారు. నా సేవగూడా పొగడ్తలూ, సన్మానాల దాహం తీర్చుకోటానికి కాదు."

ఇలా అని నేను సూర్యప్రకాశ్ ముఖంవంక ధ్యానంతో చూచాను. కపట మందహాసానికి బదులు విషాద రేఖలు కనిపిస్తున్నాయి. "మీ రెంతగానో నిరాశులైన వ్యక్తి.... చూచారా! నేడు ఎలాంటి పదవిలో కొచ్చాడో'' అని బహుశా నాకు చూపించటానికే వచ్చిఉండవచ్చు. అతను నానుండి కోరేది తన కృషిని గురించి ప్రశంస. అప్పుడు నా పొరపాటు నా కర్థమైంది. ఒక భాగ్యశాలిముందు సంపదను నిందించటం భావ్యంకాదు. వెంటనే నేను సంభాషణ మార్చి 'మరి నీసంగ తేమిటో చెప్పూ! నీలో ఈ విప్లవం ఎలా సంభవించినట్లూ! నీ పోకిరీపనులు జ్ఞప్తికి తెచ్చుకుంటే యిప్పటికీ భయం వేస్తుంది. ఏ దేవతైనా వరం ప్రసాదిస్తే తప్ప, మరో విధంగా ఈ అభివృద్ధి సాధ్యమయ్యేది కాదుసుమా!" అన్నాను.

''అదంతా మీ ఆశీర్వాద ఫలితం'' చిరునవ్వుతో అన్నాడు సూర్యప్రకాశ్.

నే నెంతో బలవంతం చేసినమీదట తన వృత్తాంతం వినిపించటం మొదలు పెట్టాడు— "మీరు వెళ్ళిపోయిన తరువాత చాలా రోజులకు మా మేనల్లుడు స్కూలులో ప్రవేశించాడు. అతని వయస్సు ఎనిమిది లేక తొమ్మిదేళ్ళకు మించదు. ప్రిన్సిపాల్‌గారు అతన్ని హాస్టలులో ఉండటానికి అంగీకరించలేదు. మామామయ్యగారు అతనికి ప్రత్యేకంగా వసతిని ఏర్పాటుచేసే స్థితిలోలేరు ఆయన యిబ్బందిని కనిపెట్టి, ప్రిన్సిపాల్‌గారి వద్దకువెళ్ళి "అతన్ని నా గదిలో ఉండనివ్వండి"అన్నాను. ప్రిన్సిపాల్‌గారు అలా ఉంచటం రూల్సుకు వ్యతిరేక మన్నారు. అందుకు కోప మొచ్చి, ఆ రోజే నేను హాస్టలు వదిలిపెట్టాను. ఒక అద్దెయిల్లు తీసుకుని మోహన్‌తో కలసి అక్కడే ఉండసాగాను. వాళ్ళమ్మ చాలా సంవత్సరాలకు పూర్వమే చనిపోయింది. సన్నగా, బక్కపలుచగా, అమిత బలహీనంగా ఉండే ఆ అర్భకుణ్ణి చూస్తే నాకు మొదటిరోజునే అతనంటే ఎంతో జాలి ఏర్పడింది. ఒకప్పుడు తలనొప్పి, మరొకప్పుడు జ్వరం, ఈ విధంగా నిత్యం ఏదో ఒకబాధ

ఉంటూనే ఉండేది. ప్రొద్దుగూకటమే తరువాయి; కునికిపాట్లు పడుతుండేవాడు. ఎంతో కష్టంమీద భోజనానికి లేచేవాడు. ప్రొద్దెక్కిందాకా నిద్రపోయేవాడు. నేను బడిలోకి తీసుకుని కూర్చోబెట్టుకునే వరకూ లేవాలనే తలంపే ఉండేదికాదు. రాత్రి పూట తరుచుగా ఉలిక్కిపడి, నా మంచంమీదికి వచ్చి, నా మెడలో చెయ్యివేసి అనుకుని పడుకునేవాడు. అతనిమీద నా కెప్పుడూ కోపంవచ్చేదేకాదు. అతనంటే నాకంత ప్రేమ ఎందు కేర్పడిందో నేను చెప్పలేను. అదివరకు రోజూ తొమ్మిదిగంటలకు నిద్రలేచే నేను ఇప్పుడు వేకువనే నిద్రలేచి అతనికోసం పాలు కాగపెట్టేవాణ్ణి. తరువాత అతన్ని లేపి, ముఖంకడిగించి టిఫిన్‌చేయించేవాణ్ణి. అతని ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రోజూ షికారుకు తీసుకెళ్ళేవాణ్ణి. ఎన్నడూ పుస్తకంబట్టి కూర్చోనివాణ్ణి అతన్ని గంటలతరబడి చదివించేవాణ్ణి. నా బాధ్యతను గురించి ఇంతటి పరిజ్ఞానం ఎలా కలిగిందో నాకే ఆశ్చర్యం. అతని కేమైనా సుస్తీచేసిందంటే ప్రాణాలు పిడికిట్లోకి వచ్చేసేవి. డాక్టరువద్దకు పరుగెత్తి మందులు తెచ్చేవాణ్ణి. మోహన్‌కు మాయమాటలుచెప్పి మందులు త్రాగించేవాణ్ణి. ఎప్పుడూ అతనికిఅయిష్టమైన విషయ మేదీ జరుగకుండా చూడాలనే ఆలోచించేవాణ్ణి పాపం ఇక్కడ అతనికి నాకంటె దిక్కెవరు? నా పోకిరీ మిత్రుల్లో ఎవరైనా వాడికి చిరాకు కలిగించటమో, రెచ్చగొట్టటమో చేశాడా నాకు చెప్పలేని కోప మొచ్చేది. చాలామంది కుర్రాళ్ళు నన్ను "అవ్వా అవ్వా!" అంటూ రెచ్చగొట్టేవాళ్ళు కాని నేను నవ్వి ఓర్చుకునేవాణ్ణి అతని ఎదుట అనుచితంగా ఒక్క మాటగూడా అనేవాణ్ణిగాదు. నన్ను చూచి వీడుకూడా ఎక్కడ చెడిపోతాడోనని సందేహించేవాణ్ణి. అతను నన్ను తనకు ఆదర్శవ్యక్తిగా భావించుకునే విధంగా అతని ఎదుట మెలగాలని వాంఛించేవాణ్ణి. అందుకు నా ప్రవర్తనను సరిచేసుకోవట మొకటే మార్గమని అందరికీ తెలిసిందే. తొమ్మిది గంటలకు నిద్రలేవటం, పదకొండు గంటలదాకా అడ్డాలు తిరుగటం, క్రొత్తక్రొత్త పోకిరీపనులకు పన్నాగాలు పన్నటం, ఉపాధ్యాయుల కళ్ళుగప్పి స్కూలునుండి పారిపోవటం- యీ అలవాట్లన్నీ వాటంతటవే అంతరిస్తూ వచ్చాయి. ఆరోగ్యం, సత్ప్రవర్తన యిలాంటి సిద్ధాంతాలకు నేను బద్ధశత్రువును. కాని యిప్పుడు ఆ నియమాలను పాటించటంలో నాకు మించిన వాడెవడూ లేడు. నేను భగవంతుడంటే పరిహసించేవాణ్ణి. కాని ఇప్పుడు పక్కా ఆస్తికుణ్ణయినాను. "భగవంతుడు అన్నిచోట్లా ఉంటాడంటారుగదా; నాదగ్గరకూడా ఉంటాడుగదూ?" అమాయకంగా ప్రశ్నించేవాడు మోహన్. ఈ ప్రశ్నను ఎగతాళిగా త్రోసివేయటం నావల్లయ్యే పనికాదు. "ఔను! భగవంతుడు నీవద్ద, నావద్ద అందరివద్ద ఉంటూ, మనలను కాపాడుతూ ఉంటాడు" అనేవాణ్ణి. ఈ ధీమాతో అతని వదనం ఆనందాతిశయంతో వికసించేది. బహుశా అతని కప్పుడు భగవంతుని శక్తి అవగాహ నయ్యేదేమో! ఒక్క సంవత్సరంలోనే మోహన్ ఎంతో మారిపోయాడు. మా మామగారు మళ్ళీ వచ్చి చూచేసరికి ఆశ్చర్యపడ్డారు. కళ్ళనీళ్ళు పెట్టుకుని, "నాయనా! నువ్వు

వీణ్ణి బ్రతికించావోయ్. నేను వీణ్ణిగురించి ఆశే వదులుకున్నాను. దీనికి తగిన పుణ్య ఫలం భగవంతుడు నీకు ప్రసాదిస్తాడు. నాయనా! వీళ్ళమ్మ స్వర్గంలోఉండి నిన్ను ఆశీర్వదిస్తోంది బాబూ!'' అన్నాడు.

సూర్యప్రకాశ్ నేత్రాలు ఆ సమయంలోకూడా సజలమైనాయి.

"మోహన్‌గూడా నిన్ను అమితంగా ప్రేమించేవా డనుకుంటాను?" ప్రశ్నిం చాను నేను.

సూర్యప్రకాశ్ సజలనేత్రాల్లో దైన్యంతోకూడిన ఆనందం మెరిసిపోతోంది. "అతను నన్ను ఒక్క క్షణంకూడా వదిలేవాడు కాదు. నా ప్రక్కనే కూర్చునే వాడు. నాతోపాటే భోంచేసేవాడు. నాతోపాటుగానే నిద్రపోయేవాడు. అతనికి సర్వస్వం నేనే. ఓహ్! అత నీ లోకం వదిలిపోయేవాడు. కాని నాకుమాత్రం అతను యిప్పుడూ జీవితుడే. నే నింతవాణ్ణి కావటానికి అతనే కారణం. దైవ నిర్ణయం లాగా అతను నాకు మార్గదర్శకుడై ఉండకపోతే, యివ్వాళ నే నే జైలులోనో పడిఉండేవాణ్ణే. ఒకనాడు నేను "నువ్వు రోజూ స్నానం చెయ్యకపోతే నేను నీతో మాట్లాడను" అన్నాను. స్నానంఅంటే అత నెందుకో అమితంగా బద్ధకించేవాడు. నా బెదరింపు ఫలితంగా అతను ప్రతినిత్యం ప్రొద్దున్నే స్నానం చేసేవాడు. ఎంత చలిగాఉన్నాసరే; ఈదురుగాలి వీస్తున్నాసరే స్నానంమాత్రం తప్పక చేసేవాడు. నన్ను సంతోషపెట్టే దెలాగా అనే ఆలోచనలోనే ఉండేవాడు. ఒకనాడు నేను స్నేహితులతోపాటు సినిమాకు వెళ్ళాను. నువ్వు భోంచేసి నిద్రపొమ్మని హెచ్చ రించి మరీవెళ్లాను. రాత్రి మూడుగంటలకు మళ్లీ వచ్చి చూస్తే అతను నిద్ర పోకుండా కూర్చునే ఉన్నాడు."నిద్ర పోలేదేం?" అన్నాను. నిద్ర పట్టలేదన్నాడు. ఆ రోజునుండీ నేను సినిమాకు వెళ్ళటమే మానివేశాను. పిల్ల లెప్పుడూ సహజంగా ఒకరకమైనప్రేమదాహానికి లోనై యుంటారు. పాలూ, మిఠాయీలూ, బొమ్మలకంటే గూడా మత్తు కలిగించే దా దాహం. తల్లి ఒడిముందు ప్రపంచంలోని సమస్త ఐశ్వ ర్యాన్ని తృణీకరింపచేసే దా దాహం. మోహన్‌లోఉన్న ఆ దాహం ఎన్నటికీ చల్లా రేదికాదు. పర్వతాలను ఢీకొనే హంసగానంలాగా అది యెల్లప్పుడూ నరనరాల్లో ప్రతిధ్వనిస్తూనే ఉండేది. భూమిమీద అల్లుకున్న లతకు ఏదైనా ఆధారం లభించ గానే, దానికి చుట్టుకుంటుంది లత. సరిగ్గా అలాగే ఉంది మోహన్ స్థితి. నానుంచి గనుక వేరుచేస్తే, ఆ కోమలమైన లత తునాతునకలైపోతుందేమో నన్నంతగా అతను నాతో మిళితమైనాడు. నాతోపాటు మూడు సంవత్సరా లున్నా డతను. నా జీవితంలో వెలుగురేఖలు చిమ్మి, తాను అంధకారంలో విలీనమైపోయినాడు. ఆ శిథిల దేహంలో ఎన్నెన్ని కోర్కెలున్నాయో! బహుశా భగవంతుడు నా జీవితాని కొక ఆలంబనను సృష్టించటంకోసమే అతన్ని పంపించాడేమో. ఆశయం ఫలించిన తరువాత యింకా అతను ఎందుకుంటాడు!

# 4

వేసవికాలపు సెలవులిచ్చారు. గత రెండు సంవత్సరాల వేసవి సెలవుల్లో మోహన్ నావద్దనే ఉన్నాడు. మా మామయ్య బలవంతంచేసినా యింటికి వెళ్ళలేదు. ఈసారి కాలేజీ విద్యార్థులందరూ కాశ్మీర్ యాత్రకు వెళ్ళటానికి నిశ్చయించుకుని. దానికి నన్ను అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. కాశ్మీర్ యాత్రకు వెళ్ళాలని నాకూ ఎన్నాళ్ళనుండో కోరిక. ఈ అవకాశం వచ్చినందుకు మహా సంతోషించాను. మోహన్‌ను మామగారింటికి పంపించి, నేను కాశ్మీర్‌కు వెళ్ళిపోయాను. తిరిగి రెండు నెలలకు వచ్చాను. మోహన్‌కు జబ్బుగా ఉందని తెలిసింది. కాశ్మీర్‌లో నాకు మాటిమాటికీ తలపు కొచ్చేవాడు మోహన్. తిరిగి వెళ్ళిపోదా మనిపించేది. అత నంటే నా కింత ప్రేమని కాశ్మీర్ వెళ్ళిన తరువాత అర్థమైంది. కాని మిత్రులు నన్ను విడిచిపెట్టలేదు. అతను జబ్బుగాఉన్న వార్త వినగానే వ్యాకులపడిపోయాను. వచ్చిన మరురోజే అక్కడికి చేరుకున్నాను. నన్ను చూడగానే అతని పసుపు పచ్చని శుష్కించిన వదనంలో ఆనందం వెల్లివిరిసింది. నేను పరుగెత్తి అతనిని కౌగలించుకున్నాను. అతని నేత్రాల్లో స్వేచ్ఛా విహారం చేస్తున్న మృత్యువుకు సూచనగా అలౌకకమైన తేజస్సు తాండవిస్తోంది. "ఇలా అయిపోయినా వేమిటి మోహన్ ! రెండు మాసాల్లోనే యిలా ముంచుకొచ్చిందేం బాబూ !" ఆవేశపూరిత మైన కంపిత స్వరంతో ప్రశ్నించాను నేను. "నువ్వు కాశ్మీర్‌కు షికారుకు వెళ్ళావు. నేను ఆకాశంలో షికారుకు వెళ్తున్నాను" అమాయకమైన చిరు నవ్వుతో అన్నాడు మోహన్.

"ఈ విషాదగాథంతా చెప్పి దుఃఖించాలనీ, దుఃఖపెట్టాలనీ లేదు నాకు. నేను కాశ్మీర్ వెళ్లి పోయినతరువాత ఏదో తపస్సు చేస్తున్నాడా అన్నంతగా కష్టపడి చదువసాగాడు మోహన్. సంవత్సరం చదువూ రెండు మాసాల్లో చదివెయ్యాలనీ, స్కూలు తెరవగానే ఈ శ్రమకు ఫలితంగా నా నుండి ప్రశంసాచిహ్నమైన బహుమానం పొందాలనీ అతనికో వెర్రి ఆవేశం పట్టుకుంది. 'నే నతన్ని ఏ విధంగా హుషారుచేస్తానో ! ఎలా మెచ్చుకుంటానో ! నా మిత్రులతో తనను గురించి ఏ విధంగా వర్ణిస్తానో!' యిలాంటి ఆలోచనలు అతని బాలోచిత ఉత్సాహం, తన్మయత్వాలతో మిళితమై, అతన్ని వశీకరించు కున్నాయి. మామగారికి వారి ఆఫీసు పనుల వత్తిడిలో అతని ఆహ్లాదాన్నిగురించి శ్రద్ధతీసుకోటానికి అవకాశ మెక్కడుంటుంది? ఆయన బహుశా కుర్రాడు నిత్యం ఏదో ఒకటి చదువుతుండటం చూచి, మనసులో సంతోషిస్తుండేవాడు. అతనేమైనా ఆటలాడుతూ ఉంటే తప్పకుండా మందలించేవాడే. చదువుకుంటుంటే ఆయన మాత్రం ఏమంటాడూ ! దాని ఫలితంగా మోహన్‌కు కొద్దిగా జ్వరం తగులుతూ

వచ్చింది. ఆ స్థితిలోగూడా అతను చదవటం మానలేదు. వరుసగా మరికొన్ని అవక తవకలుగూడా జరిగినాయి. జ్వరం యింకా ప్రకోపించింది. ఆ స్థితిలోగూడా జ్వరం కాస్త తగ్గితేసరి, ఏదో పుస్తకం చూడటం ప్రారంభించేవాడు. అతని ప్రాణా లన్నీ నామీదే ఉండేవి. జ్వరస్థితిలోగూడా "ప్రకాశ్ బావనుంచి జాబేమైనా వచ్చిందా? బావ ఎప్పుడొస్తాడూ?" అని నౌకర్లను ప్రశ్నించేవాడు. ఇది తప్పితే మరో కోరికే ఉండేదికాదు. నా కాశ్మీర్ యాత్రకు యింతమూల్యం చెల్లించవలసి వస్తుందనుకుంటే అక్కడికి వెళ్ళాలనుకునేవాణ్ణికాదు. అతన్ని కాపాడటానికి నేను చెయ్యగలిగిందం తాచేశాను. కాని అది టైఫాయిడ్ జ్వరం. అతని ప్రాణాలు తీసిమాత్రమే వదిలిం దది. అతని జీవితస్వప్నాలు ఎవరో మహర్షి ఆశీర్వాదాలై నాకు ప్రోత్సాహమిచ్చాయి. నన్ను మీరు ఈ దశలో చూడగలగటానికి ఆ ప్రేరణే కారణం. మోహన్ ఉన్ననాటి అభిలాషలను వాస్తవికం చేసినందుకు నా కొక తృప్తిగా ఉంది. మోహన్ పవిత్రాత్మ నన్ను చూచి ఆనందిస్తోందన్న విశ్వాసమే నా కా తృప్తి నిస్తూంది. ఆ ప్రేరణే అత్యంత క్లిష్టతర పరీక్షల్లోగూడా నన్నుద్ధరిం చింది. లేకుంటే నేను ఈ రోజుకూ మీరు చూడటానికిగూడా ఏవగించుకునే ఆ మొద్దుసూర్యప్రకాశ్‌గానే ఉండిపోయేవాణ్ణి."

ఆనాటినుండి నేను అనేకసార్లు సూర్యప్రకాశ్‌ను కలుసుకున్నాను. అత నా వైపుకు వస్తే నన్ను కలవకుండా వెళ్లేవాడు కాదు. ఇప్పటికీ అతను మోహన్‌ను తన యిష్టదైవంగానే భావిస్తాడు. ఈనాటివరకూ మానవ మనస్తత్వంలో నేను అర్థంచేసుకోలేకపోయిన ఒకానొక పరమ రహస్య మిది.

—*—

# శేరుంబావు గోధుమలు

అనగా అనగా ఒక ఊళ్ళో శంకర్ అనే కుర్మిజాతి రైతు ఉండేవాడు. కల్లా కపట మెరుగని పేదవాడతను. తన పనేమో తానేమో, ఒకడికి తానొక కానీ యివ్వనక్కరనూలేదు. ఒకడొక కానీ తనకు యివ్వనక్కరలేదు. మడత పేచీలు పెట్టటం అంటే ఏమిటో ఎరుగడు. మోసం, కపటం అతనిలో కలికానికి కూడా కానరావు మోసపోతానేమోనన్న భయమే ఎరుగడు. మోసం చెయ్యటం అసలే చేతకాదు. ఉంటే భోంచేసేవాడు. లేకుంటే ఏ సెనగలో కాసిని తిని ఊరుకునేవాడు. అవీ లేకపోతే, బొక్కెడు నీళ్ళు త్రాగి 'రామా, కృష్ణా' అంటూ పడుకుని నిద్రపోయేవాడు. కాని ఎవరైనా అతిథి గడపలోకి వస్తేమాత్రం ఈ వైరాగ్యం వదులుకోవలసివచ్చేది. ముఖ్యంగా సాధువులూ, మహాత్ములూ రావటం సంభవిస్తే మాత్రం తప్పనిసరిగా అతను యిహలోక విషయాలకు దాసోహ మనాల్సి వచ్చేది. తానైతే ఆకలితో పడుంటాడుగాని, సాధువుల నెలా పస్తుబెడతాడూ? వాళ్లు కేవలం భగవద్భక్తు లాయిరిమరి!

ఒకనాడు సాయంత్రమప్పుడు ఒకసాధు వెవరో వచ్చి అతని వాకిట్లో పీఠం వేశాడు. ఆయన ముఖంలో తేజస్సు తొణికిసలాడుతోంది. మెడలో పీతాంబరం, శిరస్సుపై జటాజూటం, చేతిలో యిత్తడి కమండలం, పాదాలకు పావుకోళ్ళు, కళ్ళకు అద్దాలూ—వేషం అంతా అచ్చగా ఎట్లా ఉందనుకున్నారూ! శ్రీమంతుల మేడల్లో తపస్సూ, విమానాలమీద దేవస్థానాల సంచారం, యోగసిద్ధి సాధనకోసం షడ్రసోపేతమైన భోజనంచేస్తూ శ్రమించే మహాత్ములను స్మరణకు తెస్తోంది. ఇంట్లో జొన్నపిండి మాత్రముంది. అదెలా పెడతా డాయనకు. పూర్వకాలంలో జొన్నపిండి కెంత విలువైనా ఉందనీ, ఈ ఆధునిక యుగంలోమాత్రం జొన్నపిండి భోజనం సిద్ధులైన మహాత్ములకు జీర్ణం కావటం కష్టం. ఆ సాధు మహాత్మునికి ఏం పెట్టేదా అని ఎంతో బాధపడ్డాడు శంకర్-చివరకు ఎక్కడైనా గోధుమపిండి బదులు తెద్దామని నిశ్చయించుకున్నాడు. కాని ఊరంతా గాలించినా ఎక్కడా గోధుమ పిండే దొరకలేదు. గ్రామంలో ఉన్నవాళ్ళంతా కేవలం మనుష్యులు. దేవతలైన వాళ్ళు ఒక్కరూ లేరు. అలాంటప్పుడు దేవతలు ఆరగించే పదార్థాలు ఎలా లభిస్తాయి చెప్పండి? అదృష్టవశాత్తూ గ్రామ పురోహితునివద్ద కాసిని దొరికాయి. ఆయనవద్ద శేరుంబావు గోధుమలు (తూకం) అప్పతెచ్చి పిండి విసరమన్నాడు

భార్యను. ఆ మహాత్ముడు భోజనంచేసి హాయిగా నిద్రపోయాడు. ప్రొద్దున్నేలేచి శంకర్‌ను ఆశీర్వదించి తన దారిన వెళ్ళిపోయినాడు.

గ్రామ పురోహితుడైన ఆ బ్రాహ్మణ షాహుకారు సంవత్సరానికి రెండు సార్లు మామూళ్ళు తీసుకునేవాడు. "శేరుంబావు గోధుమలు పనిగట్టుకుని ఏం తీసుకెళ్ళి ఇస్తాంలే! ప్రతి సంవత్సరం మామూలుగా ఇచ్చే అయిదుశేర్లకు బదులు ఇంకా కాసిని ఎక్కువ సుట్టచెబితే సరిపోతుంది. ఆయనా అర్థం చేసుకుంటాడు. మనకు తృప్తిగా ఉంటుంది. అంతేలే!" అనుకున్నాడు శంకర్. చైత్రమాసంలో పురోహితుడు రాగానే, ఆయనకు ఏడున్నరశేర్ల గోధుమలు సుట్టజెప్పాడు. ఇక తన ఋణం తీరిపోయిందని తృప్తిపడ్డాడు. దాన్నిగురించి మళ్ళీ ఎన్నడూ ఆలోచించలేదు. ఆ బ్రాహ్మణుడు కూడా మళ్ళీ ఎన్నడూ ఆ విషయం ప్రస్తావించలేదు ఆ శేరుంబావు గోధుమల బాకీ తీర్చటంకోసం తాను తిరిగి మరో జన్మ ఎత్తవలసి వస్తుందని పాప మా అమాయకుడు శంకర్‌కు ఏం తెలుసు!

## 2

ఏడు సంవత్సరాలు గడిచిపోయినాయి. గ్రామ పురోహిత బ్రాహ్మణుడు గ్రామ వడ్డీ వ్యాపారస్తుడుగా మారిపోయినాడు. రైతుగావున్న శంకర్ కూలీ అయిపోయినాడు. అతని తమ్ముడు మంగళ్ అతనినుండి వేరుపడిపోయినాడు. ఇద్దరూ కలిసి వున్నప్పుడు యిద్దరూ రైతులే. వేరుపడిన తరువాత కూలీలుగా మారిపోయారు. అయినా ద్వేషపు చిచ్చు చెలరేగనీయకూడ దనుకున్నాడు శంకర్. కాని, పరిస్థితులు అతనికి మరో దారిలేకుండా చేశాయి. వేర్లుపడి వేరువేరు పొయ్యిలు పెట్టుకున్న రోజున వెక్కి-వెక్కి ఏడ్చాడు శంకర్. ఈరోజునుండి అన్నదమ్ములు శత్రువులైపోతారు ఒకడు ఏడుస్తుంటే మరొకడు నవ్వుతాడు. ఒకడి ఇంట్లో శోకాలు పెడుతుంటే మరొకడింట్లో పండిపంటలు చేసుకుంటారు. ప్రేమానుబంధాలూ, రక్తసంబంధాలూ, అన్నదమ్ముల బంధాలూ అన్నీ నేటితో అంతరించిపోతాయి. అతను భగీరథుడు పడ్డ బాధలన్నీపడి, వంశప్రతిష్ఠ అనే వృక్షాన్ని నాటాడు. తన రక్తంతో దాన్ని పోషించాడు. నేడావృక్షం కూకటి వ్రేళ్ళతో పెళ్ళగించబడుతుంటే అతని హృదయం ముసాతునక లైపోతోంది. వారం రోజులవరకూ శంకర్ అన్నం ఎలా ఉంటుందో కళ్ళచూడలేదు. రోజంతా జ్యేష్ఠ మాసపు ఎండలో పనిచేసేవాడు. రాత్రికి కడుపుమాడ్చుకుని పడుండేవాడు. ఈ భయంకరమైన దిగులూ, ఈ భరింపరాని శ్రమా రక్తాన్ని పీల్చేసింది. మాంసాన్నీ, మూలుగులనూకూడా కరగదీసింది. జబ్బునపడటం జరిగితే నెలల

తరబడి మంచంలోనే పడుండేవాడు. ఇక జీవనం గడిచేదెలా? అయిదు బీఘాల పొలమల్లా సగానికి వచ్చింది. ఒక్క ఎద్దు మిగిలింది. ఇక ఈ పరిస్థితుల్లో వ్యవసాయ మేం జరుగుతుంది బూడిద? రానురాను చివరకు వ్యవసాయం కులమర్యాద కాపాడుకోటానికి ఒక ఉపాయమాత్రంగా పరిణమించింది. బ్రతుకుభారం కూలి ద్వారానే మోయవలసి వచ్చేది.

ఏడు సంవత్సరాలు గడిచిపోయినాయి. ఒకరోజు శంకర్ కూలికివెళ్ళి తిరిగి వస్తున్నాడు. "ఏమోయ్ శంకర్! రేపువచ్చి నీ ధాన్యం బాకీలెక్క చూసుకో. అయిదున్నరమణుగుల ధాన్యం ఇవ్వవలసి ఎన్నాళ్ళయింది నువ్వు? ఇద్దామని అనుకోనైనా అనుకోవేం? పంగనామాలు పెడదామనుకున్నావా ఏం?" దారిలో ఆపి అడిగాడు పురోహితుడు.

శంకర్ నివ్వెరపోయినాడు— "అయిదున్నర మణుగులు కావటానికి అసలు నేను మీ దగ్గర తీసుకున్నదెప్పుడూ? మీరు పొరపాటుపడ్డున్నారు. నేనెవరికీ గిద్దెడు గింజలుగానీ, కానీ రొఖ్ఖంగానీ బాకీ అన్నమాటే ఎరుగను."

"ఇలా తయారుకాబట్టే తిండికికూడా వాచిపోయేగతి పట్టింది."

ఈ మాట అని, అప్పటికి ఏడు సంవత్సరాలక్రితం తాను శంకర్‌కు ఇచ్చిన శేరుంబావు గోధుమల విషయం వివరించాడు. అది విని శంకర్ నిశ్చేష్టుడైనాడు. అయ్యో భగవంతుడా! నేను ఈయనకు మామూళ్లు ఎన్నిసార్లిచ్చానూ? నాకీయన కించిత్తు పనైనా చేయలేదే. పంచాంగం చూపించుకోవాలన్నా, ముహూర్తం, శకునం వగైరాలు తెలుసుకోవాలన్నా, ఎన్నడైనావెళ్తే కొద్దో, గొప్పో దక్షిణ సమర్పించుకుంటూనే ఉండేవాణ్ణి. ఇంత స్వార్థమా! శేరుంబావు గోధుమలను, గ్రుడ్డును పొదిగినట్లుపొదిగి నన్ను మ్రింగటానికి ఒక భూతాన్ని తయారుచేసి కూర్చున్నాడు ఈ మధ్యకాలంలో ఒక్కసారి మాటమాత్రం అని ఉంటే నేను గోధుమలు తూచి మరి ఇచ్చేవాణ్ణే! ఇలా తయారౌదామనేనా ఇన్నాళ్లూ గుట్టుగా ఊరుకుంది?—"స్వామీ! పేరుజెప్పి నే నెన్నడూ శేరుంబావు గోధుమలు ఇవ్వని మాట నిజమే. కాని, అనేకసారు మామూళ్ళ సందర్భాల్లో శేరూ, రెండు శేర్లూ గూడా అదనంగా ఇచ్చానే! ఇవ్వాళవచ్చి మీరు నన్ను అయిదున్నర మణుగుల గోధుమలివ్వాలంటే ఎక్కడినుండి తెచ్చేది చెప్పండి!" అన్నాడు శంకర్.

"అప్పు అప్పే; దానం దానమే. ఒక్క శేరుకాదు; అయిదు శేర్లు యిస్తే మటుకేం? నీ విచ్చిందేమీ లెక్కలోకి రావు. ఖాతా పుస్తకంలో నీ పేరిట అయిదున్నర మణుగుల గోధుమలు బాకీ ఉంది. కావాలంటే నీ యిష్టం వచ్చినవాళ్ళచేత లెక్కచూపించుకో. ఇచ్చావా ఖాతాలో నీపేరు కొట్టేస్తాను. లేదా బాకీ యింకా యింకా పెరుగుతూనే ఉంటుంది" అన్నాడు పురోహితుడు.

"స్వామీ! ఒక పేదముండా కొడుకును పీడించట మెందుకు చెప్పండి. పూట తిండికి గతిలేనివాణ్ణి. ఇన్ని గోధుమలు ఎవరింట్లో కొల్లగొట్టుకురానూ?

"ఎవరింట్లో కొల్లగొట్టుకొస్తావో నాకు తెలియదు. నేనుమాత్రం ఒక్క చటాకు గింజలుకూడా తీసివెయ్యను. ఇక్కడ తప్పించుకుంటే దేవుడి దగ్గర తప్పించుకుంటావా?"

శంకర్ వణికి పోయినాడు. చదువుకున్న మనవంటివాళ్ళమైతే "సరే దేవుడి దగ్గరే యిస్తాంలెండి. ఇక్కడకంటె అక్కడ ఎక్కువ యివ్వవలసి ఉండదు లేండి!" అనేవాళ్ళమే. కనీసం అలా యివ్వవలసి వస్తుందనటానికి మనకాధారమేమీ లేదు. ఇక మనకు దాన్నిగురించి దిగులెందుకూ? కాని శంకర్ అంత తర్క శాస్త్రజ్ఞుడూ, లౌకికుడు కాదు. ఒకటి ఋణబాధ-అదీ బ్రాహ్మణ ఋణం-అమ్మయ్యో! ఖాతాలో పేరుండి పోయిందంటే తిన్నగా నరకానికి వెళ్ళకతప్పదు. ఈ భావం కలగగానే అతని రోమాలన్నీ నిక్కబొడుచుకున్నాయి. "స్వామీ! మీకివ్వవలసిన బాకీ భగవంతుడి దాకా ఎందుకూ? ఇక్కడే యిచ్చేస్తాను. జన్మలో కష్టాలు అనుభవిస్తూనే ఉన్నాను. వచ్చే జన్మకూడా నిప్పులు జల్లుకోటమెందుకూ? అయినా ఇది మాత్రం న్యాయంకాదు. "స్వామీ! మీరు గోరంతలు కొండంతలు చేశారు. బ్రాహ్మణులై పుట్టి యిలా చెయ్యవలసిందికాదు. అప్పుడే పేచీ పెట్టి మీ బాకీ మీరు వసూలు చేసుకొని ఉంటే యివ్వాళ నా నెత్తిన ఇంత బరువు పడేదా చెప్పండి! నే నిచ్చేస్తాననుకోండి. కాని మీరు మాత్రం భగవంతుడి ముందు సంజాయిషీ చెప్పుకోకతప్పదు."

"అక్కడి భయాలు మీకుంటాయి. మాకెందు కుంటాయ్! అక్కడంతా మా సోదరులూ, బంధువులే. మహర్షులంతా మా బ్రాహ్మణులేగా. దేవతలుకూడా బ్రాహ్మణులే. ఏమైనా లోటుపాట్లుంటే వాళ్ళే సర్దుబాటు చేసుకుంటారు. అయితే మరి ఎప్పుడిస్తానంటావ్?"

"నాదగ్గరిప్పుడు హాజరుగా ఎక్కడున్నాయి స్వామీ! ఎవరినైనా అప్పో సప్పో అడిగి తెస్తేగదా ఇవ్వగలిగేది!" అన్నాడు శంకర్.

"అవ్వన్నీ నే నొప్పుకోను. ఏడు సంవత్సరాలైంది. ఇక ఒక్కరోజు కూడా ఆగను. దస్తావేజు వ్రాసివ్వు."

"నే నెటూ ఇవ్వవలసిందేగా! గోధుమలు తీసుకున్నా సరే; దస్తావేజు వ్రాయించుకున్నాసరే. మీ యిష్టం. ఏ లెఖ్ఖన కట్టుకుంటారు ధర?"

"బజారు ధర అయిదుసేర్లుంది. అయిదుందావు శేర్లచొప్పున సరిచేసుకుందాంలే."

"ఇచ్చినవణ్ణి ఇవ్వనే ఇస్తున్నాను. బజారు ధరే కట్టుకోండి. పావుశేరు కోసం అపరాధి నెందుకు కావాలి?"

లెక్కచూస్తే గోధుమల ధర అరవైరూపాయలైంది. అరవై రూపాయలకు దస్తావేజు వ్రాశాడు. వడ్డీ నూటికి మూడు రూపాయలు. సంవత్సరం లోపల ఇవ్వకపోతే ఆ తరువాత వడ్డీరేటు నూటికి మూడున్నర రూపాయలు. స్టాంపుకు

ముప్పావలా. దస్తావేజు మామూలు రూపాయి శంకర్ అదనంగా ఇచ్చుకోవలసి వచ్చింది.

ఆ పురోహితుణ్ణి గ్రామమంతా నిందించింది. కాని ముఖం చాటున మాత్రమే. వడ్డీ వ్యాపారస్థుడితో అందరికీ పనుంటుందాయె. అలాంటప్పుడు ఆయన ఎదుట పడే వాళ్ళెవరుంటారూ?

# 3

శంకర్ సంవత్సరం పొడుగునా ఘోరంగా శ్రమపడ్డాడు. గడువుదాటక ముందే డబ్బు కట్టేద్దామని దీక్ష పట్టాడతను. రెండుమూడుపూటలైనా పొయ్యిరాజేదికాదు. ఏ సెనగలో తిని పూటగడిపేవాడు. ఇప్పుడదీ మానేశాడు. పిల్లవాడికి మాత్రం రాత్రికి రొట్టెలు అట్టిపెట్టేవాడు. రోజు కొక కానీ చుట్టపొగాకు త్రాగేవాడు. అతను ఏ పరిస్థితుల్లోనూ వదిలిపెట్టలేని వ్యసనమల్లా అదొక్కటే. ఇప్పుడదికూడా ఈ కఠోరదీక్షకు ఆహుతైపోయింది. అతను తన భంగుపాత్రను బద్దలుకొట్టేశాడు. హుక్కాగొట్టం విరగగొట్టేశాడు. పొగాకుపాత్ర ముక్కలు ముక్కలు చేశాడు. దుస్తుల విషయంలో త్యాగపు ఆఖరు హద్దులను అత నెప్పుడో చేరుకున్నాడు. ఇప్పుడతను ప్రకృతి దయాదాక్షిణ్యాలకు బద్ధుడైపోయాడు. శిశిరంలోని ఎముకలు కొరికే చలిలో చలిమంటలతో గడిపాడు. ఈ ధృవ సంకల్పానికి ఫలితం, ఆశించినదానికి అధికంగానే లభించింది. సంవత్సరం ఆఖరుకు అతనివద్ద అరవైరూపాయలు పోగైనాయి. పంతులుగారికి ఆ అరవైరూపాయలూ ఇచ్చి "స్వామీ! మిగతా పైకం కూడా త్వరగానే యిచ్చుకుంటాలెండి" అని చెప్పుకుందా మనుకున్నాడు. ఇక పదిహేనురూపాయల భాగ్యం పంతులుగారు ఆ మాత్రం ఒప్పుకోకపోతారా? శంకర్ ఆ రూపాయలు తీసుకుని వెళ్ళి పంతులుగారి పాదాలముందు సమర్పించు కున్నాడు. "ఎక్కడైనా అప్పు తెచ్చావా ఏం?" ఆశ్చర్యంగా అడిగాడు పంతులుగారు.

"లేదు పంతులుగారూ! మీ ఆశీర్వాదంవల్ల ఈ ఏడేదో విధంగా కూలి బాగా గిట్టిందిలెండి."

"కాని ఇది అరవై రూపాయలేనే?"

"ఔను స్వామీ! ఇది ఇప్పుడు తీసుకోండి. మిగతాది రెండుమూడు నెలల్లో ఇచ్చివేస్తాను. నా బాకీ రద్దుచేసెయ్యండి స్వామీ!"

"నా కివ్వవలసింది చిల్లిగవ్వతోసహా ఇచ్చివేసిననాడే నీ బాకీ రద్దవుతుంది; వెళ్ళి మిగతా పదిహేనూ తీసుకురా."

"పంతులుగారూ ! ఈమాత్రం కనికరించండి. రాత్రిపూట రొట్టెలకు కూడా గతిలేక అవస్థపడుతున్నాను. ఊళ్ళోఉంటే ఎప్పుడో ఒకప్పుడు తీర్చకపోను:"

"నేనిటువంటివ్యాధులను ఎంతమాత్రం ప్రోత్సహించను. నా కిన్నిమాటలు చేతగావుకూడా. నా పైకం ఇప్పుడే పూర్తిగా ఇచ్చివేయకపోతే ఈ రోజునుండీ నూటికి మూడురూపాయలన్నర వడ్డీ ఇవ్వాలి తెలుసా? ఇవిగో నీ రూపాయలు. నీ ఇంట్లో ఉంచుకున్నానసరే; నా దగ్గర ఉంచినా సరే అదంతా నీ ఇష్టం."

"సరేలెండి తెచ్చినంతవరకు మీ దగ్గరే ఉంచండి. నేను వెళ్లి ఎక్కడైనా మిగతా పదిహేనుకుకూడా తిప్పలు బడతాను."

శంకర్ ఊరంతా గాలించాడు. కాని పైకం ఎవ్వరూ ఇవ్వలేదు. శంకరంటే నమ్మకం లేకా కాదు; ఎవడి దగ్గరా పైకం లేకా కాదు. పంతులుగారి వేట పాడు చేయగల సాహసం ఒక్కడికీ లేదు మరి !

# 4

క్రియకు ప్రతిక్రియ సహజధర్మం. సంవత్సరమంతా ప్రేగులు తెంచుకున్న ఋణ బాధనుండి విముక్తుడు కాకపోయిన ఫలితంగా శంకర్ సంయమం విరాళగా పరిణామం చెందింది. "ఇన్ని బాధలుపడ్డా సంవత్సరం మొత్తంమీద అర పై రూపాయలకు మించి కూడబెట్టలేకపోతినే. ఇక ఇంతకు రెండు రెట్లు రూపాయలు ఏ ఉపాయంతో కూడబెట్టను? ఋణభారం మోయటం ఎటుదిరిగీ తప్పనప్పుడు మణుగైతేనేం; రెండు మణుగులైతేనేం." అనుకున్నాడు శంకర్. అతని ఉత్సాహం మందగించింది. శ్రమ చెయ్యటం అంటేనే అసహ్యం ఏర్పడింది. ఆశ ఉత్సాహానికి తల్లివంటిది. తేజస్సూ, సామర్థ్యమూ అన్నీ ఆశలోనే ఉన్నాయి. అసలు జీవితాని కాధారమే ఆశ ప్రపంచాన్ని నడిపిస్తున్న మహాశక్తి ఈ ఆశే. శంకర్ ఆశను కోల్పోయి విరక్తుడైపోయాడు. అతను ఈ సంవత్సరకాలంనుండీ త్రొక్కిపట్టి ఉంచిన అవసరాలు ఇప్పుడిక బిచ్చగాళ్ళ లాగా గడపదగ్గర దేబిరించే స్థితిలో లేవు. ఇప్పుడవి గుండెల మీదెక్కి, స్వారీచేసే భూతాల్లాగా తయారైనాయి. ఆ భూతాలిక తమ పట్టు నెగ్గించుకోందే ప్రాణాలతో వదిలిపెట్టవు. గుడ్డలకు మాసికలువేస్తూ గడపటానికి కూడా ఒక హద్దంటూ ఉంటుంది. ఇక యిప్పుడు శంకర్‌కు కూలి చేసిన డబ్బులొస్తే కూడబెట్టటం మానేశాడు. ఒకసారి గుడ్డలు తెచ్చేవాడు. మరొకప్పుడు ఏ తినుబండారాలో తెచ్చేవాడు. పూర్వం రోజుల్లో చుట్ట మాత్రమే త్రాగేవాడల్లా ఇప్పుడు గంజాయి లాంటి వ్యసనాల్లో కూడా పడ్డాడు. ఇప్పుడతనికి బాకీ చెల్లించాలనే ఆలోచనే లేదు. తాను ఎవరికీ ఒక్క చిల్లి కానీ కూడా బాకీ

లేనట్లుగానే ఉందతనికి. ఇదివరకు చలిజ్వరంతో బాధపడు తుండేవాడు. అయినా తప్పకుండా పనికి వెళ్ళేవాడు. ఇప్పుడు పనికి వెళ్ళకుండా తప్పించుకోటానికి సాకులు వెదకుతున్నాడు.

ఈ విధంగా మూడేండ్లు గడిచినాయి. పంతులుగారు ఈ మధ్య కాలంలో ఎప్పుడూ బాకీ విషయం ప్రస్తావించనే లేదు. నేర్పరియైన వేటకాడిలాగా గురిగా దెబ్బ తీద్దామనుకున్నాడు. వేట జంతువును ముందుగానే మేలుకొలపటం ఆయన నీతికి విరుద్ధం.

ఒకరోజు పంతులుగారు శంకర్‌ను పిలిచి లెక్క చూపించాడు. జమకట్టిన అరవై రూపాయలు పోను యింకా యిప్పటికీ నూట యిరవై రూపాయలు ఇవ్వ దేల్చాడు.

"ఇంత పైకం యింకో జన్మమెత్తి తీర్చవలసిందే. ఈ జన్మలో మాత్రం అయ్యేపని కాదు" అన్నాడు శంకర్.

"నేను ఈ జన్మలోనే వసూలు చేస్తాను. అసలు యివ్వక పోయినా వడ్డీ మాత్రం యిచ్చి తీరవలసిందే."

"ఒక్క ఎద్దు ఉన్నది. తోలుకోండి. ఒక్క గుడిసెమాత్రం ఉంది. తీసుకోండి. అంతకంటె నా దగ్గ రేముంది చెప్పండి"

"ఎద్దులూ, దూడలూ తీసుకుని నే నేం చేసుకుంటానూ. నా కివ్వాలనుకుంటే నీ దగ్గర చాలా పైకం ఉంటుంది."

"ఇంకా ఏముంది పంతులుగారూ!"

"ఏమీ లేకపోతే నువ్వు లేవూ? నువ్వు ఎటూ ఎక్కడో ఒకచోట కూలికి వెళ్తున్నావుగదా! నాకూ వ్యవసాయానికి ఎటూ కూలీలను పెట్టుకోక తప్పదు. వడ్డీ క్రింద నువ్వు మా దగ్గరే పని చేస్తుండు. వీలుచిక్కినప్పుడు అసలుకూడా యిద్దువు గాని. ఇంతకూ ఉన్న విషయం చెబుతున్నా. నా బాకీ తీరిందాకా నువ్వు మరో చోట పనిచెయ్యటానికి వీల్లేదు. నీ దగ్గర ఆస్తిపాస్తులేమీ లేవు. ఇంత పెద్దబాకీ ఏ నమ్మకంతో వదిలిపెట్టను! ప్రతినెలా నువ్వు నా వడ్డీ చెల్లిస్తానని హామీ యిచ్చే దెవరు? ఎక్కడో సంపాదించినా వడ్డీయే యివ్వలేకపోతే అసలు సంగతి ఆశ ఏమిటి?"

"వడ్డీక్రింద సరే పనిచేస్తాను. మరి నా తిండి సంగతెలా స్వామీ!"

"నీ భార్య ఉందె; కొడుకు ఉన్నాడాయె; వాళ్ళంతా కాళ్ళు చేతులు విరగ గొట్టుకు కూర్చుంటారా ఏం? మరి నీ సంగతంటావా? రోజూ ఒక అర్ధశేరు జొన్నలు అంబలి కాచుకోటానికి యిస్తుంటాలే. కప్పుకోటానికి సంవత్సరాని కొక కంబళి యిప్పిస్తాను. ఒక చొక్కాకూడా కుట్టిస్తాను. ఇంక నీకు కావలసిందేముంది? ఇతరులైతే నీకు రోజుకు పావలాఅర్ధణా కూలియిస్తారన్నది నిజమేననుకో! కాని నిన్ను

నేను పనిలో ఉంచుకుంటున్నది నా బాకీ తీర్చుకోటంకోసంగాని నా అవసరంకోసం కాదుగా।"

కొంచెంసేపటివరకూ దీర్ఘమైన ఆలోచనలో మునిగిపోయి "యిది చివరకు జన్మదాస్యమేగద స్వామీ।" అన్నాడు శంకర్.

"దాస్యం అనుకో; కూలీ అనుకో. ఎలా అనుకున్నాసరే. నేను నా బాకీ రాబట్టుకోకుండా మాత్రం నిన్ను వదిలిపెట్టను. నీవు పారిపోతే నీ కొడుకు తీరుస్తాడు. ఇక ఎవరూ లేకపోతే అప్పటి సంగతి వేరు."

ఈ తీర్పుకిక తిరుగులేదు. కూలివాడికి హామీ ఉండేదెవరు? మరో దిక్కు ఎక్కడుంది? పారిపోతే మాత్రం ఎక్కడికి వెళతాడు? మరుసటిరోజునుంచీ శంకర్ పంతులుగారివద్ద పనిచెయ్యడం ప్రారంభించాడు. శేరుంబావు గోధుమల కారణంగా జీవితమంతా బానిసగా బ్రతకవలసి వచ్చింది. 'ఇదంతా నా పూర్వజన్మ సంస్కార' మనే భావమొక్కటే యిప్పుడా నిర్భాగ్యుడికి తృప్తికలిగిస్తోంది. భార్య తాను ఎన్నడూ చేయనిపనులన్నీ చేయవలసివచ్చింది. పిల్లలు అన్నానికి గిలగిలలాడి పోయ్యేవాళ్ళు. కాని కళ్ళప్పగించి చూడటం మినహా యింకేమీ చేయలేక పోయేవాడు. ఆ గోధుమల బాకీ ఏదో దేవత శాపంలా జీవిత పర్యంతం అతని శిరస్సునుండి వైదొలగలేదు.

## 5

శంకర్ ఆ బ్రాహ్మణునివద్ద యిరవై సంవత్సరాలు దాస్యం చేసి చేసి ఈ సారహీనమైన ప్రపంచంనుండి ప్రయాణంగట్టాడు. నూట యిరవై రూపాయల రుణం యింకా అతని నెత్తిమీదెక్కి స్వారీచేస్తూనే ఉంది. ఆ బ్రాహ్మణుడు పాపమా నిర్భాగ్యుణ్ణి భగవంతుడి దర్బారులో ఇంకా హింసపెట్టటం భావ్యంకాదనుకున్నాడు. అతనంత అన్యాయస్థుడుగానీ. కటికవాడుగానీకాదు. వయసులో ఉన్న శంకర్ కొడుకు గొంతుమీద కూర్చున్నాడా విప్రుడు. ఈ రోజువరకూ యింకా అతను ఆ బ్రాహ్మణునివద్ద చాకిరీ చేస్తూనే ఉన్నాడు. అతనికి విముక్తి ఎప్పుడో? అసలు విముక్తంటూ ఉంటుందా? ఏమో ఆ భగవంతుడికే తెలియాలి।

పాఠకులీ కథంతా వట్టి కల్పిత మనుకుంటున్నారు కదూ? కాదుకాదు. ఇదొక వాస్తవిక ఘటన. ఇటువంటి శంకర్‌లూ, ఇటువంటి విప్రులూ యింకా ఈ ప్రపంచంలో ఉండనే ఉన్నారు.

—*—

# బిళ్లంగోడు

మా ఆంగ్ల పండిత మిత్రుడు బొనన నీండి; కావన నీండి. బిళ్ళంగోడు మాత్రం ఆటలన్నింటికీ రాజంటాను నేను. ఇప్పటికీ పిల్ల లెక్కడైనా బిళ్ళంగోడు ఆడటం కంటబడితే ముగ్ధుణ్ణయిపోతాను. వాళ్ళతో కలిసి ఆడుదామా అని తహతహ లాడిపోతాను

కోర్టు, నెట్టూ, బేటూ-యివ్వేమీ అక్కర లేదీ యాటకు. హుషారుగా ఏ చెట్టన్నా ఎక్కి ఒక కొమ్మ విరగదీయటం, బిళ్ళంగోడు తయారుచెయ్యటం-అంతే! ఇద్దరు చేరినా ఆట సాగిందన్నమాటే. విదేశీ ఆటల్లో ఒక లోటుంది. వాటికి కావలసిన పరికరాలు బోలెడు ధర పెడితేగాని రావు. కనీసం వందరూపాయలైనా ఖర్చుపెడితే గాని ఆటగాళ్ళ లెక్కలోకి రారు. బిళ్ళంగోడున్నదంటే ఆడంబరమేమీ లేకుండానే మాంచి రక్తికడుతుంది ఆట. మనం మన వస్తువులంటేనే ఏవగించుకునేటంతగా విదేశీవస్తు వ్యామోహంలోపడి ఉన్మాదులమైపోతున్నాం. మన స్కూళ్ళలో ప్రతిపిల్లవాడినుండీ ప్రతి సంవత్సరం కేవలం ఆటలకోసమే మూడు నాలుగు రూపాయల ఫీజు వసూలు చేస్తున్నారు. చిల్లిగవ్వ ఖర్చుకాకుండా ఆడటానికి వీలయ్యేవి మన భారతీయ ఆటలు. మన దేశీయ ఆటలు ఆడించుదామన్న ఆలోచన ఒక్కడికీ తోచదేం? ఇంగ్లీషు ఆటలు ధనవంతులకైతే అనుకూలం. ఈ వ్యసనం తీసుకొచ్చి పేద పిల్లల నెత్తిన రుద్దుతారేం? బిళ్ళంగోడు వల్ల కళ్ళు బొత్తలు పడతాయేమోననే భయం ఉండేమాట నిజమే. అయితే క్రికెట్‌వల్ల కూడా తలలు బ్రద్దలుగావటానికీ, డొక్కలు పగలటానికీ, కాళ్ళు విరగటానికీ అవకాశముంది. నా నొసట ఈనాటికీ బిళ్ళంగోడు దెబ్బగుర్తున్నదంటారా? అయితే క్రికెట్ మూలంగా కొయ్యకాళ్ళు తగిలించుకున్న మిత్రులుగూడా బోలెడుమంది ఉన్నారు. సరే! అదంతా వాళ్ళ వాళ్ళ ఇష్టం. నాకు మాత్రం ఆట లన్నిటిలోకీ బిళ్ళంగోడే బాగుంటుంది. నా బాల్య స్మృతుల్లో గూడా బిళ్ళంగోడుకు సంబంధించిన ఘటనలే మధురంగా ఉంటాయి. ఆ ప్రొద్దున్నే బయలుదేరటం, చెట్లెక్కి ఆ కొమ్మలు విరవటం, బిళ్ళంగోళ్ళు తయారు చెయ్యటం, ఆ హుషారూ, ఆ పట్టుదలా, ఆ ఆటగాళ్ళ జట్లూ, ఆట పెట్టటాలూ, పెట్టించటాలూ, ఆ పోట్లాటలూ, పేచీలూ - అంటరానితనాలూ, కలిమిలేముల భేదాలు కలికానికైనా కానరాని ఆ నిష్కపట స్వభావాలూ ఎంత చిత్రంగా ఉండేవి. ధనవంతుల నిక్కులకూ. ఆడంబరాలకూ, దర్పాలకూ, దురభిమానాలకూ వీసమంతైనా ఆస్కారముండేదా! ఆ మధుర దినాలను మరచిపోవటం

ఎప్పటికైనా....ఏనాటికైనా సాధ్యమౌతుందా! అబ్బ!.... అసంభవం. ఇంట్లో వాళ్ళు మండిపడుతుంటారు. నాన్నగారు భోజనం ముందు కూర్చుని కోపమంతా రొట్టెలమీద చూపిస్తూ ఉంటారు. అమ్మ నాకోసం మాటి మాటికీ వాకిలివైపు చూస్తూ ఉంటుంది. అంతకంటే ఆమె ఏం చెయ్యగలుగుతుంది? వారి దృష్టిలో నా అంధకారమయ భవిష్యత్తు బ్రద్దలైన ఓడలాగా తబ్బిబ్బవుతోంది. కాని నాకో! స్నానం, భోజనం వీటి ధ్యాసే పట్టలేదు. ఆట పెట్టించుకునే నిషాలో ఉన్నాను నేను. బిళ్ళంగోడు చూస్తే జానెడుకూడా లేదు, కాని ప్రపంచంలోని మిఠాయి లన్నిటి లోనూ ఉండే తీపి, వినోదాల్లో ఉండే ఆనందమూ ఈ బిళ్ళంగోడులోనే ఉన్నాయి.

నామిత్రుల్లో గయా అనే కుర్రాడొక డున్నాడు. నాకంటె రెండు మూడేళ్ళగా పెద్ద. సన్నగా. పొడుగ్గా ఉంటాడు. కోతుల వ్రేళ్ళ మాదిరిగా సన్నని, పొడుగాటి వ్రేళ్ళు వాడివి. దుందుడుకుతనం చూచినా, పోకిరీతనం చూచినా వాడి వాలకమంతా అచ్చగా కోతే. ఎలాంటి బిళ్ళంగోడయినాసరే పురుగులమీదికి బల్లి ఉరికినట్లుగా ఉరికేవాడు. అతనికి అమ్మ, నాన్న ఉన్నారో లేదో, ఎక్కడుంటున్నాడో ఏమిటో, తిండి తింటున్నాడో లేదో ఈ విషయాలేమీ నాకు తెలియవు. కాని మా బిళ్ళంగోడు క్లబ్బులో అతనే ఛాంపియన్. అతను చేరినపక్షం జయించితీరిందన్న మాటే. మేమంతా వాడు రావటం దూరాన్నుండే చూచి పరుగెత్తి ఆహ్వానించి మా తరఫున చేర్చుకునేవాళ్ళం.

ఒకరోజు నేనూ, గయా మేమిద్దరమే ఆడుకుంటున్నాం. వాడు ఆట పెట్టించుకున్నాడు. నేను పెడుతున్నాను. కాని తమాషా ఏమిటో! ఆట పెట్టించుకుం టుంటేమాత్రం రోజంతా అయినా హుషారుగా ఉంటా. కాని ఆటపెట్టేటప్పుడు మాత్రం నిమిషం సేపయినా దుర్భర మనిపిస్తుంది. తప్పించుకోటానికి ఎన్ని ఎత్తులో ప్రయోగించాను. రూల్సుకు వ్యతిరేకమైనా అటువంటి సందర్భాల్లో అవన్నీ మామూలే. అయినా గయా తన ఆట పెట్టించుకోందే వదిలితేగా!

నేను ఇంటివైపుకు పరుగెత్తాను. బ్రతిమాలినందువల్ల ఏమీ లాభంలేక పోయింది. మరేం చెయ్యనూ!

గయా పరుగెత్తిపట్టుకున్నాడు నన్ను. లాఠీకర్ర పైకెత్తి "నా ఆటపెట్టి మరీ కదులు. నాచేత పెద్ద మొనగాడిమాదిరి పెట్టించుకుంటివే ఆటా? నువ్వు పెట్టొచ్చే ప్పటికి పారిపోతావేం?" అన్నాడు.

"రోజంతా పెట్టమంటే పెడతానేం!"

"ఆ రోజల్లా పెట్టాల్సిందే నువ్వు."

"తిండీ తినక్కరలేదు. నీళ్ళు త్రాగనక్కరలే దన్నమాట."

"ఔను! అంతే! నా ఆట పెట్టందే ఎక్కడికీ వెళ్ళటానికి వీల్లేదు."

"నేనేం నీ బానిసనా!"

"ఆః నా బానిసవే."

"అయితే నే నింటికి వెళ్ళిపోతున్నా. చూస్తా నేంచేస్తావో."

"ఇంటి కెళతా? ఏం? తమాషా అనుకున్నావా? ఆట గెలిచాను గనుక ఆట పెట్టి మరీ కదులు."

"అయితే నిన్న నే నిచ్చిన జామకాయ నాకిచ్చేసెయ్."

"అది పొట్టలో కెళ్ళిపోయింది."

"అయితే బయటికి తియ్యి. ఎందుకు తిన్నావేం నా జామకాయా?"

"నువ్విస్తే తిన్నాను. నేను నిన్నేమీ దేబిరించలా."

"నా జామకాయ ఇచ్చిందాకా నేను ఆటపెట్టను."

నా అభిప్రాయం నాదే న్యాయమని. ఇంతకూ ఏదో స్వార్థంతోనే ఆ జామకాయ యిచ్చానన్నమాట. ఎవడితోనైనా నిస్వార్థంగా ప్రవర్తించేవా శ్లెవరూ? బిచ్చం పెట్టటంకూడా స్వార్థానికే. నా జామకాయ తిన్న గయాకు నాచేత ఆట పెట్టించుకునే అధికార మెక్కడుందీ? లంచమిచ్చి మనుషులు రక్తాన్నిగూడా జీర్ణించుకుంటారు. నా జామకాయ ఉత్తినే జీర్ణమౌతుందీ? కానీకి అయిదు ఇస్తున్నారు జామకాయలు. గయా తండ్రికూడా అవి తింటానికి నోచుకోడు. అటువంటప్పుడు గయాది కేవలం అన్యాయం కదూ?

గయా నన్ను తనవైపుకు లాగుతూ "జామకాయలూ, గీమకాయలూ నాకేం తెలియవు. నా ఆట చెల్లించి మరీ కదులు" అన్నాడు.

న్యాయబలం నావైపుంది. అతను అన్యాయానికి పాలుపడ్డాడు. నాకు చెయ్యి విదిలించుకు పారిపోదామనుంది కాని అతను నన్ను పోనీయటంలేదు. బూతులు తిట్టాను నేను. వా డంతకంటె ఎక్కువగా బూతులు తిట్టాడు. తిటటమే కాదు. లాగి రెండు దెబ్బలుకూడా వేశాడు. అతన్ని పట్టుకు కొరికాను నేను. దాంతో వాడు చేతిలో కర్రపెట్టి లాగి వీపుమీద ఒక్కటివేశాడు. నేను ఏడవటం మొదలెట్టాను. గయా నా ఈ అస్త్రాన్ని ఎదుర్కోలేక పోయినాడు. అక్కడనుండి పారిపోయినాడు. వెంటనే నేను కళ్ళనీళ్లు తుడుచుకున్నాను. కర్రదెబ్బ మరిచిపోయి నవ్వుకుంటూ ఇల్లు చేరాను. నేను సబ్‌యిన్‌స్పెక్టరు కొడుకునైయుండి ఒక నీచ జాతి వెధవచేతుల్లో తన్నులు తినటం అప్పుడుగూడా నాకు అవమానకరంగానేఉంది. కాని ఆ విషయం ఇంట్లో ఎవరితోనూ రిపోర్టు చెయ్యలేదు.

## 2

అప్పుడే మా నాన్నగా రక్కడనుండి బదిలీ అయినారు. క్రొత్త ప్రపంచం చూడబోతున్నానన్న సంతోషంతో ఎంతగా మురిసిపోయానంటే స్నేహితులకు

దూరమైపోతున్నానే అన్న విచారమే కలుగలేదు. మా నాన్నగారికిమాత్రం బాధగానే ఉంది. అది మంచి ఆదాయంవచ్చే ప్రాంతం. అమ్మకుకూడా కష్టంగానే ఉంది. ఇక్కడ అన్ని వస్తువులూ చౌక. అదీగాక పేటలోని ఆడవాళ్ళందరితో మంచి స్నేహం ఏర్పడింది. నేనుమాత్రం సంతోషంతో ఉబ్బొంగిపోతున్నాను. కుర్రాళ్ళతో కోతలు కోసేశాను. మేము వెళ్ళబోయే ఊళ్ళో ఇలాంటి ఇళ్ళు ఉండనే ఉండవు. చుక్కలుతాకే పెద్దపెద్ద ఎత్తయిన మేడలుంటాయి. అక్కడ ఇంగ్లీషు స్కూళ్ళల్లో పంతులు గనుక పిల్లలమీద చెయ్యి జేసుకుంటే జైలుకు పంపిస్తారు. నా మిత్రుల విప్పారిన నేత్రాలూ, ఆశ్చర్యం నిండిన నివ్వెరపాటూ చూస్తుంటే, వారి దృష్టిలో నే నెంత ఉచ్ఛస్థాయికి చేరుకున్నానో అర్థమౌతుంది. అబద్ధాన్ని నిజంగా చిత్రించటంలో పిల్లలకుండే ఆ ప్రతిభ, నిజాన్ని అబద్ధంగా చిత్రించే మనం ఏమర్థం చేసుకోగలం! పాపం వాళ్ళందరికీ నాతో పోటీపడాలని ఎంత ఇదిగా ఉశదనుకున్నారు! "నువ్వేక్కడోయ్ దేవుడివైతేనూ. సరే పో! మాకు చావూ, బ్రతుకూ అన్నీ ఈ దిక్కుమాలిన ఊళ్ళోనేగా!" అని వాళ్ళంతా అంటున్నారనిపించింది.

ఇరవై సంవత్సరాలు గడిచిపోయింది. నేను ఇంజనీరింగ్ ప్యాసయి, ఆ జిల్లాలోనే టూరు చేస్తూ, ఆ గ్రామానికి చేరుకుని బంగళాలో బసచేశాను. ఆ స్థలాన్ని చూడగానే మధురమైన నా బాల్యస్మృతులన్నీ ఒక్కసారిగా తలపుకొచ్చాయి. వెంటనే చేతిబెత్తం తీసుకొని గ్రామంలో షికారుకు బయలుదేరాను. దప్పిక గొన్న బాటసారిలాగా చిన్ననాటి ఆటస్థలాలన్నిటినీ చూడాలని తహతహలాడిపోయాను. ఇదివరకే పరిచితమైన ఊరుపేరు మినహా, మరో పరిచిత వస్తువేదీ కనిపించలేదక్కడ. పూర్వం శిథిలగృహాలున్న ప్రాంతంలో ఇప్పుడు భేషైన భవనాలు వెలిశాయి. ఇదివరకు మర్రిచెట్టున్నచోట మంచి అందమైన ఉద్యానవనముంది. ఊరు రూపంతా మారిపోయింది. ఊరు పేరూ, దాని పూర్వస్థితీ తెలిసి ఉండకపోతే అసలు గుర్తుపట్టగలిగి ఉండేవాణ్నికాదు. మరపురాని చిన్ననాటి మధురస్మృతులు చేతులుజాచి తమ పూర్వస్నేహితులను ఆలింగనం చేసుకునేందుకు తహతహలాడుతున్నాయి. కాని ఆ పరిస్థితులు మారిపోయినాయి. ఆ భూమాత నను ఆలింగనం చేసుకుని "నన్ను మరచిపోయినావా? నిన్నిప్పుడు మళ్ళీ ఆ పూర్వ రూపంలోనే చూద్దామనిపిస్తోంది తల్లీ!" అంటూ శోకించాలనిపించింది.

తటాయిన ఒక బయలుప్రదేశంలో ఇద్దరు ముగ్గురు కుర్రాళ్లు బిళ్ళంగోడు ఆడటం చూచాను. ఒక్కక్షణం నన్ను నేను మరిచిపోయాను. వేషం, హోదా, అధికారం, దేన్నిబట్టిచూచినా నేనొక పెద్ద ఆఫీసరునన్న విషయమే మరిచిపోయాను.

"అబ్బాయ్! ఇక్కడ గయా అనే పేరుగలవా ళ్ళెవరైనా వున్నారా?" దగ్గిరసపోయి అడిగా నా కుర్రాళ్ళను.

ఒక కుర్రాడు బిళ్ళంగోడును సవరిస్తూ, జంకుగొన్న స్వరంతో "గయా ఎవరూ? మాదిగతనుగదండీ" అన్నాడు.

"ఔనౌను. అతనే. గయా అనే పేరుగలవా డెవరైనా ఉంటే బహుశా అతనే అయివుండాలి" అన్నాను.

"ఔను. ఆ పేరుగలవా డున్నాడులేండి."

"కాస్త అతన్ని పిలుచుకొస్తారూ?"

కుర్రాడు పరుగెత్తుకుంటూ వెళ్ళాడు. ఒక్కక్షణంలో అయిదు అడుగుల ఒక నల్లమూర్తిని వెంటబెట్టుకురావటం చూచాను. దూరాన్నుండే గుర్తించాను నేను. అతనివైపుకు గంతువేసి అతన్ని ఆలింగనం చేసుకుందామనుకున్నాను. కాని కొంచెం ఆలోచించి ఆగిపోయాను.

"ఏమోయ్ గయా! నన్ను గుర్తుపట్టావా?" అన్నాను.

గయా వంగి సలాంచేసి "చిత్తం అయ్యగారూ! గుర్తెందుకు పట్టలేనండీ! తమరు కులాసాగా ఉన్నారా?" అన్నాడు.

"హాయిగా ఉన్నానోయ్. మరి నీ సంగతి చెప్పు."

"డిప్టీకలెక్టరుగారి గుర్రందగ్గర పనిచేస్తున్నానులెండి."

"సత్తయ్, మోహన్, దుర్గా వీళ్ళంతా ఏం చేస్తున్నారు? నీ కేమైనా తెలుసా?"

"సత్తయ్ చనిపోయాడు. దుర్గా, మోహనూ పోస్టు బంట్రోతులుగా ఉంటున్నారు. మరి అయ్యగారేంజేస్తున్నారో!"

"నేను ఈ జిల్లాకు యింజనీరునులే."

"అయ్యగారూ మొదటినుంచీ తెలివిగలవారే."

"ఇప్పు డెప్పుడైనా బిళ్ళంగోడు ఆడుతున్నావా?"

నావైపు ప్రశ్నార్థకంగా చూచి ఇప్పు డింకా బిళ్ళంగోడు ఏ మాడతాను అయ్యగారూ. ఇప్పు డెంతసేపూ పొట్ట తిప్పలే సరిపోతుందె" అన్నాడు గయా.

"అయితే రా! ఇవ్వాళ మనిద్దరం ఆడదాం. నీవు ఆట పెట్టించుకో; నేను ఆట పెడతా. నేను ఒక ఆట నీకు బాకీ ఉన్నాను. ఇవ్వాళది తీర్చేసుకో."

ఎంతో కష్టంమీద అంగీకరించాడు గయా. అత నేమో మామూలు కూలి వాడు; నేనా ఒక పెద్ద ఆఫీసరును. అతనికీ, నాకూ సంబంధమేమిటి? పాప మతను సిగ్గుపడుతున్నాడు. నాకూ సిగ్గుగానేవుంది. గయాతో కలిసి ఆడబోతున్నందుకు కాదు: జనం ఈ ఆటను విడ్డూరంగా భావించి వినోదించటంకోసం గుంపులు గుంపులుగా చేరతారని. ఆ జనంలో ఆనందం ఎక్కడినుం డొస్తుంది? కాని ఆడకుండా ఉండటానికి మనసొప్పటంలేదు. చివరకు యిద్దరంకలిసి ఊరునుండి చాలా దూరంగా వెళ్ళి, ఏకాంతంగా ఆడుకుందామని నిశ్చయించుకున్నాం. అక్కడ

ఎవరూ వుండరుగా తీరికగా కూర్చుని చూడటానికి. హాయిగా ఆడుకోవచ్చు. చిన్ననాటి ఆనందాన్ని మళ్ళీ ఒక్కసారి అనుభవించవచ్చు. నేను గయాను వెంటబెట్టుకుని బంగళాకు వచ్చాను. కారెక్కి యిద్దరం మైదానంవైపుకు వెళ్ళాం. కూడా ఒక గొడ్డలిగూడా తీసుకువెళ్లాం. నేను చాలా గంభీరంగా ఉన్నాను కాని గయా యిప్పటివరకుగూడా యిదంతా ఎగతాళనే అనుకుంటున్నాడు. అయినా అతని ముఖంలో ఉత్సాహంగానీ, ఆనందంగానీ అగుపించటంలేదు. బహుశా అతను మా యిద్దరిమధ్యా వచ్చిన అంతరాన్నిగురించిన ఆలోచనలోనే మునిగివున్నా డనుకుంటాను.

"నిజం చెప్పు! నే నెప్పుడైనా నీకు జ్ఞాపకం వచ్చేవాణ్నేనా?" ప్రశ్నించాను నేను.

"మిమ్మల్ని నేను జ్ఞాపకముంచుకునే దేమిటి బాబుగారూ! బాబుగారూ! నా తాహతెంత నేనెంత. మీతో కొన్నాళ్ళు ఆడుకునే అదృష్టం కలిగింది. లేకుంటే నా దేముంది చెప్పండి" సంకోచపడుతూ అన్నాడు గయా.

నేను కాస్త దీనంగా యిలా అన్నాను-"నాకుమాత్రం నువ్వెప్పుడూ జ్ఞాపకం వచ్చేవాడివి. అప్పుడొకసారి కర్రతో లాగి ఇచ్చుకుంటివే వీపుమీద — గుర్తుంది కదూ?"

"అదంతా కుర్రతనంలేండి అయ్యగారూ! మళ్లా అవ్వన్నీ గుర్తుచెయ్యకండి" పశ్చాత్తాపపడుతూ అన్నాడు గయా.

"బలేవాడివి: నా చిన్ననాటి సంగతుల్లో మధురాతి మధురమైన ఘటన అది. ఆ దెబ్బలో ఉన్న మాధుర్యం యిప్పటి నా గౌరవ, సత్కారాల్లోగాని, ఐశ్వర్యంలో గానీ లేదోయ్ దానిలో వుండే విశేష మేమిటోగాని ఆ విషయం తలపుకొస్తే ఈ నాటికీ ముగ్ధుణయిపోతుంటాను."

ఇంతలో మేము ఊరునుండి షుమారొక మూడుమైళ్ళ దూరం వచ్చేశాం. నలువైపులా ప్రశాంతంగా ఉంది. పడమటి వైపున మైళ్ళపొడుగున బ్రహ్మాండమైన చెరువొకటుంది. ఒకప్పుడు మేము అక్కడికి వచ్చి తామరపూలు కోసుకువెళ్ళేవాళ్ళం. వాటితో లోలకులు తయారుచేసి చెవులకు తగిలించుకునేవాళ్ళం. కుంకుమపువ్వు కాంతులీనే జ్యేష్ఠమాసపు సాయంత్ర మది. నేను ఎగిరి ఒక చెట్టు మీద ఎక్కాను. ఒక కొమ్మనరికి గబగబా బిళ్ళంగోడు తయారుచేశాను.

ఆట ప్రారంభమైంది. నేను గుంటమీద బిళ్ళంగోడు పెట్టి ఎగరగొట్టాను. బిళ్ళంగోడు గయా మీదుగానే ఎగిరిపోయింది. చేపలు పట్టేవాడిలాగా చెయ్యి జాచాడు గయా. కాని బిళ్ళంగోడు అతని వెనక్కుపోయి పడింది. ఒకప్పుడు దానంతటదే అతని చేతుల్లో పోయివాలేది బిళ్ళంగోడు. అది కుడిప్రక్కగానీ ఎడంప్రక్కగా రానీ, అతనిచేతుల్లో చిక్కి తీరవలసిందే. బిళ్ళంగోడుపై వశీకరణ మంత్రం ప్రయోగించాడా అనిపించేది. క్రొత్తది, పాతది, చిన్నది, పెద్దది, కోసుది, నున్నటిదీ -

ఎలాంటి బిళ్ళంగోడయినాసరే అతనికి వశంకావలసిందే. అతని చేతుల్లో బిళ్ళం గోళ్ళను ఆకర్షించే సూదంటురాయి ఉండేమోననిపించేది. ఆనాటి గయాయే యితను. కాని బిళ్ళంగోళ్ళకి యిప్పుడతనంటే ఆ పూర్వపు వ్యామోహం పోయింది. ఓడి పోయినా దతను. నేనూ ఆట పెట్టించుకోసాగాను. రకరకాల ఎత్తులు వేస్తున్నాను. నేను నైపుణ్య లోపాన్ని అన్యాయంతో పూర్తి చేస్తున్నాను. బిళ్ళంగోడును ఎగుర వేసి కొట్టటంలో గురి తప్పిపోతే ఆట ఛాన్సు మారుతుంది. అంటే రూల్సు ప్రకా రం గయావంతు రావాలన్నమాట. బిళ్ళంగోడుకు సరైన దెబ్బ తగులక, అది దగ్గరలోనే పడటం జరిగితే ఒక్క గంతులో నేనే వెళ్ళి బిళ్ళంగోడు చేతికి తీసుకుని రెండోసారి కొట్టేవాణ్ణి. గయా ఈ అక్రమాలన్నీ చూస్తూనే ఉన్నాడు. ఆట రూల్సన్నీ మరిచిపోయాడా అన్నట్లు ఏమీ మాట్లాడటం లేదు. అతని గురి ఎంత సూటిగా ఉండేది? బిళ్ళంగోడు అతని చేతిలోనుండి బయలుదేరి "ఠంగ్"మని సూటిగా కర్రకువచ్చి తగిలేది. అతని చేయి దాటిం తరువాత, బిళ్ళంగోడు పనల్లా కర్రకు ఢీ కొట్టటమే! కాని అదేమిటో ఈరోజు అతని బిళ్ళంగోడు కర్రకసలు తగలటమే లేదు. ఒకసారి కుడికి, ఒకసారి ఎడమకూ, ఒకప్పు డవతలా, ఒకప్పు డివతలా – ఇలా ప్రతిసారీ గురితప్పి పోతూనేఉంది.

ఇలా ఒక అరగంట ఆడిన తరువాత ఒకసారి బిళ్ళంగోడు వచ్చి కర్రకు తగిలింది. నేను గల్లంతు చేసేశాను. "బిళ్ళంగోడు కర్రకు తగలలేదు. మరీ దగ్గరగా పోయింది. అంతే! కర్రకు తగలనేలేదు" అన్నాను.

గయా ఏవిధమైన అసంతృప్తి ప్రకటించలేదు.

"తగల్లేదేమోలెండి!"

"కర్రకు తగిలితే నేను అబద్ధమాడతానా?"

"లేదులెండి బాబుగారూ! మీ రలా అంటారా?"

చిన్నతనంలో అయితే ఇలా గడబిడచేసి ప్రాణాలతో బయటపడేవాణ్ణా! ఇతనే నాగొంతుమీ దెక్కి కూర్చునేవాడు. కాని ఇవ్వాళ నేను అతన్ని ఎంత తేలి కగా టోకరా గొడుతున్నాను! వట్టి మొద్దుగాడు. ఆట రూల్సన్నీ మరిచిపోయినాడు.

అకస్మాత్తుగా బిళ్ళంగోడు తిరిగి కర్రకు తగిలింది. అదీ ఎలా తగిలిందను కున్నారు! తుపాకి గుండులాగా తగిలింది. ఇక నేను ఏ రకంగానూ మోసం చెయ్య టానికి మళ్ళీ సాహసించలేక పోయాను. అయినా మరోమారు సత్యాన్ని అసత్య మనిపించటానికి ప్రయత్నించి చూస్తేఏం? నా దేం పోతుందీ? ఒప్పుకుంటే ఒప్పు కుంటాడు; లేదూ—— నాలుగైదు అడుగులు దోకుళ్లు పెట్టవలసి వస్తుంది. అంతేగా! చీకటిపడిందని వంకపెట్టి నిమిషంలో తప్పించుకుంటాను. మళ్ళీ ఆట పెట్టటానికి వచ్చే దెవరింకా!

"తగిలింది! తగిలింది! "ఠంగు"మని తగిలింది," విజయోత్సాహంతో అన్నాడు గయా.

"తగిలినప్పుడు చూశావా నువ్వు? నేను మాత్రం చూడలేదుమరి!" ఏమీ ఎరగనట్లు నటిస్తూ అన్నాను నేను.

"ఠంగ్‌మని తగిలింది బాబుగారూ!"

"ఏదైనా ఇటుకరాయికి తగిలిందేమోలే."

అప్పుడు నా నోటివెంట ఈమాట ఎలా వచ్చిందో నాకే ఆశ్చర్యంగా ఉంది. ఆ సత్యాన్ని తలక్రిందులు చేయటం అంటే పగలును రాత్రనటమే. బిళ్ళంగోడు 'బయ్య్'మంటూ వచ్చి కర్రకు తగలటం ఇద్దరమూ చూశాం. కాని గయా నా మాటకు ఒప్పుకున్నాడు.

"ఏ ఇటుక రాయికో తగిలి ఉంటుందిలెండి. కర్రకుతగిలితే అంత పెద్ద శబ్దమైయుండేదికాదు."

నేను మళ్ళీ ఆట పెట్టిస్తున్నాను. కాని ఇంత పచ్చి మోసం చేసినమీదట కూడా గయా చూపిన ఉదారత్వానికి నాకు చాలా జాలివేసింది. అందువల్ల మూడవ సారి బిళ్ళంగోడు కర్రకు తగలగానే నేను ఎంతో ఉదారంగా ఆట పెట్టటానికి సిద్ధమయ్యాను.

"ఇవ్వాళ ప్రొద్దుగూకి పోయింది. రేపు చెల్లించుకురుగాని లెండి మీ ఆట" అన్నాడు గయా.

ఆలోచించాను నేను బాబో! రేపు చాలా సేపు టైముంటుంది ఇతగా డెంతసేపు వేధిస్తాడో ఏమో. ఈ గొడవ ఇప్పుడే వదిలించుకుంటే మంచిది.

"అలాకాదు ఇంకా వెలుతురు బాగానే ఉందిలే నీ ఆట చెల్లించేసుకో."

"బిళ్ళంగోడు కనపడదు బాబుగారూ."

"ఫరవాలేదులే కానీ!"

గయా ఆటపెట్టించుకోటం మొదలెట్టాడు. కాని అతని కిప్పుడు బొత్తిగా అలవాటే తప్పిపోయింది. బిళ్ళంగోడును ఎగురవేసి కొట్టటానికి రెండుసార్లు ప్రయత్నించాడు. కాని రెండుసార్లూ తప్పిపోయింది. ఒక నిమిషమైనా కాకముందే ఆట చెల్లించి వేశాను. పాపం గయా గంటల తరబడి దోకుళ్లు పెట్టాడు. కాని తన ఆట నిమిషంలోనే పోగొట్టుకున్నాడు. నేను నా ఉదారత్వమంతా ప్రదర్శించాను.

"ఇంకో ఆట నువ్వే ఆడు. పాపం మొదట్లోనే చెడిపోయింది నీ ఆట."

"వద్దులే బాబుగారూ చీకటిపడిపోయింది."

"నీ అలవాటు తప్పిపోయినట్లుందే. ఎప్పుడూ ఆడటంలేదా ఏం?"

"ఆడుకోటానికి తీరి కెక్కడుంటంది బాబుగారూ!"

మే మిద్దరం కారులో కూర్చున్నాం. దీపాలుపెట్టే వేళకల్లా క్యాంపుకు చేరుకున్నాం. "రేపు ఇక్కడ బిళ్ళంగోడు పందాలున్నాయి. మన చిన్ననాటి ఆటగాళ్ళంతా ఆటకొస్తారు. మీరుకూడా వస్తారుగదూ? మీతీరికటైములోనే పిలుద్దాం ఆటగాళ్ళందరినీ" అన్నాడు గయా వెళ్తూ వెళ్తూ.

సాయంత్రమైతే నాకు తీరికగా ఉంటుందన్నాను. మరునాడు ఆట చూడ టానికి వెళ్ళాను. పదిమంది పదిమంది ఒక జట్టుగా ఉన్నారు. చాలామంది నా చిన్న నాటి సహచరులే. అందులో చాలామంది యువకులు. వాళ్ళందరినీ నేను గుర్తించ లేక పోయాను. ఆట ప్రారంభమైంది నేను కారులో కూర్చుని వినోదంగా చూసు న్నాను. ఆనాడు గయామొక్క నైపుణ్యంచూచి ఆశ్చర్యపడిపోయాను. దెబ్బ కొట్టాడంటే చుక్కలు తాకేది బిళ్ళంగోడు. నిన్నటిలాగా ఆ సంకోచంకానీ, ఆవెను కంజగానీ, అయిష్టతగానీ యివ్వాళ మచ్చుకుకూడా లేవు. అతని చిన్ననాటి నైపుణ్య మంతా ఈ రోజు పరాకాష్టకు చేరుకుంది. నిన్ననే గనుక ఈ రకంగా నాచేత ఆట పెట్టించి ఉంటే నాకు తప్పకుండా ఏడుపొచ్చేందేదే. అతని కర్రదెబ్బ తగిలిం దంటే బిళ్ళంగోడు రెండు వందల గజాలు పారిపోయేది.

ఆట పెట్టేవాళ్ళల్లో ఒక యువకుడు కొద్దిగా దగాచేయటానికి ప్రయత్నించాడు. బిళ్ళంగోడు ఎగురుతుండగానే పట్టేశా నంటాడతను. కాదు; బిళ్ళంగోడు నేలకు తగిలి ఎగిరితే పట్టుకున్నాడంటాడు గయా. ఆ విషయంలో యిద్దరూ దెబ్బలాడు కోటానికి సిద్ధమైనారు. ఆ యువకుడు వెనుకంజ వేశాడు. జేవురించిన గయా ముఖంచూచి అతను జంకిపోయినాడు. అతనుగనుక తగ్గకపోయినట్లయితే తప్ప కుండా దెబ్బలాట జరిగేదే. మా చిన్నతనంలో మేమంతా సమస్తం మరచిపోయి ఆటల్లో మునిగి తేలేవాళ్ళం. ఎంతో ఆనందంగా ఉండేది. ఇవ్వాళ నేను ఆటలో లేకపోయినా వాళ్ళు ఆడటంచూస్తుంటే అలాంటి ఆనందమే కలిగింది. నిన్న గయా నాతో ఆడటం జరగలేదనీ, కేవలం ఆడుతున్నట్లు నటించాడనీ ఇప్పు డర్థమైంది నాకు. నన్నుచూచి అతను జాలిపడ్డాడు. నేను దగా చేశాను. అబద్ధాలాడాను. అయినా అతని కసలు కోపమేరాలేదు. ఎందువల్లంటే అసలు అతనేమైనా ఆడుతుంటేగా. నన్ను ఆడిస్తున్నాడు. సంతోషపెడుతున్నాడు. అంతే! నన్ను బాగా వేధించి నారసం తీద్దామనే ఉద్దేశ్యం లేదతనికి. నే నిప్పుడు ఆఫీసరును. ఈ హోదా నాకూ అతనికీ మధ్య అడ్డుగోడై నిలిచింది. నే నిప్పు డతనివల్ల ఆదరం పొందగలను. గౌరవం సంపాదించగలను. కాని స్నేహం సాధించలేను. చిన్నతనంలో అంటే నే నతని సమఉజ్జీని. మా ఇద్దరిలో ఎలాంటి భేదమూలేదు. ఈ పదవి సంపా దించిన తరువాత యిప్పుడిక నేను అతని జాలికి మాత్రమే పాత్రుణ్ణి ఇక అతను నన్ను తన సాటివాడుగా భావించుకోలేడు. అతనే గొప్పవా డయ్యాడు, నేనే అల్పుణ్ణయినాను.

— o —

# లాటరీ

త్వరలో ఆస్తిపరుడు కావాలన్న తృష్ణ ఎవరికుండదు చెప్పండి. ఆ వాడు లాటరీటిక్కెట్లువస్తే నా స్నేహితుడైన విక్రమ్ నాన్నగారూ, బాబాయి, అమ్మ, అన్నయ్య అందరూ తలకో టిక్కెట్టు కొనేశారు. ఎవరి అదృష్టం ఎలాంటిదో ! ఎలా చెప్పగలం? ఎవరిపేరిట వస్తేనేం? డబ్బంతా కుటుంబానికేగా !

కాని విక్రమ్ కేమీ తృప్తికలుగలేదు. ఇతరుల పేరిట డబ్బువస్తే తన కేం వస్తుంది? మహా అయితే తనకో అయిదువేలో, పదివేలో యిస్తారు. ఈ డబ్బు అతని కేమూలకూ? అతని జీవితాభిలాషలు చాలా గొప్పవి. మొట్టమొదట తను ప్రపంచమంతా మూలమూలలా యాత్రచేసి రావాలి. పెరూదేశం, బ్రెజిల్‌దేశం, టింబక్‌టూ, హోనోలూలూ యివన్నీ ఉన్నాయి అతని ప్రోగ్రాములో. తుపానుగాలిగా ఒకటి రెండు మాసాల్లో బర్రునతిరిగి వచ్చేరకం గాదతను. ఒక్కొక్క ప్రదేశంలో ఎక్కువరోజులుంటూ ఆ ప్రాంతపు తీరు తెన్నులూ, ఆచారవ్యవహారాలూ వగైరా విషయాలన్నీ అధ్యయనంచేసి, తన ప్రపంచయాత్రను గురించి ఒక పెద్ద గ్రంథం వ్రాసెయ్యాలని అతని కోరిక. అంతేకాదు ఒక్క పెద్ద లైబ్రరీ నిర్మించాలి. అందులో ప్రపంచంలోని ఉత్తమగ్రంథాలన్నీ ఉండి తీరవలసిందే. లైబ్రరీకోసం రెండులక్షల వరకూ ఖర్చుపెట్టటానికైనా సిద్ధమే. ఒక బంగళా, కారూ, ఫర్నిచరూ యివి సరేసరి ! తండ్రిపేరిటగానీ, పినతండ్రిపేరిటగానీ డబ్బురావటం జరిగితే తనకు అయిదువేలకంటె దక్కే అవకాశంలేదు. అమ్మపేరిటవస్తేమాత్రం యిరవై వేలు రావచ్చు. కాని అన్నపేరిటవస్తేమాత్రం తనకొక చిల్లికానీగూడారాదు. అతను చాలా ఆత్మభిమాని. ఇంట్లోవాళ్ళదగ్గరైనా దయాధర్మంగానో, బహుమానంగానో డబ్బుతీసుకోటం అంటే అతనికి చాలా అవమానంగా ఉండేది. "బ్రదర్ ! ఎవడినైనా దేబిరించేకంటే ఏ గోతిలోనైనా దూకి చావటం మంచిది. మనిషైనవాడు లోకంలో తనకొక స్థానం సంపాదించుకోలేకపోతే ఈ లోకంనుండి సెలవుపుచ్చుకోటం మంచిది" అనేవా డతను.

అతను చాలా నిలకడలేని మనిషి. లాటరీటిక్కెట్టుకు యింట్లోవాళ్ళెవరిస్తారు డబ్బు. అతనుమాత్రం ఎలా అడుగుతాడు? "మనిద్దరం కలిసి ఒక టిక్కెట్టు తీసుకోగూడదూ?" ఎంతగానో ఆలోచించి అన్నా డతను.

ఈ ఏర్పాటు నాకూ నచ్చింది. నే నా రోజుల్లో బడిపంతులను. ఇరవై రూపాయల జీతం. దాంతో చాలా కష్టంమీద నడుస్తుండేది బండి. పది రూపాయల

టిక్కెట్టు కొనటంఅంటే నాకు తెల్ల ఏనుగును కొన్నంతపనే. ఆc ! ఒక్క నెల రోజులపాటు పాలూ, నెయ్యి. అల్పాహారాలూ, యింకా పై పై ఖర్చులన్నీ మానివేస్తే అయిదు రూపాయలు మిగులుతాయేమో. అయినా భయంగానే ఉంది. ఎక్కడైనా అదనంగా డబ్బు దొరికితే కాస్త ధైర్యం చేద్దును.

"ఇదిగో ! నా ఉంగరం అమ్మనా? ఎక్కడో జారిపోయిందని చెప్పేస్తా" అన్నాడు విక్రమ్.

ఉంగరం పదిరూపాయలకు తక్కువ చెయ్యదు. దాంతో టిక్కెట్టు మొత్తం కొనవచ్చు. కానీ ఖర్చు పెట్టకుండానే టిక్కెట్టులో సగభాగస్థుణ్ణవుతుంటే చింత యేముంది?

"కాని బ్రదర్ ! నువ్వు రొక్కం యివ్వాలిసుమా ! అయిదు రూపాయలు తీసుకోకుండా భాగమివ్వను నేను" అగస్మాత్తుగా అన్నాడు విక్రమ్

అప్పుడు నాకు ఔచిత్యం జ్ఞాపకానికి వచ్చింది. "బాగుండదు బ్రదర్ ! ఈ పని చాలా తప్పు! దొంగతనం బయట పడిందంటే లజ్జపడాలి నీతోపాటు నాకూ వస్తాయి చివాట్లు" అన్నాను.

చివర కిలా అనుకున్నాం. పాత పుస్తకాలు ఏ సెకండుహేండు షాపులోనైనా అమ్మి, ఆ డబ్బుతో టిక్కెట్టు కొందా మనుకున్నాం. అప్పుడు మా వద్ద పుస్తకాల కంటె అనవసరమైన మరేవస్తువులూ లేవు. మే మిద్దరం ఒక్కసారే మెట్రిక్ ప్యాసయినాం. డిగ్రీలుపొంది కళ్లు పాడుచేసుకుని యింట్లో డబ్బంతా నాశనం చేసిన వాళ్ళుగూడా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోటంచూచి మెట్రిక్‌తోనే బ్రేకువేశాం మా చదువుకు. నేను బడిపంతులు నయ్యాను. విక్రమ్ గాలికి తిరుగుతున్నాడు. మా పాతపుస్తకా లిప్పుడు చెదపురుగులకుమినహా మా కేమీ ఉపయోగంలేదు. వాటిని మేము నమలగలిగినంత నమలివేశాం. వాటి సారమంతా పీల్చేశాం. ఇప్పటిక ఎలుకలు తిననీ, చదలు తిననీ మా కనవసరం. ఇవ్వాళ మే మిద్దరం వాటిని పాత భోషాణంలోనుండి బయటికితీశాం. దుమ్మూ, ధూళీ దులిపి ఒక పెద్ద కట్టగా కట్టేశాం. నేను బడిపంతులు నైతిని. నన్నెందరూ ఎరుగుదురాయె మరి ! పుస్తకాల షాపుకు నేనువెళ్ళి పుస్తకాలమ్మటం ఏమంత బాగుంటుంది ! అందువల్ల ఆ బాధ్యత విక్రమ్ తీసుకున్నాడు. ఒక అరగంటలో పదిరూపాయలనోటు తీసుకుని గంతులు వేస్తూ వచ్చాడు. అతనింత సంతోషంగా ఉండటం నే నెప్పుడూ చూడలేదు. ఆ పుస్తకాలు నలభై రూపాయలకు తక్కువ చెయ్యవు కాని ఆ సమయంలో ఆ పదిరూపాయలూ మా కెక్కడో దోవలో దొరికినట్టుగా ఉంది. ఇప్పుడు టిక్కెట్టులో అర్ధభాగస్థుణ్ణవుతాను. పదిలక్షలధనం లభిస్తుంది. నాభాగానికో అయిదు లక్షలూ, విక్రమ్‌కో అయిదులక్షలూ వస్తాయి. మే మీ ఆలోచనలోనే మునిగి తేలుతున్నాం.

"అయిదు లక్షలైనా ఏమంత తక్కువమొత్తం కాదులే" తృప్తిగా అన్నాను నేను.

విక్రమ్ నా మాదిరి తృప్తిపడేవాడుకాదు. "అయిదులక్షలేం? ఈ పరిస్థితుల్లో ఐదు వందలుకూడా మనకు పెద్దమొత్తమే. కాని జీవితానికి నేననుకున్న ప్రోగ్రామే తలక్రిందులైపోయింది. నాయాత్ర కార్యక్రమం మాత్రం మానటానికి వీల్లేదు. గ్రంథాలయంసంగతే ఎగిరిపోయింది' అన్నాడు.

"యాత్రకు మహా అయితే రెండు లక్షలకు మించేమీ ఖర్చుబెట్టవుగదా!" అతని అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తూ అన్నాను.

"అలా కాదండీ! యాత్రకువేసిన బడ్జెటు మూడున్నర లక్షలు. ఏడు సంవత్సరాల కార్యక్రమం. సంవత్సరానికి ఏభైవేల రూపాయలన్నా కావద్దూ?"

"అంటే షుమారు నెలకు నాలుగువేలనుకో; కాని నెలకు రెండువేల రూపాయల్లోగూడా దర్జాగానే ఉండొచ్చులే."

"నేను మంచి రాజఠీవిగా ఉండాలోయ్. బిచ్చగాళ్ళకుమల్లే ననుకున్నావేం?"

"రెండువేలైనా రాజఠీవిగానే ఉండొచ్చు."

"నీ వాటాలోనుంచి రెండు లక్షలిస్తేగాని లైబ్రరీ ఏర్పడదోయ్."

"నగరంలోకల్లా సాటిలేనిది కాకపోతేనేం నీ లైబ్రరీ?"

"నిర్మిస్తే అలాంటిదే నిర్మించాలి."

"అదంతా నీయిష్టం. నా వాటా డబ్బులోనుంచి నీ కేమీ యివ్వటానికి వీల్లేదు. నా అవసరాలు చూస్తున్నావుగా! మీ కుటుంబానికి బోలెడంత ఆస్తి ఉంది. నీకే బావరబందీ లేదు. మరి మా కుటుంబ భారమంతా నా మీదే ఉంది. ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చెయ్యాలి. తమ్ములిద్దరిని చదివించాలి. క్రొత్తగా యిల్లొకటి కట్టించాలి. మొత్తం నా వాటా డబ్బంతా బ్యాంకులో వేసేద్దామని నిశ్చయించు కున్నాను. దానిమీదవచ్చే వడ్డీతో పని జరుపుకుంటాను. నా తదనంతరంగూడా ఎవరూ ఈ డబ్బును కదిలించటానికి వీల్లేకుండా ఏర్పాట్లు చేస్తాను."

"నీ పరిస్థితుల్లో నీవాటాలో కొంత యివ్వమనటం అన్యాయమే. సరేలే! ఎలాగో నేనే తిప్పలుపడతాలే. కాని బ్యాంకులిచ్చే వడ్డీరేటు చాలా పడిపోయింది సుమా!"

మేము చాలా బ్యాంకుల వడ్డీరేట్లు పరిశీలించాం. పర్మనెంటు బ్యాంకుల రేట్లూ, సేవింగ్స్ బ్యాంకులరేట్లూ కూడా చూచాం. నిస్సందేహంగా వడ్డీరేట్లు చాలా తక్కువే అనాలి. నూటికి రెండున్నర వడ్డీకి బ్యాంకులో వేయటం దండగే. ఇంత కంటే హాయిగా వడ్డీవ్యాపారం ప్రారంభించగూడదూ? విక్రమ్‌కూడా యాత్రకు యిప్పుడప్పుడే వెళ్ళకుండా ఆగుతాడూ, బాయింటుగా నడుస్తుంది వ్యాపారం. యాత్రకు కాస్త డబ్బు సంపాదించిన తరువాత వెళ్తాడు. వడ్డీ వ్యాపారంలో అయితే మంచి వడ్డీగూడా వస్తుంది. మనకు పలుకుబడి ఉంటుంది. కాని ఆసామి ఎంత

మోతుబరివాడైనా సరే. గట్టిహామీ లేందే ఎవరికీ డబ్బివ్వకూడదు. అసలు హామీ మీద ఎందుకివ్వాలిడబ్బూ? ఆస్తి తాకట్టుపెట్టుకునే యిద్దాం. అలా అయితే ఏమీ ప్రమాదం కూడా ఉండదు.

ఈ ఘట్టంకూడా దాటాం. ఇకపోతే టిక్కట్టు ఎవరిపేరిట ఉండాలన్న ప్రశ్న వచ్చింది. విక్రమ్ టిక్కెట్టు తనపేరిట ఉండాలని పట్టుబట్టాడు. అతనిపేరిట కాకపోతే అసలుటిక్కెట్టే వద్దనేట్టున్నాడు. నాకు మరో ఉపాయం తోచక ఏవిధమైన రాతకోతలూ లేకుండానే అతనిపేరిట కొనటానికి అంగీకరించాను. అందుకే తరువాత ఎంతో కలత బడ్డాను.

## 2

ఒకటొకటిగా ఎదురుచూడవలసిన రోజులన్నీ తరిగిపోతున్నాయి తెల్లవారటం తరువాయి; మా కళ్ళన్నీ క్యాలెండరువైపుకు పరుగెత్తేవి. మా యిల్లు విక్రమ్ యింటికి ఆనుకునే ఉంది. స్కూలుకు వెళ్ళేముందూ, స్కూలునుండి వచ్చిన తరువాతా మేమిద్దరం ప్రక్కప్రక్కన కూర్చుని స్కీములు వేసుకుంటుండేవాళ్ళం. ఎలా? ఎవరూ వినకుండా; గుసగుసలాడుతూ మేము టిక్కట్టుకొన్న రహస్యం దాచిపెట్టా లనుకున్నాం. ఈ రహస్యం నిజమైనప్పుడు అందరూ ఎంత దంగైపోతారు! ఆ దృశ్యాన్ని నాటకంలోలాగా ఆనందించే అవకాశాన్ని పోగొట్టుకో దలచలేము.

ఒకరోజు కబుర్లలో పెళ్ళివిషయం చర్చకు వచ్చింది. "బ్రదర్! పెళ్ళీ గిళ్ళీ ఈ జంజాటమంతా నేను తగిలించుకోను. వృథా ప్రయాస, రొష్టూనూ. పెళ్ళాం దర్జాలకే బోలెడు డబ్బు ఎగిరిపోతుంది" వేదాంత గాంభీర్యం ప్రదర్శిస్తూ అన్నాడు విక్రమ్.

"అవును. నీమాట నిజమేననుకో. కాని జీవితంలోని సుఖదుఃఖాల్లో పాలుపాలుపంచుకునేవాళ్ళు లేకపోతే జీవితానికి ఆనందమేముంటుంది! సాంసారిక జీవితమంటే అంత విరక్తి లేదు నాకు. అయితే ఒకటీ! చివరివరకూ నాతో కలిసి ఉండే సహచరిణి కావాలి నాకు. అలాంటి సహచరి భార్యతప్ప మరొకరు కాజాలరు" అతన్ని వ్యతిరేకిస్తూ అన్నాను నేను.

"సరె, సరె! ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి. తమ భార్యకోసలాం! కుక్కల మాదిరిగా ఆమె వెంటబడి తిరగటం, పిల్లలను ప్రపంచంలోకల్లా గొప్ప ఐశ్వర్యంగా ఎంచుకోటం, అదంతా భగవత్ప్రసాద మనుకోటం- వాటన్నిటికీ ఓ నమస్కారం! నేనుమాత్రం స్వేచ్ఛగా ఉంటాను. ఇల్లువదలి యిష్టంవచ్చినట్లు ఎక్కడి

కనుకుంటే అక్కడికి వెళతాను. అనుకున్న తక్షణం ఉడాయించేస్తాను. మళ్లీ రావాలని బుద్ధి పుట్టినప్పుడు యింటికి వస్తాను. స్వయంరాజా స్వయంమంత్రీ. ఎప్పుడూ ఒక కాపలావాణ్ని నెత్తికెక్కించుకుంటాననుకున్నావా? ఇంటికి రావటం కాస్త ఆలస్యమైతే వెంటనే విచారణ—"ఇంతసేపటిదాకా ఎక్కడికివెళ్ళారూ?" ఎక్కడికైనా బయటికి అడుగుపెట్టారంటేచాలు తక్షణం ప్రశ్న తయారు— "ఎక్కడికి వెళుతున్నారూ?" యిక దురదృష్టవశాత్తూ భార్యకూడా వెంటఉన్నదంటే చచ్చామన్న మాటే. అప్పుడిక ఎందులోనైనా దూకి చావటం తప్ప మరో మార్గంలేదు. ఒద్దు బ్రదర్! వద్దు! నాకు నీ విషయంలో వీసమంతైనా సానుభూతి లేదు. కుర్రాడికి కాస్త జలుబుచేసేచాలు; ఆదరాబాదరా పరుగెత్తాలి హోమియోపతి డాక్టరుకోసం. కాస్త మనకు వయస్సుమళ్ళి, పిల్లలు కాస్త పెద్దవాళ్ళయినారో లేదో—యిక మన మెప్పుడు చస్తామా: తాము జల్సాగా తిరిగే ఛాన్సు ఎప్పుడు వస్తుందో—అని చూస్తుంటారు. సందు దొరికిందంటే మనకు విషం పెట్టేసి కలరా తగిలిందని ప్రచారం చేసేస్తారు. నా కొద్దుబాబూ ఈ బాదరబందీ అంతా!" అవసరానికి మించిన చిరాకుతో అన్నాడు విక్రమ్.

ఇంతలో కుంతి వచ్చింది. విక్రమ్ చెల్లెలా అమ్మాయి. పదిపదకొండేళ్లుంటాయి. ఆరోక్లాసు చదువుతోంది. వరసగా ఫెయిలౌతోంది. మహా చపలపు పిల్ల; మహా బడాయి కోరూనూ. ధవాలున తెరిచింది తలుపులు. మేము ఉలిక్కిపడి లేచి నుంచున్నాం.

"నువ్వు పట్టి దయ్యానివే కుంతీ! నిన్నెవరు రమ్మన్నారిక్కడికి!" అన్నాడు విక్రమ్.

"ఇక్కడ మీ రెప్పుడూ తలుపులు మూసుకుకూర్చుని ఏమిటి గుసగుసలాడుకుంటుంటారూ? ఎప్పుడు చూచినా యిక్కడే కూర్చుని ఉంటారు. షికారుకూ వెళ్ళరూ! సినిమాకూ వెళ్ళరూ! ఏదో మంత్రం జపం చేస్తున్నట్లుందేచూస్తే!" గదిలో నలువైపులా సి.ఐ.డి. పోలీసులాగా పరీక్షగాచూస్తూ అన్నది కుంతి.

"ఆఁ! నిజమే! మంత్రమే జపిస్తున్నాం. ప్రతిరోజూ నిన్ను ఛెళ్లుఛెళ్లున లెక్కబెట్టి అయిదు కొరడా దెబ్బలుకొట్టే పెళ్ళికొడుకును తీసుకురావాలనీ" కుంతి గొంతు పట్టుకొని ఊగిస్తూ అన్నాడు విక్రమ్.

"తోకాడిస్తూ నా చుట్టూ తిరిగేవాణ్ణే చేసుకుంటాను నేను. నేను మిఠాయి పొట్లాల కాగితాలు పడేస్తే నాకేస్తాడతను. ఏమాత్రమైనా నసికాడో చెవులు మెలేస్తాను. అమ్మకు లాటరీపైకం వస్తే నాకు ఏభై వేలిచ్చేస్తుంది. నాకేం? దర్జాగా ఉంటా. నేను రెండు పూటలా అమ్మకోసం దేవుడికి మొక్కుకుంటాను. పెళ్ళిగాని పిల్లలు దీవిస్తే వృథాగా పోదటని అమ్మ అంటోంది. నాకు మాత్రం అమ్మకు డబ్బువస్తుం దనిపిస్తోంది."

నాకు జ్ఞాపకం వచ్చింది. ఒకసారి నేను మా తాతగారి ఊరికి వెళ్ళాను. అక్కడ వానలు కురవలేదు. భాద్రపదమాసం వచ్చింది. అయినా ఒక్క చినుకు కూడా పడలేదు. అప్పుడు గ్రామస్థులంతా చందాలు వేసుకుని గ్రామంలోని పెళ్ళి కాని పిల్లలందరికీ విందు చేశారు. ఆ తరువాత మూడోరోజునే కుండపోతగావర్షం కురిసింది. కన్యల దీవెనల్లో మహిమ తప్పకుండా ఉండి తీరుతుంది

నేనూ, విక్రమ్ ఒకరివైపొకరు అర్థయుక్తంగా చూచుకున్నాం. చూపుల్లోనే మేం సలహాపడ్డాం. ఒక నిశ్చయానికికూడా వచ్చాం. "మరైతే నీకొకమాట చెబుతాం. ఎవరితోనూ చెప్పకుండా ఉంటావుకదూ? నీవు మంచి అమ్మాయివి. ఎవ్వరితోనూ చెప్పవు. నేనీసారి నిన్ను బాగా చదివించి ప్యాసు చేయిస్తాను. అసలు సంగతేమిటంటే మే మిద్దరమూ లాటరీటిక్కెట్టు కొన్నాం. మా తరఫునగూడా దేవుణ్ణి ప్రార్థించు నిజం! మాకుగనుక డబ్బువస్తే నీకు మంచి మంచి నగలు చేయిస్తాం" కుంతితో అన్నాడు విక్రమ్.

కుంతికి నమ్మకం కలుగలేదు. మేము ఒట్లుబెట్టుకున్నాం. ఆమె ఒయ్యారాలు పోతోంది. శిరస్సునుండి పాదాలదాకా మొత్తం శరీరమంతా బంగారంతోనూ, మణులతోనూ కప్పేస్తామని ప్రమాణం చేశాం. అప్పటికిగాని మమ్మల్ని దీవించటానికి రాజీపడలేదు.

కాని, ఆమె పొట్టలో కొన్ని మణుగుల మిఠాయిలైనా యిముడుతాయిగాని ఈ కాస్త మాట యిమడలేదు. సరాసరి యింట్లోకి పరుగెత్తింది. ఒక్క క్షణంలో యిల్లంతా వ్యాపించిందీవార్త. ఇక ఎవరుబట్టినా విక్రమ్‌ను దబాయించేవాళ్ళే. చివరకు వాళ్ళమ్మ, బాబాయి, నాన్న అందరూ కోప్పడేవాళ్ళే. ఆ కోప్పడటం విక్రమ్‌క్షేమం కోసమో, లేక మరే ఉద్దేశ్యంతోనో ఎవరు చెప్పగలరు—"ఊరికే కూర్చుని వెధవ ఆలోచనలు చేస్తుంటావు. డబ్బుకొస్తాగంగసాలు చేశావు. ఇంట్లో ఇంతమందిమి టిక్కెట్టుకొననేకొంటిమి నువ్వుకూడాతీసుకోవలసిన అవసరం ఏమొచ్చింది? కుటుంబానికివచ్చినదాంట్లోకొద్దోగొప్పో నీకు మాత్రంరాదూ! అయినా మేష్టరుగారూ!నువ్వు వట్టి దద్దమ్మవయ్యా! కుర్రాడికి మంచిమాటలు చెప్పవలసిందిపోయి, వాణ్ణి భ్రష్టు పట్టిస్తావా!"

విక్రమ్ గారాబుకొడుకు. అతన్నింకేమంటారు? అలిగి ఒకటి రెండు పూటలు అన్నం మానేశాడంటే కొంప మునిగిందన్నమాటే! కోపమంతా నామీద కక్కేశారు. నా సావాసంతో కుర్రాడు పాడైపోతుండె మరి!

"అంతా నీతులు చెప్పేవాళ్ళే" అన్న సామెత జ్ఞప్తికి వచ్చింది. నా చిన్ననాటి ఘటనొకటి తలపుకొచ్చింది. ఆ రోజు హోలీపండుగ. ఒక బ్రాందీసీసా తెప్పించారు. మా మేనమామ వచ్చాడప్పుడు. నేను మెదలకుండా గదిలోకి వెళ్ళి గ్లాసులో ఒక గ్రుక్కెడు బ్రాందీ వేసుకు త్రాగేశాను. ఇంకా గొంతు మండుకు పోతూనే ఉంది. కళ్ళు ఎర్రబారిపోయినాయి. ఇంతలో మా మేనమామగారు గదిలోకి

వచ్చారు. కన్నంలో దొంగను పట్టుకున్నట్లుగా మండిపడ్డారు నామీద. నా గొంతు పిసుకుతున్నట్లుగా కోప్పడ్డారు. అమ్మా, నాన్నగారూకూడా మండి పడ్డారు. నేను ఏడ్చిన తర్వాతగాని వారికోపం చల్లారలేదు. ఆ మధ్యాహ్నమే మా మామయ్య విపరీతమైన కై పెక్కి పిచ్చి పాటలు పాడటం మొదలు పెట్టాడు. కాసేపు ఏడ్చాడు. కాసేపు అమ్మను బూతులు తిట్టాడు. అడ్డం చెప్పాడని తాతయ్యను కొట్టొచ్చాడు. ఆఖరుకు వాంతి చేసుకుని వళ్లు తెలియకుండా పడి పోయినాడు.

# 3

విక్రమ్ తండ్రి పెదబాబుగారూ, పినతండ్రి చినబాబుగారూ యిద్దరూ భౌతిక వాదులే. పూజలు, పునస్కారాలంటే మహా ఎగతాళి చేస్తారు. పచ్చి నాస్తికులు. కాని యిప్పుడు వాళ్లు పెద్ద నిష్ఠపరులూ, మహాభక్తులూ అయిపోయారు. పెద్దబాబుగారు తెల్లవారు ఝామునే గంగాస్నానానికి వెళ్ళేవారు. దేవాలయా లన్నింటిలో ప్రదక్షిణాలుచేసి మధ్యాహ్నంవేళకు వళ్ళంతా గంధం పట్టించుకుని యింటికి వచ్చేవారు. చిన్నబాబుగారు యింటిపద్దే వేడినీళ్ళతో స్నానంచేసేవారు కీళ్ళవాతంతో అవస్థపడుతూకూడా రామకోటి వ్రాస్తుండేవారు. సాయంత్రమవగానే పార్కువైపుకు షికారువెళ్ళి చీమల పుట్టలకు పంచదార సప్లయిచేసేవారు. ప్రొద్దుగూకగానే సోదరు లిద్దరూ తమ స్వంత దేవాలయానికి వెళ్ళి అర్ధరాత్రయ్యేదాకా భాగవత పురాణం తన్మయులై వినేవాళ్లు. విక్రమ్ పెద్దన్నయ్యకు యోగులన్నా, బైరాగులన్నా మహా సమ్మకం అతను మఠాలచుట్టూనూ, సాధుకుటీరాల వెంబడీ అదేపనిగా తిరిగేవాడు. ఇక అమ్మగారి సంగతి సరేసరి; తెల్లవారుఝామునుండి అర్ధరాత్రిదాకా స్నానాలూ, పూజలూ, వ్రతాలూ మినహా మరో ధ్యాసే ఉండేదికాదు. ఈ వయస్సులోకూడా ఆమెకు అలంకరణంటే మహామోజు. కాని యిప్పుడు పెద్ద యోగినిగా మారిపోయిందిది. కోరికను అనవసరంగా అనర్ధకమంటుంది లోకం. మనలోకనపడే ఈ భక్తీ, నిష్ఠా, మతాభిలాషా-యివ్వన్నీ కేవలం మన కోరికలకూ, తృష్ణలకూ ఫలితాలేనంటాను నేను. మన మత విశ్వాసాలకు పునాది మన స్వార్థమే. ఈ కోరిక అనేది మనిషియొక్క మనస్సునూ, బుద్ధినీ యింతగా మార్చివేయగలుగుతుందనే విషయం నాకుమాత్రం యిదివరకెన్నడూ ఎరుగని సరిక్రొత్త అనుభవం. మేమిద్దరంకూడా అప్పుడప్పుడు జ్యోతిష్కులతోనూ, పండితులతోనూ సంప్రతించి మాలో మేము మథనపడుతుండేవాళ్ళం.

లాటరీ వేసేరోజు సమీపించేకొద్దీ మా మనశ్శాంతి క్షీణించి పోతుండేది. ఎప్పుడూ అదే ఏవగా ఉండేది. నాలో నేనే అనవసరంగా సందేహపడేవాణ్ణి. విక్రమ్ నాకు భాగ మివ్వటానికి నిరాకరిస్తే ఏం చెయ్యాలి నేను? టిక్కెట్టులో నువ్వసలు భాగం కలవనే లేదని బుకాయించేస్తే? లిఖితాధారమూ లేదు; సాక్ష్యమూ లేదు. అంతా విక్రమ్ నిజాయితీమీద ఆధారపడి ఉంది. అతని బుద్ధి కాస్త చలించిందంటే ఇంకే ముంది? నా కొంప మునిగిందన్న మాటే! ఎక్కడా చెప్పుకోటానికి కూడా ఆస్కారం లేదు. నోరెత్తటానికి వీల్లేదు. ఇక అప్పుడు ఏ మంటే ఏం లాభం? అతని బుద్ధి మారటమే నిజమైతే, ఇప్పటినుండే మొగంచెయ్యి చూపుతాడు. అలా మారి ఉండకపోతే, అంతు లేని బాధపడతాడు. ఎంతో నొచ్చుకుంటాడు. అతను అటువంటివాడు కాదుమరి! ... ఏమో ఎట్లా చెబుతాం? సొమ్ము పాపిష్టిది. సంపద వచ్చిపడుతుంటే నిజాయితీగా బతకటం కష్టం. ఇప్పటికి దబ్బేమీ రాలేదు. ఇప్పుడు నిజాయితీగా ఉండటానికి కానీ ఖర్చు పెట్టనక్కరలేదు. పొయ్యే దేముంది? పది లక్షల రూపాయలు వచ్చి ఒళ్ళో పడుతుందే; అదిగో అదీ పరీక్షా సమయం. నేను నా అంతరాత్మను పరీక్షించుకున్నాను. టిక్కెట్టు నా పేరిట ఉండి పదిలక్షలు నాకే వస్తే మదతపేచీ లేమీ పెట్టకుండా నేను మాత్రం అతని వాటా అతనికి అప్పగించే వాణ్ణేనా? ఏమో, ఎవరు చెప్పగలరూ? ఐనా తొంభైతొమ్మిదిపాళ్ళు ఏదో నాటక మాడి పేచీయే పెట్టేవాణ్ణి. "నువ్వు నాకు అయిదు రూపాయలు అప్పిచ్చావు. అయిదుకు పది తీసుకో; వంద తీసుకో, అంతే!" అనివుండేవాణ్ణి. కాని....ఛీఛీ! నేనంత నమ్మకద్రోహం చేసేవాణ్ణి కాదు.

మరునటిరోజు మే మిద్దరం పత్రిక చదువుతున్నాం. ఇంతలో అకస్మాత్తుగా విక్రమ్ ఇలా అన్నాడు—లాటరీలో నా టిక్కెట్టు రావటం జరిగితే 'అనవసరంగా నీతో భాగం కలిశానే' అని నేను చాలా విచారపడవలసి వస్తుంది.

అతను నిష్కపటంగా చిరునవ్వు నవ్వాడు. కాని పరిహాసం నాటున అతను ఎంత దాచిపెట్టాలనుకున్నా అతని మనసులోని మాటే అలా బయటపడింది.

"నిజమే! కాని అలాంటి విచారం నాకూ కలగవచ్చుగా?"

"కాని టికెట్ నా పేరిట ఉందిగా."

"ఐతే ఏం?"

"సరే! మాటవరుసకు నువ్వు నా వాటాదారువు కాదంటాననుకో!"

నా రక్తం స్తంభించిపోయింది. కళ్ళు చీకట్లు కమ్మిపోయినాయి.

"నువ్వంత నిజాయితీ లేనివాడివి కాములే!"

"ఏమో, ఎందుకు కాకూడదూ? అయిదు లక్షల రూపాయలు! సామాన్యమా. బుర్ర తిరిగిపోతుంటే!"

"అయితే బదర్, ఎందుకైనా మంచిది. కాగితం వ్రాసి ఇవ్వు. ఈ అనుమానం ఎందుకుండాలి?"

"నువ్వు వట్టి అనుమానస్తుడివోయ్ బ్రదర్. నేను నిన్ను పరీక్షించుదామని అలా అన్నాను. అట్లా జరగటమే. అయిదు లక్షలు కాదు. అయిదు కోట్లయితే మాత్రం? భగవంతుడు కరుణించాలిగాని, మాట తప్పుతా ననుకున్నావా?'' నవ్వుతూ అన్నాడు విక్రమ్.

కాని, అతని ఓదార్పుమాటలవల్ల నా కేమీ నమ్మకం కలగలేదు. మనసులో ఒక అనుమానం ఏర్పడిపోయింది.

"నీవు నీతి తప్పేవాడివి కావని నాకు మాత్రం తెలియదూ, అయినా వ్రాసు కుంటే మాత్రం మునిగిపోయిం దేముందీ?"

"ఎందుకూ అనవసరంగా?''

"అనవసరమైతే ఏంలే?''

"అయితే స్టాంపుమీదనే వ్రాసుకోవాలి. పదిలక్షలకు కోర్టుఫీజు ఏడువేల అయిదువందల దాకా అవుతుంది. నీ కేమైనా మతిపోయిందా ఏం?"

ఆలోచించుకున్నాను. పోనీలెద్దూ! మామూలు పత్రం కోర్టు కేమీ పనికిరాదు. అయినా అతని సిగ్గుతీయటానికీ, అతన్ని అవమానపరచటానికీ, నలుగురిలో వట్టి నీతిమాలినవా డనిపించటానికీ, కాగితం అంటూఉంటే అవకాశం ఉంటుంది. లోకంలో అప్రతిష్ఠ వస్తుందన్న భయమే లేకపోతే, ఇక మానవుడు ఎంత పనైనా చేస్తాడు. అప్రతిష్ఠ భయం చట్టపు భయంకంటే మానవుణ్ణి అదుపుచెయ్యటంలో తక్కువ పని చెయ్యదు. ''నాకు మామూలు కాగితమైనా నమ్మకమేలే!" అన్నాను నేను.

''వ్యవహారానికి పనికిరాని కాగితాలతో కాలం వ్యర్థం చెయ్యటం ఎందుకు లెద్దూ!'' నిర్లక్ష్యంగా అన్నాడు విక్రమ్

విక్రమ్ బుద్ధి ఇప్పటికే మారిపోయిదని నాకు నమ్మకం కలిగిపోయింది. లేకపోతే మామూలు కాగితం వ్రాయటానికికూడా సందేహ మెందుకు? "నీ బుద్ధి ఇప్పుడే మారిపోయిందే!'' కోపంగా అన్నాను నేను.

''ఇటువంటి పరిస్థితుల్లో నువ్వు మహా మడిగట్టుకుని ఉంటావని రుజువు చేద్దామనా నీ ఉద్దేశ్యం?'' లజ్జయినా లేకుండా అన్నాడు విక్రమ్.

''నేనంత మెతక మనిషిని కాదులే!''

''బయలుదేరాడు పెద్ద నిజాయితీపరుడూ, నీతిపరుడూ, మహా మహా కొమ్ములు తిరిగినవాళ్ళనే చూశాం.''

''నువ్వు ఈ క్షణంలోనే కాగితం వ్రాసి ఇవ్వాలి. నీ మీద నాకు నమ్మకం పోయింది.''

''నామీద నమ్మకం లేకపోతే నేను మాత్రం వ్రాసిస్తా ననుకున్నావా?''

''నా డబ్బు జీర్ణమౌతుందనేనా నువ్వనుకోటం?''

''ఎవరి డబ్బు; ఎట్లా ఉంటుం దా డబ్బు!''

''ఇదిగో చెబుతున్నా విక్రమ్! మన స్నేహం ఇంతటితో ఆఖరై పోతుంది. అంతేకాదు. అంతకంటేకూడా విషమ పరిణామాలు ఏర్పడతాయి.''

నాలో ప్రతీకారం జ్వాలలాగా చెలరేగి వళ్ళు మండసాగింది.

ఇంతలో అకస్మాత్తుగా ఆఫీసు గదిలో జగడ మాడుకుంటున్న అలికిడి విని నా మనసు అటు మళ్ళింది. అక్కడ బాబుగార్లిద్దరూ కూర్చునేవాళ్ళు. వాళ్ళ స్నేహం ఆదర్శ సోదరుల స్నేహం. రామలక్ష్మణుల స్నేహంకూడా అచ్చగా ఇలాగే ఉండి ఉంటుంది. జగడ మేమిటి; వాళ్ళ మధ్య ఎప్పుడైనా తర్కం జరిగినట్టుగాకూడా వినలేదు. పెద్దబాబుగారి మాటంటే చిన్నబాబుగారికి వేదవాక్యం. చిన్నబాబుగారి మనసు కనిపెట్టే పెద్దబాబుగారు ఏమైనా అనేవారు. మాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఆఫీసు గది వాకిలిదగ్గరకు పోయినుంచున్నాం. సోదరు లిద్దరూ తమ కుర్చీల్లోనించి లేచి నుంచుని ఉన్నారు. ఒకటి రెండడుగులు ముందుకు వేశారుకూడా. కళ్ల చింతనిప్పుల్లాగా ఉన్నాయి. కళ్ళల్లో క్రోధం చిందులు త్రొక్కతోంది. పిడికిళ్ళు బిగించారు. పరిస్థితి చూస్తే చేతులు కలిసేట్లే వున్నాయి.

చిన్నబాబుగారు మమ్మల్ని చూచి వెనక్కి తగ్గుతూ ఇలా అన్నారు: ''సమిష్టి కుటుంబానికి ఎలా అన్నారనీ, ఎవరి పేరటన్నారనీ; ఆ వచ్చిందేదో కానీగానీ, దమ్మిడీగానీ అందరికీ సమానంగా రావలసిందే.''

''ఎంతమాత్రం వీల్లేదు. నేనేదైనా నేరం చేస్తే నన్నే అరెస్టు చేస్తారు. కాని కుటుంబాన్నంతా కాదు. ఇది వ్యక్తిగత విషయం'' పెద్దబాబుగారు విక్రమ్‌ను చూచి మరో అడుగు ముందుకు వేసి అన్నారు.

''ఆ సంగ తేదో కోర్టు తేలుస్తుంది.''

''మహరాజుగా వెళ్ళు కోర్టుకు. నా పిల్లల పేరిటగానీ, నా భార్య పేరిటగానీ, నా పేరిటగానీ లాటరీవస్తే దాంతో నీ కెలాంటి సంబంధమూ లేదు. అలాగే లాటరీ నీ పేరిట వచ్చినా నాకుగానీ, నా భార్యకుగానీ, పిల్లలకుగానీ దాంతో ఎలాంటి సంబంధమూ ఉండదు.''

"మీ బుద్ధి ఇలాంటిదని తెలిసుంటే నేనుకూడా నాభార్యా, పిల్లలపేరిట టిక్కట్టు తీసుకొని ఉండేవాణ్ణే."

"అది నీ తప్పు!''

''మీరు నా సోదరులనుకోబట్టే అలా అయింది.''

"నువ్వొక విషయం తెలుసుకోవాలి. ఇది జూదం. జూదంలో వచ్చే జయాపజయాలకు కుటుంబాని కేమీ సంబంధం లేదు. రేపు నువ్వు అయిదువేలో, పదివేలో గుర్రపు పందాల్లో నష్టపోతే అందుకు కుటుంబాని కేమి బాధ్యత లేదు."

"కాని, సోదరుడి హక్కులు కాజేసి మీరేమీ బాగుపడరు."

"నువ్వేం బ్రహ్మవా? భగవంతుడివా? మహాత్ముడివా?"

సోదరు లిద్దరికీ తెలిసిందనీ, ముష్టియుద్ధం జరగబోతున్నదనీ విని, పరుగెత్తుకుంటూ వచ్చింది విక్రమ్ తల్లి. ఇద్దరికీ నచ్చచెప్పటం ప్రారంభించింది.

"మీరు నాకేమీ నచ్చచెప్పనక్కరలా. నాలుగు నాలుగు టిక్కెట్లు ముడి వేసుకు కూర్చున్న ఆయనగారికి చెప్పండి. నా దగ్గరేముందీ? ఒక్క టిక్కెట్టు! అది వస్తుందని నమ్మక మేముంది? నాకంటే డబ్బురావటానికి నాలుగురెట్లు ఛాన్సున్న ఆయనకు చెడుబుద్ధి పుట్టిందంటే అంతకంటే లజ్జాహీన, విచారకరమైన విషయం ఇంకేమైనా ఉందీ?" చిన్నబాబుగారు మండిపడుతూ అన్నారు.

"ఇదిగో! నా డబ్బులో సగం నీకే యిస్తాగా! ఇక ఊరుకో!" ఓదారుస్తూ అన్నది వదినగారు.

పెదబాబుగారు భార్యమీద విరుచుకు పడ్డారు–"సగమెందు కిస్తాం? ఒక్క కానీకూడా యివ్వను. మొగమాటపడిగానీ, మంచితనంవల్లగానీ ఇచ్చినా అయిదో వంతుకంటె ఏ విధంగానూ రాదు. ఆలోచించి చూచినా ధర్మ ప్రకారమైనా, నైతిక సూత్ర ప్రకారం చూచినా సగంభాగం ఏ చట్టప్రకారం వస్తుందీ?"

"లోకంలో చట్టాలన్నీ తమ కొక్కరికే తెలిసింది!"

"ముప్పది సంవత్సరాలు చేశాను ప్లీడరీ. తెలుసుగా?"

"కలకత్తా బారిస్టరు వచ్చి ఎదుట నుంచుంటే ఎగిరి పోతుంది ఈ ప్లీడరీ రాస్తా."

"కలకత్తా బారిస్ట రైతేనేం? లండన్ బారిస్ట రయితేనేం? లెక్కా? జమా?"

"కుటుంబానికి సంబంధించిన ఆస్తిలోలాగానే ఇందులోనూ నాకు సగ భాగం రావలసిందే."

ఇంతలో విక్రమ్ అన్నగారు తలకూ, చేతికీ కట్లు కట్టించుకుని, కుంటుకుంటూ నెత్తురు మరకలు నిండిన బట్టలతో ప్రసన్నవదనుడై ఒక పడక కుర్చీలో వచ్చి కూలబడ్డాడు. "ఏమిటిదంతా ప్రకాశ్! అరె! ఈ దెబ్బ ఎలా తగిలిందీ? ఎవరితోనైనా దెబ్బలాడలేదుగదా?" గాభరాగా అడిగాడు పెదబాబుగారు.

"ప్రకాశ్ కుర్చీలో పడుకుని ఒక్కసారి మూలిగాడు. తరువాత చిరునవ్వు నవ్వుతూ "ఏం లేదులెండి; ఏమంత పెద్ద దెబ్బ తగలలేదులెండి" అన్నాడు.

"చెయ్యీ తలా మొత్తం వాచిపోయినాయి. గుడ్డలు నెత్తురు ముద్దయినాయి. ఇంకా పెద్ద దెబ్బ తగలలేదు లెమ్మంటా వేమిటి? అసలు జరిగిందేమిటో చెప్పు. కారు ప్రమాదమేమి కాదుగదా?"

"మామూలు దెబ్బలేలెండి నాన్నగారూ! రెండు, మూడు రోజుల్లో అదే నయమైపోతుంది. ఏమి గాభరా పడక్కరలేదులెండి."

ప్రకాశ్ ముఖంలో ఆశ, నిబ్బరం నిండిన చిరునవ్వు చిందులాడుతోంది. లజ్జా, క్రోధాలుగానీ ప్రతీకారభావంగానీ మచ్చుకైనా కానరావటంలేదు.

"అస లింతకూ జరిగిందేమిటో చెప్పవెందుకని? ఎవరితోనైనా దెబ్బలాట జరిగితే చెప్పు. పోలీసులకు రిపోర్టు చేస్తాను." మరింతగా వ్యాకులపడుతూ ప్రశ్నించాడు పెదబాబుగారు.

"దెబ్బలాటేమీ జరుగలేదు నాన్నగారూ! అసలు జరిగిందేమిటంటే—నేను ఝుక్కడ్‌బాబావద్దకు వెళ్ళాను. మీకు తెలుసుగా: ఆయన మనుషులు కంటబడితేచాలు పారిపోతాడు. రాళ్ళు తీసుకుని వెంబడిపడతాడు. పరుగెత్తి పారిపోయిన వాడు దురదృష్టవంతుడే. కాని రాళ్ళదెబ్బలు తినిగూడా ఆయన్నంటుకు తిరిగిన వాడికిమాత్రం పట్టిందల్లా బంగారమన్నమాటే. ఆయన ఆవిధంగానే పరీక్షించుతాడు. ఇవ్వాళ నేనూ అక్కడికి వెళ్ళాను. అక్కడొక ఏభైమందిదాకా ఉన్నారు జనం. కొందరు మిఠాయిలు తీసుకొచ్చారు. కొందరు ఎంతో విలువైన బహూమతులు తెచ్చారు. మరికొందరు బట్టలతానులు తెచ్చారు. ఝుక్కడ్‌బాబా తపస్సులో ఉన్నాడు. అగస్మాత్తుగా ఆయన కళ్ళుతెరిచాడు. ఈ జనసమూహాన్ని చూచాడు. బోలెడురాళ్లు ఏరుకుని వాళ్ళవెంబడిపడ్డాడు. గోలగోలగా పరుగెత్తారు జనం. పడుతూ లేస్తూ పారిపోయారు. అంతా జారిపోయారు. ఒక్కడుకూడా నిలువలేకపోయినాడు. గడియారపు స్తంభంలాగా దృఢంగా నిలబడింది నేనొక్కడినే. ఇంకేముంది? ఆయన రాయివిసరనే విసరాడు. మొదటిదెబ్బ తలకు తగిలింది. అతని గురి తప్పనే తప్పదు. పుర్రెచిట్లింది. నెత్తురుధారగట్టి పారింది. ఐనా నేను చలించలేదు. బాబా మళ్ళీ మరో రాయి విసరాడు. అది చేతికి తగిలింది. నేను క్రిందపడిపోయాను స్పృహతప్పిపోయింది. తెలివివచ్చిన తరువాత చూస్తే అక్కడంతా నిశ్శబ్దంగానే ఉంది. బాబా కూడా మాయమైనాడు. ఆయన అలాగే అంతర్ధానమౌతుంటాడు. ఇకప్పుడు ఎవరిని పిలవనూ? బండి తెమ్మని ఎవరికి చెబుతానూ? బాధతో చెయ్యి బ్రద్దలైపోతోంది. తలనుండి రక్తం ఇంకా కారుతూనే ఉంది. ఎలాగో లేచి తిన్నగా డాక్టరువద్దకు వెళ్ళాను. ఆయన పరీక్షచేసి ఎముక విరిగిపోయిందన్నాడు. వెంటనే కట్టుకట్టాడు. వేడినీటితో కాపటం పెట్టమన్నాడు. డాక్టరు మళ్ళీ సాయంత్రం వస్తాడు—దెబ్బ తగిలితే తగిలిందిలే. ఇక లాటరీ మాత్రం నా పేరిట వచ్చిందన్నమాటే. ఇందులో ఏమీ సందేహంలేదు. ఝుక్కడ్ బాబా చేతి దెబ్బతిని అనుకున్నపని కాకుండా ఉన్న వాడు ఇంతవరకూ మచ్చుకైనా లేడు. నేను అన్నిటికంటే ముందు బాబాకు ఆశ్రమం కట్టిస్తాను."

పెద్ద బాబుగారి ముఖంలో ఆనందరేఖలు చిందులాడినాయి. వెంటనే ప్రక్క పరిచారు. ప్రకాశ్ దానిమీద పడుకున్నాడు. వాళ్ళమ్మ విసరటం ప్రారంభించింది. ఆమెకూడా సంతోషంగానే ఉంది. ఇంత దెబ్బతిని పదిలక్షలు సంపాదించటం దండుగ వ్యాపారమేమీ కాదు.

చిన్నబాబుగారికి ఆకలి మండిపోతోంది. పెదబాబుగారు భోజనానికి వెళ్ళారు. ఒదినగారుకూడా ప్రకాశ్‌కు భోజనం ఏర్పాటు చెయ్యటానికి వెళ్ళింది. వెంటనే

చిన్నబాబుగారు ప్రకాశ్‌ని ప్రశ్నించాడు—"రాళ్ళు జోరుగా విసురుతాడా? జోరుగా ఎందుకు విసురుతాడూ!"

ప్రకాశ్ ఆయన మనసులో ఉద్దేశ్యమేమిటో అర్థంచేసుకుని "అమ్మబాబో! అతను వేసేది రాళ్ళా! ఫిరంగి గుళ్ళయితే. మనిషి మంచి ఆజానుబాహుడు. ఎంత బలవంతుడనుకున్నా! ఒక్క గుద్దుతో వస్త్రాలుగూడా నిగిడి చావాల్సిందే. అంతంత మాత్రం మనిషైతే ఒక్క రాయితోనే సరి! ఎంతమంది చనిపోయారు. అయినా ఇంతవరకూ యుక్కడ్‌బాబామీద ఒక్క కేసుగూడా పెట్టలేదు. ఒకటీ, రెండూ రాళ్ళు విసరి ఊరుకుంటాడనుకున్నారా! క్రిందపడి స్పృహతప్పిందాకా రాళ్ళు విసురుతూనే ఉంటాడు. కాని అక్కడే ఉంది కీలకం. మీ రెంత ఎక్కువగా దెబ్బలుతింటే మీ కోరిక అంత గట్టిగా నెరవేరుతుంది" అన్నాడు.

ఆ విషయాన్ని చినబాబుగారు వణికిపోయేటంత భయంకరంగా చిత్రించాడు ప్రకాశ్. ఇక ఆయనకు అలా దెబ్బలు తినేందుకు ధైర్యం చాలలేదు.

# 4

చివరకు అదృష్టం నిర్ణయమయ్యేరోజు వచ్చేసింది. జులై 20 వ తేదీ! ఇక తెల్లవారటమే తరువాయి. ఖూనీ జరిగిపోతుంది. మేము వేకువఝామునే లేచాం. ఆశా, భయం రెండూ మిశ్రమమైన ఒక విధమైనకైపులో వున్నాం మేము. బాబుగార్లిద్దరూ యింకా బాగా ప్రొద్దుండగానే గంగాస్నానంచేసి మందిరానికివెళ్ళి పూజలో కూర్చున్నారు. ఇవ్వాళ నా హృదయంలో భక్తిభావం జాగృతమైంది. మందిరానికి వెళ్ళి లోలోపలే భగవంతుణ్ణి స్తోత్రం చెయ్యటం ప్రారంభించాను — "అనాధరక్షకా! నీ దయారస మొక్కసారి మా పై ప్రవహింపజేయవా? లాటరీ టిక్కెట్టు మేమెంత శ్రమపడి కొన్నామో నీకు మాత్రం తెలియదా? నీవు సర్వాంతర్యామివే! నీకు తెలియని విషయ మేముంది చెప్పు! ఈ ప్రపంచంలో నీ దయకు పాత్రులైనవారు మా కంటె మరెవ్వరున్నారు ప్రభూ!" మిక్రమ్ సూటూ, బూటూ వేసుకుని మందిరం ద్వారం వద్దకు వచ్చాడు. నన్ను సైగతోపిలిచి "ఇదిగో! నేను పోస్టాఫీసుకు వెళుతున్నాను" అని మాత్రం బర్రున వెళ్ళిపోయాడు. ఇంక కాసేపటికి ప్రకాశ్ మిఠాయిపళ్ళెములు తీసుకుని యింట్లోనుండి వచ్చి మందిరం వాకిట్లో నిలబడి అక్కడ గుమిగూడిన బీదలకు మిఠాయి పంచుతున్నాడు ఇక బాబుగార్లిద్దరూ తలవంచి, కళ్ళు మూసుకుని భక్తి పరవశులై భగవద్ధ్యానంలో ఉన్నారు.

పెద్దబాబుగారు తలఎత్తి పూజారివైపు చూస్తూ "ఏమంటారు స్వామీ? భగవంతుడు భక్తవత్సలుడుగదూ!" అన్నాడు.

"చిత్తం! చిత్తం! భక్తరక్షణార్థమే గదండీ శ్రీ మహావిష్ణువు క్షీరసాగరం నుండి పరుగులెత్తి గజేంద్రుణ్ణి రక్షించింది!" ఆయన మాటలను బలపరుస్తూ అన్నాడు పూజారి.

ఒక నిమిషం ఆగి చిన్నబాబుగారు తల ఎత్తి "ఏమండీ! భగవంతుడు సర్వశక్తివంతుడూ, సర్వాంతర్యామి గదండీ! అందరి హృదయాలనూ అర్థం చేసుకోడూ?" అన్నాడు.

"చిత్తం! చిత్తం! సర్వాంతర్యామి కాకపోతే సర్వుల హృదయాలనూ ఎలా అర్థం చేసుకుంటాడు చెప్పండి! శబరి భక్తి శ్రద్ధలు గ్రహించి స్వయంగా వచ్చి ఆమె కోరిక నెరవేర్చాడుగదండీ, మహానుభావుడు!"

పూజలు పూర్తయినాయి. హారతిచ్చారు. సోదరులిద్దరూ ఇవ్వాళ పెద్దగా మంగళహారతులు పాడారు. పెద్దబాబుగారు పళ్ళెంలో రెండు రూపాయలు వడ్డించారు. చిన్నబాబుగారు నాలుగు రూపాయలు వడ్డించారు. పెద్దబాబుగారు ఒక్కసారి కోపంగా చూచి ముఖం అటు త్రిప్పుకున్నారు.

ఉన్నట్టుండి పెద్దబాబుగారు "మీ మనసు కెలా ఉంది స్వామీ:" అని ప్రశ్నించారు పూజారిని.

"తమదే విజయం సందేహంలేదు."

"మరి నా సంగతి?" ప్రశ్నించారు చిన్నబాబుగారు.

"తమరూ జయిస్తారు." వెనకటంత గట్టిగానే నొక్కి చెప్పాడు పూజారి.

పెద్ద బాబుగారు భక్తి పరవశత్వంతో—

ఏ తిరుగ నను దయ జూచెదవో ఇనవంశోత్తమ రామా!

శరణు కోరితిని సంగున బ్రోవుము దశరథతనయా రామా! అంటూ తన్మయులై మందిరం నుండి బయలుదేరారు.

"దశరథ రామా గోవిందా-నన్ను

దయ చూడు మహానుభావా!" అంటూ

మరొక నిమిషానికి చిన్నబాబుగారు కూడా భజన చేసుకుంటూ మందిరం నుండి బయలుదేరారు.

వెంబడే నేనుకూడా బయలుదేరి మిఠాయిలు పంచుతున్న ప్రకాశ్‌కు సహాయం చేయబోయాను. కాని ఆయన "మీ రెందుకులెండి! ఇదిగో ఇప్పుడు పంచెయ్యనూ? ఇక వున్నది మాత్రం ఎంతలెండి!" అంటూ పళ్ళెం పక్కకు త్రిప్పుకున్నాడు.

నేను లజ్జపడుతూ పోస్టాఫీసువైపుకు బయలుదేరాను. ఇంతలో విక్రమ్ ముసిముసి నవ్వులూ నవ్వుతూ సైకిలుమీద వచ్చేశాడు. వాణ్ణి చూడగానే అందరికీ వెర్రెత్తిపోయింది. బాబుగార్లిద్దరూ ముందే నిలబడి వున్నారు. దేగల్లాగా వెళ్ళి పడ్డారు యిద్దరూ. ప్రకాశ్ పళ్ళెంలో ఇంకా కొంతమిఠాయి మిగిలివుంది. పళ్ళెం

నేలమీద పడేసి అతనూ పరుగుతీశాడు. ఇక నేనా ఉన్మాదంలో విక్రమ్‌ను చంకకెత్తుకున్నాను. కాని అసలతన్ని ఎవరూ ప్రశ్నించటమేలేదు. అంతా జయజయధ్వానాలు చేస్తూ వెర్రికేకలు పెడుతున్నారు.

"జయ్! రాజా రామచంద్ర ప్రభువుకూ జై!" ఆకాశంవంక చూస్తూ నినదించాడు పెదబాబుగారు.

"జయ్! వీరహనుమాన్‌కీ జై!" ఒక్క గంతువేసి పొలికేక పెట్టాడు చిన్నబాబుగారు.

"ఝక్కడ్ బాబా జిందాబాద్" చప్పట్లు కొడుతూ వెర్రిగా అరిచాడు ప్రకాశ్.

విక్రమ్ యింకా పెద్దగా పకపకా నవ్వి దూరంగా నుంచుని "గెలిచినవాళ్ళు ఒక లక్ష రూపాయలు నాకివ్వాలి. ఇష్టమేనా మరి?" అన్నాడు.

"మొదట చెప్పూమరి!" విక్రమ్ చెయ్యి లంకించుకుని ప్రశ్నించాడు పెదబాబుగారు.

"ఉహుఁ! ఊరికే చెప్పకేం!"

"కబురు చెప్పినందుకే లక్ష రూపాయలా! మంచి మొనగాడివే!" కోపంగా అన్నాడు చినబాబుగారు.

"పోస్టాఫీసు మాకేం తెలియదనుకున్నావా?" ప్రకాశ్ కూడా ముఖం చిట్లించాడు.

"సరే అయితే. మీ పేర్లు వినటానికి సిద్ధంగా ఉండండి."

అందరూ మిలిటరీ అటెన్షన్ పోజులో నుంచున్నారు.

"మెదడును ఆర్డరులో ఉంచుకోండి."

అందరూ పూర్తి జాగ్రత్తలో ఉన్నారు.

"అయితే చెవులు తెరుచుకుని మరీ వినండి. ఈ పట్టణమంతా క్షౌరమైంది. ఈ పట్టణమే కాదు; భారతదేశం అంతా క్షౌరమైంది. అమెరికాలో ఒక నీగ్రోవాడు గెలిచాడు."

"అబద్ధం! అబద్ధం! పచ్చి అబద్ధం!" మండిపడ్డాడు పెదబాబుగారు.

"అసంభవం! మూడు నెలల తపస్సు వృధాకావటమే బలే!" పూనికగా నిలబడి ఊగుతూ అన్నాడు చిన్నబాబుగారు.

"ఒకప్రక్క ఇక్కడ తల పగులగొట్టించుకుని, చెయ్యి విరగ్గొట్టించుకుని కూర్చుంటే పరిహాసమాడుతున్నావా?" గుండెలు బాదుకుంటూ అన్నాడు ప్రకాశ్.

ఇంతలో వందల జనం అటునుండి ఏడుపుముఖాలతో బయలుదేరారు. పాపం వాళ్ళంతా పోస్టాఫీసుకు వెళ్ళి తమ అదృష్టానికి విలపిస్తూ తిరిగి వస్తున్నారు. "అమెరికా నీగ్రో కొట్టేశాడురా! దౌర్భాగ్యుడు! సైతాను! దుర్మార్గుడు!" అనుకుంటున్నారు.

ఇంకా నమ్మకుండా ఎవరుంటారు? పెద్దబాబుగారు మండిపడుతూ మందిరానికి వెళ్ళారు.

"ఇన్నాళ్ళబట్టి నిన్ను పోషించింది ఇందుకేనా? తేరసొత్తు తింటూ దర్జాగా కులుకుతున్నావా?" పూజారిని ఉద్యోగంలోనుండి తీసివేస్తూ అన్నాడు పెదబాబుగారు.

ఇక చిన్నబాబుగారి గుండెలు జారిపోయినాయి. రెండు మూడుసార్లు తల బాదుకుని అక్కడే కూర్చుండిపోయినాడు. కాని, ప్రతాప్ కోపానికి హద్దేలేదు. అతను దిట్టమైన తన లాఠీ తీసుకుని ఘుక్కడ్ బాబా దేహశుద్ధి చెయ్యటానికి బయలుదేరాడు.

"అందరూ ద్రోహమే చేశారు. ఇక భగవంతు డేం చేస్తాడు? ఇతరుల సొత్తు లాక్కొని మన కివ్వమంటే యిస్తాడా?" అని మాత్రం అన్నది విక్రమ్ తల్లి.

ఆనాడు రాత్రి ఎవరూ భోజనం చెయ్యలేదు. నేనుకూడా దిగాలుపడి కూర్చుని ఉన్నాను. ఇంతలో విక్రమ్ వచ్చి "హోటలుకుపోయి ఏమైనా తినొద్దాం పద! ఇవ్వాళ ఇంట్లో పొయ్యి రాజలేదు" అన్నాడు.

"సరేగాని పోస్టాఫీసునుండి వచ్చేప్పుడు నువ్వు సంతోషంగా ఉన్న కారణ మేమిటి చెప్పు!" అడిగాను నేను.

"పోస్టాఫీసు ముందున్న వేలజనాన్ని చూచేసరికి మన ప్రజల అజ్ఞానానికీ, మూర్ఖత్వానికీ నవ్వు వచ్చింది. ఒక్క పట్టణంలోనే ఇంతమంది ఉంటే భారత దేశంలో ఇంతకు వెయ్యిరెట్లకు తక్కువ ఉండరు. ఇక ప్రపంచం మొత్తంమీద లక్ష రెట్లకు మించే ఉంటారు. ఆశలతో నేను నిర్మించుకున్న మహాపర్వతం కాస్తా క్షణంలో నలుసుగా మారిపోయింది. అందుకే నవ్వు వచ్చింది నాకు. అరగిద్దెడు బియ్యపు అన్నం అరచేతిలో ఉంచుకుని లక్షమంది ప్రజలకు విందు చెయ్యటానికి తయారైనాడట ఒక దానకర్ణుడు....... అట్లాగే మా ఇంట్లో ఒక్కొక్కడూ ఎంతెంత పోకడలు పోయాడు!...." అంటూ నవ్వాడు.

నేనూ నవ్వాను- "నిజానికి నీ వన్నది నిజమే! మనిద్దరం ప్రాతకోతల కోసం కీచులాడుకు చచ్చాం. సరేగాని ఒక్కటడుగుతా; కాని నిజం చెప్పాలి సుమా! నీ బుద్ధి మారిందా లేదా చెప్పు!"

"ఇప్పుడు తెలుసుకుని మాత్రం ఏం ప్రయోజనం? దాన్నలా తెరచాటునే ఉంచు!"

— o —

# చదరంగ యోధులు

వజీద్ అలీఖాన్ పరిపాలించే రోజులవి. లక్నో భోగవిలాసాల నిషాలో మునిగి తేలుతోంది. చిన్నా, పెద్దా, ధనికా, పేదా అందరూ ఈ భోగలాలసత్వం లోనే మునిగిపోయారు. నృత్యగానసభల్లో తన్మయుడయ్యేవా డొకడు; నల్లమందు కైపులో కునికిపాట్లు పడే దొకడు. నిత్యజీవితంలో ప్రతిరంగంలోనూ, భోగ విలాసాలు ప్రాధాన్యం వహించాయి. రాజ్యపరిపాలనలో, సాహిత్యక్షేత్రంలో కళాకౌశలంలో, పరిశ్రమల్లో, ఆహారవిహారాల్లో, అన్ని రంగాలలోనూ విలాస వ్యసనాలు వ్యాపించిపోతున్నాయి. రాజోద్యోగులు విషయ వాసనల్లోనూ, కవులు ప్రణయ, విరహాల వర్ణనల్లోనూ, పనివాళ్ళు పట్టుబట్టల బుటాదారీపనుల్లోనూ, చిత్రవిచిత్రమైన పూల అల్లికలు నిండిన మేల్మివస్త్రాలు తయారు చెయ్యటంలోనూ, పారిశ్రామికులు సుర్మా, సెంట్లు, రకరకాల అభ్యంగన సామగ్రి తయారు చెయ్యటంలోనూ నిమగ్నులయ్యేవాళ్ళు. అందరూ భోగవిలాసాల కైపులోనే మునిగి తేలుతున్నారు. ప్రపంచంలో ఏమి జరుగుతున్నదనే విషయం ఎవరికీ పట్టటంలేదు. ఒకవైపు కోడిపందాలు జరుగుతున్నాయి. మరోప్రక్క పొట్టేళ్ళ పందాలకు సన్నాహాలు చేస్తున్నారు. మరోచోట పచ్చీసు పందెం సాగుతోంది. విజయోత్సాహంతో కోలాహలంగా ఉంది. ఇంకోచోట ఘోరంగా చదరంగ యుద్ధం జరుగుతోంది. మహారాజు మొదలు ఆగర్భదరిద్రుడివరకూ ఈ వ్యసనంలోనే మునిగి తేలుతున్నారు. చివరకు ఫకీర్లుకూడా నాలుగు రూకలు దొరికితే రొట్టెలు తినటం మానేసి నల్లమందుకో, గంజాయికో తయారౌతున్నారు. 'చదరంగం, చీట్లపేక, మూడుముక్కలాట - వీటివల్ల బుద్ధి సునిశిత మౌతుంది. ఆలోచనాశక్తి అధికమౌతుంది. చిక్కు సమస్యలను పరిష్కరించే అభ్యాసం అలవడుతుంది.' ఇలాంటి వాదనలన్నీ జోరుజోరుగా వినిపిస్తుండేవి. (ఈ మతస్థులు ప్రపంచంలో ఇప్పటికీ లేకపోలేదు.) అందువల్లనే మిర్జా సజ్జదాలీ, మీర్ రోశనాలీలు ఇద్దరూ తమ కాలంలో అత్యధిక భాగం మెదడుకు పదును పెట్టుకోటానికి వినియోగించే వాళ్ళంటే ఆలోచన గలిగిన ఏ వ్యక్తికయినా అభ్యంతర మెలా ఉంటుంది చెప్పండి. తాతలనాటి సొత్తు ఇద్దరికీ ఉంది. బ్రతుకు దెరువును గురించి ఎలాంటి చింతా లేదు. ఇంట్లో కూర్చుని హాయిగా విలాసాలతో కులుకుతున్నారు. అంతకంటె ఇక చేసే పనిమాత్ర మేముందీ! ప్రొద్దున్నే లేచి మిత్రులిద్దరూ భోజనంచేసి చదరంగ తివాసి పరిచి బెఠాయించేవాళ్ళు. పావులు అమర్చేవాళ్లు. ఇక యుద్ధం మొదలై ఎత్తుపైఎత్తులు

సాగేవి. రెండు యామలుగానీ, మూడు యామలుగానీ, సాయంత్రమేగానీ వాళ్ళ కేమీ తెలిసేదికాదు. "భోజనం తయారైంది" అని ఇంట్లోనుండి మాటిమాటికీ పిలుపు "ఇదిగో ఇప్పుడే వస్తున్నా! దస్తర్‌ఖాన్ పరుస్తుండు" అని ఇక్కడనుండి జవాబు. చివరకు వంటమనిషి గత్యంతరం లేక భోజనం గదిలోకే తెచ్చి పెట్టి వెళ్ళిపోయేవాడు. ఇక మిత్రు లిద్దరూ రెండు పనులూ తోడుతోడుగా సాగించే వాళ్లు. మీర్జా సజ్జదాలీ ఇంట్లో ముసలీ ముతకా ఎవరూ లేరు. అందువల్ల ఆట ఆయన దివాణంలోనే సాగుతుండేది. అలా అని మీర్జా కుటుంబంలో వాళ్ళందరికీ ఈ వ్యవహారం నచ్చిందని కాదు. ఆయన భార్యసంగతి ఇంకా వేరే చెప్పాలి! పేటలోవాళ్ళంతా, చివరకు ఇంట్లో పనిపాటలవాళ్లుకూడా రోజూ కటువైన వ్యాఖ్యానాలు చేస్తుండేవారు. పట్టి దిక్కుమాలిన ఆట. ఇల్లు వల్లకాడు చేసేస్తోంది. అల్లా (దేవుడు) ఎవణ్ణీ ఈ వ్యసనంలో పడనివ్వకూడదు. మనిషి ఉట్టికీ, స్వర్గానికీ ఎందుకూ కాకుండా భ్రష్టుపట్టిపోతాడు. రెంటికీ చెడ్డ రేవడౌతాడు. ఇదొక పెద్ద వ్యాధి - మీర్జాయొక్క భార్యకు ఈ ఆటంటే ఎంతో అసహ్యం. సందు దొరికి నప్పుడల్లా పేచీ పెడుతూనే ఉండేది. కాని ఆమెకు పేచీ పెట్టడానికి సామాన్యంగా వీలుకూడా చిక్కేదికాదు. ఆమె ఇంకా నిద్రమంచంమీద ఉండగానే ఇక్కడ ఆట ప్రారంభమయ్యేది. ఇక రాత్రిపూటగూడా ఆమె నిద్రపోయిన తరువాత యెప్పటికో వెళ్ళేవాడు ఇంట్లోకి. ఆమె తన కోపమంతా నౌకర్లమీద వెళ్లబోసుకునేది. "కిల్లీ కావాలన్నారా? వచ్చి తీసుకుపొమ్మని చెప్పు. తింటానికి కూడా తీరిక లేదా ఏం? తింటాడో లేక ఎలుకలకూ, కుక్కలకూ పెట్టుకుంటాడో మన కెందుకుగానీ, ఆ అన్నం తీసుకునివెళ్ళి మొహాన గొట్టిరా" అంటుండేది. అయినా ఆమెగూడా ఎదుట ఏమీ అనగలిగేది కాదు. ఆమెకు తన భర్తకంటెకూడా మీర్ సాహెబ్ అంటేనే గిట్టేదికాదు. ఆయనకు ఆమె మీర్ బిగాడూ (ఇతరులను పాడుచేసేవాడు) అని నామకరణం చేసింది. బహుశా మీర్జా తన నిర్దోషిత్వాన్ని ప్రకటించుకోటం కోసం నేరమంతా మీర్ సాహెబ్‌కు అంటగట్టేవాడు కాబోలు!

ఒకరోజు మీర్జా భార్యకు తలనొప్పి వచ్చింది. ఆమె దాసీని పిలిచి "పోయి నవాబుగారిని పిలుచుకురా! ఏ వైద్యుడి దగ్గరకైనా పోయి మందుతేవాలి. పో! త్వరగా వెళ్లు" అన్నది. దాసి వెళ్ళి ఆసంగతి చెబితే "ఇదిగో! ఇప్పుడే వస్తున్నా పద" అన్నాడు మీర్జాగారు. బేగమ్ సాహబా చాలా కోపిష్టిస్వభావం కలది. ఆమె తలనొప్పితో బాధపడుతుంటే, భర్త చదరంగమాడుతూ కూర్చోటానికి గుండెలే! ముఖం కందగడ్డయిపోయింది. "తానిప్పుడు వస్తాడో లేక వైద్యుడిదగ్గరకు నన్నే పొమ్మంటాడో చెప్పమను" అన్న దామె దాసీతో. మీర్జా ఆట మాంచి రసఘట్టంలో ఉంది. రెండేరెండు ఎత్తుల్లో మీర్ సాహెబ్‌ను ఓడించబోతున్నాడు. "ఏం? అంత ప్రాణాలు పోతున్నాయా? కాస్త ఓర్చుకోలేదూ?" విసుక్కుంటూ అన్నాడు మీర్జా.

"కాస్త అటుపోయి వినిరాకూడదూ! ఆడవాళ్లు సహజంగా సుకుమారులూ."

"నిజమే! ఎందుకు వెళ్ళనూ? రెండు ఎత్తుల్లో మీరు ఎలాగూ ఓడి పోతుండిరి!"

"అంత సులభం కాదండోయ్! పావులు ముట్టడివేసినంత మాత్రానే ఓడి పోతా ననుకున్నారా? ముందు మీరు వెళ్ళి మాట్లాడిరండి. ఉత్తపుణ్యానికి ఆమె మనసు కష్టపెట్టట మెందుకూ!"

"ఆ మాటమీదే ఉండండి. ఓడించి మరివెళ్తాను. కాచుకోండి!"

"నేను ఆడనే ఆడను. ముందు మీరు వెళ్ళి విచారించిరండి."

"అరె! భాయీ! వైద్యుడిదగ్గర కెళ్లాలిప్పుడు. తెలుసా? నన్ను వేధించేందుకిదొక సాకేగాని తలనొప్పి లేదు; మట్టీ లేదు."

"ఏమైనా కానీ! ఆమె మాటకూడా కాస్త పాటించాలి."

"సరేలే! ఇంకొక ఎత్తు వేద్దాం."

"ఉహూం! మీరు వెళ్ళి వచ్చిందాకా పావుమీద చెయ్యి కూడా వెయ్యను."

మీర్జా ఇక తప్పనిసరై లోపలికి వెళ్లాడు. బేగమ్‌సాహెబా కొరకొర చూస్తూ మూలుగుతూనే "ఆ దిక్కుమాలిన చదరంగం అంటే ఇంత వ్యసనమా! ఇవతల ఎవరైనా చచ్చినాసరే అక్కడినుండి కదలరామె. మీ వంటి మనుషులు అసలు పుట్టనేకూడదు" అన్నది.

"ఏం చెయ్యనూ? మీర్‌సాహెబ్ రానీకపోతే? ముప్పతిప్పలు పడి ఎలాగో వదిలించుకు వచ్చాను."

"తనమాదిరే ఇతరు లందరికీకూడా పనీ పాటు ఉండదనుకుంటున్నాడా ఏం? ఆయనకుకూడా పెళ్లాం, పిల్లలంటూ ఉన్నారా? అందరినీ ఆఖరు చేసేశాడా?"

"వట్టి వ్యసనగాడు. ఆయన వస్తుంటే తప్పనిసరై ఆడక తప్పటంలా! ఏం చెయ్యనూ?"

"నాలుగు చీవాట్లు పెట్టరాదూ?"

"సాటివాడూ! వయస్సులో, హోదాలో నాకంటె ఒకమెట్టు ఎక్కువైన వాడు. కాస్త మర్యాద పాటించక తప్పుతుందా?"

"అయితే నాలుగు విదిలింపులు నేనే విదిలిస్తాను. కోపమొస్తేరానీ! ఎవడి మోచేతినీళ్లు ఎవడు త్రాగుతున్నాడు? అలిగితే ఆయ నింటికి ఆయన పోతాడు. అంతేగా. హిరియా! పోయి ఆ చదరంగం తీసుకురా. అయ్యగారు ఇప్పుడు రారూ; తమరు ఇంటికి దయచెయ్యొచ్చని చెప్పిరా మీర్ సాహెబ్‌గారితో."

"ఆ! ఆ! అంత కోపమొస్తే ఎట్లా? అవమానపరుద్దా మనుకుంటున్నావా? ఏమిటదీ? -హిరియా! ఆగు! ఎక్కడికి వెళ్ళేవి!"

"పోనివ్వ రెందుకనీ? దా న్నాపితే నన్ను చంపుకున్నట్లే. ఉహూం! దాన్ని సరే ఆపారు. నన్నాపండి తెలుస్తుంది."

ఈ మాట అని బేగమ్ సాహెబా మండిపడుతూ దివాణం వైపుకు వెళ్ళింది. పాపం మీర్జా ముఖాన నెత్తురుచుక్క లేదు. బేగమ్‌ను బ్రతిమాల సాగాడు —"అల్లా తోడు! హజరత్ హుస్సేన్‌తోడు. అక్కడికి వెళ్ళితే నన్ను చంపుతున్నట్లే." కాని బేగమ్ ఒక్కటీ లెక్కచేయలేదు. దివాణం గదివాకిలిదాకా వెళ్ళింది. కాని అకస్మాత్తుగా పరాయి మగవాడి ఎదుట పడటానికి కాళ్ళాడలేదు. లోపలికి తొంగి చూసింది. అదృష్టవశాత్తూ గదిలో ఎవ్వరూ లేరు. మీర్‌సాహెబ్ ఒకటి రెండు పావులు ఇటువటూ, అటువిటూ మార్చి, ఏమీ ఎరుగనట్లుగా బయట పచార్లు చేస్తున్నాడు. ఇంకేముంది! బేగమ్ లోపలికి వెళ్ళి ఆటంతా చెల్లాచెదరు చేసింది. కొన్ని పావులు బల్లక్రింద పారేసింది. కొన్ని బయటికి విసిరికొట్టింది. లోపలనుంచి తలుపులు మూసి గొళ్ళెంబెట్టివేసింది. మీర్‌సాహెబ్ వాకిలిదగ్గరే ఉన్నాడుగా, పావులు బయట పారెయ్యటం చూచాడు. గాజుల గలగలగూడా విన్నాడు. పైగా తలుపు కూడా బిగించె. బేగమ్‌సాహెబాకు కోపమొచ్చిందని గ్రహించాడు. మెల్లగా యింటి దోవ పట్టాడు.

"మొత్తానికి రభస చెయ్యనేచేశావు" అన్నాడు మీర్జా.

"ఈసారి మీర్‌సాహెబు యిక్కడికి రానీ చెబుతా! నుంచున్నవాణ్ణి నుంచున్నట్లు గెంటిస్తాను. ఇంతటి భక్తి ఆ అల్లాఅంటే ఉండరాదూ? అబ్బే! ఆపని చేస్తే పాపం రాదూ! తమరిక్కడ చదరంగమాడుతూ కూర్చుంటే, ఈ సంసారమంతా నేను ఈదాలన్నమాట. ఇకనైనా వైద్యుడిదగ్గరకు వెళ్తారా? ఇంకా యిక్కడే తారట్లాడుతారా?"

మీర్జా యింటినుండి బయలుదేరాడు. వైద్యుడి యింటికి వెళ్ళటానికి బదులు మీర్‌సాహెబ్ యింటికి చేరుకున్నాడు. జరిగిందంతా చెప్పాడు.

"పావులు వాకిట్లో పడ్డప్పుడే గ్రహించాను నేను. వెంటనే పలాయనం చిత్తగించాను. మంచి కోపిష్టి మనిషల్లే ఉందే! కాని మీ రామెను అనవసరంగా నెత్తికెక్కించుకోటం ఏమంత బాగుండలా. మీ బయటి వ్యవహారాలతో ఆమె కేమి సంబంధం? ఆమె పనల్లా ఇల్లు చక్కబెట్టుకోటం; అంతే! కాని ఇతర విషయాలతో ఆమె కేం పని?" అన్నాడు మీర్ సాహెబ్.

"అది సరేగాని యింతకూ మన ముకాణం ఎక్కడ పెడతాం చెప్పండి" అన్నాడు మీర్జా.

"అందుకు దిగు లేముంది? ఇంత పెద్ద భవనం ఉంది. ఇక్కడే కూర్చుందాం."

"మరి బేగమ్‌కు ఎలా నచ్చచెప్పను! మా యింటి వద్ద కూర్చుంటేనే యింత గొడవ చేసింది. ఇక ఇక్కడ సాగిస్తే ఊపిరితో ఉండనిస్తుందీ!"

"వాగ్కంటే వాగుకోనీండి. నాలుగురోజులు గడిస్తే ఆమే సర్దుకుంటుంది. ఆ! మీరు ఒక పని చెయ్యండి; ఈ రోజునుండీ కాస్త బెట్టుగా మాత్రం ఉండండి."

# 2

మీర్‌సాహెబ్ భార్యకుమాత్రం - కారణ మేమిటో తెలియదుగాని - ఆయన యింట్లో లేకుంటేనే హాయిగా ఉండేది. అందువల్ల ఆమె ఎప్పుడూ ఆయన చదరంగ వ్యసనాన్ని విమర్శించేదికాదు. ఎప్పుడైనా మీర్‌సాహెబ్ జాగుచేస్తే గుర్తు చేసికూడా పంపేది. ఈ కారణాలవల్ల తన భార్య చాలా వినయ విధేయతలు గలదనీ, గంభీరమైన మనిషనీ మీర్ సాహెబుకు ఒక భ్రమ ఏర్పడిపోయింది. కాని, చదరంగం ఇక్కడనే ప్రారంభించి మీర్ సాహెబ్ రోజంతా ఇంట్లోనే ఉండటం మొదలుపెట్టి నప్పటినుంచీ ఆమెకు చాలా ఇబ్బందిగా ఉంది. ఆమె స్వేచ్ఛకు ఆటంకం కలిగింది. రోజంతా వాకిలివైపు తొంగిచూడటానికి పరితపించి పోయేది.

అటు నౌకర్లలోగూడా గుసగుసలు ప్రారంభమైనాయి. అంతకుముందు వాళ్ళు రోజంతా పనీ, పాటూ లేకుండా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునేవాళ్ళు. ఇంట్లోకి ఎవరైనా రానీ, పోనీ, వాళ్ళకేమీ సంబంధ ముండేదికాదు. కాని, ఇప్పు డలా కాదు. రాత్రిం బవళ్లు ఒకటే రాపిడైపోయింది. ఒకసారి తాంబూలం తెమ్మంటే, ఇంకోసారి మిఠాయీలు తెమ్మనేవాళ్ళు. ఇక హుక్కా సంగతి చెప్పనే అక్కర లేదు. ప్రేమికుని హృదయంలాగా నిరంతరం రాజుతూనే ఉండేది. బేగమ్ సాహబా వద్దకు వెళ్ళి మాటిమాటికీ యిలా ఫిర్యాదుచేసేవాళ్ళు—"అమ్మగారూ! నవాబుగారి చదరంగంతో మా పంపతెగిపోతోంది. రోజంతా తిరిగి తిరిగీ కాళ్ళు బొబ్బలెక్కి పోతున్నాయి. ప్రొద్దున కూర్చుంటే ప్రొద్దుగూకె లేవటమా? ఇదెక్కడ ఆట అమ్మ గారూ! గంటో, అరగంటో ఉల్లాసంగా ఆడుకుంటే ఫరవాలేదు. అయినా మాకేమీ కష్టం లేదనుకోండి. మీ సేవకులం- చెప్పిన పనల్లా చెయ్యటమే మా పని. అయినా ఈ ఆట వట్టి దిక్కుమాలినదండీ! ఈ ఆట ఆడేవాడు ఎక్కిరాడు. ఇంటి కేదో ఆపద చుట్టుకునితీరుతుంది. ఈయనగారి వ్యసనం గురించి ఒకరి తరువాత ఒకరుగా క్రమక్రమంగా పేటకు పేటంతా అల్లుకుపోయింది. పేటలో ఏ మూల చూచినా ఇదే చర్చయిపోతే! అయ్యగారి ఉప్పూ పులుసూ తింటున్నవాళ్ళం. యజ మానికి చెడ్డపేరు వస్తుంటే చూడలేకుండా ఉన్నాం. కాని మేమేం చెయ్యగలం."

"అసలు నాకు ఆ ఆటంటే అసహ్యం. కాని ఆయన ఎవరిమాటా వినడాయె మరి! ఏం చెయ్యగలం" ఇలా జవా బిచ్చేది బేగమ్.

పేటలో ఉన్న ఒక రిద్దరు పూర్వకాలపువాళ్లుకూడా అశుభాన్ని గురించి అనేక రకాలైన ఊహలు చేస్తూండేవాళ్ళు. "ఇక లాభంలేదు. మన శ్రీమంతు లీ స్థితిలో ఉంటే యిక ఈ దేశాన్ని అల్లాకూడా కాపాడలేడు. ఈ చదరంగం,

రాజ్యం సర్వనాశనం గావటానికే వచ్చింది. అన్నీ అపశకునాలే కనపడుతున్నాయి" అనేవాళ్ళు.

రాజ్యంలో ఎక్కడ చూచినా ఆర్తనాదాలే. ప్రజలను పట్టపగలే దోపిడీ చేస్తున్నారు. మొరపెట్టుకున్నా ఏనేవా దెవడూ లేడు. పల్లెటూళ్ళ సంపదంతా లక్నో నగరానికి ఓడ్చుకు రాబడుతోంది. అదంతా వేశ్యాగృహాలకూ, సారాకుండలకూ, తదితర భోగ విలాసాలకూ ఆహూతై పోతోంది. ఈస్టిండియా కంపెనీవాళ్ళ రుణం రోజురోజుకూ పెరిగిపోతోంది. అంతకంతకు అప్పుకంబడి తడిసి మొప్పెందు మౌతోంది. రాజ్యంలో సుపరిపాలన లేనందువల్ల పన్నులుకూడా వసూలు కావటం లేదు. మరో ప్రక్క కంపెనీ రెసిడెంటు మాటిమాటికీ హెచ్చరికలు చేస్తున్నాడు. కాని ఇక్కడ అందరూ విలాసాలకై పులో మునిగి తేలుతున్నారు. ఎవడికీ చీమ కుట్టినట్టయినా లేదు.

సరే! ఇక్కడ మీర్ సాహెబ్ దివాణంలో చదరంగ మాడటం ప్రారంభించి నెలలు గడిచినాయి. చదరంగంలో క్రొత్త క్రొత్త ఎత్తులు వేసేవాళ్ళు. క్రొత్త క్రొత్త కోటలు నిర్మించే వాళ్ళు. నిత్యం సరికొత్త వ్యూహాలు కనిపెట్టేవాళ్ళు. అప్పు డప్పుడు ఆటమధ్యలో పేచీ పడేవాళ్లు. నువ్వెంతంటే నువ్వెంత అనేవరకూ వచ్చేది పరిస్థితి. మిత్రు లిద్దరూ కలిసిపొయ్యే వాళ్ళు. అప్పుడప్పుడు ఆట అసలు ఎత్తి పారేయటంగూడా జరిగేది. మీర్జా అలిగితన ఇంటికి వెళ్ళిపోయేవాడు. మీర్‌సాహెబ్ తన ఇంట్లోకి పోయి కూర్చునేవాడు. కాని రాత్రి నిద్రలో వాళ్ళ మనస్పర్ధంతా మటుమాయమైపోయేది. తెల్లవారగానే 'మిత్రు లిద్దరూ మళ్ళీ దివాణంలో తయా రయ్యేవాళ్ళు.

ఒకరోజున వారిదర్దూ చదరంగపు ఊబిలో గొంతులోతున దిగబడి ఉక్కిరి బిక్కిరౌతున్నారు. ఇంతలో గుర్ర మెక్కి చక్రవర్తి సైనికాధికారి ఒకడు "మీర్ సాహెబ్ ఎక్కడ?" అంటూ వచ్చాడు. మీర్‌సాహెబ్ ప్రాణాలు ఎగిరిపోయినాయి. ఇదొక పీడ వచ్చిపడిందే. ఎందుకొచ్చిం దబ్బా ఈ పిలుపు? ఏదో కొంపమునిగి నట్లేఉందే! ఇంటి తలుపు బిగించాడు. "ఇంట్లో లేరని చెప్పు?", అన్నాడు నౌకర్లతో. "ఇంట్లో లేక ఎక్కడికి వెళ్ళాడు?" అన్నాడు అధికారి. "ఏమో తెలియదు; ఏమిటి పని?"

''నీకు చెబితే ఏం లాభం? చక్రవర్తిగారు కబురంపారు-బహూశా సైన్యానికి సిపాయిలు కావాలేమో! జాగీర్దారనుకున్నాడా మజాకా అనుకున్నాడా!''

''అయితే వెళ్ళండి. చెబుతానులెండి.''

''ఇది చెప్పేమాట కాదు. రేపు మళ్ళీ నేను వస్తాను; వెంబడి తీసుకు రమ్మని హుకుమైంది.''

అధికారి వెళ్ళిపోయినాడు. మీర్ సాహెబ్ గుండె దడదడ లాడిపోయింది "చెప్పండి! ఇక ముందు గతేమిటి?'' అన్నాడు మీర్జాతో.

"పెద్ద చిక్కే వచ్చింది. ఒకవేళ నాకూ వస్తుందేమో పిలుపు."

"దరిద్రుడు! మళ్ళా రేపే వస్తానని చెప్పావే!"

"ఇం కేముంది? ఏదో కొంప మునిగింది. ఒకవేళ యుద్ధానికి వెళ్ళవలసి వస్తే చచ్చామన్నమాటే"

"ఇదుగో! ఒక్కటే ఉపాయ ముంది. అసలు ఇంటి దగ్గర లేకుండా ముఖం తప్పిస్తేసరి. రేపటినుండి గోమతి నది ఒడ్డునఉన్న అడవిలో వేద్దాం బిఛాణా. అక్కడ ఉన్న సంగతి ఎవరికి తెలుసూ? ఆ హజరత్ వస్తే వచ్చిన దోవనే వెళ్తాడు."

"శబాష్! బలే ఉపాయం తట్టింది. ఇంతకంటె మరోదారిలేదు."

ఇవతల మీర్ సాహెబ్ భార్య ఆ అధికారితో "మీరు బలే బెదురుపెట్టారే" అంటోంది. "ఇటువంటి మూర్ఖులను చిటికలమీద తైతక్కలాడిస్తాను. ఈయన తెలివి తేటలూ, ధైర్య సాహసాలూ చదరంగం మింగేసింది. ఇక పొరపాటున కూడా ఇంట్లో ఉండవల్లే ఉండి" అంటూ వెళ్ళిపోయినాడా అధికారి.

# 3

మరునటిరోజునుండి మిత్రు లిద్దరూ కనుచీక టుండగానే ఇంటినుంచి జారుకునేవాళ్ళు. చిన్న జంపఖానా ఒకటి చంకలో పెట్టుకుని, ఒక డబ్బానిండా తాంబూల సామగ్రి కుక్కి గోమతినది దాటిపోయేవాళ్ళు. ఒక పురాతనమైన పాడుబడిన మసీదులోకి వెళ్ళేవాళ్ళు. ఆ మసీదు కట్టించింది అసఫుద్దౌలా కావచ్చు. పొగాకు, గంజాయి, బ్రాందీ వగైరా దోవలోనే సమకూర్చుకునే వాళ్ళు. ఇక మసీదుకు చేరుకుని, జంపఖానా పరిచి, హుక్కా తయారుచేసుకుని చదరంగం ప్రారంభించేవాళ్ళు. ఇక వాళ్ళకు లోకపు ఊసే పట్టేదికాదు, "కిస్తీ, షహ్" ఇలాంటి ఒకటి రెండు మాటలు మినహా మరోమాట ఉచ్చరించేవాళ్ళే కాదు. మహాయోగి అయినవాడు కూడా తపస్సులో ఇంత తన్మయం కావటం జరగదేమో. రెండు ఝాములైన తరువాత ఆకలైనట్టు తోస్తే, మిత్రు లిద్దరూ ఏ రొట్టెల దుకాణానికో వెళ్ళి నాస్తాచేసి వచ్చే వాళ్ళు. ఒకపట్టు హుక్కా త్రాగి తిరిగి యుద్ధరంగంలో నిలబడేవాళ్ళు. ఒక్కొక్కప్పుడు వాళ్ళు భోజనం సంగతికూడా మరిచిపోయేవాళ్ళు.

మరోప్రక్క దేశంలో రాజకీయ పరిస్థితులు భయంకరంగా విషమించి పోతున్నాయి. కంపెనీ సైన్యాలు లక్నోవైపుకు సాగివస్తున్నాయి. నగరంలో చాలా ఆందోళనగా ఉంది. ప్రజలు తమ పిల్లాజెల్లలతో సహా పల్లెటూళ్ళకు పారిపోతున్నారు. కాని, మన యోధు లిద్దరికీ మాత్రం చీమకుట్టినట్టయినా లేదు. వాళ్ళు యింటి

నుండి బయలుదేరితే గొందులగుండా వచ్చేవాళ్లు. ఎక్కడ ఏ చక్రవర్తి ఉద్యోగి కంటబడతాడో, వెట్టిచాకిరి కెక్కడ లాక్కుపోతాడోనని భయమాయెమరి! వేల రూపాయల ఆదాయం వచ్చే జాగీరును ఉత్తినే అనుభవిద్దామని వాళ్ళ అభిప్రాయం.

ఒకరోజు మిత్రులిద్దరూ ఆ శిథిలమైన మసీదులో కూర్చుని చదరంగం ఆడుతున్నారు. మీర్జా ఆట కాస్త వెనుకడుగులో ఉంది. మీర్‌సాహెబ్ ఆయన్ను దెబ్బ మీద దెబ్బ తీస్తున్నాడు. ఇంతలో కంపెనీ సైనికులు రావటం చూశారు. అది తెల్లవాళ్ళ సైన్యం. లక్నోను ఆక్రమించుకోటానికి వస్తోంది.

"ఇంగ్లీషువాళ్ళ సైన్యం వచ్చేస్తోంది. అల్లా రక్షించాలి!" అన్నాడు మీర్ సాహెబ్.

"రానివ్వరూ! ముందు దెబ్బ కాచుకోండి. ఇదిగో కిస్తీ!"

"కాస్త చూద్దాం. ఇక్కడే చాటుగా నుంచుందాం."

"చూద్దాంలేండి! తొందరేమిటి? ఇదిగో మళ్ళీ-కిస్తీ!"

"ఫిరంగిదళంగూడా ఉంది. షుమారు ఐదువేలమంది ఉంటారు. ఎంత ముద్దవాళ్లు! ఎర్రకోతుల్లాగా ఉన్నారే! వాళ్ళను చూస్తేనే గుండె దడెత్తిపోతుందే!"

"జనాబ్! తప్పించుకు పోదామనా మీ ఉద్దేశం. ఈ ఉపాయాలన్నీ మన దగ్గర కావండోయ్!—ఇదిగో కిస్తీ!"

"మీరు బలే విచిత్రమైన మనుషులండీ! అటు ఒక ప్రక్క పట్టణానికి ప్రమాదం వచ్చిపడితే మీరు కిస్తీల్లో మునిగి తేలుతున్నారా? పట్టణం చుట్టుముట్టబడితే ఇంటికెలా వెళ్తాము అన్నైనా ఆలోచించారా?"

"ఇంటికి వెళ్ళేటప్పుడే ఆలోచిద్దాంగాని-ఇదిగో కిస్తీ! ఈసారి 'షహా' అన్నానంటే బిస్మిల్లా!"

సైన్యం వెళ్ళిపోయింది. పది గంటలైంది. మళ్ళీ ఆట ప్రారంభించారు.

"ఇవ్వాళ తిండిసంగతి ఎలా చేద్దాం మరి?" అన్నాడు మిర్జా.

"ఇవ్వాళ ఉపవాసమనుకుందాంలే. మీకు మరీ ఆకలిగా ఉందా ఏం?" అన్నాడు మీర్.

"లేదులెండి. కాని పట్టణంలో ఏం జరుగుతున్నదో మరి!"

"పట్టణంలో ఏం జరుగుతుందడు. ప్రజలు సుష్టుగా భోంచేసుకుని హాయిగా నిద్రపోతుంటారు. నవాబుగారుకూడా ఖుషీలోనే ఉండి ఉంటారు."

ఆ సత్పురుషు లిద్దరూ తిరిగి ఆట ప్రారంభించేసరికి మూడుగంటలైంది. ఈసారి మీర్జా సాహెబ్ ఆట వెనుకడుగులో ఉంది. నాలుగైనట్లుగా గంట లింకా కొడుతుండగానే సైన్యం వెనుదిరిగి వస్తున్న అలికిడయింది. నవాబ్ వజీద్ ఆలీ సాహెబ్ పట్టుబడ్డాడు. సైన్యం ఆయన్ను ఎక్కడికో అజ్ఞాత ప్రదేశానికి తీసుకు

వెళ్తోంది. పట్నంలో ఆందోళన ఏమాత్రం కనపడలేదు. ఘర్షణ లేమీ జరగలేదు. ఒక్క నెత్తురుబొట్టయినా చిందలేదు. ఇంతవరకూ ఏ స్వతంత్రదేశపు రాజూ ఇంత ప్రశాంతంగా ఒక్క నెత్తుటిబొట్టయినా చిందించకుండా ఓడిపోవటం ఎన్నడూ జరిగుండదు. దేవతలు ప్రసన్నులయ్యే అహింసా ప్రదర్శనం కాదిది. నీచాతినీచమైన పిరికి పందలు సైతం కన్నీరు కార్చే ఘటన యిది. అయోధ్యలాంటి విశాల దేశపు నవాబును ఖైదీగా బంధించి తీసుకుపెళ్తుంటే, లక్నో నగరం విలాసాల కైపులో మత్తెక్కి ఉంది. దేశపు రాజకీయ పతనావస్థకు పరాకాష్ఠ ఈ ఘటన.

"చూచారా సాహెబ్! నవాబుగారిని దుర్మార్గులు ఖైదు చేసేశారూ?" అన్నాడు మీర్జా.

"చేశారు కాబోలులెండి. ఇదిగో 'షహ్' చెప్పాను చూడండి" అన్నాడు మీర్ సాహెబ్.

"కాసేపు ఆగండి. ఇప్పుడు మనసు యిక్కడ నిలవటంలేదు. నవాబుగారిప్పుడు గోడుగోడున ఏడుస్తుంటారు పాపం!"

"ఏడవడు మరి! ఈ భోగ విలాసాలు అక్కడ అమరవుగా పాపం! సరే ఇదిగో! -కిస్త్!''

"ఎవడికైనా రోజులన్నీ ఒక్క తీరుగా ఉండవుగదా! ఎంత హీనస్థితి ముసించుకొచ్చిందీ!"

"ఔనౌను ఆ మాట నిజమేననుకోండి—యిదిగో మళ్ళీ కిస్త్! బస్! ఈసారి ఎత్తుతో ఖాళీ. ఇక తప్పించుకోలేరు."

"అల్లా సాక్షిగా చెబుతున్నా. మీరు వట్టి కటికవాళ్ళండీ. ఇంత పెద్ద ఆపద సమయంలోగూడా మీకు విచారం కలగటంలేదు. పాపం వాజీదాలీ చక్రవర్తి ఎంత దురదృష్టవంతుడండీ!"

"మొదట మీ చక్రవర్తిని కాపాడుకోండి. నవాబు సాహెబ్‌గారిని తరువాత ఊరడించవచ్చులెండి! ఇదిగో 'షహ్'!- ఆట కట్టింది. ఓడిపోయినారు మీరు. చెయ్యిలా అందివ్వండి!"

చక్రవర్తిని తీసుకుని సైన్యం వారి ముందునుంచే సాగిపోయింది. సైన్యం వెళ్ళగానే మీర్జా తిరిగి పావులు పరిచాడు. ఓటమి కలిగించిన గాయం లోతైంది. "నవాబు సాహెబ్‌ను గురించి ఒక మర్సియా (శోకగీతం) పాడదాం? రండి" అన్నాడు మీర్. కాని మీర్జా సాహెబ్ రాజభక్తి తన ఓటమితోపాటే అంతరించిపోయింది. తన పరాజయానికి ప్రతీకారం కోసం తహతహలాడి పోతున్నాడాయన.

# 4

సాయంత్రమైంది. ఆ శిథిలమైన మసీదులో గబ్బిలాలు కీచు కీచు మంటున్నాయి. కృష్ణపక్షులు వచ్చి తమ గూళ్ళకు చేరుకుంటున్నాయి. కాని మన యోధులిద్దరూ రక్తదాహంతో తహ తహలాడిపోతూ పరస్పరం కత్తులు దూసుకున్న యుద్ధ వీరుల్లాగా సిద్ధంగా నిలబడ్డారు. మిర్జాసాహెబ్ వరుసగా మూడు ఆటలూ ఓడిపోయినాడు. ఈ నాలుగో ఆట నడకగూడా ఏమంత బాగాలేదు. ఆయన మాటి మాటికీ ఆట గెలుచుకుందామనే గట్టి పట్టుదలతోనే ఆచితూచి మరీ ఆడుతున్నాడు. అయినా ఏదో ఒక తప్పుడు ఎత్తు పడిపోయి ఆటంతా నాశనమైపోయేది. ప్రతిసారీ ఓటమితోపాటు ప్రతీకారభావం గూడా మరింతగా చెలరేగేది. ఇక మీర్ సాహెబ్ హుషారుగా పదాలు పాడటం, చిటికెలువేయటం జోరుగా సాగిస్తున్నాడు. ఏదో దాచినసొమ్మేదో దొరికినట్లుగా ఉంది ఆయన పని. మిర్జాసాహెబ్ విని విని విసుక్కునే వాడు. తన పరాజయ పరాభవాన్ని దాచుకోటానికి ఆయన్ను ప్రశంసించేవాడుకూడా. కాని, ఆట పాడైపోయేకొద్దీ, సహనం కాస్తా మటుమాయమైపోతోంది. చివరకు ప్రతి చిన్న విషయానికీ చిరచిరలాడటం మొదలుపెట్టాడు.. "ఏమండోయ్! మీరు ఎత్తు మార్చబోకండి. అదేమిటి? ఒక ఎత్తు వెయ్యటం, తిరిగి దాన్ని మార్చి వేయటమూ..ఏమి టీ ఆటా? వెయ్యదలుచుకున్న ఎత్తేదో ఒక్కసారే వేసెయ్యండి. మీ రలా పావుమీదనే ఉంచుతారేమిటి చెయ్యి? పావుమీద చెయ్యి తీసెయ్యండి. మీకు ఎత్తు తోచేవరకూ పావుమీదచెయ్యివెయ్యకండి. ఒక్కొక్కఎత్తువెయ్యటానికి అరగంటా? అలా వీల్లేదు తెలుసా? ఎవరైనాసరే ఒక్క ఎత్తుకు అయిదు నిమిషాలకు మించి ఆలస్యం చేస్తే ఓడిపోయినట్లే లెక్క. అదుగో! మీరు మళ్ళీ ఎత్తు మార్చారు. మెదలకుండా ఉన్నచోట పెట్టేసెయ్యండి పావు."

మీర్ సాహెబ్ మంత్రి ప్రమాదంలో ఉన్నాదప్పుడు.

"నే నసలు ఎత్తు వేసిం దెక్కడ?" అన్నాడు మీర్.

"మీ రెప్పుడో వేశారు ఎత్తు. పావు అక్కడే ఉంచండి. ఆ గడినుంచి కదపకండి.!" అన్నాడు మిర్జా .

"ఆ గడిలో ఎందుకుంచుతానూ? నే నసలు పావుమీదినుంచి చెయ్యి తీస్తేగా?"

"మీరు స్వర్గానికి వెళ్ళిందాకా పావు వదలకపోతే ఎత్తు వెయ్యనట్లేనా ఏమిటి? మంత్రికి తిప్పలొచ్చేసరికి మోసానికి తయారౌతారా?"

"మోసం చేసేది మీరూ! ఓడటం గెలవటం అదంతా అదృష్టం మోసంతో ఎవరూ గెలవలేడు. "

"అయితే ఈ ఆట మీరు ఓడిపోయినట్లేనా?"

"నే నెందు కోడతాను?"

"అయితే ఆ పావు మొదట ఉన్న గడిలోనే ఉంచండిమరి."

"అక్కడ ఎందుకుంచుతానూ? ఉంచను."

"ఎందు కుంచరేం? ఉంచి తీరాల్సిందే."

వివాదం పెరగసాగింది. ఇద్దరూ వాళ్ళ వాళ్ళ పట్టుమీద మొండికేశారు. ఎవరూ తగ్గటంలేదు. అసందర్భమైన మాటలు ప్రారంభమైనాయి. వంశంలో ఎవడైనా చదరంగం ఆడినవాడుంటేగా ఆట పద్ధతులు తెలిసేందుకూ? అంతా గడ్డి గోసుకునే రకమాయిరిమరి మీకేం చేతౌతుంది. చదరంగం! సంస్థానం అంటే దాని తరహా అంతా వేరు. జాగీరు దొరికినంతమాత్రానే గొప్పవాళ్ళవుతారా!" అన్నాడు మీర్జా.

"ఏ మన్నావ్! మీ బాబు కోసుకునే వాడేమో గడ్డి....మా వంశం తరతరాల నుంచీ చదరంగం ఆడే వంశమే" అన్నాడు మీర్.

"ఇక ఆపుదురూ! గాజీవుద్దీన్ హైదర్ దగ్గర వంట పనిచేసి చేసి వయసంతా కుంగిపోయింది! "- ఇవ్వాళ పెద్దగొప్పవాణ్ణంటూ బయలుదేరారు! గొప్పవాడు కావటం అంటే మజాకా కాదు తెలుసా?"

"ఎందుకూ మీ పెద్దల బ్రతుకలా బజారుకీడ్చుకోటం? వంటపనిచేసింది మీవాళ్ళే కాబోలు మరి? మావాళ్లు ఎప్పుడూ చక్రవర్తి సరసన కూర్చుని భోంచేసిన వాళ్ళు తెలుసా?"

"ఇక ఆపవోయ్ బడాయిపిండె! పెద్ద దబ్బాలాగా వాగబోకు!"

" ఒళ్ళు దగ్గర ఉంచుకొని మాట్లాడండి. లేకపోతే మర్యాద దక్కదు. ఇలాంటి మాటలుపడే అలవాటులేదు నాకు. నావైపు ఎవరైనా కళ్ళు ఎర్రజేయటం జరిగితే వాళ్ళ గ్రుడ్లు తోడించేస్తాను. దమ్ములున్నాయా మరి?"

"నాకు దమ్ములున్నాయో లేదో చూడాలనుందా? అయితే రండి యుద్ధం చేద్దాం. అటోయిటో తేలిపోవా లివ్వాళ."

"నీకు తగ్గేవా శ్ళెవ రిక్కడ?"

మిత్రులిద్దరూ ఒరల్లో నుండి కత్తులు దూశారు. నవాబు లేలే కాల మది. అందరూ కత్తులూ, బాకులూ, కటారులూ వగైరా ధరించేవాళ్ళు. ఇద్దరూ విలాస పురుషులే. కాని పిరికిపందలు మాత్రంకాదు. రాజకీయ భావాల్లోమాత్రం పతనమై పోయారు వాళ్ళు. రాజ్యంకోసం ఎందుకు ప్రాణాలిస్తారూ? కాని వ్యక్తిగతమైన పౌరుషాని కేమీ లోటులేదు. ఇద్దరూ అడుగులు వేసుకుంటూ యుద్ధానికి సిద్ధమైనారు. కత్తులు మెరిసినాయి. ఖణ్ ఖణ్ మని ధ్వనులు వినబడుతున్నాయి. ఇద్దరూ గాయ పడి పడిపోయినారు. కొట్టుకులాడీ కొట్టుకులాడి అక్కడే ప్రాణాలు విడిచారు. తమ చక్రవర్తి కోసం ఒక్క కన్నీటి బొట్టయినా కార్చనివాళ్ళే చదరంగంలో మంత్రి రక్షణకోసం ప్రాణాలిచ్చేశారు.

చీకటిపడిపోయింది. ఆట పరిచేఉంది. చక్రవర్తు లిద్దరూ ఈ వీరు లిద్దరి మరణానికీ విలపిస్తున్నారా అన్నట్లుగా, తమ సింహాసనాల పైన ఆసీనులై యున్నారు.

నలుపైపులా నిశ్శబ్దం ఆవరించింది. ఆ శిధిలమైన మసీదు తాయారు విరిగి పోయిన వసారాలూ, పడిపోయిన గోడలూ, దుమ్ముతో నిండిన స్తంభాలూ యీ శవాలను చూస్తూ పశ్చాత్తాప పడసాగినాయి.

— o —

# మంగళసూత్రం

## 1

పెద్దకొడుకు సంత్‌కుమార్‌ను ప్లీడరీ చదివించాడు. చిన్నకొడుకు సాధు కుమార్‌కు బి.ఏ. చెప్పించాడు. చిన్నపిల్ల పంకజ వివాహంకోసం అయిదువేల రూపాయల రొఖ్ఖం ఖర్చుకు వప్పగించాడు. ఇదంతాచేసి తానిక జీవితబాధ్యతల నుంచి విముక్తి పొందా ననుకున్నాడు దేవకుమార్. ఇక తన జీవితశేషాన్నంతా భగవధ్ధ్యానంలో గడుపవచ్చుననుకున్నాడు. ఆయన తన ఆస్తినంతా భోగవిలాసా లకూ, సాహిత్యం సేవకూ కొల్లబెట్టేశాడని యిప్పుడెవరైనా ఆయన్ను ఆక్షేపణ చేస్తేచెయ్యొచ్చు కాని, ఆయన హృదయం చాలా విశాలమైనదన్న సత్యాన్ని కాదనగలవాళ్ళెవరూ లేరు. ఆయన సాయంకోరి లేదనిపించుకున్న వాళ్ళెవరూ ఉండరు. ఆయన తన యవ్వనకాలమంతా భోగవిలాసాలనిషాలోనే గడిపాడు. ఇక జీవితమంతా అప్పటి నష్టాన్ని భర్తీచేసుకొనేప్రయత్నంలోనే గడుపుతూ వచ్చాడు. కాని సాహిత్యసేవ మినహా యింకేవిషయంలోనూ ఆయనకు ఆసక్తికలిగేదేకాదు. ఇక అందులో ధనానికి స్థాన మెక్కడుంది?— నిజమే ! కీర్తివరించిం దాయినను. అదే ఆయనఆత్మకు తృప్తికలిగించేది. ధనం గడించటంలో ఆయనకు నమ్మకం లేదు. పరిస్థితులా నమ్మకాన్ని మరింత బలపరిచి యుండవచ్చు కాని 'ధనం సంపాదించలేకపోతినే' అన్న బెంగ ఆయన కెప్పుడూ కలిగేదేకాదు. పరువుగా తనకాలం గడిచిపోతుంటే అంతేచాలు ! అంతకంటే అధికంగా ఆశించేవాడే కా దాయన. సాహిత్య రసికుల్లో ఉండే మిడిసిపాటు— పోనీ బడాయనే అనుకోండి— అది ఆయనలోనూ ఉండేది. ఆయన తమ ఆస్థానానికి రావాలనీ, తన రచనలను వినిపించాలనీ, ఆయనకు బహుమానా లివ్వాలనీ కోరుకునే శ్రీమంతులూ, మహా రాజాలూ ఎందరుండేవాళ్ళు ! కాని దేవకుమార్ తన ఆత్మగౌరవాన్ని ఎన్నడూ జారవిడుచుకోలేదు ఎవరైనా ఆహ్వానించినా కృతజ్ఞత ప్రకటించి తప్పించుకునేవాడు. తప్పించుకోటమేకాదు; శ్రీమంతులూ, మహారాజాలూ తన యింటికేవచ్చి తనను కీర్తించాలని ఆశపడేవాడు. అది జరిగే విషయమేనా? తనతోపాటు చదువుకున్న మందబుద్ధు లనేకమంది ప్లీడరీవృత్తిద్వారానో, తదితర వృత్తుల ద్వారానో ధన రాసులు కూడబెట్టటం, ఆస్తులుకొనటం, కొత్త కొత్త భవనాలు కట్టించటం, యివన్నీ చూచి అప్పుడప్పుడు అమితంగా విచారపడేవాడు. ముఖ్యంగా తన భార్య

శైవ్యా గృహసంబంధమైన చిక్కులతో విసుగెత్తి ఆయనను పరుషంగా మాట్లాడే సమయంలో ఆయన తనస్థితికి మరింత బాధపడేవాడు కాని తన రచనాకుటీరంలో కలంపట్టి కూర్చొనగానే సమస్తం విస్మరించి సాహిత్యస్వర్గానికి చేరుకునేవాడు. ఆత్మగౌరవంజాగృతమయ్యేది. అలసట. విషాదం అదృశ్యమయ్యేవి.

కాని కొన్నాళ్ళనుండి సాహిత్య రచనలలో ఆయనకు అభిరుచి మందగిస్తూ వచ్చింది. సాహిత్యప్రియులకు తన పట్ల ఆ తొలిరోజుల్లోగల భక్తిశ్రద్ధలు లేవని పించసాగింది ఆయనకు. ఆయన యిటీవల చాలా కష్టపడి రెండు పుస్తకాలు వ్రాశాడు. ఆయన తన సమస్త జీవితానుభవంతోనూ, కళాప్రతిభతోనూ పరిపూర్ణంచేశాడా రెండు గ్రంథాలనూ. కాని వాటికి ప్రత్యేక ఆదరణ ఏమీ ప్రాప్తించలేదు. ఇంతకు పూర్వం వెలువడిన ఆయన రచనలు సాహిత్య ప్రపంచంలో కలకలాన్ని రేకెత్తించాయ్. ప్రతి పత్రికలోనూ ఆ పుస్తకాలను గురించి సుదీర్ఘమైన విమర్శలు వెలువడ్డాయి. సాహిత్య సంస్థలు ధన్యవాదా లర్పించాయి. సాహిత్యవేత్తలు ప్రశంసిస్తూ లేఖలు వ్రాశారు. దేవకుమార్ దృష్టి కెప్పుడా రచనలు అంత రమణీయంగా లేకపోయినా, వాటిలోని భావాలు భావావేశదోషంతో నిండిఉన్నా.యనిపిస్తున్నా, శైలి కూడా కృత్రిమంగానూ, జటిలంగానూ ఉన్నప్పటికీ. ప్రజాదృష్టికి ఆ రచనలే యిప్పటికీ ఆప్యాయంగా ఉన్నాయి. కాని ఈ క్రొత్తకృతులు ఆహ్వానించబడని అతిథిలాగా ఆదరణ పొందాయి. సాహిత్య ప్రపంచమంతా ఏకమై తనను చిన్న చూపు చూస్తున్నారా అనిపించింది దేవకుమార్‌కు. అసలింతకు మునుపే ఆయన విశ్రాంతిగా తన కాలం గడపాలనుకునేవాడు. ఈ నిరాదరణ ఆ అభిప్రాయాన్ని మరింత గట్టిపరిచింది "ఆకలి అమితంగా ఉన్నప్పుడు మామూలు భోజనంకూడా ఎంతో మధురంగా ఉంటుంది. కాని ఆకలి మందగించగానే ఎంత మధురపదార్థమైనా అంత ఆప్యాయంగా ఉండదు." ఈ తర్కంతో ఆయన సన్నిహిత కవిమిత్రు లొకరిద్దరు ఆయన్ను ఓదార్చటానికి ప్రయత్నించారు. కాని అందువల్ల ఆయన కేమీ మనశ్శాంతి కలుగలేదు. ఆయన దృష్టిలో సజీవమైన రచయిత ఎవరూ అంటే అందుకొకటే ప్రమాణం. ఆ రచయిత రచనలంటే గల దాహం నిరంతరం పెంపొందాలి. అలాంటి దాహంలేదని తేలినప్పుడు ఆ రచయిత యిక రంగంనుండి విరమించాలి. ఆయనకు మిగిలిందల్లా ఏమాత్రై పంకజవివాహసమస్యే. పుస్తక ప్రకాశకుడొకడు ఆయనతాలూకు లోగడ వ్రాసిన రెండు కృతులకూ అయిదువేలిచ్చాడు. ఆయన దాన్ని భగవత్ప్రేరణగా భావించి తన కలాన్ని శాశ్వతంగా మూలపెట్టేశాడు. తాను వానప్రస్థాశ్రమం స్వీకరించాడు. ఐనా తాను బంధనాల నుండి విముక్తి కాలేదన్న విషయం ఈ ఆరు నెలల్లో ఆయనకు అనేకసార్లు అనుభవమైంది. తన భార్య శైవ్యా మొండితనాన్ని గురించి కూడా ఆయనకంతగా లక్ష్యమేమీ లేదు. సంసారాన్నే సమస్తంగా భావించే సాధ్వీమణులకోవకు చెందిందామె. తన కుటుంబంమీద పెత్తనం చెయ్యాలనే కాంక్ష ఆమె నిప్పటికీ వదలలేదు.

కాని చేతుల్లో పైసా లేనప్పుడు ఆమె కాంక్ష నెరవేరే దెలా? దేవకుమార్ తన నలభై సంవత్సరాల వైవాహిక జీవితంలోనూ శాంతిపరచలేకపోయినా డామె కాంక్షను. ఇక ఆ కోర్కెను యిప్పుడు సంతృప్తిపరచటానికి ప్రయత్నించటమంటే నీళ్లు మూటగట్టా లనుకునే వ్యర్థప్రయత్నంకాదూ! అంతే అనుకున్నాడు దేవకుమార్. ఆయన విచారపడేదల్లా సంత్‌కుమార్ అభిప్రాయాలకూ, ప్రవర్తనకూ మాత్రమే. ఆ ఆస్తిపాస్తులన్నీ కొల్లబెట్టిన నేరానికి తన ఈ స్థితిలో కూడా క్షమించటానికిష్టపడటంలేదు సంత్‌కుమార్. ఏభై సంవత్సరాల క్రితం పదివేల రూపాయలకు విసిరిపారేసిన ఆస్తిగనుక యిప్పుడుంటే పదివేల సంవత్సరాలకు సరిపోయే ఆదాయం వచ్చేది. ఒకప్పుడు పట్టపగలే నక్కలు పొర్లాడే వారి భూమి ఈ రోజున నగరంలో అన్నింటికంటే మించి కన్నులపండువుచేసే బజారుగా మారిపోయింది. అక్కడి భూమి యిప్పుడు చదరపు అడుగు వంద రూపాయలకు అమ్ముడుపోతోంది. గొప్పవా డవాలని ఉవ్విళ్ళూరే సంత్‌కుమార్ ఉండిఉండి లోలోపలే తన తండ్రి అంటే మండిపడుతున్నాడు. తండ్రి, కొడుకుల స్వభావంలో యింత అంతరం ఎలా వచ్చిందో అర్థంకాదు. దేవకుమార్ వద్ద ఎప్పుడూ అవసరాలకు సరిపడా డబ్బుండేదేకాదు. కాని ఆయన ఎప్పుడూ చాలా ఉదారంగానే ఉండేవాడు. సౌందర్య భావనతో జాగృతమైన ఆయన మనస్సు ఎప్పుడూ స్వర్ణోపాసనను తన జీవిత లక్ష్యంగా భావించలేకపోయింది. అంచేత, దానర్థం ఆయనకు డబ్బువిలువ తెలియ దనికాదు; కాని ఆయన మనస్సులో ఒక దృఢనిశ్చయం గూడుకట్టుకుంది. దేశంలో నాల్గింట మూడువంతుల జనం ఆకలితో అల్లాడిపోతూంటే, ఏ ఒక్కడో కోట్లు సంపాదించేందుకు — సంపాదించే సమర్థత ఉంటే ఉండుగాక — నైతికంగా మాత్రం అధికారంలేదు. కాని సంత్‌కుమార్ ధనాశ యిలాంటి నైతికాదర్శాలను పరిహసించేది. "సాహిత్యమంటే మీ కంత ప్రేమైనప్పుడు మీరు గృహస్థులయ్యే అధికారమెక్కడిది? మీరు తమ జీవితాన్ని నాశనం చేసుకోటంతోపాటు మా బ్రతుకులుకూడా మట్టిలోగలిపారు. జీవితంలో మీ సుఖాలన్నీ తీరిపోయినాయా అన్నట్లుగా వానప్రస్థాశ్రమం స్వీకరించి కూర్చున్నారు." అప్పుడప్పుడు సంత్‌కుమార్ నిర్మొగమాటంగా యింతవరకూగూడా అనేసేవాడు.

శీతాకాలపు రోజులవి. ఎనిమిదిగంటలైంది. ఇంట్లోవాళ్ళంతా ఫలహారానికి గుమిగూడారు. పంకజ మేజామీద తేనీరు, కమలాపండ్లు, ఎండుఖర్జూరాలు ప్లేటులో పెట్టి, సోదరులిద్దరినీ పిలవటానికి వాళ్ళ గదుల్లోకి వెళ్లింది. ఒక నిమిషంలో సాధుకుమార్ వచ్చి కూర్చున్నాడు. పొడుగ్గా, బలంగా ఉంటాడు, తెల్లగా, అందంగా ఉంటాడు. మధుర భాషి, శాంత స్వభావంగల యువకుడు. హాయిగా భోంచెయ్యటం, కులాసాగా షికారు వెళ్ళటం ఇదే కార్యక్రమ మతనికి. దొరికిం దేదో కడుపునిండా తిని మిత్రులతో కలిసి వెళ్లిపోయేవాడు.

"సంతూ ఎక్కడున్నాడూ! టీ చల్లారిపోయిందంటే; వట్టినీళ్ళంటాడుమళ్ళీ! పిలుచుకురా సాధూ! వీడికి తిండికి కూడా తీరిక దొరకటంలేదూ?" అన్నది శైవ్యా.

సాదు తలవంచు కూరుకున్నాడు. సంత్‌కుమార్‌తో మాట్లాడేటప్పుడు అతని గుండెలు దడదడలాడుతుండేవి.

"వాణ్ణికూడా పిలుచుకు రావేంరా?" శైవ్యా ఒక క్షణమాగి మళ్ళీ అన్నది.

"ఉఁహూఁ! ఎగిరిపడతాడు ప్రొద్దున్నే. ఇక నా రోజంతా పాడు పాడవుతుంది" క్షీణస్వరంతో అన్నాడు సాధూ

ఇంతలో సంతలో సంత్‌కుమార్ వచ్చేశాడు. చూపులకు తమ్ముడి మాదిరిగానే ఉంటాడు. శరీర సౌష్ఠవం మాత్ర ంఅంతబాగుండదు. ఆఁ! ముఖంలో మాత్రం తేజస్సూ, అహంభావం తొణికిసలాడుతుంటాయి. ప్రపంచంలో ఏదీ అతనికి నచ్చటంలేదన్నభావం అతనికి ముఖంలో స్పష్టంగా వ్యక్తమౌతూంది.

"నీవు రావేం పంకజా! పుష్ప ఎక్కడుంది? ఫలహారాలూ, భోజనాలూ, అన్నీ ఒకేసారి పూర్తికావాలని ఇప్పటి కెన్నిసార్లు చెప్పాను నేనూ!" బల్లమీద కూర్చుని టీ నోటి కందిస్తూ, ముఖం చిట్లిస్తూ అన్నాడు సంత్‌కుమార్.

"మీరు తినండి. వాళ్ళంతా తరువాత తింటారులే. అందరూ ఒక్కసారి కూర్చోటాని కిదేమీ విందుకాదుగా?" కళ్ళురుముతూ అన్నది శైవ్యా.

"అల్లదే తాతలనాటి చట్టం. ఎన్నిమాట్లు చెప్పను. యిది సిగ్గుంకూ, బిడియాలకూ, కాలంకాదనీ!" సంత్‌కుమార్ ఒక గుక్కెడు టీ త్రాగి అన్నాడు.

"అందరూ ఒక్కసారి కూర్చుంటే వండే దెవరూ; వడ్డించేదెవరూ? వండటాని కో వంటవాణ్ణి, వడ్డించటాని కింకొకణ్ణి ఏర్పాటు చెయ్యి. అప్పుడైతే సాగుతుంది దర్జా!" అన్నది శైవ్యా కోపంతో.

"ఐతే ఆ ఏర్పాటేదో ఆ మహానుభావుడు చెయ్యకూడదూ? ఆయనకు చేతనైంది వానప్రస్థాశ్రమం పుచ్చుకోటమేనా?"

"ఆయన చెయ్యాల్సిందేదో ఆయన చేశారు. ఇక నీవు చెయ్యాల్సిం దేదో చెయ్యి."

"ఆ పౌరుషం లేనప్పుడు మమ్మల్ని చదివించట మెందుకేం? ఏ పల్లెటూరులో నన్నా పడవెయ్యక పోయినారూ? మేము మా వ్యవసాయం చేసుకునో, కూలిచేసుకునో పడుండేవాళ్ళం! ఈ జంఝాటాన్నంతా ఎందుకు పెంచారూ?"

"అప్పుడు నువ్వు లేవుమరి; సలహా ఎవరినడుగుతారూ!"

సంత్‌కుమార్ మూతి ముడుచుకుని టీ త్రాగాడు. కాసిని ఖర్జూరపుపండ్లు తిన్నాడు. తరువాత సాధుకుమార్‌తో అన్నాడు—— "మీ టీము బొంబాయి వెళ్ళే దెప్పుడేంరా?"

"ఎల్లుండే" తలవంచుకుని జంకుతూ అన్నాడు సాధుకుమార్.

"మరి నువ్వు కొత్త సూటు కుట్టించుకున్నావా?"

"నా పాతసూటు యింకా బాగానే ఉందిలే."

"సూటు లేకపోతే మాత్రం బాగుండదూ? మేము దినకాళ్లతో ధోవతి కట్టుకుని ఆడేవాళ్ళం. కాని ఒక అఖిలభారత జట్టులో ఆడబోతున్నప్పుడు దానికి తగిన దర్జాకూడా ఉండాలి. ఈ స్థితిలో వెళ్ళేకంటే మానెయ్యటమే మంచిది. అక్కడ ప్రజలు నీవు దేవకుమార్ మహాశయుని సుపుత్రుడవని తెలిస్తే ఏమనుకుంటారూ?"

సాధుకుమా రేమీ బదులు చెప్పలేదు. మెదలకుండా ఫలహారంచేసి వెళ్లిపోయాడు. అతనికి తన తండ్రి ఆస్తి పరిస్థితులు బాగా తెలుసు. ఆయన్నియిబ్బంది పెట్టటం యిష్ట లే దతనికి. సంత్‌కుమార్‌కు కొత్తసూటు అవసరమనిపిస్తే కుట్టించరాదూ? నాన్నగారిమీద మరింత బరువెత్తమంటూ వత్తిడి చేస్తాడు దేనికి?

సాధూ వెళ్లిపోగానేవార్ల్యి ఎంతో నొచ్చుకుంటూ అన్నది — "నాకికయింటి వ్యవహారాలతో ఏవిధమైన సంబంధం లేదనీ, సర్వం నాకే అప్పగించాననీ ఆయన స్పష్టంగా చెప్పారుగదా! సంసారభారం యింకా ఆయన నెత్తికెత్తటం ఎందుకు చెప్పూ? తన సామర్థ్యం, తెలివితేటల ననుసరించి తనకు చేతైనట్లుగా తన రోజులు వెళ్ళబుచ్చుకున్నారు. ఆయన చెయ్యలేని పనులకు, చేసిన పొరబాట్లకు ఆయన్ను ఊరికే యెత్తిపొడవటం నీ కేమంత ఘనంగాదు. ఈ విధంగా నువ్వాయన్ను వేధించావంటే ఆయన యిల్లు విడిచి, కళ్ళబడకుండా ఎటైనావెళ్లిపోతారేమోనని భయంగాఉంది నాకు. ఆయన ముల్లె సంపాదించనిమాట నిజమే కాని ఆయన ఎక్కడికైనా వెళ్ళనీ! — ప్రజలు ఆయన్ను నెత్తినబెట్టుకు పూజిస్తారన్న విషయం నీకు తెలుసు."

శైవ్యా యింతవరకు ఎప్పుడూభర్తను ఈసడింపుగానే చూస్తూ వచ్చింది. ఇవ్వాళ ఆమె తన భర్త తరఫున వాదించటం చూసి సంత్‌కుమార్ చిరునవ్వు నవ్వుకున్నాడు.

"ఆయన కటువంటి అభిప్రాయముంటే ఆయనకంటే ముందు నేనే వెళ్లిపోతాను. నే నీభారం నా నెత్తికెత్తుకోలేను. ఈసంసారాన్ని ఈదటంలో ఆయన నాకు అండగా ఉండితీరాలి. ఆయన తాను సంపాదించిన ఆస్తయితే కొల్లబెట్టుకునే హక్కుంది. కాని తాతముత్తాతల ఆస్తిని తగలబెట్టటానికి ఆయన కేమీ అధికారం లేదు. ఇందు కాయన ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. ఆ ఆస్తి మాకు తిరిగి అప్పగించితీరాలి. నాకు కాస్త "లా" తెలుసు. ప్లీడర్లతోనూ, మేజిస్ట్రేట్లతోనూ సంప్రదించాను. ఆస్తి తిరిగి సాధించటాని కవకాశముంది. ఆయనకు తన సంతానమెక్కువో, మహాత్మగిరి ఎక్కువో ఏదో తేలిపోవాలిప్పుడు!"

ఈ మాటలంటూ, సంత్‌కుమార్ పంకజ యిచ్చిన తమలపాకులు తీసుకుని తన గదికి వెళ్లిపోయాడు.

# 2

సంపత్‌కుమార్ భార్య పుష్ప నిజంగా పుష్పంవంటిది. రూపవతి సుకుమార వతి. సన్నగా ఉంటుంది. ఎంతో ఆత్మాభిమాని. ఒక్కొక్క విషయానికి ఆమె అనేక రోజులు కోపంగా వుండగలదు. ఆమె కోపం కూడా అన్నివిధాలా విచిత్ర మైంది. ఆమె ఎవరితోనూ మాట్లాడదు పోట్లాడదు. చిరాకుపడదు. కాని ఇంటిపను లన్నీ యథాప్రకారంగానే చేస్తుంటుంది. మరింత శ్రద్ధగాకూడా చేస్తుందేమో। తనకు కోపం కలిగించిన వాళ్ళవైపుకూడా చూడదు. కాని వాళ్ళు చెప్పిందల్లా చేస్తుంది. వాళ్ళు అడిగిన దానికల్లా జవాబిస్తుంది. వాళ్ళు కావాలన్నదల్లా అందిస్తుంది. వాళ్ల అడిగినదానికల్లా జవాబిస్తుంది. వాళ్ళు కాజాలన్నదల్లా అందిస్తుంది. కాని ఇదంతా వాళ్ళ ముఖంవంకనైనా చూడకుండానే చేస్తుంటుంది. ఈ మధ్య చాలారోజులుగా ఆమెకు సంపత్‌కుమార్ పైన కోపంగా ఉంది. తన అలకచూపులతో అతని దాడులన్నిటినీ ఎదుర్కొంటూంది.

సంపత్‌కుమార్ స్నేహపూర్వకంగా అన్నాడు—"యివ్వాళ సాయంత్రం వెళ్ళాలికదూ?"

"అదంతా మీయిష్టం" తలవంచుకుని అన్నది పుష్ప.

"వస్తావా మరి!"

''మీరు రమ్మంటే ఎందుకురానూ।''

"నీ అభిప్రాయమేమిటంటావ్?''

"నాకే అభిప్రాయమూ లేదు."

''ఇంతకూ దేని కింత కోపం నీకూ।''

"దేనికీ లేదు."

"మంచిది। చెప్పబోకులే. కాని ఆ విషయం ఊరికే మూగనోము పట్టినంత మాత్రాన పరిష్కారం కాదు."

పుష్ప ప్రయోగించిన ఈ సాధారణ అస్త్రమే సంపత్‌కుమార్‌కు పిచ్చియెత్తించింది. అతను బాగా వాదించి ఆ వివాదాన్ని చల్లబరుద్దామనుకున్నాడు. అటువంటి మాట మళ్ళీ ఎప్పుడూ అననని క్షమాపణ కోరుకోటానికికూడా సిద్ధపడ్డాడు. కాని నిజాని కతనన్నమాట ఆమెను రెచ్చగొట్టడానికి కానేకాదు. ఒక వాస్తవిక విషయాన్ని బలపరచటానికి మాత్రమే అన్నాడు. ఆయన అన్నమాటిదీ: పురుషునిమీద ఆధారపడ్డస్త్రీ పురుషుని అధికారానికి తలవంచక తప్పదు. ఆ సంవత్సరంలో అలా అనకుండా ఉంటే బాగుండేదని అతనూ అంగీకరిస్తాడు. ఒక వేళ అలా అనటం అవసరమనుకున్నప్పటికీ సున్నితమైన మాటల్లో అనవలసింది. కాని ఒక విషయం ఏ స్త్రీయైనాసరే తన హక్కులకోసం పురుషునితో పర్షణ పడవలసుకున్నా. పురుష

నితో స్త్రీకి సమానహక్కులున్నాయని వాదించ దలుచుకున్నా పరుషమైన మాటలు పడడానికి కూడా సిద్ధంగా ఉండాలి. ఇప్పుడతను వచ్చిందికూడా పుష్పను నిరుత్తరాలుగా చేద్దామనే; ఎడమొగం పెడమొగంగా ఉన్నంతమాత్రానే ఏ విషయం తేలదని నచ్చచెప్పడానికే. ఆ సమస్యమీద తిరిగి ఎప్పుడూ వివాదం చెలరేగటానికి అవకాశంలేకుండా తా నీ క్షేత్రాన్ని జయించాలనీ, అక్కడ దొక విజయస్తంభం నెలకొల్పాలనీ అతని కోరిక. అప్పటి నుండీ అతని మనసులో ఎన్నెన్ని కొత్త కొత్త తర్కాలు పుట్టుకొచ్చాయి! కా నేం లాభం? శత్రు వసలు కోటదాటి బయటకు రావటం అంటూ జరిగితేగా, వాడిమీద దండయాత్ర చెయ్యటానికి!

ఐతే ఒక్క ఉపాయముంది. శత్రువును లాలించి అతనికి తన మైత్రీ భావంపైనా, ప్రేమస్వభావంపైనా విశ్వాసం కలిగించి, కోటనుండి బయటకు రప్పించాలి.

సంత్‌కుమార్ పుష్ప గడ్డంపట్టుకుని తనవైపుకు త్రిప్పుకుని అన్నాడు——"నే నన్నమాట నీ కింత కష్టంగావుంటే నే నామాట నుపసంహరించుకుంటాను. అలా అన్నందుకు క్షమాపణ కోరతాను. నువ్వు నాతో పది, పదిహేను రోజులైనా మాట్లాడకుండా వుండగలవు. భగవంతుడు నీకా శక్తినిచ్చాడు కాని ఆ శక్తి నాకు మాత్రం యివ్వలేదు. నీవు అలిగావంటే నా నాళాల్లో రక్త ప్రవాహం స్తంభించి పోయిందని పిస్తుంది. నాకుకూడా నువ్వు ఆ శక్తి ప్రసాదించగలిగితే అప్పుడది సమానుల మధ్య యుద్ధమౌతుంది. అప్పుడు నిన్ను రెచ్చగొట్టటానికేరాను నేను. నీ కలా చెయ్యటానికి శక్తిలేకపోతే, ఆ అస్త్రం నామీద మాత్రం ప్రయోగించబోకు!"

పుష్ప చిరునవ్వు నవ్వింది. ఆమె తన అస్త్రంతో పతిని పరాజితుణ్ణి చేసింది. అతనంత దీనుడై క్షమాపణ వేడుకుంటున్నప్పుడు ఆమె మనసు కరగటంలో ఆశ్చర్యమేముంది!

సంధిపత్రంమీద సంతకమా అన్నట్లుగా తమలపాకు బీడా చుట్టి సంత్‌కుమార్‌కు అందిస్తూ అన్నది— "ఇక ముందెప్పుడూ అలాంటి మాటలనరుగదూ! నేను మీమీద ఆధారపడ్డదాన్నయితే మీరు నామీద ఆధారపడ్డ వాళ్ళే. నేను మీ ఇంట్లో చేస్తున్నంత చాకిరీ ఇతరు లిండ్లల్లో చేస్తే నన్ను నేను పోషించుకోగలనంటారా? లేదంటారా? చెప్పండి!"

"హాయిగానూ" కఠినమైన జవాబిద్దామనే తన కోరికను అణచుకుని అన్నాడు సంత్‌కుమార్.

"అప్పుడు నేను సంపాదించినదంతా నాదౌతుంది. ఇక్కడ నేను ప్రేగులు త్రెంచుకోవిగాక, నాకే వస్తువుమీదా అధికారం లేదు. మీ యిష్టమొచ్చినప్పుడు నన్ను ఇంటినుండి గెంటివెయ్యగలరు".

"సరే కానీ దానికి జవాబు వింటానికికూడా సిద్ధంగా ఉండాలిసుమా!"

"మీ రేమీ చెప్పలేరు జవాబు. మీ కున్నదల్లా మొండి పట్టుదలొక్కటే. మీరనేది యిదేగా? 'నీ కిక్కడున్న గౌరవం అక్కడ వుండదు; అక్కడ నిన్ను కాపాడేవాళ్ళెవరూ వుండరు. నీ కష్టసుఖాల్లో భాగం పంచుకునేవాళ్ళెవరూ వుండరు!' ఇలాంటివే యింకెన్నో వాదనలు చెయ్యగలరుమీరు. కాని మిస్ బట్లర్ జీవిత పర్యంతం అవివాహిత గా వుండి, గౌరవంగా జీవితం గడపటం నే నెరుగుదును. ఆమె వ్యక్తిగత జీవితం ఎలాంటిదో నాకు తెలియదు. హిందూ గృహిణుల ఆదర్శానికి అనుగుణంగా లేకపోవచ్చును. కాని ఆమెను అందరూ గౌరవించేవాళ్ళు. మరి ఆమె కెప్పుడూ తన రక్షణ కోసం ఎవరో ఒక పురుషుణ్ణి ఆశ్రయించవలసిన అవసరం కలగలేదు."

సంత్‌కుమార్‌కు బట్లరుతో పరిచయముంది. ఆమె నగరంలో ప్రసిద్ధ లేడీ డాక్టరు. పుష్ప కుటుంబంతో ఆమెకు సన్నిహిత పరిచయముంది. పుష్ప తండ్రి డాక్టరు. ఒకేవృత్తిలో ఉన్న వారిమధ్య సన్నిహిత సంబంధం ఏర్పడటం సహజమే. పుష్ప అతని ముందుంచిన సమస్యను గురించి తటస్థమైన ధోరణిలో తన అభిప్రాయం కొంత వ్యక్తం చెయ్యటం కఠినమై పోయింది సంత్‌కుమార్‌కు. పోనీ మౌనంగా వుందామనుకుంటే అతని పురుషత్వాని కది మరింత దుర్భరమై పోయింది.

సందిగ్ధంలోపడి అన్నాడు—— "స్త్రీలందరూ మిస్ బట్లరులు కాలేరుగదా?"

"ఎందుకనేం? ఆమె వైద్యపరీక్ష చదివి తన వృత్తి చేసుకోగలిగినప్పుడు నాకెందుకు చేతగాదూ?" ఆవేశంతో అన్నది పుష్ప.

"వాళ్ళ సొసైటీకి, మన సొసైటీకి బోలెడంత అంతరముంది."

"అంటే వాళ్ళ సమాజంలో పురుషులు శిష్టులూ, శీలవంతులూ నన్నమాట. మన సమాజంలోని పురుషులు ముఖ్యంగా విద్యావంతులైనవాళ్ళు పతితులూ, అవినీతిపరులూ నన్నమాట."

"ఆ సమాజంలోని స్త్రీలకు ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ సామర్థ్యం, పురుషులను స్వాధీనం చేసుకోగల నిపుణత యివన్నీ ఉన్నాయన్న విషయంకూడా చెప్పలేం?"

"ఆ ఆత్మబలం, సామర్థ్యం, నైపుణ్యం, అవన్నీ మేమూ సంపాదించాలనే కోరుకుంటున్నాం. కాని మీరు కొంచెమైనా సాగనిస్తేనా? ప్రతిష్ఠనీ, ఆదర్శమనీ–ఒకటేమిటి? ఎన్నెన్ని సాకులతో మమ్మల్ని అణగద్రొక్కేందుకూ, మామీద తమ అధికారాన్ని నిలబెట్టుకునేందుకూ కృషి చేస్తూంటారూ!"

చర్చ మళ్ళీ పుష్పకు కోపంకలిగించే ధోరణిలోనే సాగుతుండటంకనిపెట్టాడు సంత్‌కుమార్. మరి యిప్పు డతను వచ్చింది ఆమెను సంతోష పెట్టడానికిగాని కోపం తెప్పించటానికి కాదుగా!

"ఔనులెండి! సమస్త దోషాలూ పురుషులవేలే. ఇక రాజీపడదాం. పురుషుడు కూడా అధికారం చలాయించి చలాయించి అలిసిపోయినాడు. ఇక కొన్నాళ్లువిశ్రాంతి తీసుకోవాలను కుంటున్నాడు. నీ అధీనంలో ఉండి ఈ సంఘర్షణ నుంచి బయట పడగలిగితే సింహాసన పరిత్యాగం చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాడు."

"సరే! అయితే, ఈరోజునుంచి ఇంట్లోనే కూర్చోండి'' చిరునవ్వు నవ్వుతూ అన్నది పుష్ప.

"సంతోషంగా కూర్చుంటా. నాకు కావలసినవన్నీ తెచ్చిపెడుతూ ఉండు. నువ్వు చెప్పినట్లేచేస్తా. నీ కిష్టం కాని మాట ఒక్కటికూడా మాట్లాడను."

"స్త్రీ పురుషుడి దాసిననీ, అందువల్ల ఆమె పురుషుడికి దాస్యం చెయ్యాలనీ, మళ్ళీ ఎప్పుడూ అనరుగదూ?"

"ఎప్పుడూ అనను. ఐతే ఒక్క షరతుంది."

"ఏమిటో అది?"

"నిన్ను ప్రేమించే అధికారం నాదే."

"ఇటువంటి షరతుకు స్త్రీలు పురుషుణ్ణి ఏనాడు ఒప్పించగలిగారు?"

"అది వాళ్ళ బలహీనత. కాని భగవంతుడు మట్టుకు స్త్రీలకు పురుషులను శాసించే సమస్త ఆయుధాలూ ప్రసాదించాడు."

రాజీ కుదిరినప్పటికీ పుష్ప మనసు కుదుటపడలేదు. సంత్‌కుమార్ స్వభావం ఆమెకు బాగాతెలుసు. స్త్రీమీద పెత్తనం చేయటానికి అలవాటుపడిన ఒక మానసిక సంస్కారం ఇంత త్వరలో ఎలా మారగల్గుతుంది? పైపై మాటల్లో మాత్రం సంత్ కుమార్ ఆమెకు తనతో సమానహోదా నిచ్చేవాడు. కాని అందులో ఒక రకమైన దాక్షిణ్యం దాగివుండేది. ముఖ్యమైన విషయాల్లో కళ్ళెం తన చేతుల్లోనే వుంచు కునేవాడు. అటువంటి వ్యక్తి అకస్మాత్తుగా తన అధికారాన్ని త్యాగం చెయ్యటా నికి సిద్ధపడ్డాడంటే యిందులో ఏదో రహస్యముండి తీరాలి.

"స్త్రీలు ఆ అస్త్రాలతో తమ ఆత్మరక్షణ చేసుకోలేదు. పురుషులనే కాపా డుతూ వచ్చారు. అసలు స్త్రీలకు తమను రక్షించుకోగల శక్తి, సామర్థ్యా లెక్క డివీ?" అన్నది పుష్ప.

"ఇదే అభిప్రాయం నా కెన్నోసార్లు కలిగింది పుష్పా! అంతేకాదు. స్త్రీయే గనుక పురుషుణ్ణి కాపాడి వుండకపోతే, యివ్వాళ ప్రపంచమే ఎడారిగా ఉండేది. ఆమె జీవితమంతా త్యాగమయం!"

తరువాత సంత్‌కుమార్ తన అభిమతం వెల్లడించాడు. తన తాతలనాటి ఆస్తిని కాజేసిన మహానుభావులనుండి ఆ ఆస్తిని తిరిగి రాబట్టుకోవాలనుంది అతనికి. పుష్పగనుక తన తండ్రి కిదంతా నచ్చచెప్పి పదివేలరూపాయల డబ్బు యిప్పించినట్లయితే, సంతకుమార్‌కు రెండు లక్షల రూపాయల ఆస్తి దక్కటాని కవకాశముంది. ఒక్క పదివేలైతేచాలు. ఆ మాత్రమైనా లేకపోతే రెండు లక్షల

రూపాయల ఆస్తి చెయ్యిజారిపోతుంది. "కాని ఆ ఆస్తి అన్యాక్రాంతమైపోయిందిగా" అన్నది పుష్ప.

సంత్‌కుమార్ తలపంకించాడు— "అన్యాక్రాంతం కాదది; దోపిడీ! లక్షా రెండు లక్షల కమ్మినా చౌకనిపించే భూమి పదివేల రూపాయలకు నాశనమైపోయింది. తెలివిగలవాడెవ్వడూ యింత గోతిలోపడడు. ఒకవేళ పడినా స్పృహలో వుండగా పడడు. గృహనిర్వహణలోనూ నాన్నగారంత సమర్థుడు కాదు. ఆయన ఊహా ప్రపంచంలో విహరించేవాడు. దుష్టులాయనకు టోపీవేసి ఆ స్తికాస్తా భుక్తం చేసుకున్నారు. ఆ ఆస్తిని తిరిగి స్వాధీనం చేసుకోటం నా కర్తవ్యం. నీవు పూనుకుంటే అంతా జరిగిపోతుంది. డాక్టరుగారికి పదివేల రూపాయలు సర్దుకోటమంటే ఏమంత బ్రహ్మాండంకాదు.

పుష్ప ఒక్క క్షణంసేపు ఆలోచనలో మునిగింది. తరువాత అనుమానంగా అన్నది– "మా నాన్నగారిదగ్గర అంత పైకం నిలవవుంటుందన్న ఆశ నాకే మాత్రం లేదు."

"కాస్త చెప్పిచూడు."

"చెప్పటం ఎలా చెప్పండి! వారి పరిస్థితి నాకు తెలియదు గనకనా? ఆయన ప్రాక్టీస్ బాగా సాగుతున్నమాట నిజమే. కాని దానికి తగిన ఖర్చుకూడా వుంది. బీరూకు ప్రతినెలా అయిదువందల రూపాయలు ఇంగ్లండుకు పంపించవలసివస్తోంది. తిలో తమ చదువుకుకూడా ఏం తక్కువ ఖర్చు కావటంలేదు. కూడబెట్టే అలవాటు లేదాయనకు. ఆయన్ను యిబ్బందిపెట్టటం నాకిష్టంలేదు."

"అప్పుగా యివ్వమంటున్నాను; దానంగా యివ్వమంటంలేదు."

"ఇంత సన్నిహిత సంబంధమున్నచోట అప్పుకు దానం అని తప్ప మరో అర్థం వుండదు. మీరు పైకం యివ్వలేకపోతే ఆయన మిమ్మల్ని చేసేదేమిటి? కోర్టుకు వెళ్తారా – లోకం నవ్వుతుంది. పంచాయతీముందు పెడతారా – ప్రజలు హేళన చేస్తారు."

"నేను పైకం యివ్వలేనని నీ వెలా ఊహించావేం?" సంత్‌కుమార్ తీక్షణంగా అన్నాడు.

ముఖం ప్రక్కకు తిప్పి అన్నది పుష్ప–"మీకు జయం కలుగుతుందని గ్యారంటీ ఏమీలేదు. ఒకవేళ మీరు గెలుస్తారనే అనుకోండి: మీకు డబ్బు చేతికి వస్తుందనే అనుకోండి. ఐనా తమ రుణాన్ని తీర్చగలిగిన జమీందార్లు ఈ ప్రాంతంలో ఎందరున్నారో చెప్పండి! ప్రతినిత్యం జాగీర్లు 'కోర్టు ఆఫ్ వార్డ్స్' పరం ఔతూనే వున్నాయిమరి! పోనీ మీరు పొదుపుగా వుంటారనే అనుకుందాం. డబ్బు నిలవ చేస్తారనికూడా ఒప్పుకుందాం. కాని మానవస్వభావం ఎలాంటిదంటే అతను జీర్ణం చేసుకోగలిగిన ధనం జీర్ణమైపోయిందన్నమాటే. ధర్మాన్నీ, నీతినీ మరిచిపోవటం మానవుడి సర్వసాధారణ బలహీనత."

సంత్‌కుమార్ పుష్పవైపు కొరకొర చూచాడు. పుష్ప మాటల్లోవున్న సత్యం బాణంలాగా గ్రుచ్చుకుంది. ఆయన మనస్సులో గుప్తంగావున్న దొంగను పుష్ప పట్టుకుని ఎట్టఎదుట నిలవేసింది. ''మానవుడంటే యింత నీచంగా భావిస్తున్నావా నువ్వు? ఈ నీ స్వభావానికి నాకు ఆశ్చర్యంగానూ వుంది; విచారంగానూ వుంది. ఈ పాపిష్టికాలంలోకూడా సమాజాన్నింకా నీతి, ధర్మమే పరిపాలిస్తున్నాయి. ప్రపంచంలో ఈ రెండూ నశించినరోజున, ఈ సమాజంగూడ సర్వనాశనమై తీరుతుంది" కలవరపడుతూ అన్నాడు సంత్‌కుమార్.

ధర్మమూ, నీతి పీటికిగల వ్యాపకత్వాన్ని గురించి ఒక సుదీర్ఘమైన వేదాంతోపన్యాసం యిచ్చాడు సంత్‌కుమార్. ఎప్పుడైనా ఏ యింట్లో అన్నా దొంగతనం జరిగితే ఎంత అందోళన చెలరేగుతుంది! కారణం? దొంగతనం ఒక అసాధారణ విషయంగనుక. అసలు సమాజమే దొంగలదైతే? ఎవడైనా షాహుకారు కావటం జరిగినా అంతగానే ఆందోళన చెలరేగుతుంది. ఈ రోజుల్లో రోగాలు చాలా విపరీతంగా పెరిగిపోతున్నట్లు వింటున్నాం. కాని పరిశీలించి చూస్తే నూటికి ఒక్కరికి మించి రోగులుండరు. అసలు వ్యాధులే గనుక సర్వసాధారణమైతే ఆరోగ్యవంతుల ఎగ్జిబిషన్లు జరుగుతాయి. వగైరావగైరా వాదనలన్నీ ఏకరువుపెట్టాడు. పుష్ప విముఖంగా వింటూ పూరుకుంది. ఆమె వాటన్నిటికీ జవాబు చెప్పగలదు. కాని ఈ చర్చ క్రుతిమించాలని కోరటంలేదామె. తన తండ్రిని పైకం అడుగకూడదని మాత్రం నిశ్చయం చేసుకుంది పుష్ప. ఏ తర్క-ప్రమాణాలూ ఆమెమీద పలుకుబడి సంపాదించ లేక పోయినాయి.

సంత్‌కుమార్ ఉపన్యాసం చాలించి ఆమెనుండేమీ జవాబు రాకపోవటం చూచి, ఒక క్షణం ఆగి అన్నాడు— ''ఏమిటి ఆలోచిస్తున్నావు? నిజం చెబుతున్నాను. నేను చాలా త్వరలో యిచ్చేస్తాను పైకం.''

''కావాలనుకుంటే మీరు స్వయంగా అడగండి? నేను మాత్రం వారికి జాబు వ్రాయలేను." అచంచలంగా అన్నది పుష్ప.

"ఈమాత్రం విషయంకూడా వ్రాయలేవు పాపంనువ్వు! కాని యింటిమీద నాకూ అధికారముందని బల్ల గ్రుద్దుతావు మళ్ళీ" పెదవులు నొక్కుకుంటూ అన్నాడు సంత్‌కుమార్.

"మీతో ముడివేసుకున్న మరుక్షణంనుండే వచ్చింది నా కా అధికారం" ఆవేశంతో అన్నది పుష్ప.

"అలాంటి అధికారం లభించినంత సులభంగానే పూడిపోతుంది కూడానూ" గర్వంగా అన్నాడు సంత్‌కుమార్.

ఏ ఆలోచనా ప్రవాహంలో ఆమె అడుగుపెట్టడానికే హడలిపోయేదో,అందులోకే ఎవరో ఒక్క త్రోపుతోసినట్లయింది పుష్పకు ఆమె కాపురానికివచ్చిన ఒకటి రెండు నెలల్లోనే సంత్‌కుమార్ స్వభావాన్ని గుర్తించింది. ఆయనతో కాలక్షేపం

చెయ్యాలంటే ఆయన ఆజ్ఞలన్నీ పాలించే దాసిగా పడుండవలసిందే ఆమె. తన వ్యక్తిత్వాన్ని ఆయన అస్తిత్వంలో మిళితం చెయ్యకతప్పదామె. ఆయన ఆలోచించినట్లుగానే ఆమెకూడా ఆలోచించాలి. ఆయన చేసినపనులే ఆమెకూడాచెయ్యాలి. ఆమె ఆత్మవికాసాని కక్కడ ఏమాత్రం అవకాశమే లేదు. ఆయనకు యిహలోకంలోనూ, పరలోకంలోనూకూడా ఏమైనా వుందంటే అదిఆస్తి మాత్రమే. ఆ ఆస్తే ఆయన జీవితాని కుత్సాహాన్ని ప్రసాదించేది. ఆ స్తిముందు భార్యా బిడ్డలకు కూడా ఆయన దృష్టిలో విలువలేదు. ఒకచైనాపింగాణీప్లేటు పుష్ప చేతిలో నుండి జారిపడితే ఆమె చెవులు మెలివేశాడు. గచ్చుమీద సిరా పారబోసిన నేరానికి శిక్షగా పంకజచేత గచ్చంతా కడిగించాడు. ఆయన దాచిన పైకం ఎప్పుడూ తాకనన్నా తాకేదికాదు పుష్ప. ఆయన ధనాన్ని కేవలం సంగ్రహించవలసిన పదార్థంగా భావించదన్నమాట నిజమే. ధనం అనుభవించవలసిన పదార్థమని ఆయన సిద్ధాంతం. కాని అపవ్యయం. అజాగ్రత సహించేవాడుకాడు. తననుతప్ప ఎవరినీ విశ్వసించడాయన. కఠోరమైన ఆత్మత్యాగంతో ఆ జీవితానికి తనను తాను సిద్ధపరచుకున్నది పుష్ప, కాని యిక్కడ తనకేమీ అధికారం లేదనీ, కేవలం దాసితో సమానమేననీ మాటి మాటికీ జ్ఞాపకం చేస్తుండటం ఆమెకు చాలా అసహ్యంగా వుంది. ఈ మధ్యనే ఓ రోజున ఇలాంటిమాటే విని ఆమె చాలా రోజులు అన్నహారాలు మానేసింది. ఈ రోజువరకూ ఎలాగో మనస్సుకు నచ్చచెప్పుకుని కొంత కుదుటపడింది. ఇంతలోనే తిరిగి గాయం తగిలింది. ఇది ఆమెలో మిగిలిన సహనాన్ని గూడా గొంతునులిమివేసింది. సంత్‌కుమార్ ఆమెను ఛాలెంజిచేసి వెళ్ళిపోయినాడు. ఆమె అక్కడే గూర్చుని యిక తాను చెయ్యగల్గిందేమిటా అని ఆలోచించసాగింది. ఈ స్థితిలో మాత్రం ఆమె అక్కడ ఉండలేదు. తన తండ్రి యింట్లో గూడా తనకు శాంతి లేదని ఆమెకు తెలుసు. తన తండ్రి కూడా సంత్‌కుమార్‌ను ఆదర్శయువకుడుగా భావిస్తాడు. సంత్ కుమారేదో అనుచితంగా ప్రవర్తించాడని ఆయనకు విశ్వాసం కలిగించటం చాలా కష్టం. పుష్ప వివాహంచేసి ఆయన జీవిత సమస్యల్లో ఒకదాన్ని పరిష్కరించుకున్నాడు. ఆ సమస్యను గురించి తిరిగి ఆలోచించటమనేది ఆయన ఊహకందని విషయం. ఆయన జీవితాభిలాష ఇక హాయిగా, నిశ్చింతగా లోకసంచారం చేద్దామనేదే. ఆ సమయమిప్పుడు సమీపిస్తూ వుంది, కొడుకు ఇంగ్లండు నుండి రావటం, చిన్నఅమ్మాయి వివాహం కావటం, ఈ రెండూ జరిగిన మరుక్షణమే ఈ సంసార బంధనాలనుండి విముక్తులౌతారాయన. పుష్ప తిరిగి ఆయన పాలిటపడి ఆయన అతి ప్రధానమైన జీవితాభిలాషకు అవరోధంగా తయారవటం ఆమెకిష్టంలేదు, ఇక ఆమెకు మరోస్థాన మెక్కడుంది? ఎక్కడా లేదు. అయితే ఈ ఇంట్లోనే వుండి జీవితపర్యంతం అవమానం సహిస్తూ వుండవలసిందే?

సాధుకుమార్ వచ్చి కూర్చున్నాడు, పుష్ప త్రుళ్ళిపడ్డది. "నువ్వు బొంబాయి వెళ్ళేదెప్పుడు?" అన్నది.

"నిన్ననే వెళ్ళాల్సింది; కాని వెళ్ళాలనిపించడంలేదు. రామా పోనూ పందలు ఖర్చవుతాయి. ఇంట్లో డబ్బులేదు. ఎవరినీ పీడించటం నాకిష్టంలేదు. బొంబాయి వెళ్ళితీరవలసినంత అవసరం మాత్రం ఏముంది? ప్రతి పదిమందికీ తొమ్మిదిమంది అన్నానికి అలమటించిపోయే దేశంలో పది, పదిహేనుమంది క్రికెట్ వ్యసనంలో మునిగి ఉండటం మూర్ఖత్వ మౌతుంది. నేను వెళ్ళదలుచుకోలేదు" అన్నాడు సందేహిస్తూ.

"మీ అన్నగారు డబ్బిస్తారుగా!" ఉత్సాహపరుస్తూ అన్నది పుష్ప.

"అన్నగారు డబ్బేమీ యివ్వరు. నన్ను నాన్నగారి గొంతుమీదకూర్చోమని చెబుతున్నారు నేను నాన్నగారిని కష్టపెట్టదలుచుకోలేదు. నీకు నమస్కారంచేస్తా; అన్నయ్యతో మాత్రం చెప్పబోకు వదినా!" చిరునవ్వుతో అన్నాడు సాధూ.

పుష్ప అతని వినయ పూర్వకమైన నిష్కాపట్యానికి ఫక్కున నవ్వింది. ఆత్మగౌరవం తొణికిసలాడే యిరవై రెండేళ్ళ యువకు డతను. సత్యాగ్రహ సమరంలో చదువుకు స్వస్తి చెప్పాడు. రెండుమార్లు జైలుకు వెళ్ళి వచ్చాడు. జైలరు మొరటుమాటలు విని ఉద్రేకంలో అతని గుండెల మీద కెక్కి కూర్చున్నాడు. ఈ ఉద్దండతకు శిక్షగా మూడు నెలలు చీకటి కొట్టులోకూడా ఉన్నాడు. అలాంటి వాడు తన అన్నగారంటే ఏదో భూతమా అన్నంతగా భయపడతాడు.

"నేను మీ అన్నయ్యతో చెప్పేస్తాలే" అన్నది పుష్ప.

"నువ్వు చెప్పవులే, అంత కఠినురాలవు కావుగా?"

"నీకెట్లా తెలుసేం?" పుష్ప ప్రసన్నురాలై అన్నది.

"ముఖాన్నిబట్టే "

''వట్టి టక్కరివాడివి."

''ఐతే యింకో విషయం చెప్పనా? యివ్వాళ అన్నయ్య నిన్ను ఏదో అన్నాడులే."

''పచ్చి అబద్ధం, ఆయన నన్నేమంటారూ." సిగ్గుపడుతూ అన్నది పుష్ప.

''ఐతే నామీద ఒట్టుబెట్టుకో."

''ఒట్టెందుకు బెట్టుకోవాలి? నేనెప్పుడైనా ఒట్టుబెట్టుకోంగా చూశావా నువ్వు?"

''అన్నయ్య తప్పక ఏదో అనేవుంటాడు. లేకుంటే నీ ముఖం యింత వాడిపోవటం ఎందుకు జరుగుతుంది? అన్నయ్యతో మాట్లాడటానికి సాహసించ లేకపోతున్నాను. లేకుంటే గతించినవాటిని తవ్వుకోట మెందుకులెమ్మని నచ్చ చెప్పేవాణ్ణి. అమ్మైపోయిన ఆస్తికోసం నాన్నగారిని నిందించటం, కోర్టుకెక్కటం నా కేమాత్రం నచ్చటంలేదు. ఈ లోకంలో పేదవాళ్ళుకూడా ఉన్నారా?

అంతా ఆ సిపరులే నంటావా? నేను నీతో హృదయపూర్వకంగా చెబుతున్నా వదినా, ధనవంతుడు కావాలన్న ఊహ నా మనసులో కలిగితేచాలు. యిక నేనెలా మారి పోతానో అని సందేహంగా ఉంటుంది నాకు. ఇంతమంది దరిద్రుల్లో ధనవంతుడు కావటం పచ్చి స్వార్థమనిపిస్తు ది. నావంటి మానవులే బాధలుపడటం చూచినప్పుడు ఈ స్థితిలో కూడా నామీద నాకు అసహ్యం కలుగుతుంది. మనం రెండు పూటలా నేతి రొట్టెలూ, పాలూ, సీమరేగుపండ్లూ, కమలాలూ ఉడాయిం చేస్తున్నాం. కాని నూటికి తొంభై మంది ఈ పదార్థాలు కళ్ళజూడనివాళ్ళు కూడా ఉన్నారు. ఇంతకూ మనకేమి కొమ్ములు మొలిచాయి చెప్పు."

పుష్ప యిలాంటి భావాలు కలది కాకపోయినా సాధూ సత్య స్వభావాన్ని గౌర వించేది. "నీవు పెద్దగా ఏమీ చదివినట్లుండవు, మరి ఇటువంటి భావాలు నీబుర్రలో ఎలా ప్రవేశిస్తున్నాయో!" అన్నది పుష్ప.

"బహుశా క్రిందటి జన్మలో బిచ్చగాణ్ణయి ఉంటాను" అన్నాడు సాధూ నిలబడి.

"మా చెల్లెలు పాపం నగలకోసం తహతహలాడి పోతుందేమో." అతని చెయ్యిపట్టుకుని కూర్చోబెడుతూ అన్నది పుష్ప.

"నే నసలు పెళ్ళిచేసుకోను."

"ఎక్కడినుండైనా కబురొస్తే బాగుండునని జపంచేస్తూనే ఉంటావులే మనసులో."

"నిజం వదినా, నీతో అబద్ధం చెప్పను; వివాహం గురించిన ఆలోచనేరాదు నాకు. జీవితమనేది యితరులకు ఉపయోగపడటంకోసం; ప్రజాసేవకుల కెంతగానో అవసరమున్న మనదేశంలో కొంతమంది బ్రహ్మచారులుగా ఉండితీరాలి. ఒకవేళ ఎప్పుడైనా వివాహం చేసుకోదలచినా, నాతోపాటు బీదరికపు జీవితం గడుపుతూ, నా జీవితానికి నిజమైన సహచరిగా మెలగటానికి సిద్ధపడిన అమ్మాయినే చేసుకుం టాను."

"మొట్టమొదట యువకు లందరూ యిలాగే ఊహాగానం చేస్తారు. కాని పెళ్ళికావటం ఆలశ్యమైందంటే గల్లంతు ప్రారంభిస్తారు" అతని ప్రతిజ్ఞను ఎగ తాళిగా ఎగరగొట్టేసింది పుష్ప.

"వదినా! నేను వాళ్ళరకంకాదు తెలుసా? మనస్సు ఎప్పుడైనా చలించటం జరిగితే విషం తినేస్తాను" ఆవేశంతో అన్నాడు సాధుకుమార్.

"నీ మనస్సులోమాత్రం పంకజలాంటి ప్రియురాలు విహరిస్తూనే వుందిలే!" తిరిగి వ్యంగ్యంగా అన్నది పుష్ప.

"నీతో ఏమాటన్నా ఎగతాళి ప్రారంభిస్తావు. అందుకనే నీ వద్దకు రాను నేను."

"సరేగాని నిజం చెప్పు. పంకజలాంటి పిల్ల దొరికితే పెళ్ళి చేసుకుంటావా లేదా?

సాధుకుమార్ లేచి వెళ్ళిపోయినాడు. పుష్పవారిస్తున్నా చెయ్యి విదిలించుకుని పరుగుతీశాడు. ఆదర్శవాదీ, సరళ స్వభావం గలవాడూ, శీలవంతుడూ, శాంత మూర్తి అయిన ఈ యువకునితో మాట్లాడితే ముకుళితమైపోయిన పుష్ప మనో కుసుమం వికసించేది. ఆమె మనసులో ఎంత లోతైన మనిషో పైకి అంత తేలికైన మనిషి. సంత్‌కుమార్‌వద్ద ఆమె అనుక్షణం తన హక్కులను రక్షించుకోవలసి వచ్చేది. ఆయన ఎప్పుడు దాడిచేస్తాడోనని మెలకువగా వుండవలసివచ్చేది. శైవ్యా ఎల్లప్పుడూ ఆమె మీద పెత్తనం చెయ్యాలనుకునేది. తాను ఇంటికి యజమానురాలినన్న సంగతి ఆమె ఒక్క క్షణంగూడా మరిచిపోయేదికాదు. అందువల్ల తన అధికారాన్ని అందరూ గుర్తించి తీరాలనుకునేది. దేవకుమార్ తన భారమంతా సంత్‌కుమార్‌కు అప్పగించి నిజానికి శైవ్యా అధికారాన్ని లాగివేశాడు. దేవకుమార్ యజమానిగా వున్నంతవరకే తను ఇంటికి యజమానురాలన్న విషయం ఆమె మరిచిపోయేది. ఇప్పుడామె పేరుకు మాత్రమే దేవి. తన ఆశీర్వాదాల బలంతో మాత్రమే గౌరవించబడుతుంది. మనస్సులోని తన సందేహాన్ని తీర్చుకోటం కోసం ఆమె ఎల్లప్పుడూ తన అధికారాలను పరీక్షించి చూచుకునేది. ఈ శంక ఏదో వ్యాధి లాగా ఆమెలో జీర్ణించిపోయింది. మామూలు భోజనం జీర్ణం చేసుకోలేనందువల్ల ఆమె స్వభావం రుచులు కోరుతుండేది. పుష్ప ఆమెతో మాట్లాడటానికి భయపడేది. ఆమెదగ్గరకు వెళ్ళటానికి సాహసించేదికాదు. ఇక పంకజ ఉందంటే ఆమెకెప్పుడూ పనిచేసేవ్యాధే ఆమె పనే ఆమెకు వినోదమూ, కాలక్షేపమూ అన్నీని. నిందించటమనేది ఆమె నేర్చుకోనేలేదు అచ్చగా దేవకుమార్ స్వభావం ఆమెది. ఎవరైనా నాలుగుమాటలన్నా తలవంచుకు వింటుంది. ఏ విధమైన ద్వేషమూ విచారమూ మనసులో చేరనివ్వదు. తెల్లవారుఝామునుండి రాత్రి పది పదకొండు గంటలయ్యేదాకా గుక్కెడు త్రిప్పుకునేందుకు కూడా తీరిక ఉండదు. ఎవరిచొక్కా గుండీలన్నా ఊడిపోతే పంకజ కుట్టిపెడుతుంది. ఎవరిగుడ్డలు ఎక్కడ ఉన్నాయో ఆ గుట్టంతా పంకజకు తప్ప ఎవరికీ తెలియదు. ఇంతపనిచేస్తూ కూడా ఆమె చదువుకోటానికీ, కుట్టుపనులకు కూడా తీరిక ఎలా సంపాదిస్తుందో ఆశ్చర్యం. ఇంట్లో వున్న దిండ్లన్నిటిమీద పంకజ కళాప్రియత్వపు చిహ్నాలు అంకితమైయుండేవి. టేబుల్ గుడ్డలూ, కుర్చీ మెత్తలూ, పెట్టె గలేబులూ- ఒకటేమిటి? సమస్తం ఆమె శిల్పశోభలతో విరాజిల్లుతుండేవి. పట్టు ముఖమల్ గుడ్డలపై రకరకాల పక్షుల బొమ్మలూ, పూల చిత్రాలూ చిత్రించి, ఆమె ఫ్రేములు కట్టించింది వాటికి. అవన్నీ దివాణపుశోభను ద్విగుణీకృతంచేసేవి. ఆమెకు సంగీతంలో కూడా అభిరుచిఉంది. సితార్ వాయించేది. హార్మోనియం వాయించటమంటే ఆమెకెంతో సరదా. కాని యితరుల యెదుటమాత్రం పాడటానికి, వాయించటానికి బిడియపడేది. వీటన్నిటితో

పాటు ఆమె స్కూలుకుకూడ వెళ్ళేది. ఆమెను చురుకైన పిల్లలలో ఒకతెగా పరిగణించేవారుకూడా. ప్రతినెలా పదిహేనురూపాయల స్కాలర్ షిప్‌కూడా యిచ్చేవారామెకు. పుష్పవద్దకు వెళ్ళి కొద్దిక్షణాలు కూర్చొని సరసాలాడుకోవటానికి ఆమెకంత తీరికకూడా లేదు. ఆమెకు సరస మాడటం అసలుచేతగాదుకూడా. పరిహాసాన్ని గ్రహించేదీ కాదూ; దానికి యెదురుజవాబు చెప్పేదికాదు. పుష్పకు తన బ్రతుకు భారాన్ని కొంత తగ్గించుకోడానికి సాధూ ఒక్కడే తటస్థపడేవాడు. ఇక భర్తగా గోరుచుట్టుమీద రోకటి పోటులాగా, తన బరువుకూడా ఆమె నెత్తికేరు యెత్తాడు.

సాధూ వెళ్ళిపోంగానే పుష్ప తిరిగి అదే ఆలోచనలో మునిగి పోయింది. తన బ్రతుకు భారాన్ని తానే భరించేందుకు ఉపాయమేది? కనుకనే భర్తగారు తన మీద అధికారాన్ని చలాయించగల్గుతున్నారు. ఆమెను ఎంతగా వేధించుకు తిన్నా తాను ఎక్కడికీ పోలేదనీ, నోరెత్తి మాట్లాడలేదనీ, ఆయనగారికి బాగా తెలుసు. ఔను! నిజమే ఆయన ధీమా! తనకు గొప్ప గొప్ప వస్తువులంటే ఎంతో మోజు. ఖరీదైన భోజనానికి అలవాటు పడింది. హాయిగా విశ్రాంతి ఉండాలని కోరుకునేది. ఒక్కసారి ఆమె భోగవిలాసాల వ్యామోహాన్ని త్యాగంచేస్తే, త్యాగం చేయటం నేర్చుకుంటే, యిక ఆమెమీద పెత్తనం చేయగలవారెవరూ? ఆమె ఒకరికి దాసోహమెందుకంటుంది?

సాయంత్రమైంది. పుష్ప కిటికీ కెదురుగా నుంచుని బయటవైపు చూస్తోంది. ఇరవై, ఇరవై అయిదుమంది స్త్రీల గుంపు ఒకే స్వరంతో పాటపాడుకుంటూ సాగిపోతుండటం చూచిందామె. ఎవరి శరీరాలమీదా నిండుగా గుడ్డలుకూడా లేవు. తలమీదా, ముఖంమీదా దుమ్ము అట్టగట్టుకు పోయింది. బహుశా నెలలతరబడి నూనె తగలలేదేమో. వెంట్రుకలు కరుకెక్కిపోయినాయి. దినమంతా యిటుక అదుసు మోసి యింటికి తిరిగి వస్తున్న కూలీ స్త్రీలువాళ్లు. రోజంతా వాళ్లు ఎండలో ఉడికిపోయుంటారు. యజమాని చీదరింపులకూ, తిట్లకూ గురైయుంటారు. బహుశా మధ్యాహ్నం ఒక గుప్పెడు సెనగలతోనే సరిపెట్టుకుని యుంటారు పాపం! అయితేమటుకేం? ఎంత ఆనందంగా ఉన్నారు! ఎంత స్వేచ్ఛగాఉన్నారు! వాళ్ళ ఆనందంలోనూ, స్వేచ్ఛలోనూ గల పరమరహస్యం ఏమై యుంటుంది.

## 3

ప్రజలు భయంతో గౌరవించే వ్యక్తుల్లో మిష్టర్ సిన్హా ఒకడు. సిన్హాను చూడగానే అందరూ "దయచేయండి. దయచేయండి." అంటారు. కాని ఆయన

ముఖం చాటున మాత్రం "పరమ దుర్మార్గుడు. పాము కాటుకన్నా మంత్రముంది కాని వీడికాటుకు మంత్రంకూడా ఉండదు" అంటూ ఉంటారు. లేనిపోని తగాదాలు, దావాలూ సృష్టించడమే ఆయన వృత్తి. కవి తన కల్పనాశక్తిద్వారా ఒక పెద్ద కావ్యాన్నే సృష్టించినట్లు, సిన్హాకూడా తన ఊహాశక్తితో దావాలను సృష్టించేస్తాడు. ఆయన కవి కాకపోవడానికి కారణమేమిటో తెలియదు మరి. కాని కవిగా ఎంత సాహిత్యాన్ని సృష్టించినా తనకు మాత్రం కించిత్తయినా మేలుచేసుకోగలిగుండడు. కాని చట్టాన్ని ఉపాసించినందువల్ల ఆయన కోర్కెలన్నీ సఫలమైనాయి. భేషైన బంగళాలో నివాసం. గొప్ప గొప్ప శ్రీమంతులతోనూ, అధికారులతోనూ స్నేహం, మంచి ప్రతిష్ఠా పలుకుబడీ సంపాదించాడు. ఆయన కలంలోఉన్న మహత్యమేమిటోగాని దావాకు ప్రాణంపోసేవాడు. ఎటువంటి ఎటువంటి సందర్భాలు ఏర్చికూర్చేవాడు! ఎలాంటి ఎలాంటి పాత్రలు సృష్టించేవాడు! ఒక్క దెబ్బన కల్పన సజీవంగా తయారయ్యేది. గొప్ప గొప్ప హేమాహేమీలైనవాళ్ళుగూడా దాని లోతులు పసిగట్టగలిగేవాళ్లుకాదు. అంతా ఎంత సహజంగానూ, పగడ్బందుగానూ ఉండేదీ? అబద్ధమేమోనన్న సందేహమన్నా కలిగేదికాదు. ఆయన సంత్ కుమార్‌తో పాటు చదువుకున్నాడు. ఇద్దరికీ గాఢమైన స్నేహం. సంత్ కుమార్ మనస్సులో ఒక అభిప్రాయం తల ఎత్తింది. సిన్హా దానికి జీవంపోసి ఒక సజీవమైన ప్రతిమగా రూపొందించాడు. ఇవ్వాళ దావా దాఖలు చేయడానికి ఆలోచన జరుగుతోంది.

తొమ్మిది గంటలైయుంటుంది. వకీళ్లూ, కక్షిదారులూకోర్టుకువెళ్ళే ఏర్పాట్లలో ఉన్నారు. సిన్హా తన అలంకృతమైన గదిలో డ్రాయరుమీద కాళ్లుజాచి పడుకుని ఉన్నాడు. అందగాడు, పొడగరి, సన్నగా ఉంటాడు వెనుకకు దువ్వుకున్న పెద్ద జుట్టు, చక్కని మీసం, కళ్ళకుజోడు, నోట్లో సిగరెట్, ముఖంలో ప్రతిభ, కళ్ళల్లో గర్వం— ఎవరో గొప్ప శ్రీమంతుడనిపిస్తుంది. సంత్‌కుమార్ షేర్వానీ, ఫెల్ట్‌కేప్ ధరించికూర్చున్నాడు. ఎందుకో విచారంగా ఉన్నాడు.

"నువ్వు అనవసరంగా భయపడుతున్నావు. నా మాట విను; విజయం మనదే. కొడుకులూ, మనుమలూ విక్రయపత్రాలను రద్దు చేయించిన ఉదాహరణలు వందలున్నాయి. గట్టి సాక్ష్యం కావాలి. అంతే! అది సంపాదించట మొకలెక్కలోది కాదు'' ఓదారుస్తూ అన్నాడు సిన్హా.

"కాని నాన్నగారిని ఒప్పించాల్సుంటుంది. ఆయన అనుమతిలేకుండా ఏమీ జరుగదు'' సందిగ్ధంగా అన్నాడు సంత్‌కుమార్.

"ఆయన్ని దారికి తేవడం నీపని".

"కాని ఆయన దారికి రావటం చాలకష్టం."

"ఐతే ఆయన్నిగూడా ప్రక్కకునెట్టేసెయ్యి. ఆయనకు మతిస్థిమితంలేదని మనం రుజావుచేద్దాం.''

"అది రుజువు చేయటమంత సులభంకాదు. గొప్ప గొప్ప గ్రంథాలు రచించిన వాడాయన. నాగరిక ప్రపంచంలో నాయకుడుగా భావిస్తారాయన్ను. ఆయన్ను పిచ్చివాదని రుజువుచేయట మెలా?"

"అదంతా నేను చూచుకుంటా. పుస్తకాలు వ్రాయటం వేరూ; మతిస్థిరంగా ఉండటం వేరూ! నా ఉద్దేశ్యం అసలు రచయితలంతా రసపిచ్చిగాళ్ళనని, ప్రశంసల కోసం యీ వృత్తి నవలంబించే ఉన్మాదులు వాళ్ళు. నిజంగా వీళ్ళకు మతి స్వాధీనంలోనే ఉంటే పుస్తకాలు వ్రాయక, ఏదఠారీ వ్యాపారమో చేసేవాళ్ళు. లేకపోతే మిఠాయీలు అమ్ముకునేవాళ్లు. ఈ పనుల్లో అయితే శ్రమపడ్డందుకు ఫలితం దొరుకుతుంది. పుస్తక రచనవల్ల అజీర్ణం, నిద్రలేమి, 'క్షయ'రోగం యివ్వేగా లభించేది. డబ్బు వ్యవహారం నువ్వు చూచుకుంటుండు. మిగతా వ్యవహారమంతా నాకు వదలి పెట్టేయ్. ఆఁ! మరిచాను. ఇవ్వాళ సాయంత్రం క్లబ్బుకు తప్పకుండా రా! దాడి యిప్పటినుంచే ప్రారంభించాలి మరి. త్రివేణిని వలలోవేసుకునే ప్రయత్నం ప్రారంభించు. ఆమె సబ్ జడ్జిగారి ఏకైక పుత్రిక అన్న విషయం గుర్తుంచుకో. మరి ఆమెను ఆకర్షించగలిగితే నీ రొట్టె నేతిలో పడ్డదన్నమాటే! సబ్ జడ్జిగారు త్రివేణి మాట నెప్పుడూ కాదనలేరు. ఇటువంటి చిక్కు వ్యవహారాల్లో నీ కంటె నేను ఆరితేరినవాణ్ణేకాని నేనొక హత్య కేసులో వకాలతు పుచ్చుకున్నాను. మరి సివిలుసర్జను మిస్టర్ కామత్‌గారి అమ్మాయి ఉంది చూచావా- పచ్చగా ఉంటుంది- అమ్మాయి ప్రస్తుతం నా ప్రియురాలు. సివిల్ సర్జన్ నన్నెంత ఆప్యాయంగా ఆదరిస్తాడని చెప్పనూ ఆ పిశాచితో వివాహం విషయం యింతవరకూ ఏమీ నిర్ణయానికి రాలేదులే. పెద్ద పెద్ద పెదిమలున్నూ, వంగిపోయినవక్షోజాలా ఉంటుంది దాని వక్షస్థలం. అయినా తనకంటె అందకత్తెలే ప్రపంచంలోనే లేరని విర్రవీగుతుంది. ఆడవాళ్ళకు తమ అందాన్ని, గురించి గర్వం ఎలా కలుగుతుందో నా కింతవరకూ అర్థంకాలేదు. అందగత్తెలు గర్వించినా సబబుగా ఉంటుంది కాని ముఖం చూడగానే డోకు పుట్టేవాళ్ళుకూడా తాము అప్సరసలమనుకుంటే ఎలా? దాని వెంటబడి ప్రేమ నటించేటప్పుడు వళ్లు మండెత్తుతుంది. కాని బోలెడు డబ్బు చేతికొచ్చే అవకాశముంది. కాస్త ముక్కుమూసుకోక తప్పదు మరి, వేణి నిజంగా అప్సరసే. కాని చంచలమైంది. కొంచెం కష్టంమీదగాని వశంకాదు. నీ సామర్థ్యమంతా వినియోగించవలసి ఉంటుంది'' విశ్వాస పూరితంగా అన్నాడు సిన్హా.

"ఆ కళ నేను బాగా అభ్యసించాలే!''

"అయితే యివ్వాళ సాయంత్రం క్లబ్బుకు వస్తావుగదూ!''

"తప్పకుండానూ.''

"పైకం ఏర్పాటుకూడా చూడు."

"అదెలాగూ చెయ్యాల్సిందేగా! ''

ఈ విధంగా సంత్‌కుమార్, సిన్హా లిద్దరూ ముట్టడి ప్రారంభించారు. సంత్‌కుమార్ కాముకుడూ కాదు; రసికుడూ కాదు. కాని నటించటం నేర్చినవాడు. అందగాడుకూడానూ. తియ్యగా మాటలు చెప్పగలడు. బలిష్ఠుడు. ప్రసన్నవదనం, ప్రతిభావంతమైన ముఖం. తెల్లని శరీరచ్ఛాయతో కళకళ లాడుతుంటాడు. సూటు వేసుకుని బెత్తం త్రిప్పుకుంటూ బయలుదేరితే కళ్ళల్లో హత్తుకుపోతాడు. టెన్నిస్, బ్రిడ్జి మొదలైన నాగరిక ఆటలలో నిపుణుడుకూడా కావటంవల్ల, వేణితో పరిచయం సంపాదించటానికి యెంతోకాలం పట్టలేదు. వేణి యూనివర్సిటీలో మొదటి సంవత్సరం చదువుతోంది. అతి చురుకయింది, మిక్కిలి గర్విష్ఠి ఎంతో సమయస్ఫూర్తి గలది. ఆమెకు చదువుమీద అంత శ్రద్ధలేదు. కాని లోకంపోకడతో పరిచయముంది. ఆ పైపై పరిచయానికి పాండిత్య రూపమివ్వడం ఎలాగో తెలుసు వేణికి. ఏవిషయమున్నా తీసుకోండి - అది కేవలం సైన్సు విషయమైనా సరే:-దానిమీద ఆమె ఏదో వ్యాఖ్యచేస్తూనే వుండేది. ఏదో క్రొత్త విషయాన్ని పరిశుద్ధమైన భాషలోచెప్పాలని ఉబలాటపడేది. అమిత సున్నితమైన స్వభావంగలదామె. మర్యాద, యోగ్యత ఏ మాత్రం లోపించినా ఆమె కసహ్యం. ఆమెవద్ద ఏ సేవకుడూ ఏ దాసీకూడా నిలవగలిగేవాళ్ళు కాదు. ఇతరులను ఘోరంగా విమర్శిస్తుంటే ఆమె కెంతో ఆనందంగా వుండేది. అమిత తీక్షణమైంది ఆమె దృష్టి. ఏ స్త్రీలోగానీ, ఏ పురుషునిలోగానీ, ఏ మాత్రమైన దుర్వ్యసనాలూ, వికృతచేష్టలూ పసిగట్టిందా ఆమె సహించేది కాదు. కనుబొమలద్వారానో, పెదవులద్వారానో తన మనోభావాలను తక్షణమే వ్యక్తంచేసేది. ఆమె దృష్టి అంతా స్త్రీలైతే వారి వస్త్రభూషణాలమీదా పురుషులైతే వారి మనస్తత్వాలమీదా కేంద్రీకృతమయ్యేది. ఆమెకు తన, సౌందర్యమెంత సాటిలేనిదో తెలుసు, చక్కని దుస్తులుధరించి, తన సౌందర్యాన్ని మరింత శోభింపజేసేది. తన అలంకార పేటికలో తళతళ మెరిసిపోయే నగలను చూసుకుని ఆమెంతో ఆనందించేది. ఐనా ఆమెకు నగలంటే పెద్దగామోజులేదు. రోజు కెన్నో సార్లు ఆమె క్రొత్తక్రొత్త దుస్సులు ధరించేది. కాసేపు బెంగాలీజాతి వేషం. కాసేపు గూర్జరజాతి వేషం వేసేది; మరొకప్పుడు గౌనూ, మేజోళ్ళూ ధరించేది. కానీ ఆమె మనస్సులో పురుషులను ఆకర్షించుదామనే భావం లేశం కూడా లేదు. తనకుతానే సౌందర్యారాధనలో తన్మయత్వం చెందేది.

కాని దాంతోపాటు ఆమె చనువుగా ఉండేదికాదు. యువకుల ముఖతా ప్రేమపూరిత వచనాలువిని ఆమె ఏమాత్రం చలించేదికాదు.ఈ విషయంలో సాధారణ సౌందర్య ప్రశంసమినహా, ఆమె మరి దేనికీ ప్రాధాన్యత యిచ్చేదికాదు. ఇక యువకులు ఆమెనుండి ఏ విధమైన ప్రోత్సాహం లభించక నిరాశ లయ్యేవాళ్ళు. కానిసంత్‌కుమార్ రసికత్వంలో ఏదోరహస్యం, నిపుణత అంతరాత్మకు గోచరించింది. ఇతర యువకులలో ఆమెకు కనుపించిన ఆ యింద్రియలోలత్వం, తొందరపాటు, తహతహ సంత్‌కుమార్‌లో మచ్చుకైనా కనుపించలేదు. సంత్

కుమార్ యొక్క ప్రతిచేష్టలోనూ యింద్రియనిగ్రహం, మర్యాదా, జాగరూకతా తొణికిసలాడేవి. కనుకనే ఆమె ఆయనతో మెలకువగా వుంటూ, ఆయన మనస్తత్వాన్ని అధ్యయనం చేయటానికి ప్రయత్నిస్తుండేది. సంత్‌కుమార్ యొక్క సంయమం, ఆలోచనాశక్తి - యివే వాటి గాఢమైన గూఢత్వంవల్ల తమ వైపుకు ఆకర్షించుకుంటున్నాయి. ఆమెవద్ద సంత్‌కుమార్ తననొక యిష్టంలేని వివాహానికి ఎరయైన బలిపశువులాగా చిత్రించుకున్నాడు. దాని ఫలితంగా ఆయనకు ఆమెనుండి కొంత సానుభూతి లభించింది. వేణి కెంతమాత్రం సాటిరాని పుష్ప సౌందర్యాన్ని తన స్వార్థానికి అవసరమనుకున్నంతవరకూ ప్రశంసించాడు సంత్‌కుమార్. ఆయన పుష్పలో మొరటుతనం, మూర్ఖత్వం, నిర్దయ, నిష్ఠురత్వం వగైరా అవగుణాలు మూర్తీభవించి వున్నాయని ఆరోపించాడు. తత్ఫలితంగా పుష్ప కంటబడితే, వేణి తన తరఫున ఆమెతో వాదించేటంతగా ఆమె నాకర్షించాడు సంత్‌కుమార్.

ఒకరోజు ఆమె సంత్‌కుమార్‌తో అన్నది— "మీరు ఆమెనువదిలిపెట్ట కూడదూ?"

"ఎలా విడిచిపెట్టను మిస్ త్రివేణీ! సంఘంలో వున్నప్పుడు సంఘపు కట్టుబాటును మన్నించి తీరవలసిందే. అదీగాక ఇందులో పుష్ప చేసిన నేర మేముంది? ఆమె తనను తాను సృష్టించుకుందా? భగవంతుడనుకో, సంస్కారమనుకో, పరిస్థితులనుకో-ఎలా తయారుచేస్తే అలా తయారైంది" ఖిన్నుడై అన్నాడు సంత్‌కుమార్.

"మెడకు తగులుకున్నది గనుక డోలువాయించక తప్పదనే మనుషులంటే నా కెంతమాత్రం సానుభూతిలేదు. ఆ డోలును మెడనుండి తీసి ఏ కందకంలోనో విసిరిపారెయ్యాలంటాను నేను. నా కధికారముంటే ఆ పని నేనే చేసేదాన్ని."

తన మంత్రం పారటం గమనించి లోలోపలే సంతోషిస్తూ అన్నాడు సంత్‌కుమార్— "కాని ఆమె గతేమవుతుందో ఆలోచించారూ!"

"ఆమె తన యింటికి వెళ్ళిపోతుంది. లేకుంటే ఏదో పనిచేసుకుంటుంది. అదీగాకపోతే తన స్వభావానికి సరితూగే మరో వ్యక్తిని వివాహమాడుతుంది. మీ కా విషయం ఆలోచించవలసిన పనేముంది?" చికాకుగా అన్నది వేణి.

"వేణికి వాస్తవానికీ, కల్పనకూగల తేడాకూడా తెలియదు. ఎంత అమాయకం!" పకపక నవ్వి అన్నాడు సంత్‌కుమార్.

"ఇది చాలా క్లిష్టసమస్య త్రివేణీ! ఈ సంఘపు నీతి ఏమిటో తెలుసా? పుష్పను చూస్తుంటే నిత్యం నా రక్తం వుడికిపోతుంటే మటుకేం! ఆ బాధతో ఏదో ఒకరోజు నేను నా కంఠం తెగగోసుకుంటే మటుకేం! సంఘాని కేమీ నష్టంలేదు. కాని విడిచిపెట్టటంమాత్రం అసంభవం. ఒక్క కారణంతో మాత్రం ఆమెను వదిలివెయ్యగలను. అది ఆమె శీలదోషానికి సంబంధించిన విషయం. పుష్పలో

ఎన్ని దోషాలైనా వుండవచ్చును గాని, ఈ దోషంమాత్రం లేదు" గంభీరమైన ఔదార్యం ప్రదర్శిస్తూ అన్నాడు సంత్‌కుమార్.

సాయంత్రమైనది. వేణి నౌకరును పిలిచి తోటలో తిన్నెమీద కుర్చీలు వెయ్యమనిచెప్పి తోటలోకి వచ్చేసింది. ఈపని చేసిపోవటమే తరువాయి అన్నట్లుగా నౌకరు కుర్చీలు తెచ్చివేశాడు.

"కుర్చీలు తుడువలేదేం ? కనబడటంలా వాటిమీద ఎంత దుమ్ముందో? ఎన్నిమాట్లు చెప్పాను నీకూ? ఐనా నీకు జ్ఞాపకమే ఉండదు. జరిమానా వెయ్యందే నీకు జ్ఞాపక ముండదులే" గద్దిస్తూ అన్నది వేణి.

నౌకరు కుర్చీలు రుద్దిరుద్దీ శుభ్రంచేశాడు. మళ్ళీ వెళ్ళబోయాడు.

"ఎందుకలా మాటిమాటికీ పారిపోతావ్? డ్రాయరు తీసుకొచ్చావ్? టీ టేబిల్ తీసుకురాలేదేం? టీ నీ నెత్తిన బెట్టుకు త్రాగుతామనుకున్నావా!" తిరిగి గద్దించింది వేణి.

ఆమె వృద్ధనౌకరు చెవులురెండూ మెలివేసింది. "వట్టి మందమతి. శుద్ధ మూర్ఖుడు. వట్టి మట్టిబుర్ర పీడిది?" ఒక్క నెట్టునెట్టి అన్నది వేణి.

ఆ వృద్ధనౌకరు ఎన్నాళ్ళనుండో ఉంటున్నాడు. ఇంటియజమానురాలు అతనిని ఎంతో ఆదరంగా చూచేది. ఆమె స్వర్గస్థురాలైన తరువాత అతను పెద్దగా ఆశకల వాడు కాకపోవటంచేతనూ, యజమానురాలియెడల అతనికిగల భక్తిశ్రద్ధలవల్లనూ—యిక్కడకంటే ఒకటిరెండు రూపాయలు ఎక్కువ జీతంతో నౌకరీ దొరికే అవకాశ మున్నప్పటికీ—అతనా యింటికే బంధితుడైనాడు. అనాదరణ, అవమానం సహిస్తూ కూడా ఇతనా యింటికే అంటుకుపోయినాడు. సబ్‌జడ్జిగారు కూడా అతన్ని గదమాయిస్తుండేవారు. కాని వారు కోప్పడ్డందుకు అతని కేమీ కష్టంకలిగేదికాదు. ఆయనగారు వయసులో అతనికి సమానమైనవాడు. కాని తాను త్రివేణీనితన ఒడిలో ఉంచుకుని ఆడించాడు. ఇప్పుడా వేణియే అతన్నిగద్దిస్తున్నది. దెబ్బలు కూడా కొడుతున్నది ఇందువల్ల అతని శరీరానికి కలిగే బాధకంటే, అతని ఆత్మగౌరవానికి కలిగేబాధ ఎంతో తీవ్రంగాఉంది. అతను నౌకరీచేసిందల్లా రెండు కుటుంబాల్లోనే. రెండు కుటుంబాల్లోనూ ఆడపిల్లలుండేవాళ్ళు. కోడళ్ళు కూడా ఉండేవాళ్ళు. కాని అందరూ అతనిని ఆదరించేవాళ్ళు. అతనంటే బిడియపడేవాళ్ళుకూడాను. అతనివల్ల ఏ పనైనా పాడైపోవటం జరిగినా, మనసులోనే ఉంచుకునేవాళ్ళు. అతని యజమానురాలు ఆదర్శ మహిళామూర్తి. అతన్నెప్పుడూ పల్లెత్తుమాటనలేదు. బాబుగారు ఎప్పుడన్నా కోప్పడ్డా, అతని పక్షంవహించి ఆయనతోవాదించేది. కాని ఈ అమ్మాయి పెద్దా, చిన్నా తారతమ్యంకూడా చూడదు. విద్యవల్ల విజ్ఞానం కలుగుతుందంటారు. ఇదేనా ఆ జ్ఞానం! అతని హృదయంలో ద్వేషభావాలు చెలరేగాయి— ఈ అవమానాన్నెందుకు సహించాలి. తన స్వంతబొతురుకంటేకూడా చిన్నపిల్లచేత చెవులు మెలివేయించుకోటమా? వయస్సులోకూడా అభిమానముంది. అది చెమటోడ్చి సంపా

దించిన ధనంవల్ల కలిగే అభిమానాలకేమీ తీసిపోదు. గౌరవం, ప్రతిష్ట తన జన్మ హక్కని భావిస్తుందది. అందుకు బదులుగా అవమానం పొందినప్పుడు తల్లడిల్లి పోతుంది.

ఘూరా టీ టేబిల్ తెచ్చిపెట్టాడు. కాని కళ్ళలో ద్వేషం రగులుతూనే ఉంది.

"వెళ్ళి బైరాతో రెండు కప్పులు టీ ఇచ్చిపొమ్మనిచెప్పు" ఆజ్ఞాపించింది వేణీ.

ఘూరా వెళ్లిపోయినాడు. బైరాకు ఆ మాట చెప్పి, తన ఏకాంతకుటీరానికి వెళ్ళి భోరున విలపించాడు. యజమానురాలే జీవించి ఉంటే, ఈరోజు ఇలాంటి అవమానం జరిగేదేనా?

బైరా టీ తెచ్చి టేబిల్ మీద ఉంచాడు. "పతివ్రతలుగా ఉండేది స్త్రీలే కాదనీ, పురుషుల్లోకూడా పత్నీవ్రతులుంటారనీ ఇప్పుడే తెలుస్తోంది" టీ కప్పు సంత్ కుమార్ కందిస్తూ పరిహాసంగా అన్నది వేణీ.

"కనీసం అలాగే నాటక మాడుతుంటారు" సంత్‌కుమార్ ఒక గుటకవేసి అన్నాడు.

"అది నేను నైతిక బలహీనతంటాను. ఎవరినైనా హృదయపూర్వకంగా ప్రేమిస్తుంటేనే ప్రేమిస్తున్నా ననాలి—లేదూ స్పష్టంగా బయటపడాలి. నేను వివాహాన్ని ప్రేమబంధంగా భావిస్తాను. ధర్మ నిర్బంధమన్నా, సాంప్రదాయ నిర్బంధమన్నా పరమ అసహ్యం నాకు."

"ఐనా అందుకూ పురుషులే ఆక్షేపించబడుతున్నారు" వేణీ త్రుళ్ళిపడ్డది. విషయం స్త్రీ పురుష జాతి సమస్యగా పరిణమిస్తోంది.

ఇప్పుడామె తన జాతి పక్షం వహించక తప్పదు—అయితే మీరు నాచేత పురుషులందరూ దేవతాస్వరూపులని ఒప్పించా లనుకుంటున్నారా? మీరు ప్రకటించే నిజాయితీకూడా హృదయపూర్వకమైంది కాదు; లోక నిందకు భయపడి మాత్రమే. ఇది నిజాయితీ అనను నేను. తేలును దాని కొండె విరిచివేసి సంపూర్ణ శాంతిజీవిగా చెయ్యవచ్చు. కాని అందువల్ల తేళ్ళకుండే విషతత్వం నశించదు."

"ఎక్కువమంది స్త్రీల పాతివ్రత్యంకూడా లోకనిందకు భయపడేనని నేనంటే తమ రేమంటారు?" తన ఓటమి నంగీకరిస్తూనే అన్నాడు సంత్‌కుమార్.

"నే నామాట యెన్నటికీ అంగీకరించను" వేణీ కప్పు టేబుల్ మీద ఉంచుతూ అన్నది.

"ఎందుకనో?"

"పురుషుడు స్త్రీలకు మరో ఆధారం మిగలనిస్తేగా! పాతివ్రత్యధర్మంవాళ్ళకు ఘోరాతిఘోరంగా ఇంజెక్టు చెయ్యబడ్డది. ఇక కుల స్త్రీ తమ వ్యక్తిత్వమంటూ మిగిలితేగా! ఆమె కేవలం పురుషుడిమీద ఆధార పడిమాత్రమే జీవించ గల్గుతుంది.

ఆమె కిక స్వతంత్రవ్యక్తిత్వమనేది పూజ్యం. అవివాహితుడైన పురుషుడు హాయిగా తింటాడు; తిరుగుతాడు; మీసం మెలివేస్తాడు. కాని అవివాహితురాలైన స్త్రీ ఏడుస్తుంది; మొత్తుకుంటుంది. తన్ను తాను ప్రపంచంలోకల్లా నికృష్టజీవి ననుకుంటుంది. ఇదంతా పురుషుల అపరాధమే. దీనికి విడిచిపెట్టటాని కష్టంలేని పురుషులు కాబట్టిగా మీరు పుష్పను వదిలివెయ్యండి!"

"మీరు నామీద అన్యాయమైన ఆరోపణ చేస్తున్నారు. నేను పుష్పను వదిలిపెట్టటంలేదంటే, ఆమె జీవితం నాశనమౌతుందేమోనన్న బెంగచేతగాను. నేనామెను వదిలేస్తే ఇతరులతో పాటు తమరూ నన్ను చిన్నచూపు చూస్తారు" ఎంతో బాధ పడుతూ అన్నాడు సంత్‌కుమార్.

"నా విషయంలో మట్టుకు నిశ్చింతగా ఉండండి" చిరునవ్వుతో అన్నది వేణీ. కాని మరుక్షణంలోనే గంభీరంగా అన్నది -"కాని నేను మీ చిక్కులేమిటో అర్థం చేసుకోగలను."

''మీ ముఖతా ఈ మాటలు విని నాకెంతో సంతృప్తి కలిగింది. నేను వాస్తవంగా మీదయకు పాత్రుణ్ణి. దానవసరం ఎప్పుడైనా కలుగుతుందేమో!"

"మీరంటే నాకు నిజంగా జాలివేస్తుంది. ఏదోవిధంగా ఒకరోజు ఆమెకు నన్ను పరిచయం చెయ్యకూడదూ! బహుశా నేను ఆమెను దారికి తేగలుగుతానేమో!"

ఈ ప్రతిపాదనతో ఆయువుపట్టులో గాయపడ్డవాడిలాగా వెలవెల బోయినాడు సంత్‌కుమార్.

''ఆమె దారికి రావటం అసంభవం మిస్ త్రివేణీ! ఆమె ఎదురుమిమ్మల్నే విమర్శిస్తుంది. మీ విషయంలో ఎన్నెన్ని దుష్టకల్పనలు చేస్తుందో చెప్పలేం. ఇక నేను ఇంట్లో ఉండటమే దుర్భరమైపోతుంది తెప్పరించుకుని అన్నాడు సంత్‌కుమార్

''అయితే ఆమెను నేను కలుసుకు తీరతాను" వేణీ సాహసిక హృదయం ఉత్తేజితమైంది.

''అలా అయితే బహుశా నే నిక్కడకు వచ్చే అవకాశం కూడా లేకుండా చేస్తారన్నమాట."

''అలా ఎందుకు జరగాలి?''

''ఆమె మీ సానుభూతి పొందటం, మీరామెను సమర్థించటం సంభవించవచ్చు.''

''అయితే యక్స్‌పార్టీ డిక్రీ ఇచ్చెయ్యాలనా మీ కోరిక?''

''నేను కేవలం మీ దయ, సానుభూతిమాత్రమే కోరుతున్నాను. మీతో నా మనోవ్యథంతా వెళ్ళబోసుకుని హృదయభారం తగ్గించుకోవాలని నా కోరిక. నేను మీ ఇంటికి వస్తూపోతూ ఉన్నానని తెలిస్తే, మరో క్రొత్త రగడ ప్రారంభించిందన్నమాటే.''

''అయితే మీరు ఆమె కింతగా భయపడతారేం? అసలు భయపడవలసింది నేనూ!'' సూటియైన వ్యంగ్యంతో అన్నది వేణి.

''నేను మీగురించే భయపడుతున్నాను. నా కోసం కాదు'' మరెంత చొరవ తీసుకుని అన్నాడు సంత్‌కుమార్.

''అక్కరలేదండీ! మీరు నా కొరకేమీ భయపడనక్కరలేదు'' నిర్భయంగా అన్నది వేణి.

''నేను జీవించి ఉండగా నావల్ల మీకు అపనింద రావటం సహించలేను.''

''నాకు భావుకత్వం గిట్టదని మీకూ తెలుసుగా!''

''ఇది భావుకత్వం కాదు; నా స్వచ్ఛమైన మనోభావాలివి.''

''స్వచ్ఛమైన భావాలుగల యువకులను చాలా తక్కువమందిని చూచాను నేను.''

"ప్రపంచంలో అన్నిరకాలవాళ్ళూ ఉంటారు."

"ఎక్కువమంది వేటగాళ్ళ బాపతే. స్త్రీలలో వేశ్యలు మాత్రమే వేటాడుతారు. పురుషుల్లో నూటికి నూరుగురూ వేటగాళ్ళే. "పొరపాటు. అందులో చేరనివాళ్ళుగూడా ఉంటారు."

"స్త్రీ సౌందర్యం చూడదు. పురుషు డెప్పుడూ సౌందర్యం వెంటబడతాడు. అందుకనే పురుషుణ్ణి విశ్వసించటానికి వీల్లేకుండా ఉంది. నా వద్దకు సౌందర్యోపాసకు లెందరో వస్తుంటారు. బహుశా యిప్పుడు గూడా యే మహాశయుడైనా వస్తూ ఉండవచ్చు. నేను రూపసి నన్నమాట నిజమే. ఈవిషయంలో మొగమాట పడవలసిం దేమీలేదు. కాని ఎవరైనా కేవలం సౌందర్యంకోసం నన్ను ప్రేమించటం నా కెంతమాత్రం యిష్టంలేదు."

"మీరు నన్ను వాళ్లలో ఒకనిగా పరిగణించటం లేదు గదా?" కంపితహృదయంతో ప్రశ్నించాడు సంత్‌కుమార్.

"మిమ్మల్ని నా ప్రేమికుల్లో ఒకరుగా పరిగణించటమే లేదు!" చమత్కారంగా అన్నది వేణి.

"అది నా దురదృష్టం" తల వంచుకుని అన్నాడు సంత్‌కుమార్.

"మీ రా మాట హృదయపూర్వకంగా అనటంలేదు. మిమ్మల్ని నేను అర్థం చేసుకోలేకపోతున్నాను. మీరు చాలా నిగూఢ హృదయులని తోస్తున్నది."

"సరిగ్గా యిదే అనుకుంటుంటాను మిమ్మల్ని గురించి."

"నే నేమీ రహస్యాన్ని కాదు. నా హృదయాంతరాళంలో నిద్రావస్థలో ఉంది నా ప్రేమ. దాన్ని జాగృతం చేయగల వ్యక్తికోసం వెదకులాడుతున్నాను. ఈ విషయం నేను విస్పష్టంగానే చెబుతున్నాను. నిజమే! నా ప్రేమ అడుగున ఎంతో అగాధంలోఉంది. అగాధ సంద్రంలో మునకలు వేయగలవానికే లభిసుందది. మీలో ఎప్పుడూ నా కా తహ తహ కనిపించలేదు. ఇంతవరకూ నేను జీవి

తంలో వెలుగు భాగమే చూచాను. ఇక దాంతో విసుగెత్తిపోయాను. త్యాగం. ఆవేదన, ఆత్మ సమర్పణ చిందులాడే జీవితంలోని చీకటికోణాన్నికూడా తర్కించా లనుంది. ఆ జీవితం అంటే చాలా త్వరలోనే అసహ్యం కలుగవచ్చు, కాని, ఉన్నత పదవిలోని బానిసత్వంగానీ, చట్టసంబంధమైన మోసంగానీ, వ్యాపారం పేరుతో జరిగే దోపిడీగానీ, జీవనాధారంగా చేసుకోటానికి నా హృదయం అంగీక రించదు. శ్రమ, త్యాగాలతో నిండిన జీవితమే నాకు వాస్తవికమైన దనిపిస్తున్నది. సంఘమూ, దేశమూ ఈనాడున్న పతనావస్థను గురించి పట్టించుకోకుండా ఉండటం కంటే అవివేకం లేదు. ఒక్కొక్కసారి నన్ను చూస్తే నాకే అసహ్యం వేస్తుం టుంది? నాన్నగారికి తన చిన్నకుటుంబంకోసం వెయ్యిరూపాయలు పుచ్చుకోటానికి హక్కెక్కడిది? నే నీ విధంగా పనీ, పాటూ లేకుండా యింత విశ్రాంతిగా ఉండేం దుకు నాకే మధికార ముందీ; కాని, యిదంతా తెలిసిగూడా నాకు పనిచేసే శక్తి లేదు. ఈ భోగవిలాసాల జీవితం నన్నుగూడా సోమరిగా తయారుచేసింది. నా స్వభావంలో ధనికతత్వం ఎంతగా ఉందో మీరు గ్రహించే ఉంటారు మా నోటి నుండి మాట బయటికివచ్చిన మరుక్షణంలో నాకోరిక నెరవేరకపోతే పిచ్చెత్తి పోతుంది నాకు. బుద్ధికి మనస్సుమీద ఏమాత్రం కంట్రోలు లేదు. మాటిమాటికీ నిషేధించినా త్రాగుడు మానలేని త్రాగుబోతు స్థితిలో ఉన్నాను. ఆ త్రాగుబోతు మాదిరే నా యిచ్ఛాశక్తి విశృంఖలమై పోయింది."

ప్రతిభావంతమైన వేణీ వదనంలో తరుచు చంచలత్వం చిందులాడుతుండేది. ఆమెతో మనసులో మాట చెప్పటానికి జంకుజంకుగా ఉండేది..ఎందువల్లనంటే ఆమె సానుభూతిగా వింటానికిబదులు వ్యంగ్యోక్తులు విసరుతుందేమోనని సందేహంగా ఉండేది. కాని, యీ సమయంలో ఆమె అంతరాత్మ మాట్లాడుతున్న దనిపించింది. ఆమె కళ్ళు చెమ్మగిల్లినాయి ముఖంలోనిశ్చింతతో కూడిన వినయం, సుకుమారం వికసించింది. ఆమె విగ్రహం సడలిపోవటం గ్రహించాడు సంత్‌కుమార్. చాలా సేపటికి హఠాత్తుగా దాత దర్శనం లభించిన బిచ్చగాడు తన గోడుచెప్పుకునేందుకు, ఆరాటపడ్డట్టుగా ఉంది సంత్‌కుమార్ స్థితి.

"ఎన్నోసార్లు సరిగ్గా యిలాంటి అభిప్రాయాలే నాకూ కలిగాయి. నే ననుకున్నదానికంటే మీకు మరింత సన్నిహితంగా ఉన్నాను నేను" అన్నాడు సంత్‌కుమార్.

"మీ రెప్పుడూ నాతో అనలేదే" సంతోషంతో అన్నది వేణీ.

"మీరుకూడా ఈ రోజేగా మనసు విప్పటం."

"మీ ఉనికేమో యింత తీవిగా ఉంటుంది; కాని, కబుర్లేమో అలా చెబుతుంటారని లోకు లాక్షేపిస్తారేమో నని నాకు భయంగా ఉంటుంది. నా ధనికత్వపు అలవాట్లు వదిలించుకునేందుకేమైనా ఉపాయాలుంటే అవి తప్పక అమలులో పెడ

తాను. ఈ విషయానికి సంబంధించిన పుస్తకాలేమైనా మీవద్ద వుంటే నాకివ్వండి. మీరు నన్ను తమ శిష్యురాలిగా స్వీకరించండి."

సంత్ కుమార్ రసికభావంతో అన్నాడు—"నేనే మీ శిష్యుణ్ణికాబోతుంటే।" అంటూ ఆమెవైపు భావయుక్తమైన చూపులు ప్రసరించాడు.

వేణీ రెప్పలు వాల్చలేదు. "మీరు పరిహాస మాడుతున్నారు. నాకు క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొనగలిగే శక్తి సమకూర్చండి. నేను స్త్రీనిగాకపోతే యింత బలహీనురాలను కానుగదా అని మాటిమాటికి విచారంగా ఉంటుంది నాకు" సంత్ కుమార్ చెయ్యిపట్టుకుని అన్నది వేణీ.

ఈరోజు సంత్ కుమార్ కు తెలియకుండా ఏ విషయమూ దాచిపెట్టాలన్న ఉద్దేశం ఆమె కేమి ఉన్నట్లులేదు. ఆమె ఎంతో కాలంనుండీ శోధిస్తున్న ఆధారం అకస్మాత్తుగా లభించినట్లుగా ఉంది ఆమెకు.

"పురుషులకంటే స్త్రీలే సాహసంగలవాళ్ళు మిస్ త్రివేణీ।" కఠిన స్వరంతో అన్నాడు సంత్ కుమార్

"సరేగాని చేతనైతే ఈ లోకంలో వున్న వ్యవస్థ మొత్తం మార్చివేద్దామని పించటం లేదా మీకు?"

పరిశుద్ధ హృదయంనుండి వెలువడిన యీ ప్రశ్నకు కృత్రిమ సమాధాన మివ్వటానికి సంత్ కుమార్ హృదయం కంపించిపోయింది.

"అబ్బ। ఏమనిచెప్పను! మానవుడొక నిట్టూర్పువిడిచి స్తంభించిపోతాడు" అన్నాడు సంత్ కుమార్.

"నేను తరచు రాత్రులు యీ ప్రశన్ను గురించే ఆలోచిస్తూ, ఆలోచిస్తూ నిద్రపోతాను. ఆ స్వప్నాలే చూస్తుంటాను. లోకంలో జనమెంత స్వార్థులుగా జీవిస్తున్నారో చూడండి. సంఘాన్ని మొత్తం ఉద్ధరించ గలిగిన సాంఘిక వ్యవస్థ కొద్దిమంది వ్యక్తుల స్వార్థం కారణంగా అణగి పడుంటున్నది."

"దానిరోజు వచ్చేస్తోంది।" చిన్నబోయిన వదనంతో అన్నాడు సంత్ కుమార్, అని లేచి నుంచున్నాడు. అక్కడి వాతావరణంలో ఆయనకు శ్వాస ఆగిపోతున్నట్లుగా ఉంది. ఈ నిష్కల్మష, సరళ వాతావరణంలో తన నీచత్వాన్ని గ్రహించిన ఆయన కల్మష హృదయం కుంచించుకుపోతోంది. ధర్మనిష్ఠగల వ్యక్తి హృదయంలో అధర్మపు ఆలోచన ప్రవేశించినా ఆ ఆలోచనకు యింకా స్థిరమైన పునాది లభించనట్లుగా ఉంది సంత్ కుమార్ స్థితి.

"ఇంకా సేపు కూర్చోరూ?" బలవంతం చేసింది, వేణీ.

"నేటికి సెలవివ్వండి; తిరిగెప్పుడన్నా వస్తాను."

"ఎప్పుడు వస్తారూ?"

"త్వరలోనే వస్తాను."

"నేను తమ జీవితం సుఖవంతం చెయ్యగలిగితే ఎంత బాగుంటుంది!"

సంత్‌కుమార్ బంగళాపంచలోనుండి ఒక్క గంతులో క్రిందికివచ్చి ఆవరణ దాటి వెళ్ళిపోయాడు. వేణీ వసారాలో నుంచుని ప్రణయ దృక్కులతో చూస్తూ నిల్చుండిపోయింది. ఆమెది గట్టిగుండె; చంచల స్వభావం గలది. రూపగర్విత. చతురురాలు. ఎవరినీ లెక్కజేసేదిగాదు. ప్రేమ నటించి ఆమె నెవరూ మోసం చెయ్యగలిగేవాళ్ళుకారు. అనేక మంది వేశ్యల్లో వారి వ్యాసంగా లన్నిటిమధ్యా భక్తిభావం గుప్తంగా వున్నట్లుగానే వేణీ హృదయంలోగూడా సమస్త అపనమ్మకాలమధ్య కించిత్ నమ్మకం గుప్తంగా స్థానం సంపాదించింది. దాన్ని స్పర్శించ గలిగిన నేర్పుగల వ్యక్తి ఆమెను మూర్ఖురాలిని చెయ్యగలడు. ఆ కోమల స్థానం స్పృశించబడిన మరుక్షణమే ఆమె నిరాడంబరమూ, సరళమూ, విశ్వాసపూర్ణమూ అయిన పిరికి పిల్లగా మారిపోయేది. ఈరోజు దైవికంగా సంత్‌కుమార్ ఆ స్థానం సంపాదించాడు. ఇక వేణీని ఆయన తన యిష్ట మొచ్చిన వైపుకు తీసుకుపోవచ్చు. మెస్మరిజానికి గురైనదా అనిపిస్తున్న దామె స్థితి. ఇప్పుడామెకు సంత్‌కుమార్‌లో దొసగులేమీ కనబడటంలేదు. ఆ దౌర్భాగ్యపు పుష్ప ఈ సత్పురుషుని జీవితం ఎంత ధ్వంసం చేస్తోంది! ఆయనకు ఉత్సాహమిస్తూ అన్ని వేళలా ఆయన్నంటి పెట్టుకు తిరిగే సహభాగిని కావా లాయనకు. తాను ఆయన జీవితానికి రాహుగ్రహంగా తయారై సంఘానికెంత అనిష్టం కలిగిస్తుందో పుష్పకు తెలియదు. మరి యిటువంటి పరిస్థితుల్లోకూడా సంత్‌కుమార్ ఆమెను మెడకు గట్టు కున్నాడంటే అది దేవత్వానికేమీ తీసిపోదు. ఆయనకు వేణీ ఎలా సేవ చెయ్యగలుగుతుంది; ఏ విధంగా ఆయన జీవితం సుఖవంతం చెయ్యగలుగుతుంది!

## 4

సంత్‌కుమార్ యిక్కడినుండి వెళ్ళేటప్పుడు అతని హృదయం గగన మండలంలో విహరిస్తోంది. ఇంత శీఘ్రంగా దేవి తనకు వరం ప్రసాదిస్తుందని ఆశించలే దతను; అదృష్టం కలిసొచ్చింది. కాకుంటే మహా మహావాళ్ళనే నాట్యం చేయించే యువతి అతనియెడల ఎందుకంత భక్తిశ్రద్ధలు ప్రదర్శిస్తుంది? ఇక ఆతను జాగుచేయకూడదు. వేణీ ఎప్పుడు ఎదురు తిరుగుతుందో ఎవరికి తెలుసు! మరో రెండు మూడు సమావేశాల్లోనే అలా జరగబోతుంది. వేణీ అతన్ని కార్యక్షేత్రంలో ముందంజ వేయమని ప్రోత్సహిస్తుంది. అప్పుడతను వెనకాడుతాడు. అక్కడే విభేదాలేర్పడుతాయి. అక్కడనుండి సంత్‌కుమార్ తిన్నగా సిన్హా యింటికి వచ్చేశాడు. సాయంత్రమైంది. మంచు కురవటం ప్రారంభమైంది. మిస్టర్‌సిన్హా టాయి

లెట్ అయి ఎక్కడికో వెళ్ళటానికి తయారైనాడు. ఇతన్ని చూడగానే ప్రశ్నిం చాడు-

"ఎక్కడినుండి రావటం?"

"అక్కడినుండే. ఇవ్వాళ వశీకరణ జరిగిపోయింది."

"నిజం!"

"ఔనోయ్! ఆమెపై నేను మంత్రదండం ప్రయోగించేశాననుకో!"

"ఇక లెక్కేమిటి? పందెం గెలిచావన్నమాటే. అయితే మీ నాన్నతో యివ్వాళే ప్రస్తావించు."

"తమరుకూడా నా వెంట రావాలి మరి!"

"సరేలే! నేనూ వస్తాననుకో. కాని నువ్వు మంచి అదృష్టవంతుడవోయ్. నా విషయమే గొడవగా ఉంది. ఆ మిస్ కామత్ లేదూ: ఆమె నిజంగానే నేను ప్రేమిం చానని కలలుగంటున్నది. నే నేమో నాటకమాడుతున్నాను. కాని, ఆమె తనను నిజంగానే ప్రేమిస్తున్నానని భ్రమపడుతోంది. ఇప్పుడామె వ్యవహారం చూశావా; గర్వంతో భూమిమీద నిలవటంలేదు. కాని ఒక సంగతి. ఆ అమ్మాయి చాలా తెలి వైంది. నేనామె స్వాధీనంలోనుండి జారిపోతానేమో అని భయం ఆమెకు. అందు వల్లనే నన్ను చాలా మర్యాదచేస్తుంది. కృత్రిమ అలంకారాలతో సహజంగా ఉన్న లోటును వీలైనంతవరకూ పూడ్చాలని విశ్వ ప్రయత్నం చేస్తుంది. తగినంత ధనం లభిస్తే వివాహం చేసుకుంటే ఏమని ఆలోచిస్తున్నాను."

"ఆమె ముఖం చూస్తేనే నీకు చెడ్డ మంటగా ఉండేదిగా!" ఆశ్చర్యంగా అన్నాడు సంత్‌కుమార్.

"ఔను! ఇప్పుడూ అంతే! కాని డబ్బు షరతొకటి చెప్పానుగా! డాక్టర్ గనుక యిరవై యిరవై అయిదువేలు గనుక ముట్టజెప్తే వివాహం చేసుకుంటాను. పెళ్ళి చేసుకున్నంతమాత్రాన ఆమెకేమీ అమ్ముడుపోవటం లేదుగా!"

మరుసటిరోజు మిత్రు లిద్దరూ తమ అభిప్రాయాలు దేవకుమార్ ముందుం చారు. ఒక నిమిషంవరకూ దేవకుమార్ తన చెవులను తానే నమ్మలేకపోయినాడు. ఆయన తన జీవితం స్వతంత్రంగానూ, నిర్భయంగానూ, నిష్కపటంగానూ గడి పాడు. కళాకారుల్లో సహజంగా వుండే ఒక విధమైన ఆత్మాభిమానం నిరంతరం ఆయనకు దిలాసా కలిగించేది. ఆయన కష్టాలుపడ్డాడు. పస్తులున్నాడు. అవమానాలు సహించాడు. కాని, తన హృదయాన్ని ఎన్నడూ కలుషితం చేసుకోలేదు. జీవితంలో ఎన్నడూ కోర్టుముఖమైనా చూడలేదు. "నాతో ఈ ప్రతిపాదన ఎలా చెయ్యగలి గావా అని బాధగా వుంది. దీనికంటేకూడా ఇటువంటి కుటిలపు ఆలోచన నీ హృద యంలో కలిగినందుకు మరింత బాధగా వుంది" అన్నాడు దేవకుమార్.

''అవసరం అన్నీ నేర్పుతుంది. ఆత్మరక్షణ అనేది ప్రకృతిలో ప్రథమ నియమం. మీరు ఇరవై వేలకు తిలోదకాలిచ్చిన ఆస్తి ఇవ్వాళ రెండు లక్షలకు తగ్గదు" నిస్సంకోచంగా అన్నాడు సంత్‌కుమార్.

"అది రెండు లక్షలు కాదు; పదిలక్షలు జేస్తే మటుకేం? నాదృష్టికది ఆత్మవిక్రయసమస్య. నాలుగు రూకలకోసం నేను నా ఆత్మ నమ్ముకోలేను."

మిత్రులిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూచుకుని చిరునవ్వు నవ్వుకున్నారు. ఎంత పురాతనమైన తర్కం! ఎంత పనికిమాలిన తర్కం! అసలా ఆత్మ అనే పదార్థం ఎక్కడున్నది. ప్రపంచమంతా పచ్చి మోసంమీద నడుస్తుంటే ఇంకా 'ఆత్మ' ఎక్కడుంది? వందరూపాయ లప్పుపెట్టి వెయ్యిరూపాయలు గుంజటం అధర్మంకాదూ? చచ్చీచావకుండా పస్తులతో మలమలమాడే లక్షమంది కార్మికుల శ్రమఫలితం దోచుకుని, ఒక్క పెట్టుబడిదారు భోగవిలాసాలలో తులతూగటం అధర్మం కాదూ? ఒక పురాతనమైన కాగితపు అగ్రిమెంటు రద్దుకు ప్రయత్నించటం మాత్రం అధర్మ మౌతుందన్నమాట!

"మీరిది ఆత్మవిక్రయ మనుకున్నాసరే చేసితీరాలి. ఇదితప్ప మరో మార్గం లేదు. అదీగాక మీరీ విషయాన్ని ఇలాంటి దృక్పథంతో చూస్తారెందుకూ? సంఘానికి క్షేమకరమైనదే ధర్మం. సంఘానికి నష్టం కలిగించేదే అధర్మం. ఈ పనివల్ల సంఘానికి కలిగే మహాపకార మేమిటో సెలవిస్తారా?" కటువుగా అన్నాడు సంత్‌కుమార్.

''సంఘం తన కట్టుబాట్లమీద ఆధారపడివుంది. ఆ కట్టుబాట్లను బ్రద్దలుచేస్తే ఇక సంఘం అంతరించిందన్నమాటే!" సావధానంగా అన్నాడు దేవకుమార్.

ఇరువైపులా తర్క వితర్కాలు చెలరేగినాయి. దేవకుమార్ సాంప్రదాయాలూ, సిద్ధాంతాలూ, ధర్మసూత్రాలూ వల్లిస్తున్నాడు. కాని, ఈ యువకు లిద్దరి వాదనలముందూ ఆయన యే యుక్తీ నిలబడలేక పోయింది. ఆయన తన నెరసన గడ్డాన్ని చేతితో దువ్వుకుంటూనూ, బట్టతలను గోక్కుంటూనూ ఎన్నో దృష్టాంతాల నిస్తున్నాడు. కాని, ఈ యువకు లిద్దరూ వాటన్నిటినీ చిటికెలువేస్తూ దూది పింజలక్రింద ఎగరగొట్టేస్తున్నారు.

"బాబుగారూ! తమరు మాట్లాడేది ఏ కాలపు మాటలో అర్థం కావటంలేదు. చట్టంవల్ల మనం పొందగలిగిన ప్రయోజనమంతా పొందితీరాలి. ప్రయోజనం పొందగలందుకే ఆ సెక్షనులన్నీ ఉద్దేశించబడ్డాయి. ఈమధ్యనే వడ్డీవ్యాపారులనుండి జమీందార్ల ప్రాణాలు నిలబెట్టటానికి ప్రభుత్వం చట్టం చేసిన విషయం మీకూ తెలుసు. దాని ఫలితంగా ఎన్ని జాగీర్లు తిరిగి జమీందార్లకు సంక్రమించాయి? తమ రిది అధర్మమే నంటారా? చట్టసంబంధమైన సాధనాల ద్వారా మనం నెరవేర్చుకోగల్గిన పనులన్నీ నెరవేర్చుకోటమే లౌకికానికి అర్థం. ఇందులో నాకొచ్చేదీ, పొయ్యేదీ ఏమీలేదు. నాకే స్వార్థమూ లేదు. సంత్‌కుమార్ నా మిత్రుడు. ఇందువల్లనే తమ

క్కి విన్నపం చేస్తున్నాను. అంగీకరించటం, అంగీకరించక పోవటం మీ యిష్టం" నిర్మొగమాటంగా అన్నాడు సిన్హా.

"అయితే ఇంతకూ నే నేం చెయ్యాలనీ మీ రనేది!" గత్యంతరంతోచక అన్నాడు దేవకుమార్.

"ఏముంది! మేము చేసేపనికి విరుద్ధంగా తమ రేమీ చెయ్యకుండా ఉంటే అంతేచాలు"

"సత్యం ఖూనీ ఔతుంటే నేను సహించలేను."

"ఐతే మీరు నా చావు కళ్ళచూడవలసుంటుంది" కండ్లు పెద్దవి చేసి ఉద్రేక స్వరంతో అన్నాడు సంత్‌కుమార్.

సిన్హా సంత్‌కుమార్‌ను గదమాయిస్తూ అన్నాడు- "అనవసరమైన మాట లెందుకు సంత్‌కుమార్; బాబుగారికి రెండు మూడు రోజులు ఆలోచించుకునేందుకు అవకాశమివ్వు! ఇంకా నువ్వు తండ్రివి కాలేదు. కొడుకంటే తండ్రి కెంత ప్రాణమో ఏం తెలుస్తుంది నీకూ! ఆయనిప్పు డెంత కాదన్నా దావా దాఖలుచేసిన తరువాత, ఆయ నేం చేస్తారో చూడు మరి!.... మా ఫిర్యాదేమిటంటే బాబుగారూ! తమరు విక్రయదస్తావేజు వ్రాసేటప్పుడు తమ మానసిక పరిస్థితి సరిగాలేదనీ, యిప్పుడుకూడా అప్పుడప్పుడు తమ మతి భ్రమిస్తూనే వుంటుందనీ.... భారతదేశం లాంటి ఉష్ణదేశంలో ఈ వ్యాధి అనేకమందికి కలుగుతూనే వుంటుంది. తమకుకూడా కలిగిందంటే అందులో ఆశ్చర్య మేమీ వుండదు. మేము సివిల్ సర్జన్‌చేత ఈ విషయంలో సాక్ష్య మిప్పిస్తాం.''

"నేను జీవించివుండగా ఈ దుర్మార్గం జరగటానికి వీల్లేదు. నేనెంతమాత్రం అంగీకరించను. నేను చేసిన పనేదో బాగా ఆలోచించినమీదటే చేశాను; పరిస్థితుల వత్తిడివల్ల చేశాను. నే నందుకు ఎంత మాత్రం విచారపడటంలేదు. మీరు ఈ రకమైన దావాయే వేశారంటే అన్నిటికంటె తీవ్రమైన ప్రతిఘట నా నుండే యెదుర్కొనవలసి వొస్తుంది. నేను స్పష్టంగా చెబుతున్నా నీ విషయం" ఏకంగింపుగా అన్నాడు దేవకుమార్, అని ఉద్రేకంతో గదిలో అటూ యిటూ తిరుగసాగాడు.

సంత్‌కుమార్‌కూడా లేచి నుంచున్నాడు. "అయితే ఇదిగో! మీరు నా ఛాలెంజీ కూడా వినండి. మీరు తమ ధర్మరక్షణో లేక నా ప్రాణరక్షణో ఏదో ఒకటే చెయ్యగలుగుతారు మీరు మళ్ళీ నా ముఖం చూడబోరు" బెదరిస్తూ అన్నాడు.

"భార్యకంటే, బిడ్డలకంటేకూడా నాకు నా ధర్మమే ప్రియమైంది."

సంత్‌కుమార్‌ను ఆజ్ఞాపిస్తూ అన్నాడు సిన్హా— "వారి మానసిక పరిస్థితిలో మార్పు కలిగిందనీ, ఈ పరిస్థితిలో ఆయన ఏంచేస్తారో తెలియదుగనుక, ఆయన్ను తమ స్వాధీనంలో ఉంచుకోమని యివ్వాళ పిటీషను పెట్టేసెయ్"

"అయితే నేను పిచ్చివాణ్ణా!" పిడికిలి బిగించి క్రోధావేశంతో ప్రశ్నించాడు దేవకుమార్.

"ఔను తమరు పిచ్చివారే? తమ మెదడు అర్డరులో లేదు. పిచ్చి వాళ్లే యిలా మాట్లాడుతుంటారు. ఎవరినైనా కరవడానికి ఉరికేవాడుకాదు పిచ్చివాడు; మామూలు మనుష్యుల ప్రవర్తనకు విరుద్ధంగా ప్రవర్తించటంకూడా పిచ్చే."

"అసలు మీరే పిచ్చివాళ్ళు."

"ఆ నిర్ణయంచేసేది డాక్టరు."

"నేను డజనుల పుస్తకాలు వ్రాశాను. వేల ఉపన్యాసా లిచ్చాను. ఇది పిచ్చి వాళ్ళ పనేనంటారా?"

"చిత్తం! అదంతా పచ్చిఉన్మాదులపనే. రేపే తమ నీ యింట్లో త్రాళ్ళతో కట్టివెయ్యటం జరుగుతుంది."

"మీరు ముందు నా యింట్లో నుంచి వెళ్ళిపోండి. లేకుంటే తుపాకీతో కాల్చిపారేస్తాను."

"అచ్చగా పిచ్చివాళ్ళ బెదరింపే! సంత్‌కుమార్! ఆ దరఖాస్తులో వారి తుపాకీ స్వాధీనం చేసుకోవలసిందనీ, లేకుంటే ప్రాణాపాయమనికూడా వ్రాయి."

తరువాత మిత్రు లిద్దరూ లేచి వెళ్ళిపోయినారు. దేవకుమార్ ఎన్నడూ చట్టపు వలలో చిక్కుకున్నవాడుకాదు. ప్రకాశకులూ, పుస్తక విక్రేతలూ ఆయన్ను అనేకసార్లు మోసంచేశారు. కాని ఆయ నెప్పుడూ చట్టాన్ని ఆశ్రయించలేదు. ఆయన జీవిత పంథా యిది - తాను మంచి వాడైతే లోకమంతా మంచిదే! ఆయన అన్నివేళలా ఈ నీతినే పాటించాడు. కాని ఆయన అమాయకుడుగానీ, పిరికి పందగానీ కాదు. ముఖ్యంగా సిద్ధాంత విషయంలోమాత్రం రాజీఅంటే ఏమిటో ఎరుగడు. ప్రపంచం తల్లక్రిందులైనసరే ఆయన ఈ కుట్రలోమాత్రం భాగస్వామి కాడు. కాని వీళ్ళంతా ఏకమై నిజంగానే ఆయన పిచ్చివాడని రుజువుచేస్తారా? సిన్హా బెదరింపులో ఉన్న గట్టితనం నిర్లక్ష్యం చెయ్యదగిందికాదు. ఆయన పోకడ చూస్తే యిలాంటి ఎత్తుగడలలో బాగా ఆరితేరినవాడని తోస్తుంది. బహుశా డాక్టర్లను ఆకట్టుకుని నిజంగానే ఆయన్ను పిచ్చివాడని రుజువుపరుస్తారేమో! ఆయన ఆత్మాభిమానం గర్జించింది—— ఉహుఁ! ఎన్ని కష్టాలు పడవలసివచ్చినాసరే ఆయన అసత్యాన్ని ఆశ్రయించడు. డాక్టర్లుమాత్రం అంత గ్రుడ్డివాళ్ళా? ఆయన్ను ప్రశ్నించరూ? ఆయనతో సంభాషించరూ? ఏమీ చెయ్యకుండానే పిచ్చివాడని వ్రాసిపారేస్తారా? ఆయన మానసిక పరిస్థితిలో లోటు ఏర్పడిన లక్షణా లెక్కడా కనిపించటంలేదు. ఇదేమిటి! ఆయన కూడా ఈ కుట్రవాళ్ళ జిత్తుల్లో పడిపోయినాడే! ఆయనకు తన ప్రవర్తనలో పరివర్తనేమీ కనపడటంలేదు. ఆయన బుద్ధి సూర్యుని ప్రకాశంవలె నిర్మలంగా ఉంది. ఎన్నటికీ జరగ దలా. ఈ కుట్రకుంకల బెదరింపుల కాయ నేమీ లొంగడు.

కాని సంత్‌కుమార్‌కు ఈ స్వభావం ఎలా అబ్బిందా అని ఆయన మనస్సు మథనపడిపోతోంది. ఆయనకు తన తండ్రి గుర్తుకొచ్చాడు. ఆయనెంత సౌమ్యుడూ!

సత్యవ్రతుడూ! ఆయన మామగారు వకీలే మరి. కాని ఎంత ధర్మబుద్ధి! తానొక్కడు సంపాదించి కుటుంబాన్నంతా పోషించేవాడు. అన్నదమ్ములైదుగురి కుటుంబభారమూ ఆయనొక్కడు భరించేవాడు. తన కొడుకులూ, కూతుళ్ళ విషయంలో ఏ విషయంలోనైనాసరే పక్షపాతం చూపాడని, ఎవరనగలరాయన్ను! అన్నగారు భోజనం చేస్తేగాని ఆయన అన్నం ముట్టేవారు కాదు. అటువంటి వంశంలో సంత్‌కుమార్‌లాంటి దగాకోరు ఎక్కడనుండి దాపురించాడు! తాను అక్రమంగా ప్రవర్తించిన సందర్భం ఒక్కటిగూడా ఆయనకు గుర్తురావటం లేదు.

అలాంటప్పుడీ చెడ్డపేరు సహించటమెలా? తన ఇంట్లోనే ఆయన చైతన్యం కలిగించలేకపోతే, ఒక విధంగా ఆయన జీవితమంతా వ్యర్థమైందన్నమాటే. తన కత్యంత సన్నిహిత సంపర్కంలో ఉన్నవాళ్ళనే మానవులుగా మార్చలేకపోతే, జీవితపర్యంతం చేసిన తన సాహిత్య సేవతో ఎవరిని ఉద్ధరించినట్లు? ఈ దావా దాఖలైన తరువాత, తన ముఖమిక లోకాని కెలా చూపించగలుగుతాడు? ఆయన ధనం సంపాదించలేదు. కాని కీర్తిమాత్రం ఆర్జించాడు. అదికూడా తనకు దక్కకుండా పోతుందా; ఆయనకు తన ఆత్మసంతృప్తి కేమాత్రంకూడా మిగలదా? ఇంతటి ఆవేదన ఆయన ఎన్నడూ అనుభవించలేదు.

ఇదంతా శైవ్యాకు చెప్పి, తను ఆమె కూడా వ్యధకలిగించటమెందుకూ? ఆమె సుకుమార హృదయాన్ని గాయపరచట మెందుకూ? ఆ దుఃఖమంతా తానే సహిస్తాడు. దుఃఖపడుతున్నాననుకోవటం మాత్రం దేనికి? అనుభవాలకు మరో పేరే జీవితం. ఇదీ ఒక అనుభవమౌతుంది. కాస్త యిది కూడా అనుభవిద్దాంలే.

ఈ భావం కలుగగానే ఆయన మనస్సు తేలికపడ్డది. ఇంట్లోకవెళ్ళి పంకజను టీ తయారుచేయమన్నాడు.

"సంత్‌కుమార్ ఏమిటీ అంటున్నాడూ?" ప్రశ్నించింది శైవ్యా.

"ఏముంది! ఆ పాతపిచ్చే!" తన సహజ మందహాసంతో అన్నాడాయన.

"మీరు దేనికీ అంగీకరించలేముగదా?"

తన భార్య అనుకూలతను అర్థంచేసుకుని అన్నాడు దేవకుమార్– ''ఎన్నటికీ అంగీకరించను."

"వీడి పుర్రి కీ బుద్ధి ఎలా పుట్టిందో?"

"సామాజిక సంస్కారమే! ఇం కెలా పుట్టుంది!"

"వీడి సంస్కారమే యిలా ఎందుకు కావాలి? సాధూ లేడూ? పంకజ లేదూ? లోకంలో ధర్మమే నశించిపోయిందా?"

"మరీ మెజారిటీ యిలాంటివాళ్ళదే ! ఇదిమాత్రం తెలుసుకో."

ఆరోజునుండీ దేవకుమార్ షికారు కెళ్ళటంకూడా మానేశాడు. రాత్రింబవళ్ళు బయటికి ముఖం చూపకుండా యింట్లోనే కూర్చుండి పొయ్యేవాడు. కళంకమంతా తనకే అంటినట్లుగా ఉం దాయనకు. నగరంలోనూ, చుట్టుప్రక్కలా ఉండే

ప్రముఖులూ, మేధావంతులూ అయినవాళ్ళందరితోనూ ఆయనకు స్నేహమే. అందరూ ఆయన మంచితనాన్ని గౌరవించేవాళ్ళు. దావా దాఖలైనాసరే బహుశా ఆయ నేమీ జోక్యం కల్గించుకోరా అనిపిస్తోంది. కాని ఆయన హృదయం కలవర పడుతూనే ఉంది. తన అహంభావంవల్ల తన ఆప్తులైనవా రందరి మంచి చెడ్డలకూ తానే బాధ్యు డనుకుంటున్నా డాయన. లోగడ సూర్యగ్రహణ సందర్భంలో సాధు కుమార్ వెల్లువగా ప్రవహించే నదిలోకిదూకి, మునిగిపోతున్న ఒక వ్యక్తి ప్రాణం రక్షించాడు. అప్పుడాయనకు ఆ కీర్తి యావత్తు తానే పొందినప్పటికంటే కూడా మించిన ఆనందం కలిగింది. ఆయన కళ్ళల్లో నీళ్లు నిండినాయి. ఆయన మస్తకం మరింత ఉన్నతిమైనట్లూ, ముఖం తేజోవంతమైనట్లూ తోచింది. ఆ ప్రజలే సంత్ కుమార్‌ను రక రకాలుగా విమర్శిస్తుంటే, ఆయ నెలా వినగల్గుతాడు?

ఆ విధంగా ఒక నెల జరిగిపోయింది. సంత్‌కుమార్ దావా దాఖలుచేయలేదు. అటు సివిల్ సర్జన్‌ను లోబరుచుకోవాలి; ఇటు మిస్టర్ మల్లిక్‌ను కూడగట్టుకోవాలి. సాక్షుల్ని సిద్ధపరుచుకోవాలి. ఈ ఏర్పాట్లలోనే రోజులన్నీ గడిచిపోయినాయి ఇంకా పైకం వ్యవహారం ఉండనే ఉంది. దేవకుమార్ సహకరిస్తే అన్నిటికంటె పెద్ద దైన ఈ బాధ తప్పి పోయేది. కాని ఆయన ప్రాతికూల్యం సమస్యను మరింత క్లిష్టంచేసింది. సంత్‌కుమార్ అప్పుడప్పుడు నిరాశపడేవాడు. ఏంచెయ్యటానికి తోచేదికాదు. మిత్రులిద్దరూ దేవకుమార్ పైన పండ్లుకొరుకుతూ ఉండిపొయ్యే వాళ్ళు.

"ఈయన్ను తుపాకితో కాల్చిపారేద్దా మనిపిస్తుంది. ఈయన నాకు తండ్రి కాదు. శత్రువనిపిస్తోంది" అనేవాడు. సంత్‌కుమార్.

"నా హృదయంలో మటుకు ఆయనంటే ఎంతో గౌరవం ఏర్పడుతోంది. తన స్వార్థంకోసం మానవుడు నీచాతినీచమైన పనికూడా చేస్తాడు కాని త్యాగ ధనులనూ, సత్యవాదులనూ హృదయంలో మాత్రం గౌరవిస్తూనే వుంటాడు. ఆయన మీద నీ కింతక్రోధ మెలా కలుగుతుందో అర్థంకావటంలేదు. సత్యం కోసం ఎన్ని కష్టాలనైనా సహించగలవ్యక్తి పూజ్యుడన్నది గుర్తుంచుకో"నచ్చచెప్పేవాడు సిన్హా.

"ఇటువంటి మాటలతో నన్ను మరింత మండించబోకు సిన్హా! నీవు పూను కుంటే ఆ మహాత్ము డీ పాటికి పిచ్చి ఆసుపత్రిలో ఉండేవాడే. నీవింత భావుకుడ వన్న విషయం నాకు తెలియదు."

"ఆయన్ను పిచ్చి ఆసుపత్రికి పంపటం నువ్వను కున్నంత తేలిక కాదు. ఆపని చెయ్యవలసిన అవసరమూలేదు. మనం రుజువుచెయ్యదలచుకుంది విక్రయ దస్తావేజు వ్రాసినప్పుడు ఆయన తన స్వాధీనంలో లేడని. ఇందుకు సాక్షులు కావాలి. ఆ విషయం యిప్పటికీ అనుకూలపడలేదు. ఆ విషయం రుజువు చెయ్యటానికి డాక్టరు కావాలి. మిస్టర్ కామత్ కూడాఅలా వ్రాయటానికి సాహసించటం లేదు."

పండిట్ దేవకుమార్‌ను బెదరింపులతో లొంగదీయటం అసంభవం. కాని తర్కానికిమాత్రం తనంతట తానే లొంగిపోయేవాడు. ప్రస్తుతం ఆయన ఆలోచిస్తున్న సమస్య ప్రపంచంలో యీ అవినీతికి. అరాజకానికి కారణమేమి అనే కర్మ సంస్కారం. వీటి ఆధారంతో ఆయన కేమీ అంతు చిక్కటంలేదు. ఆత్మ పదార్థమంతా ఒకటే ననే సర్వాత్మవాదంకూడా ఆయన సందేహం తీర్చలేదు. ప్రపంచమంతా ఒకే ఆత్మ స్వరూపమైతే మరి యీ భేదా లేమిటి? జీవితమంతా ప్రేగులు తెంచుకు పాటుపడ్డా, ఆకలితో మలమల మాడుతున్నాడొకడు. కాలుమీద కాలువేసుకు కూర్చున్నా, పూలపాన్పుపై పొర్లాడుతున్నాడు మరొకవ్యక్తి. ఇది ఆత్మవాదమా? ఘోరాతిఘోరమైన అనాత్మవాదమా? బుద్ధిలా జవాబిచ్చేది-యిక్కడ అందరూ స్వతంత్రులే. అందరికీ తమ శక్తి సామర్థ్యాల ననుసరించి అభివృద్ధి అయ్యేందుకు అవకాశా లున్నాయి. కాని అనుమానం ప్రశ్నించేది—-అందరికీ సమాన అవకాశాలు యెక్కడ ఉన్నాయి? మార్కెటు ఏర్పాటుచేశారు తన యిష్టం వచ్చిన వస్తువు ఏది కావాలంటే అదే కొనుక్కోవచ్చు మార్కెటులో. కాని కొనేదెవరు? చేతి పైసా లున్నవాడేగా! మరి అందరివద్ద ఆ పైసాలు లేనప్పుడు అందరికీ సమానమైన అధికారాలున్నాయంటే ఎలా నమ్మటం? ఇలాంటి తీవ్ర మైన మానసిక సంఘర్షణ ఆయన జీవితంలో యెన్నడూ జరుగలేదు. ఆయన సాహితీ మేధస్సు. యిటువంటి వ్యవస్థతో సంతృప్తిపడటమే అసంభవం. కాని ఈ సమస్యను వ్యక్తిగత పరాకాష్ఠవరకూ తీసుకెళ్ళవలసినంతటి చిక్కు ఆయన కెప్పుడూ కలుగలేదు. ఇప్పు డాయన పరిస్థితి. నిత్యమార్గంలో పడివుండే యిటుక రాళ్ళ గుట్టలను చూస్తూగూడా. వాటిని తప్పించుకు నడిచే వ్యక్తిని పోలి వుంది. ఆ యిటుకరాళ్ళవల్ల రాత్రిపూట ఎంతమందికో దెబ్బలు తగులుతూవుంటాయి. ఎందరికో కాళ్ళూ, చేతులూ విరుగుతుంటాయి. కాని ఆ విషయం తప్పించుకుతిరిగే వ్యక్తి కేమీపట్టదు. కాని ఒకరోజు ఆ ఎదురుదెబ్బ తనకే తగిలి మోకాళ్ళు పగలటం జరిగినప్పుడు, అతని తప్పించుకు తిరిగే తత్వం ఎదురుతిరుగుతుంది. అప్పుడా వ్యక్తి ఆ రాళ్ళకుప్ప మొత్తం దారిలో నుండి లాగిపారవేయటానికి సిద్ధమౌతాడు. దేవకుమార్‌కు తగిలిన దెబ్బలాంటిదే. ఎక్కడుంది న్యాయం? ఏదీన్యాయం! ఒక పేదవాడు ఏ చేలోనో కంకులు నల్చుకుతింటాడు చట్టం అతన్ని శిక్షిస్తుంది. మరి శ్రీమంతుడు పట్టపగలే ఇతరులను దోపిడీ చేస్తాడు. కాని అతనికి బిరుదులు లభిస్తాయి. సన్మానాలు జరుగుతాయి. కొంతమంది రకరకాల ఆయుధాలతో వచ్చి అమాయకులూ, బలహీనులూ అయిన కూలిజనం మీద అత్యాచారాలుచేసి. తమ బానిసలుగా చేసుకుంటారు. భూమిపన్ననీ, వృత్తిపన్ననీ బండిపన్నని ఎన్నెన్ని పేర్లతో కొల్లగొడుతుంటారు జనాన్ని! కాని తా మేమో వందల, వేల జీతాలు కాజేస్తారు వేటాడుతారు డ్యాన్సులు చేస్తారు. భోగ విలాసాల్లో కులుకుతారు. భగవంతుడు సృష్టించిన ప్రపంచం యిదేనా? ఇదేనా మరి న్యాయం?

నిజమే! మహాత్ములు అన్ని కాలల్లోనూ వుంటారు. ఉన్నారుకూడాను. వారి కిప్పటికీ ప్రపంచం ధర్మానికీ, నీతికీ కట్టుబడే నడుస్తున్నట్లుగా కనపడుతుంది. వాళ్ళు తమ జీవితాలను ఆహుతిచ్చి ఈ లోకంనుండి సెలవుపుచ్చుకుంటారు. కాని వాళ్ళు మహాత్ము లెలా ఔతారు? వాళ్ళను పిరికిపందలనాలి; స్వార్థపరు లనాలి; కుక్షింభరు లనాలి. న్యాయ రక్షణకు ప్రాణాలర్పించేవాళ్ళే మహాత్ములు. తెలిసికూడా అజ్ఞానంగా తయారైనవాడు ధర్మపతితుడౌతాడు. అతని దృష్టికీ దుష్టవ్యవస్థ నికృష్ట మనిపించకపోతే ఆ వ్యక్తి అంధుడేకాదు; మూర్ఖుడు కూడాను. అంతే కాని మహాత్ము డెంతమాత్రం కాదు. అయినా యిక్కడ మహాత్ముల అవసరమేమీలేదు. అదృష్టమనీ, దేవుడనీ, భక్తి అనీ కల్లబొల్లి కల్పనలు వ్యాపింపజేసి, ఈ అవి నీతికి అమృతంపోసిందీ మహాత్ములే. మానవుడీపాటికి ఈ అవినీతినో లేక ఈ పరిస్థితుల్లో అంతరించటమే యింతకంటే మేలనిపించే ఈ సంఘాన్నో నిర్మూలిస్తే బాగుండును! కాదు! కాదు! మానవుల్లో మానవుడు రూపొందాలి, క్రూరమృగాలమధ్య వాటితో పోరాటానికి ఆయుధాలు ధరించాలి, క్రూరమృగాల పంజాదెబ్బల కెర గావటం మహత్త్వంకాదు; మూర్ఖత్వం ఇవ్వాళ ఈ జాగీరు దారులూ, మహారాజులూ తమ తాతముత్తాతల దోపిడీ సొత్తుతోనే ఆనందమనుభవిస్తున్నారు. అయితే ఆయన ఆస్తినంతా అమ్మటం పిచ్చిపని కాదూ మరి? పితరులకు పిండం వెయ్యటంకోసం గయకు వెళ్ళటం; మళ్ళీ అక్కడి నుండివచ్చి వేలు ఖర్చుపెట్టటం ఏమంత అవస రం? రాత్రులు మిత్రులతోకలిసి వేశ్యల పాటకచ్చేరీలలో గడపటం, నాటక సమా జాలు స్థాపించి, వేలకువేలు అందులో తగలబెట్టటం యివన్నీ అనివార్యమైన విష యాలా? అది తప్పకుండా ఉన్మాదమే. ఆయనకు తన పిల్లలనుగురించి ఆలోచన ఎందుకు కలుగలేదూ? ఆయనకు తేరగా ఆస్తి లభించింది; అనుభవించాడు ఏం? ఆయన కొడుకులుమాత్రం తేరసొత్తు ఎందు కనుభవించ గూడదూ? తన యౌవనో త్సాహాలను ఆయన అరి కట్టుకో లేకపోయినాడే; మరి ఆయన కొడుకులు తప సెందుకుచెయ్యాలి?

"ఈ అవినీతిపూరిత ప్రపంచంలో ధర్మాధర్మాల విచక్షణ శుద్ధ తప్పు; ఆత్మహత్యాకరం." చివరకు ఆయన సందేహాలన్నిటికీ ఈ దృఢనిశ్చయంతో ఓదార్పుకలిగింది. చట్టసంబంధమైన ఎత్తుగడలతో ఆస్తి సంపాదించటంలో వున్నంత మంచీ లేక చెడ్డా — జూదమాడిగానీ, పరుల దురాశా, వ్యామోహాలను ఉపయోగించుకునిగానీ ఆస్తి సంపాదించడంలో గూడా వున్నాయి. ఆ వడ్డీవ్యాపా రికి నిజంగానే తానొక ఇరవై వేల రూపాయలు బాకీపడ్డాడు. ఆ ఆస్తి అమ్మివేసి, అతని ఇరవై వేల రూపాయలు అతనికి చెల్లించగా, మిగిలిన సొమ్మంతా ఆయనకు లభించటం న్యాయం. నీతి వక్కాణించే దిదే. చట్టం రుణపీడితుల ఎడల ఈ మాత్ర మైనా న్యాయం చూపనప్పుడు, రుణపీడితులు కూడా చట్టంలో ఉన్నపేచీ లన్నీ ప్రయోగించి, వడ్డీవ్యాపారి నుండి తిరిగి తమ ఆస్తిని రాబట్టుకునేందుకు ప్రయ

త్నించవలసిందే. అందులో అధర్మానికి పాటుపడటంఅంటూ ఏమీలేదు. శాస్త్రమూ, నీతి, వీటికి సంబంధించిన ప్రతి కోణం నుండీ పరిశీలించిన పిమ్మటే ఈ నిర్ధారణకు వచ్చాడు దేవకుమార్. అది ఆయన హృదయంలో బాగా నాటుకుపోయింది. ఇక ఆయన ఎంత మాత్రం చలించడు. దీని ఫలితంగా చిరకాలంనుండీ ఆయనలో నాటుకుపోయిన సంస్కారాలకు ప్రమాదం వాటిల్లుతున్నప్పటికీ, ఆయనకు నవ జీవన సాధన కేదో తారకమంత్రం లభించిందా అన్నంత ఆనందంతో పుప్పొంగి పోయాడు.

"తమరు నా ఆస్తి తిరిగి యిచ్చివేయకపోతే నా కుమారులు తమ మీద దావా వేస్తారు" ఒకరోజు సేఠ్ గిరిధరదాస్ వద్దకు వెళ్ళి స్పష్టంగా చెప్పేశాడు దేవకుమార్.

గిరిధరదాస్ నవయుగానికి చెందినవ్యక్తి. ఆంగ్లభాషలో దిట్ట. చట్టసంబంధ మైన విషయాల్లో ఆరితేరినవాడు. రాజకీయాల్లో కూడాపాల్గొంటాడు. కంపెనీల్లో షేర్లుకొంటాడు మార్కెటు గిట్టుబాటుగా వుండటం కనిపెట్టి మరీ వ్యాపారం చేస్తాడు. ఒక పంచదారమిల్లు అచ్చంగా తనే నడిపిస్తున్నాడు. వ్యాపారమంతా ఇంగ్లీషువాళ్ళ పద్ధతుల్లో నడిపిస్తాడు. ఆయన తండ్రి మక్కూలాల్‌గూడా ఈ పను లన్నీ చేసేవాడే. కాని పూజలూ, పునస్కారాలతోనూ, దానధర్మాలతోనూ ప్రాయ శ్చిత్తం చేసుకునేవాడు. కాని గిరిధరదాస్ పచ్చిభౌతికవాది. ప్రతిపనీ వ్యాపార పక్కీలో చేసేవాడు. గుమాస్తాలకు జీతం ఫస్టు తేదీకల్లా ఇచ్చేసేవాడు. కాని మధ్యలో ఎవరికైనా డబ్బు అవసరం కలిగితే వడ్డీకిచ్చేవాడు. మక్కూలాల్ సంవత్సరమంతా జీతమే యిచ్చేవాడుకాదు. కాని గుమాస్తాలకు ఎప్పుడూఅడ్వాన్సుగా యిస్తుండేవాడు. లెక్కచూచు కుంటే వాళ్ళకు యివ్వవలసి రావటానికి బదులుతిరిగి వస్తు దేది. మక్కూలాల్ సంవత్సరానికి రెండు మూడుసార్లు అధికారుల దర్శనానికి వెళ్ళేవాడు. పూలబుట్టలూ, పళ్ళబుట్టలూ సమర్పించుకునేవాడు. చెప్పులు విడిచి మరీ గదిలోకి వెళ్ళేవాడు. చేతులు కట్టుకు నిలబడేవాడు. తిరిగి వచ్చేటప్పుడు అక్కడి నౌకర్లకు రెండు మూడు రూపాయలు మామూళ్ళిచ్చేవాడు. గిరిధరదాస్ మునిసిపల్ ఛైర్మన్. సూట్లూబూటూ ధరించి అధికారుల వద్దకు వెళ్ళేవాడు సమాన హోదాలో వ్యవహరించేవాడు తనను యాచించినవారిని ఎంతో దయగాచూచేవాడు. పండుగలకు యినాములిచ్చేవాడు. అవికూడా తనను బాగా పొగిడించుకున్నతర్వాతనే. తన హక్కులకోసం పోరాడటం, ఆందోళన చెయ్యటం ఎలాగో తెలుసు. ఆయన్ను మోసగించటం అసంభవం.

దేవకుమార్ కథనం విని, గిరిధరదాస్ విభ్రాంతుడైనాడు. ఆయన దేవకుమార్ నెంతో గౌరవించేవాడు, ఆయన పుస్తకాలు చాలా చదివాడు. ఆయన రచనల మొత్తం సెట్టు ఒకటి ఆయన గ్రంథాలయంలో వున్నది. ఆయన హిందీ భాషాభిమాని. అనేక

మార్లు నాగరీ ప్రచారిణీసభకు భూరివిరాళా లిచ్చివున్నాడు. పురోహితులూ, పూజారు లంటే మండిపడేవాడు. అసహ్యకరమైన దానధర్మాల సాంప్రదాయంపైన ఒక కర పత్రంకూడా అచ్చువేయించాడు. ఉదారమైన భావాలు కలవాడని నగరంలో ఎంతో ప్రతీతి. మక్కాలాల్, స్థూలకాయు డవటంవల్ల; తన చోటునుంచి చురుకుగా కదలగలిగేవాడు కాడు. కాని గిరిధరదాస్ గట్టివరుస మనిషి. నగర వ్యాయామశాల ముఖ్యుడేగాక బలవంతుడూ. మంచి విలుకాడు కూడాను!

ఒక నిమిషంవరకూ ఆయన దేవకుమార్ ముఖంవంక చూస్తూ ఉండిపోయి నాడు. ఆయన ఉద్దేశ మేమిటో అర్థమేకాలేదు గిరిధరదాస్‌కు. మళ్ళీ ఇలా అను కున్నాడు. పాపం ఆర్థిక చిక్కులతో బాధపడుతున్నాడు. అందుకనే మతికూడా చెడి పోయినట్లుంది. కాబట్టే అవకతవకగా మాట్లాడుతున్నాడు దేవకుమార్ ముఖంలో ప్రస్ఫుటించే విజయగర్వం చూచిన తరువాత ఆయన అభిప్రాయం మరింత బల పడింది.

తన బంగారు కళ్ళజోడు తీసి మేజామీద ఉంచి పరిహాసంగా అన్నాడు. "ఏమండీ! యింట్లో అంతా కులాసాగా ఉన్నారా?"

"చిత్తం! చిత్తం! అంతా తమ దయ" ద్వేషభావంతో అన్నాడు దేవకుమార్.

"పెద్దబ్బాయి 'లా' ప్రాక్టీస్ చేస్తున్నాడు కదూ?"

"చిత్తం !"

"కాని ప్రాక్టీస్ బాగా సాగటంలేదుకాబోలు: పాపం తమ పుస్తకాలు కూడా ప్రస్తుతం బాగా ఖర్చవుతున్నట్టులేదు. తమవంటి సరస్వతీపుత్రుల నీవిధంగా అనాదరణగా చూడటం నిజంగా మన దేశ దురదృష్టం. తమరు యూరపులోనే జన్మించి నట్లయితే. యివ్వాళ లక్షల కధికారులయ్యేవారు."

"నేను ధనలక్ష్మి ఉపాసకుణ్ణి కాదన్న విషయం తమకూ తెలుసు!"

"పాపం! తమరు ఆర్థికంగా యిబ్బందుల్లోనే ఉండుంటారు. తమరు నన్ను ఏ సాయం చెయ్యమన్నా చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాను. తమవంటి ప్రతిభా వంతులైనవారితో నాకు పరిచయ మున్నందుకు నే నెంతోగర్విస్తున్నాను. తమ కేదైనా సేవ చెయ్యటమంటే అది నాకెంతో గౌరవమైన విషయం."

ఇటువంటి సందర్భాల్లో దేవకుమార్ అత్యంత వినయమూర్తిగా మారిపోయే వాడు. భక్తి ప్రదర్శించీ. భూషించీ, ఎవరైనా ఆయన సర్వస్వం హరించగలిగేవాళ్ళు. అటువంటప్పుడు ఒక లక్షాధికారి—అందులోనూ సాహిత్యప్రియుడైన వ్యక్తి—ఆయన్నింతగా గౌరవిస్తున్నాడంటే యింకేం కావాలి! అతనితో ఆస్తి వ్యవహారాలూ లేక లావాదేవీలూ, వీటిని గురించి సంభాషించటం సిగ్గుచేటనిపించింది దేవకుమార్‌కు.

"నన్నింత గొప్పవాణ్ణిగా భావించటంలో తమ ఉదార హృదయం వెల్లడౌతోంది" అన్నాడు దేవకుమార్.

"తమరు ప్రస్తావించేది. ఏ ఆస్తి విషయాన్ని గురించో నాకర్థం కాలేదండీ" అన్నాడు గిరిధరదాస్.

"ఆ! అదేనండీ! సేఠ్ మక్కాలాల్ గారు నాచేత వ్రాయించుకున్నారే..." సంకోచిస్తూ అన్నాడు దేవకుమార్.

"సరె సరె! దాని విషయంలో ఏమైనా కొత్త సంగతు లున్నాయా?"

"ఆ వ్యవహారంలోనే పిల్లలు తమపై నేదో దావా వెయ్యబోతున్నారు. నే నెంతగానో నచ్చచెప్పాను. కాని వాళ్ళు వినటంలేదు; ఇందుకే నేను తమవద్దకు వచ్చాను. కొద్దోగొప్పో ముట్టజెప్పి రాజీపడండి వ్యవహారం కోర్టు కెక్కటం బాగుండదు. అనవసరంగా ఉభయులూ పెద్ద చిక్కులో బడతారు."

సుకుమారం, ఔదార్యం చిందులాడే గిరిధరదాస్ వదనం కఠోరంగా మారిపోయింది. 'నాగరికత' అనబడే మెత్తల్లో దాగిన వడ్డీవ్యాపారపు వాడిగోళ్ళు యీ భయం సోకిన మరుక్షణమే పదునెక్కి భయంకరంగా బయటపడ్డాయి.

"తమరు నాకు చెప్పటంకోసం శ్రమపడి ఇంత దూరం రావలసిన అగత్యమేమీ లేదు. ఆ కుర్రవాళ్ళకే నచ్చచెప్పి యుండవలసింది" కోపాన్ని అణుచుకుంటూ అన్నాడు.

"వాళ్ళకు నచ్చచెప్పటం అయిపోయింది."

"అయితే వెళ్ళి ప్రశాంతంగా విశ్రమించండి. నా హక్కుల కోసం ఎలా పోరాడాలో తెలుసు నాకు. వాళ్ళ పుర్రెలు "లా" చదివినందువల్ల ఏమైనా వేడెక్కి బాధపడుతుంటే, నా దగ్గర దానికి తగిన ఔషధముందిలెండి."

ఇక దేవకుమార్ సాహితీ సౌశీల్యం కూడా చలించకుండా ఉండలేకపోయింది. సమరాహ్వానాన్ని స్వీకరిస్తున్నట్టుగా అన్నాడు — "కాని ఆ యిలాకా యివ్వాళ రెండు లక్షలకు తక్కువ చెయ్యదని తమరు కొంచెం గుర్తుంచుకోవాలి."

"రెండు లక్షలు కాదు; పది లక్షలైనాసరే; దానితో తమ కేమీ సంబంధం లేదు."

"తమరు నాకిచ్చిందల్లా యిరవై వేలే."

"తమ రెప్పుడూ కోర్టుకు వెళ్ళినవారు కాకపోయినా, తమకీ మాత్రం 'లా' తెలుసుననుకుంటాను. ఒకసారి విక్రయమైపోయిన వస్తువు చట్టంప్రకారం తిరిగి

ఏ ధరకైనా వాపసు యివ్వబడదు. తమ క్రొత్త సూత్రాన్ని అంగీకరిస్తే, యిక ఈ నగరంలో వడ్డీవ్యాపారులే కంటపడరు.

కొంతసేపటివరకూ తర్క-వితర్కాలు సాగినాయి. కొట్లకుక్కల్లాగా ఆ పెద్ద మనుష లిద్దరూ కాండ్రు కాండ్రు మంటూనూ, కొక్కిరించుకుంటూనూ, విదిలించు కుంటూనూ గడిపారు. చివర కిద్దరూ పోట్లాడుకోటం జరగనేజరిగింది.

"తమ రిలా తయారవుతారనుకో లేదు" ఉగ్రుడై అన్నాడు గిరిధరదాస్.

"నేనూ తమ స్వార్థపుబొజ్జ ఇంత అగాధమైం దనుకోలేదు" బెత్తం పైకెత్తుతూ అన్నాడు దేవకుమార్.

"తమరు సర్వనాశనానికి సిద్ధమౌతున్నారు."

"ఏమీ మునిగిపోలేదులే."

దేవకుమార్ అక్కడినుండి వెళ్ళిపోయినాడు. ఆ మాఘ మాసపు చీకటి రాత్రిల ఘోరమైన చలిలోకూడా చెమట పోస్తోందాయనకు. ఇంతటి విజయగర్వం ఆయన జీవితంలో ఎన్నడూ కలుగలేదు. ఆయన తర్కంలో అనేకమందిని జయించాడు. కాని ఈ విజయం జీవితానికొక నూతన ప్రోత్సాహం లాంటిది.

ఆ రోజు రాత్రే సిన్హా, సంత్‌కుమార్ లిద్దరూ మరొక మారు దేవకుమార్‌ను ఒత్తిడిచేసి చూడాలని నిశ్చయించుకున్నారు. ఇద్దరూ వచ్చి అలా నుంచున్నారో లేదో దేవకుమార్ ప్రోత్సాహం నిండిన స్వరంతో అన్నాడు—మీరింత వరకూ దావా దాఖలు చెయ్యలేదే? అనవసరంగా ఎందుకీ జాగూ?"

నిరాశతో శుష్కించిన సంత్‌కుమార్ హృదయంలో ఉత్సాహం తుపానులాగా విజృంభించింది. అయితే భగవంతు డున్నాడా ఏమిటి? దేవుడంటే అతని కెన్నడూ విశ్వాసం కలుగలేదు. ఏదో దైవికశక్తి తప్పక ఉండి తీరాలి. బిచ్చమడగటానికి వస్తే కోరిన వరం లభించింది.

"మీ అనుమతికోసమే ఎదురుచూస్తున్నాం" అన్నాడు సంత్‌కుమార్

"నేను మహదానందంగా అనుమతిస్తున్నాను. నేను మిమ్మల్ని ఆశీర్వదిస్తున్నాను."

ఆయన గిరిధరదాస్‌తో జరిగిన మాటలన్నీ వివరించాడు.

"తమ ఆశీర్వాదం వుంటే మనం జయించామన్నమాటే. ఆయన తనడబ్బు చూసుకుని గర్వపడుతున్నట్లున్నాడు. కాని మనమూ ఏమీ గాజులు తొడుక్కు కూర్చోలా." నాసికా పుటా లుబ్బించి అన్నాడు సిన్హా.

భవన నిర్మాణం సగంవరకై పోయినంత సంతోషంగా ఉన్నాడు సంత్ కుమార్. "మీరు బాగా తగిన జవాబిచ్చారు" అన్నాడు.

"ఇటువంటి లక్షాధికారులను తైతెక్కలాడిస్తున్నాం మనం!" బిగించిన డోలుమీద దెబ్బకొట్టినట్లన్నాడు సిన్హా.

"మనిద్దరి బంగళాలూ యిక్కడే వేయిద్దాం. మిత్రమా" సంత్‌కుమార్ కలలు గనటం మొదలెట్టాడు.

"ఇక్కడెందుకు? సివిల్ లైన్సులో వేయిద్దాం!" అన్నాడు సిన్హా.

"షుమారు ఎన్నాళ్ళకు వస్తుంది తీర్పు?"

"ఆరు నెలల లోపు."

"నాన్నగారి పేర సరస్వతీ మందిరం కట్టించుదాం."

కాని దావాకు డబ్బెలాగనేది సమస్య. దేవకుమార్ ఆశలేని వ్యక్తి. ధనాన్ని ఆయ నెప్పుడూ ఉపాసించలేదు. కూడబెట్టటానికి తగినంత అధికమైనధనం ఆయన కెప్పుడూ లభించనే లేదు. ఏనెలలోనన్నా ఏ భై యాభైయలు మిగిలినా మరో నెలలో ఖర్చయిపోయేవి. తన పుస్తకా లన్నిటికీ కాపీరైటు విక్రయిస్తే ఆయనకు లభించింది అయిదువేల రూపాయలు. ఆ పైకం ఆయన పంకజ వివాహం నిమిత్తం అట్టిపెట్టాడు. ఇప్పుడిక ఏవిధంగానూ పెద్దగా ధనం లభించే లక్షణా లేమీ కనబడటంలేదు. సంత్‌కుమార్ యింటిఖర్చులు గడుపుతాడనీ, తానిక కొన్నాళ్ళు విశ్రాంతిగా కూర్చోటానికో, స్వేచ్ఛగా సంచారం చేయటానికో అవకాశం లభిస్తుం దనుకున్నాడు దేవకుమార్. కాని యింత పెద్ద ప్లాను వేసుకున్న తర్వాత, ఆయనిక విశ్రాంతిగా ఎలా వుండగలుగుతాడు? ఆయన భక్తుల జనాభా తగినంత పెద్దదే. ఆయన భక్తబృందంలో యిద్దరు మహారాజాలు కూడా వున్నారు; దేవకుమార్ తమ యింటికి వచ్చి ఆయన పాదపద్మాలతో తమగృహాలు పవిత్రం చెయ్యాలనీ, తమ భక్తిశ్రద్ధలను వారి పాదాలముందు సమర్పించుకోవాలనీ ఎంతో కాలం నుండీ వారి అభిలాష. కాని ఎప్పుడూ ఏ ఆస్థానంలోనూ అడుగుపెట్టని వ్యక్తి దేవకుమార్. అటువంటి వాడెప్పుడూ తన అభిమానులతోనూ, భక్తులతోనూ తన ఆర్థికస్థితికి సంబంధించిన గోడును వెళ్ళబోసుకోటం మొదలెట్టాడు. నోరు తెరచి సహాయం చెయ్యమని యాచిస్తున్నాడు. ఆయన ఆత్మగౌరవం ఏ సమాధిలోనో నిద్రపోయినట్లుగా వుంది.

మరి త్వరలోనే దాని ఫలితం గోచరమయింది. దేవకుమార్ డెబ్బయ్యవ జన్మదినోత్సవం బ్రహ్మాండంగా జరపాలనీ, ఆ సందర్భంలో ఆయనకు సాహిత్యాభి

మానుల తరపున ఒక 'పర్సు' బహూకరిస్తే బాగుంటుందనీ, ఒకభక్తుడు ప్రతిపాదించాడు. తన జీవితంలో నలభై సంవత్సరాలు సాహిత్యసేవకు అంకితంచేసిన మహారధు డాయన. అలాంటివానికి వృద్ధాప్యంలోకూడా ఆర్థికబాధలనుండి విముక్తి కలుగకపోవటం విచారకరమైన లజ్జాకరమైన విషయం కాదూ? సాహిత్య వికాసం మాటలతో జరుగుతుందా? మనం మన సాహిత్య నిర్మాతలను సరిగా సత్కరించటం నేర్చుకోనంతవరకూసాహిత్యానికి ఔన్నత్యం సమకూరదు. ఈ విషయాన్ని వార్తా పత్రికలు ముక్తకంఠంతో సమర్థించాయి. ఆశ్చర్యకరమైన విషయమేమంటే దేవకుమార్‌తో చాలాకాలంనుండి సాహిత్య స్పర్థగల మహానుభావులు గూడా ఈ సందర్భంలో తమ ఉదారతను ప్రదర్శించారు. విషయం బాగా వ్యాప్తమయింది, ఒక కమిటీ ఏర్పడింది. ఒక మహారాజా దానికి అధ్యక్షుడు. మిస్టర్ సిన్హా ఎన్నడూ దేవకుమార్ పుస్తకం ఒక్కటిగూడా చదివినవాడు కాడు. కాని ఈ ఉద్యమంలో ప్రముఖపాత్ర వహిస్తున్నాడు. స్త్రీలు పురుషులకంటే వెనుకబడియుంటే ఎలా మరీ? మిస్ కామత్, మిస్ మల్లిక్‌లు గూడా ఈ ఉద్యమాన్ని బలపరుస్తున్నారు. జ్యేష్ఠమాసంలో ముహూర్తం నిశ్చయమైంది. నగరంలోని ఇంటర్‌మీడియట్ కాలేజీలో ఈ ఉత్సవానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

చివరకారోజు వచ్చేసింది. నాటి సాయంత్రమే ఉత్సవం, దూర దూరాలనుండీ విచ్చేశారు సాహిత్యాభిమానులు. సౌరాష్ సంస్థాన యువరాజుగారు పర్సు బహూకరిస్తారు. "ఉపన్యాసాలుంటాయి. గాన కచ్చేరీ లుంటాయి. నాటకం ప్రదర్శిస్తారు, విందు జరుగుతుంది. కవిసమ్మేళనం జరుగుతుంది" ఈ రకమైన ప్రకటనలు నగరపు గోడలన్నిటిమీదా అంటించారు. నాగరిక సమాజంలో మంచి సంచలనం వ్యాపించింది. రాజుగారు సభాధ్యక్షులు.

దేవకుమార్‌కు తాను ప్రదర్శన వస్తువుగా తయారవటమంటే చెడ్డ అసహ్యం. బహిరంగసభలకు కూడా తరచు వెళ్ళేవాడుకాదు. కాని ఈరోజు క్రొత్త పెళ్ళికొడుకుగా తయారవక తప్పలేదు. సభకు వెళ్ళేసమయం సమీపిస్తున్నకొద్దీ, ఆయన మనస్సులో ఒకవిధమైన విషాదం అలముకొంటోంది: ఆ 'పర్సు' బహూకరించే సమయంలో ! ఆయన చేయి జాచి అందుకోబోయే ఆ దృశ్యం ఎంత లజ్జాకరంగా ఉంటుంది? డబ్బుకోసం ఎన్నడూ చేయిజాచనివ్యక్తి ఈ చివరి రోజుల్లో యితరులనుండి దానంపొందటమా? దీన్ని దానమనే అనాలి. మరేమీ కాదు.' ఒక్క నిమిషం ఆయన ఆత్మగౌరవం తిరుగుబాటు చేసింది. ఈ సందర్భంలో తాను 'పర్సు' స్వీకరించినదే తడవుగా, అక్కడికక్కడే ఏ ప్రజాసంస్థకో దాన్ని యిచ్చివేయటమే ఆయనకు శోభచేకూరుస్తుంది. ఆయన జీవితాదర్శాలకు ఆ పనే యోగ్యమైంది. అందులోనే ఉంది ఆయన గొప్పతనం. ఆయన మహాసభ పందిరిలోకి వచ్చినప్పుడు ముఖంలోకి ఉత్సాహరేఖలు లేవు. ఆయన కొంచెం సిగ్గుపడు

ితోచింది. కీర్తి కాంక్ష ఒకవైపుకూ, ఆశ మరొకవైపుకూ లాగుతున్నాయి.
ం దానంకాదనీ, హక్కనీ మనసు కెలా నచ్చచెప్పటం? చివరకు డబ్బు
ుగబడ్డాడని ప్రజలు పరిహసిస్తారు. ఆయన జీవితం బుద్ధిబలంమీద ఆధార
మరి బుద్ధి తానుచేసే ప్రతిపనినీ "నీతి అనే గీటురాయితో తరిచి మరీచేస్తుంది.
క్క ఆసరా లభిస్తేచాలు, ఇక బుద్ధి ప్రపంచాన్నే లక్ష్యపెట్టదు. దేవకుమార్
రగానే ఘనంగా స్వాగితమిచ్చారు. మంగళగీతాలు గానం చేశారు. ఆయన
ఘిస్తూ వుపన్యాసాలు సాగుతున్నాయి. కాని తలనొప్పితో బాధపడుతున్న
ా ఉన్నాడు దేవకుమార్, ఇప్పు డాయనకు ఆ బాధ కౌషధం కావాలి.
మీ బాగుండలే దక్కద. అందరూ పండితులే; కాని వారి భావాలెంత సార
వీ; ఆడంబరమైనవీ; వారిలో ఎవరూ ఆయన సందేశాలను అర్థం చేసు
లేదు. ఈ ప్రశంసలూ కీర్తి గానాలూ, గ్రుడ్డి భక్తిగాని మరేమీ కాదు.
ఎవరూ అర్థంచేసుకోలేదు. నలభై సంవత్సరాలకాలం తనను అదుపులో
గిన శక్తి ఏది? ఎన్నడూ క్షీణించకుండా ప్రకాశించిన ఆ జ్యోతి ఏది?

టాలున ఆయన కొక ఆధారం లభించింది. ఆయన ఆలోచనావంతమైన
వదనంలో ఒక సన్నని మందహాసం వికసించింది. ఇది దానం కాదు.
కూ తన ఆదాయంలో మినహాయించుకుంటూ వచ్చిన ప్రావిడెంటు
ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రజలు పెన్షను పుచ్చుకుంటున్నారు. అది దాన
ా? ఆయన ప్రజలకు సేవచేశాడు; సర్వస్వం పరిత్యజించేశాడు. పెద్ద పెద్ద
నా ఏర్పడని తదేక నిష్ఠతో చేశాడు. పెన్షను పుచ్చుకోటానికి సిగ్గుపడట
ు?

హారాజాగారు 'పర్సులు' బహూకరించగానే దేవకుమార్ వదనంలో
హర్షం. విజయం చిందులాడినాయ్.

★ ★

INDIRA GANDHI MEMORIAL LIBRARY
UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

T
Cl. No. 83 Acc. No. 33427
P91P

DATE DUE

DURATION OF LOAN — Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

INDIRA GANDHI MEMORIAL LIBRARY
UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defacted or lost.

Help to keep this book fresh & clean